శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆశ్రమవాస పర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీసంబంధాయుర్గురు। తా సిద్ధిద చరణపద్మ! దాంత్యున్మీల

ద్ధీసద్మ శాంతిసేవ్యా। వ్యాసాది మునీంద్రభావ్య హరిహరనాథా! 1

ప్రతిపదార్థం: శ్రీ= ఐశ్వర్యానికి; సంబంధ= సంబంధించినటువంటివాటియొక్క, (ధన కనకాది సంపదలు); ఆయుస్(ః)= జీవితకాలంయొక్క; గురుతా= ఆధిక్యాన్ని; సిద్ధిద= కలుగజేసేటటువంటి; చరణ పద్మ!= తామరవంటి పాదాలు కలవాడా!; దాంతి= బహిరింద్రియ నిగ్రహంచేత; ఉన్మీలత్= వికసించేటటువంటి; ధీ= బుద్ధి; సద్మ!= నివాసంగా కలవాడా!; శాంతి= అంతరింద్రియ నిగ్రహంచేత; సేవ్యా!= సేవించదగినవాడా!; వ్యాస= వ్యాసుడు; ఆది= మొదలుగా కలిగిన; ముని+ఇంద్ర= మునిశ్రేష్ఠులచేత; భావ్య= భావించబడేవాడా!; హరిహరనాథా!= ఓ హరిహరనాథ స్వామీ!

తాత్పర్యం: ధనకనకాది సంపదలూ, ఆయువులూ అత్యధికంగా సిద్ధింపజేసేటటువంటి పద్మములవంటి పాదాలు కలవాడా! బాహ్యేంద్రియాలను నిగ్రహించగలిగినవారి బుద్ధిలో నివసించేవాడా! అంతరింద్రియాలను నిగ్రహించుకొనటం చేత సేవించదగినవాడా! వ్యాసుడు మొదలైన మహామునులచేత భావించబడేవాడా! హరిహరనాథస్వామీ!

విశేషం: శ్రీయొక్క సంబంధం కలిగిన ఆయుర్గురుత అంటే సంపదలతో కూడిన జీవిత కాలాధిక్యము. జీవితకాలం అధికంగానూ, అంతకాలమూ సంపదలు గలిగే విధంగానూ, శ్రీసంబంధం కలిగినవాడు శ్రీపతి హరి. హరి శ్రీసంబంధిగురుత్వం ఇచ్చేవాడు. మృత్యుంజయుడైన శివుడు లయకారి, కాబట్టి ఆయుర్గురుత, హరుడిస్తాడు. ఇంద్రియ లోలుడుగా బాహ్యదృష్టికి గోచరిస్తూ ఆంతరదృష్టికి ఇంద్రియజేతయై దాంతి గలవాడు హరి. తపోమగ్నుడై అంతర్ముఖత్వంతో శాంతుడైన వాడు హరుడు. ఇటువంటి ఉభయవిధమైన ఏకతత్త్వాన్నే వ్యాసాదిమునీంద్రులు భావించారు. అదే 'హరిహరనాథ' తత్త్వం. 'శాంతి బుద్ధీంద్రియ సన్నివారణ, దాంతి కర్మేంద్రియాల యోగ్య ప్రవృత్తి, అని భార. అను.5181.కర్మేంద్రియాలను యోగ్య విషయాలలో ప్రవర్తింపజేయటం 'దాంతి' ఇతర విషయాలలో వివర్తింపజేయటం (బహిరింద్రియ) నిగ్రహం దాంతి.

ధృతరాష్ట్రుని పాలికి నారదుండు మునులతో వచ్చి యత్తపోవనమహిమ చెప్పుట (సం.15-26-1)

వ. దేవా! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె; నట్లు వైచిత్రవీర్యుండు పరమతపోధుర్యుం డయి యుండె; నంత నొక్కనాఁడు నారద పర్వత దేవల మౌంజాయను లమ్మహీనాయకుం జూచువేడ్క నయ్యా శ్రమంబునకుం జనుదెంచిన. 2

ప్రతిపదార్థం: దేవా!= హరిహరనాథా!; వైశంపాయనుండు= వైశంపాయన మహర్షి; జనమేజయునకున్= జనమేజయ మహారాజుతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు; అట్లు= ఆ విధంగా; వైచిత్రవీర్యుండు= (విచిత్రవీర్యుడి కొడుకు) ధృతరాష్ట్రుడు; పరమ+తపస్+ధుర్యుండు+అయి ఉండెన్= గొప్ప తపస్సును తీవ్రంగా ఆచరిస్తూ ఉన్నాడు (శతయూపుడి ఆశ్రమ సమీపంలో) తన ఆశ్రమంలో ఉన్నాడు); అంతన్= ఆ సమయంలో; ఆ+మహీనాయకున్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; చూచు+వేడ్కన్=

చూడాలనే కోర్కెతో; ఆ+ఆశ్రమంబునకున్= ధృతరాష్ట్రుడు ఉంటున్న ఆశ్రమానికి; నారద పర్వత దేవల మౌంజాయనులు= నారదుడూ, పర్వతుడూ, దేవలుడూ, మౌంజాయనుడు అనే మునులు; చనుదెంచినన్= రాగా.

తాత్పర్యం: హరిహరనాథా! జనమేజయుడితో వైశంపాయన ముని ఈ విధంగా చెప్పాడు. ధృతరాష్ట్రుడు ఆ ప్రకారంగా తీవ్రమైన తపస్సును ఏకాగ్రతతో ఆచరిస్తూ ఉండగా, ఒకరోజు ఆ ధృతరాష్ట్రుడిని చూడటానికి నారదుడు, పర్వతుడు, దేవలుడు, మౌంజాయనుడు అనే మహర్షులు అతడి ఆశ్రమానికి వచ్చారు.

క. శతయూపుఁడు నయ్యెడకుం । గుతుకంబున వచ్చె; వారిఁ గుంతి వినయ సం
భృతయై యందఱను సమ । ర్చితులుగఁ జేసినఁ బ్రహృష్టచేతసు లగుచున్. 3

ప్రతిపదార్థం: శతయూపుఁడున్= శతయూపుడు కూడా; కుతుకంబునన్= కుతూహలంతో; ఆ+ఎడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; వచ్చెన్= వచ్చాడు; వారిన్= ఆ నారదాదులను; అందఱును= అందరినీ; వినయ సంభృత+ఐ= అణకువతో నిండినదై; కుంతి= కుంతీదేవి; సమ్+అర్చితులుగన్= బాగా పూజించబడినవారినిగా; చేసినన్= చేయగా (నారదాదులనందరినీ అణకువతో పూజించగా); ప్రహృష్ట+చేతసులు= (ఆ నారదాదులు) సంతోషించిన మనస్సు కలవారు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: శతయూపుడు కూడా కుతూహలంతో ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చాడు. అపుడు కుంతి వాళ్ళనందరినీ సవినయంగా పూజించగా, వాళ్ళు సంతోషించారు.

వ. ధృతరాష్ట్రుకడకుం బోయిన నతండు వినయ సంభ్రమంబులతో వినతుం డైన దీవన లిచ్చి యతని పెట్టించిన దర్భాసనంబుల నాసీనులై యుచిత సల్లాపంబులు సేయుసమయంబున నారదుం డన్నర నాథుతో శతయూప నామధేయుం డయిన ధరాధిపు పితామహుం డగు సహస్రచిత్యుం డను మహారాజు తన పెద్దకొడుకైన శతచిత్యునందు రాజ్యభారం బిడి యియ్యాశ్రమంబునకు వచ్చి తపశ్చరణంబున దుశ్చ్యవన సఖిత్వంబు వడసె; మఱియును బృషధ్రుండును, శైలాలయుండును, బురుకుత్సుండును నిందుఁ దపంబు చేసి యింద్రలోకంబు వడసి రా రాజర్షిసత్తముల నెల్లను నే నీలోకంబున మెలంగుచుండి యియ్యెడం గంటి నయ్యెడం జూచితి; నిది యితరదుష్ప్రాప్యంబయిన పుణ్యప్రదేశంబు; నీకుం గృష్ణద్వైపాయను ప్రసాదంబున నిచ్చట వసియింప సంభవించె' నని పలికి వెండియు. 4

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుకడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; పోయినన్= వెళ్ళగా; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; వినయ సంభ్రమంబులతోన్= అణకువతోనూ, సంరంభముతోనూ; వినతుండు= నమస్కరించినవాడు; ఐనన్= కాగా; (నారదాదులు) దీవనలు+ఇచ్చి= ఆశీర్వదించి; అతని పెట్టించిన= ఆ ధృతరాష్ట్రుడు ఏర్పాటు చేయించిన; దర్భాసనంబులన్= దర్భలచేత తయారుచేయబడ్డ ఆసనాలపై; ఆసీనులు+ఐ= కూర్చున్నవారై; ఉచిత సల్లాపంబులు= తగిన సంభాషణలు; చేయు సమయంబునన్= చేసేటప్పుడు (కుశలాదికమైన మాటలు మాటాడుతుండగా); నారదుండు= నారదమహర్షి; ఆ+నరనాథుతోన్= ఆ ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు); శతయూప నామధేయుండు+ఐన= శతయూపుడు అనే పేరు కలిగిన; ధరా+అధిపు= రాజుకు; పితామహుండు= తాత; అగు= అయిన; సహస్ర చిత్యుండు= సహస్రచిత్యుడు; అను మహారాజు= అనే పేరుకలిగిన రాజు; తన పెద్దకొడుకు= తన కుమారులలో పెద్దవాడు; ఐన= అయినటువంటి; శతచిత్యునందున్= శతచిత్యుడు అనే వాడిమీద; రాజ్యభారంబు= రాజ్యపాలన బాధ్యతను; ఇడి= ఉంచి; ఈ+ఆశ్రమంబునకున్= ఇపుడు నీవు (ధృతరాష్ట్రుడు) ఉంటున్న ఆశ్రమానికి; వచ్చి= చేరి (ఇక్కడ ఉండి); తపస్+చరణంబునన్= తపస్సు చేయటంవలన; దుశ్చ్యవన= ఇంద్రుడియొక్క; సఖిత్వంబు= మైత్రిని; పడసెన్= పొందాడు;

మఱియును= ఇంకా; పృషధ్రుండును= పృషధ్రుడు అనే పేరుగలవాడు; శైలాలయుండును= శైలాలయుడనే రాజు; పురుకుత్సుండును= పురుకుత్సుడనే అతడు; ఇందున్= ఈ ఆశ్రమంలోనే; తపంబు= తపస్సు; చేసి= ఆచరించి; ఇంద్రలోకంబు= ఇంద్రుడుండే లోకం (స్వర్గం); పడసిరి= పొందారు; ఆ రాజర్షి సత్తములన్= రాజ ఋషులలో ఉత్తములైన వారిని; ఎల్లను= అందరినీ; నేను= నేను (నారదుడు); ఈ లోకంబునన్= భూలోకంలో; మెలంగుచున్+ఉండి= సంచరిస్తూ ఉండి; ఈ+ఎడన్= ఇక్కడ; కంటిన్= చూచాను; ఆ+ఎడన్= ఇంద్రలోకంలోనూ; చూచితిన్= చాచాను; ఇది= నీవు ఉంటున్న ఈ ఆశ్రమం; ఇతర+దుస్+ప్రాప్యంబు= ఇతరుల (సామాన్యుల) చేత పొందరానిది; అయిన= అయినటువంటి; పుణ్యప్రదేశంబు= పవిత్ర స్థలం; ఇచ్చటన్= ఈ ఆశ్రమంలో; వసియింపన్= ఉండే అవకాశం; నీకున్= నీకుకూడా; కృష్ణద్వైపాయను= వ్యాసమహర్షియొక్క; ప్రసాదంబునన్= కరుణవలన; సంభవించెన్= కలిగింది; అని= అనే విధంగా; పలికి= చెప్పి; వెండియున్= తిరిగి (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: నారదాదులందరూ (కుంతిచేసిన అతిథి పూజలకు సంతోషించి) ధృతరాష్ట్రుడి వద్దకు చేరారు. అపుడు ఆ ధృతరాష్ట్రుడు వినయంతోనూ, గౌరవంతోనూ వారికి వంగి నమస్కరించాడు. వారు ధృతరాష్ట్రుడిని ఆశీర్వదించారు. ధృతరాష్ట్రుడు ఏర్పాటు చేయించిన దర్భాసనాలమీద కూర్చున్నారు. కుశలాదికం సంభాషిస్తున్నారందరూ. ఆ సమయంలో నారదుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'పూర్వం శతయూప మహారాజుకు తాత అయిన సహస్రచిత్యుడు అనే (కేకయదేవ) రాజు తన పెద్దకొడుకైన శతచిత్యుడికి రాజ్యభారం అప్పగించి ఈ ఆశ్రమానికి వచ్చి తపస్సుచేసి ఇంద్రుడి మైత్రిని పొందాడు. ఆ తరువాత పృషద్రథుడూ, శైలాలయుడూ (భగదత్తుడి తాత), పురుకుత్సుడూ (మాంధాత కొడుకు) ఈ ఆశ్రమంలోనే తపస్సు చేసి ఇంద్రలోకం పొందారు. నేను భూలోకంలో సంచరించేటప్పుడు ఇక్కడ (ఈ ఆశ్రమంలో వారు తపస్సు చేసికొనటం, అంతకుపూర్వం రాజులుగా పాలనచేయటం) తరువాత ఇంద్రలోకంలోనూ ఆ ఉత్తమ రాజర్షులను ఎరుగుదును. ఈ ఆశ్రమానికి రావటం సామాన్యులకు సాధ్యం కాదు. నీకు కూడా ఈ ఆశ్రమంలో నివసించే అవకాశం వ్యాసుడిదయవలన కలిగింది' అని చెప్పి నారదుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

సీ. **'ధరణీశ! యిచ్చటి తపమున నీవు నా । నృపుల యట్టుల విశిష్టపుఁ బదంబుఁ**
గందు; నీ తోడన గాంధారియును వచ్చు; । మీకు శశ్రూష యమేయ భక్తిఁ
జేసి కుంతియుఁ బతిఁ జేరంగ నరుగు; న । ప్పాండుభూపతి సురపతి సమీప
ముననుండి యెప్పుడు నినుఁ దలంచు, నతండు । పోఁడిమి సేయఁగలాఁడు నీకు

ఆ. **ధర్మమూర్తి యైన ధర్మసూనుఁడు దన । యాత్మ గాన విదురుఁ డన్నరేంద్రు**
వినుతతనువుఁ దగఁ బ్రవేశించు సంజయుఁ । డతుల నాకలోకగతి వెలుంగు. **5**

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= ఓ ధృతరాష్ట్ర మహారాజా!; ఇచ్చటి= అటువంటి మహత్తు కలిగిన ఈ ఆశ్రమంలో ఆచరించిన; తపమునన్= తపస్సువలన; నీవున్= నీవుకూడా; ఆ నృపుల+అట్టుల= సహస్రచిత్యుడు మొదలైన రాజులవలెనే; విశిష్టము+పదంబు= గొప్ప స్థానాన్ని (సద్గతి); కందు(వు)= పొందుతావు; గాంధారియును= గాంధారికూడా; నీతోడన్+అ= నీతోపాటే; వచ్చున్= ఆ ఉత్తమ గతికి (నిన్ను) అనుసరించి వస్తుంది; కుంతియున్= కుంతీదేవికూడా; అమేయభక్తిన్= మిక్కిలి భక్తితో; మీకున్= మీకు (గాంధారీ ధృతరాష్ట్రులకు); శుశ్రూష= సేవ; చేసి= ఆచరించి; పతిన్= భర్త అయిన పాండురాజును; చేరంగన్= పొందటానికి; అరుగున్= వెళ్ళుతుంది; ఆ+పాండుభూపతి= ఆ పాండురాజు; సురపతి= దేవేంద్రుడి యొక్క; సమీపమునన్+ఉండి= చెంత ఉండి; ఎప్పుడున్= నిరంతరమూ; నినున్= నిన్ను; తలంచున్= తలచుకొంటూ ఉంటాడు; అతండు= ఆ పాండురాజు; నీకున్=

నీకు (గాంధారికీ); పోఁడిమి= మేలు; చేయన్+కలాఁడు= కలిగేటట్లు చేస్తాడు; ధర్మమూర్తి= ధర్మమే ఆకారంగా కలవాడు; ఐన= అయినటువంటి; ధర్మసూనుఁడు= ధర్మరాజు; తన+ఆత్మ= తన(విదురుడి) యొక్క యథార్థ రూపం; కానన్= కాబట్టి; విదురుఁడు; ఆ+వర+ఇంద్రు= ఆ ధర్మరాజు యొక్క; వినుత+తనువున్= ప్రశస్తమైన శరీరంలో; తగన్= తగువిధంగా (యోగమార్గంలో); ప్రవేశించున్= ప్రవేశిస్తాడు; సంజయుఁడు; అతుల నాకలోక గతిన్= సాటిలేని స్వర్గలోకానికి వెళ్ళటంచేత; వెలుంగున్= ప్రకాశిస్తాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! అటువంటి ఈ ఆశ్రమంలో తపస్సు చేయటంవలన సహస్రచిత్యుడు మొదలైన పూర్వపు రాజులవలె నీవూ ఉత్తమమైన గతిని పొందుతావు. గాంధారికూడా నిన్ను అనుసరించి వస్తుంది. మీకు అత్యంత భక్తితో సేవలు చేయటంవలన కుంతికూడా చివరకు తన భర్త పాండురాజు వద్దకు వెళ్ళుతుంది. ఇంద్రుడి వద్ద ఉండి ఎప్పుడూ నిన్నే తలచుకొనే పాండురాజు నీకు మేలు చేయగలడు. ధర్మ స్వరూపమైన ధర్మరాజు తన ఆత్మ కాబట్టి విదురుడు ధర్మరాజు శరీరంలో తగువిధంగా ప్రవేశిస్తాడు. సంజయుడు స్వర్గలోకానికి వెళ్ళి ప్రకాశిస్తాడు.'

వ. అనిన విని యాంబికేయుండు గాంధారీకుంతీ సమేతంబుగా సంతోషంబు నొందె; నచ్చటియందఱును ప్రీతాత్ములై; రప్పుడు. 6

ప్రతిపదార్థం: అనినన్= అని నారదుడు చెప్పగా; విని= విన్నవాడై; ఆంబికేయుండు= (అంబిక కొడుకు) ధృతరాష్ట్రుడు; గాంధారీ కుంతీ సమేతంబుగాన్= గాంధారితోనూ, కుంతితోనూ కలిసి; సంతోషంబున్= ఆనందాన్ని; ఒందెన్= పొందాడు; అచ్చటి అందఱును= ఇంకా అక్కడ ఉన్న వారందరూ; ప్రీత+ఆత్ములు= సంతోషించిన మనసుగలవారు; ఐరి= అయ్యారు; అప్పుడు= ఆ సమయంలో.

తాత్పర్యం: నారదు డట్లా చెప్పగా విన్న ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతులతో సహా సంతోషించాడు. ఇంకా అక్కడ ఉన్నవారందరూ కూడా సంతోషించారు. ఆ సమయంలో. (తరువాతి పద్యంతో అన్వయం).

క. శతయూపుఁడు నారదుతో। 'నతుల జ్ఞానాభిరామ' యడిగెద నిన్నుం
గుతుకంబున నొక్కటి; నీ। వితతకృపం దెలియఁ జెప్పవే నా' కనుడున్. 7

ప్రతిపదార్థం: శతయూపుఁడు= శతయూపుడనే రాజర్షి; నారదుతోన్= నారదమహర్షితో (ఇట్లా అన్నాడు); అతులజ్ఞాన+అభిరామ!= సాటిలేని జ్ఞానంతో మనోహరమైనవాడా!; నిన్నున్= నిన్ను; కుతుకంబునన్= కుతూహలం కొద్దీ; ఒక్కటి= ఒకానొక విషయం; అడిగెదన్= అడుగుతాను; నాకున్= నాకు; నీ+వితత+కృపన్= అత్యధికమైన నీదయతో; నీవు; తెలియన్+చెప్పవే= తెలుపవలసింది; అనుడున్= అని శతయూపుడు అనగా.

తాత్పర్యం: శతయూపుడు నారదుడితో 'అన్నీ అందరికంటె ఎక్కువగా తెలిసినవాడా! కుతూహలంకొద్దీ నిన్నొక విషయం అడుగదలచాను దయతో నాకు చెప్పవలసింది' అని పలుకగా. (తరువాతి వచనంతో అన్వయం)

వ. ఆ దేవముని 'నీ యడుగఁ దలంచినది యెయ్యది? యడుగు' మనిన నతం 'డీకురుపతి సుగతి గను' నని నిర్దేశించితి; తద్విశేషంబు వినవలతు; వివరింపు' మనుటయు. 8

ప్రతిపదార్థం: ఆ దేవముని= ఆ దేవతా ఋషి; నీ+అడుగన్+తలంచినది= నీవు నన్ను అడగాలి అనుకొన్నది; ఏ+అది?= ఏది?, ఏమిటి?; అడుగుము= అడుగుము; అనినన్= అని నారదు డనగా; అతండు= ఆ శతయూపుడు; ఈ+కురుపతి= ఈ ధృతరాష్ట్రుడు;

సుగతి= శ్రేష్ఠమైన స్థానాన్ని; కనున్= పొందుతాడు; అని= అనే విధంగా; నిర్దేశించితి(వి)= చెప్పావు; తద్+విశేషంబు= సుగతి పొందటానికి సంబంధించిన ఆ విషయం; వినన్+వలతు(న్)= వినగోరుతున్నాను; వివరింపుము= విస్తరించి చెప్పవలసింది; అనుటయున్= అని శతయూపుడు అనగా.

తాత్పర్యం: ఆ దేవర్షి నారదుడు 'నీవు నన్ను ఏమి అడగా లనుకొంటున్నావు? అడుగుము' అన్నాడు. అపుడు శతయూపుడు 'ఈ కురురాజుకు ఉత్తమగతి కలుగుతుందని చెప్పావు. అందుకు సంబంధించిన విశేషాలు వివరించు.' మని అడుగగా (తరువాతి పద్యంతో అన్వయం)

నారదుఁడు శతయూపునితో ధృతరాష్ట్రాదులు సుగతిఁ బొందెడు తెఱంగు చెప్పుట (సం.15-27-8)

సీ. **ఆ సంయమీశ్వరుం డాతని కిట్లను । 'నిచ్చమై నేను మహేంద్రు కడకు**
నరిగి సంభాషణ మాచరించుచు నుండ । నా సభ నిక్కౌరవాధినాథు
వలనివార్తలు పుట్టి యలఘు తపోవృత్తి । నిష్ఠాతిశయము వర్ణించి' రప్పు
డవ్వాసవుఁడు చెప్పె ననఘ! నాతో ముని । జాతుఁడు ధృతరాష్ట్ర జనవిభుండు

తే. **తపము మూఁడేఁడు లొనరించి తాను సతియు । దేహము ల్విడ్చి చని ధనాధీశు చెలిమి**
నతిశయిల్లు దివ్యాభరణాభిరాముఁ । డై విమానవిహార హృష్టాత్ముఁ డగుచు. 9

ప్రతిపదార్థం: సంయమి+ఈశ్వరుండు= (యతులలో శ్రేష్ఠుడైన) ఆ నారదుడు; అతనికిన్= శతయూపుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నాడు; అనఘ!= పాప మెరుగనివాడా!; నేను= నేను (నారదుడు); ఇచ్చమైన్= కోరికతో; మహేంద్రు కడకున్= దేవేంద్రుడి వద్దకు; అరిగి= వెళ్ళి; సంభాషణము+ఆచరించుచున్+ఉండన్= మాటలాడుతుండగా; ఆ సభన్= ఆ ఇంద్రసభలో; ఈ+కౌరవ+అధినాథు వలని వార్తలు= ఈ ధృతరాష్ట్రుడికి సంబంధించిన సమాచారం; పుట్టి= ప్రస్తావనకు వచ్చి; అలఘు తపస్+వృత్తి నిష్ఠా+అతిశయము= ధృతరాష్ట్రుడి గొప్ప అయిన తపస్సునందు వర్తిస్తున్న శ్రద్ధయొక్క ఆధిక్యం; వర్ణించిరి= ప్రశంసించారు; అప్పుడు= ఆ సందర్భంలో; ఆ+వాసవుఁడు= ఆ ఇంద్రుడు; నాతోన్= నాతో; చెప్పెన్= ఈ విధంగా అన్నాడు; మునిజాతుఁడు= మునివలన జన్మించిన; ధృతరాష్ట్ర జన విభుండు= ధృతరాష్ట్ర మహారాజు; మూఁడు+ఏఁడులు= మూడు సంవత్సరాల పాటు; తపము= తపస్సు; ఒనరించి= చేసి; తానున్= తానూ; సతియున్= అతడి భార్యా; దేహముల్= శరీరాలు; విడ్చి= త్యజించి; చని= వెళ్ళి; ధన+అధి+ఈశు= ధనాధిపతి అయిన కుబేరుడియొక్క; చెలిమిన్= స్నేహంతో; దివ్య+ఆభరణ+అభిరాముఁడు+ఐ= గొప్ప ఆభరణాలతో మనోహరుడై; విమాన+విహార+హృష్ట+ఆత్ముఁడు= విమానంలో విహరించటంవలన సంతోషించే మనస్సు కలవాడు; అగుచున్= అవుతూ; అతిశయిల్లున్= వెలుగుతాడు.

తాత్పర్యం: శతయూపుడితో నారదమహాముని ఇట్లా అన్నాడు. 'ఓ పుణ్యాత్మా! ఒకసారి నేను దేవేంద్రుడివద్దకు వెళ్ళి మాటాడుతుండగా ఆ సభలో ఈ ధృతరాష్ట్రుడి వృత్తాంతం ప్రస్తావనకు వచ్చి, ఇతడి తీవ్రతపోనిష్ఠను అందరూ ప్రశంసించారు. ఆ సందర్భంలో దేవేంద్రుడు నాతో ఇట్లా అన్నాడు. 'ముని శ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుడు తపస్సు మూడు సంవత్సరాలు చేస్తాడు. ఆ తరువాత తానూ గాంధారీ తమ శరీరాలు విడిచిపెట్టి, కుబేరుడితో మైత్రి పొంది దివ్యమైన ఆభరణాలు ధరించి, పుష్పకవిమానంలో విహరిస్తూ సంతోషంగా వెలుగుతారు.

క. **అని పాండుని మది ప్రమదం । బునఁ దేలఁగఁ జెప్పె 'ననుడు మోదము ధృతరా**
ష్ట్రుని నెమ్మనమున నిండా । రె; నఖిల జనచిత్తములను బ్రియము దలిర్చెన్. 10

ప్రతిపదార్థం: పాండునిమది= పాండురాజు హృదయం; ప్రమదంబునన్= సంతోషంతో; తేలఁగన్= తేలిపోయేటట్లుగా; అని= ఆ ప్రకారంగా; చెప్పెన్= ఇంద్రుడు నారదుడితో చెప్పాడు; అనుడున్= అని నారదుడు చెప్పగానే; ధృతరాష్ట్రుని= ధృతరాష్ట్రుడియొక్క; నెమ్మనమునన్= నిండైన హృదయంలో; మోదము= సంతోషం; నిండారెన్= నిండింది; అఖిలజన చిత్తములను= అక్కడ ఉన్న వారందరి మనస్సులోనూ; ప్రియము= ఆమోదం; తలిర్చెన్= చివురించింది.

తాత్పర్యం: పాండురాజు హృదయం సంతోషంతో తేలేవిధంగా ఇంద్రుడు నాతో ఆ విధంగా చెప్పాడు' అని నారదు డనగానే ధృతరాష్ట్రుడి మనస్సు నిండా ఆనందం పొందింది. అక్కడున్న వారందరి మనస్సుల్లోనూ ప్రీతి పల్లవించింది.

విశేషం: ధృతరాష్ట్రుడికి కుబేరలోకం సిద్ధిస్తుందనీ సుఖిస్తాడనీ విని పాండురాజు సంతోషించాడు. అంటే పాండురాజుకు ధృతరాష్ట్రుడిపై గల గౌరవాదరాలు ధ్వనిస్తున్నాయి.

వ. ఇట్లు సద్గోష్ఠి నడపి యత్తాపసోత్తము లక్కురుపతిసత్తము నభినందించి యామంత్రణంబు సేసి నిజనివాసంబులకుం జని; రక్కాలంబున. 11

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సత్+గోష్ఠి= సాధుజనులతో సమావేశాన్ని; నడపి= జరిపి; ఆ+తాపస+ఉత్తములు= నారదుడు మొదలైన ఆ మునిశ్రేష్ఠులు; ఆ+కురుపతి సత్తమున్= కురువంశపు రాజులలో ఉత్తముడైన ఆ ధృతరాష్ట్రుడిని; అభినందించి= ప్రశంసించి; ఆమంత్రణంబు+చేసి= వీడుకోలు చెప్పి; నిజ నివాసంబులకున్= తమ తమ స్థానాలకు; చనిరి= వెళ్ళిపోయారు; ఆ+కాలంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా సాధుజనులంతా కలిసి మంచి మాటలతో సమావేశం జరిపి, నారదుడు మొదలైన మునివరులందరూ ఆ ధృతరాష్ట్రుడు ఉత్తమ గతులు పొందుతున్నందుకు తత్సాధకంగా తీవ్ర తపస్సు చేస్తున్నందుకూ ప్రశంసలు చేసి వీడ్కోలు చెప్పి తమతమ నివాసాలకు వెళ్ళిపోయారు. ఆ సమయంలో (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. పాండుపుత్త్రులు తల్లిఁ బలుమఱుఁ దలఁతురు । వగతురు, ధృతరాష్ట్రువలన సుబల
నందన దెసను మనంబిడి; చింతింతు । రట్ల పౌరులు వంత నారఁ గూరి
'వృద్ధుండు ధృతరాష్ట్రవిభుఁడు సుఖార్హుఁడు । విగతజనం బైన విపినభూమి
నెత్తెఱంగున వసియించు? గాంధారియుఁ । గుంతియు నత్యంత కోమలాంగు

తే. లడవి నుండంగ నెట్లోర్తు రకట! యిట్టి కొడుకులను రాజ్యసౌఖ్యంబు విడిచి యట్లు
సనునె యక్కుంతిభోజుని తనయ? జనని । దొఱఁగిపోవుట కెంత గుండుదురొ వీరు! 12

ప్రతిపదార్థం: పాండు పుత్త్రులు= పాండురాజు కొడుకులు; తల్లిన్= కుంతిని; పలుమఱున్= అనేక పర్యాయాలు; తలఁతురు= తలచుకొంటూ ఉంటారు; ధృతరాష్ట్రువలనన్= ధృతరాష్ట్రుడిపైనా; సుబలనందన+దెసను= (గాంధార రాజయిన) సుబలుడి కూతురి (గాంధారి) పైనా; మనంబు+ఇడి= తమ మనసులు ఉంచి; వగతురు= (పాండవులు) దుఃఖిస్తూ ఉంటారు; పౌరులును= ప్రజలు సైతం; అట్లు+అ= ఆ విధంగానే; వంతన్= దుఃఖంలో; ఆరన్+కూరి= నిండా మునిగిపోయి; చింతింతురు= విచారిస్తూ ఉంటారు; వృద్ధుండు= ముసలివాడైన; ధృతరాష్ట్ర విభుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; సుఖ+అర్హుఁడు= సుఖింపదగినవాడు;

విగతజనంబు= మనుష్యులు లేనిది; ఐన= అయినటువంటి; విపినభూమిన్= అడవులలో; ఏ+తెఱంగునన్= ఏ విధంగా; వసియించున్?= ఉంటాడు?; గాంధారియున్= గాంధారీ; కుంతియున్= కుంతీ; అత్యంత కోమల+అంగులు= మిక్కిలి సుకుమారమైన మేనులు కలవారు; అడవిన్= అడవిలో; ఉండంగన్= ఉండటానికి; ఎట్లు= ఏ విధంగా; ఓర్తురు?= సహించగలరు?; అకట!= అయ్యో!; ఆ+కుంతిభోజతనయ= (కుంతిభోజుడి కూతురు) కుంతి; ఇట్టి= ఇటువంటి; కొడుకులను= పుత్రులను; రాజ్యసౌఖ్యంబున్= రాజ్యాధిపత్యంవలన కలిగే సుఖమూ; విడిచి= వదలిపెట్టి; అట్లు= ఆ విధంగా (అడవులకు); చనునె?= వెళ్లునా? జనని= తమ తల్లి కుంతి; తొఱఁగి= తమను విడిచి; పోవుటకున్= అడవులకు వెళ్ళినందుకు; వీరు= ఈ పాండవులు; ఎంత= ఎంతగా; కుందుదురు+ఒ?= విచారిస్తున్నారో కదా!

తాత్పర్యం: అక్కడ హస్తినాపురంలో పాండవులు తల్లిని చాలాసార్లు తలుచుకొంటూ ఉన్నారు. గాంధారీ ధృతరాష్ట్రులను తలుచుకొని దుఃఖిస్తున్నారు. జనులు కూడా మిక్కిలిగా దుఃఖించేవారు. వారు 'ముసలివాడైన ధృతరాష్ట్రుడు ఇప్పుడు సుఖపడవలసినటువంటివాడు. మనుషులే ఉండని అడవులలో ఏ విధంగా ఉండగలడు? గాంధారీ, కుంతీ చాలా సుకుమారలు. అడవులలో ఉండటం ఎట్లా ఓర్చుకొంటారు? ఇటువంటి ఉత్తములైన కొడుకులను, రాజ్యసుఖాలను విడిచిపెట్టి ఆ కుంతి అడవులకు ఎట్లా వెళ్ళిందో! తల్లి తమను విడిచిపోయినందుకు ఈ పాండవులు ఎంతగా విచారిస్తున్నారో!

క. **ఆయాసంబున విదురుని। కాయము, సంజయుని మేనుఁ గందక యున్నే?**
పోయిరి ధృతరాష్ట్ర మహీ। నాయకుపై భక్తిఁ గాననమున వసింపన్.' **13**

ప్రతిపదార్థం: విదురుని కాయము(న్)= విదురుడి శరీరమూ; సంజయుని మేను= సంజయుడి శరీరమూ; ఆయాసంబునన్= (అడవులలో) శ్రమవలన; కందక+ఉన్నే?= నొవ్వకుండా ఉంటాయా?; ధృతరాష్ట్ర మహీనాయకుపైన్= ధృతరాష్ట్ర మహారాజుమీద; భక్తిన్= సేవా భావంతో; కాననమునన్= అడవిలో; వసింపన్= ఉండటానికి; పోయిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడిని సేవించుకొనాలనే ఉద్దేశంతో అరణ్యాలలో ఉండటానికి వెళ్ళారు గానీ, ఆ విదురుడికీ, సంజయుడికీ అడవులలో శ్రమవలన ఒళ్ళు కందిపోకుండా ఉంటుందా?

క. **అని యొండొరువులతోడ। న్వనట యెసఁగఁ బలుకుదురు మనంబులఁ గుంతీ**
తనయులు మాతృవియుక్తత। కనయము నడలుదురు కౌరవాన్వయముఖ్యా! **14**

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; వనట= దుఃఖం; ఎసఁగన్= అతిశయిస్తుండగా; ఒండొరువులతోడన్= ఒకరితో ఒకరు (పరస్పరం); పలుకుదురు= అంటూ ఉంటారు; కౌరవ+అన్వయముఖ్య!= కౌరవవంశంలో పేరుగాంచినవాడా జనమేజయా!; కుంతీ తనయులు= పాండవులు; మాతృ వియుక్తతకున్= తల్లితో కలిగిన ఎడబాటుకు; మనంబులన్= మనస్సులలో; అనయము= అత్యధికంగా; అడలుదురు= అల్లాడిపోతూ ఉంటారు.

తాత్పర్యం: ఈ విధంగా పౌరులు తమలో తాము దుఃఖంతో మాటాడుతారు. ఓ జనమేజయ మహారాజా! పాండవులు తల్లితో ఎడబాటుకు చాలా అల్లాడిపోతున్నారు. (అన్నాడు వైశంపాయనుడు).

సీ. **ధర్మపుత్త్రాదులందఱు నొక్కచో నుండి। ధృతరాష్ట్రు నాతని దేవిఁ బేరు**
కొని వారి కొడుకు లెల్లను ద్రుంగి రని, వార। లతి వృద్ధు లెమ్మెయి నడవిఁ గలిసి

యున్నా రనియు, నింక నెన్నాళ్ళు లుండెడి । గొంతి వనంబునఁ గూరఁ దినుచు?.
ననియును, బంధుల నదయతఁ దునిమితి । మలుక ధైర్యంబున నడఁప మైతి

తే. మనియు, నభిమన్యు వీరుని నతని తమ్ముఁ । గుఱ్ఱలను గర్ణునాఱడిఁ గోలుపోయి
యొంటి వడితి మనియుఁ, గడు నుమ్మలంపు । మాట లాడుదు ర్పరిజనుల్ మఱుఁగుచుండ. 15

ప్రతిపదార్థం: ధర్మపుత్ర+ఆదులు= ధర్మరాజు మొదలైన వారు; అందఱున్= అందరూ; ఒక్కచోన్= ఒక చోట; ఉండి; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడినీ; ఆతని, దేవిన్= అతడి భార్యఅయిన గాంధారినీ; పేరుకొని= పేర్కొని; వారి, కొడుకులు+ఎల్లను= వారి కుమారులైన దుర్యోధనాదులందరూ; త్రుంగిరి= మరణించారు; అని; వారలు= ఆ గాంధారీ ధృతరాష్ట్రులు; అతి వృద్ధులు= బాగా ముసలివాళ్ళు; ఏ+మెయిన్= ఏ విధంగా; అడవిన్= అడవిలో; కలిసి= కలిసిపోయి; ఉన్నారు= జీవిస్తూ ఉన్నారు; అనియున్= అనుచూ; గొంతి= (తమ తల్లి) కుంతి; కూరన్= కంద మూలాలు; తినుచున్= ఆహారంగా తీసికొంటూ; వనంబునన్= అడవిలో; ఇంకన్= ఇంకా; ఎన్నాళ్ళు= ఎంతకాలం; ఉండెడిన్= ఉంటుంది; అనియును= అంటూ; బంధులన్= చుట్టాలను; అదయతన్= జాలిలేకుండా; తునిమితిమి= చంపేశాం; అలుకన్= కోపాన్ని; ధైర్యంబునన్= నిర్వికారచిత్తంతో; అడఁపము+ఐతిమి= అణచివేయలేకపోయాము; అనియున్= అనీ; వీరునిన్= వీరుడైన; అభిమన్యున్= అభిమన్యుడిని; అతని తమ్ముఁ గుఱ్ఱలను= అభిమన్యుడికి తమ్ముళ్ళయిన ద్రౌపది కొడుకులు ఉపపాండవులను; ఆఱడిన్= అపకీర్తి కరంగా; కర్ణున్= కర్ణుడిని; కోలుపోయి= పోగొట్టుకొని; ఒంటి+పడితిమి= ఏకాకులం అయినాం; అనియున్= అంటూ; కడున్= మిక్కిలి; ఉమ్మలము+మాటలు= దుఃఖపు మాటలు; పరిజనుల్= సేవకులు; మఱుఁగుచున్+ఉండన్= దుఃఖిస్తూ ఉండగా; ఆడుదుర్= అంటూ ఉంటారు.

తాత్పర్యం: ధర్మరాజు మొదలైన వారినందరినీ ఒకచోటికి చేర్చి అక్కడి పరిజనులంతా దుఃఖిస్తుండగా ధృతరాష్ట్రుడినీ, గాంధారినీ, తలచుకొని ఇట్లా శోకాలాపాలు చేసేవారు. గాంధారీ ధృతరాష్ట్రుల కొడుకులు అందరూ మరణించారు. ఈ పండు ముసలి ప్రాయంలో అడవి పాలయ్యారు. కుంతీదేవి కూరలు తిని కడుపు నింపుకొంటూ అడవులలో ఇంకా ఎన్నాళ్ళు ఉంటుందో-నిర్దాక్షిణ్యంగా బంధువులను చంపివేశాం. కౌరవులమీది కోపాన్ని ధైర్యంతో అణచు కోలేకపోయాము. అపకీర్తికరంగా పరాక్రమవంతుడైన అభిమన్యుడినీ, అతడి సోదరులనూ, కర్ణుడినీ పోగొట్టుకొని ఏకాకులమైనాం.

విశేషం: 'పరిజనులు మఱుఁగుచుండ' పాండవులు అనుకొంటున్న మాటలు వాటివెనక విచారం చూసేవారికి కూడా దుఃఖం కలిగించేంతటి విస్తారంగా ఉన్నదని భావం.

వ. ఇ ట్లనుదినంబును ఘన చింతాక్రాంతులై యలంత నొందుదురు. 16

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అనుదినంబును= ప్రతిరోజూ; ఘన= చింతా; ఆక్రాంతులు= అత్యధికమైన విచారానికి లోబడినవారు; ఐ= అయి; అలంతన్= అలసటను; ఒందుదురు= పొందుతున్నారు.

తాత్పర్యం: ఈ విధంగా ప్రతిరోజూ పాండవులు అత్యంతదుఃఖంవలన బడలిపోతూ ఉన్నారు.

చ. విదురుని సంజయుం దలఁచి వేదనఁ బొందుదు; రట్లు నెవ్వగల్
హృదయముఁ గుందఁజేయఁ జెలువేది మనోజ్ఞము లైన భోగముల్

వదలి వినోదముల్ సలుపు లాలసతం బెడఁబాసి రాజ్యసం

పద నరయం దలం పెడలి పాడఱి యుండుదు, రేమి సెప్పుదున్! 17

ప్రతిపదార్థం: విదురునిన్= విదురుడిని; సంజయునిన్= సంజయుడినీ; తలఁచి= తలచుకొని; వేదనన్= విచారాన్ని; పొందుదురు= పొందుతుంటారు; అట్లు= ఆ విధంగా; నెవ్వగల్= సంపూర్ణ (నెఱ)మైన విచారాలు; హృదయమున్= తమ తమ మనసులను; కుందన్+చేయన్= క్రుంగిపోయేటట్లు చేస్తుండగా; చెలువు+ఏది= తేజస్సు నశించి; మనోజ్ఞములు+ఐ= తమ మనసులకు ఇష్టమైనటువంటి; భోగముల్= అనుభవాలను; వదలి= విడిచిపెట్టి; వినోదముల్= ఆనందం కలుగజేసే పనులు; చలుపు= చేయాలి అనే; లాలసతన్= కోర్కెను; పెడన్+పాపి= పూర్తిగా వదలిపెట్టి; రాజ్య సంపదన్= సామ్రాజ్యపు సిరులను; అరయన్= చూసే; తలంపు= ఆలోచన; ఎడలి= తొలగి; పాడఱి= తమకు యోగ్యమైన స్థితి నశించి; ఉండుదురు= ఉంటారు; ఏమి= (జనమేజయా!) వారి స్థితిని గురించి= ఏమని; చెప్పుదున్!= చెప్పగలను!

తాత్పర్యం: విదురుడిని, సంజయుడిని తలచుకొని పాండుకుమారులు విచారించేవాళ్ళు. ఆ విధంగా సంపూర్ణంగా దుఃఖాలు మనసును క్రుంగదీస్తుంటే తేజోహీనులైనారు. తమకు ఇష్టమైన సుఖాలు విడిచిపెట్టారు. వేడుకలపై కోరికనే వదలివేశారు. రాజ్యం మీద ఆలోచన కూడా తొలగిపోయింది. తమకు అర్హమైన స్థితిని పోగొట్టుకొని ఉన్నారు. ఆ దుస్థితిని ఏమని చెప్పేది జనమేజయా!

విశేషం: వగలలో నెఱతనంవలన పాండవులలో 'రాజతేజం' పోయింది. హృదయం కూడా వ్యథ (మానసిక) ఆంతరంగికం కాగా చెలువేదటం - కాంతిహీనులు కావటం శారీరకం బాహిరమైనది. రాజభోగాలు తమ మనసుకు నచ్చినవికూడా విడిచిపెట్టారు. 'న రాజ్యే న చ నారీషు' అని మూలంలో కొంతవాచ్యంగా ఉన్న స్త్రీ సుఖం ఇక్కడ మనోజ్ఞాలైన భోగాలలో చేరి గూఢంగా వ్యక్తం చేయబడటం మనోజ్ఞం. నిద్రాది సుఖాలు (27.14) త్యజించారు. రాజ్య సంపదనరయం దలంపెడలి' యుద్ధంచేసి రాజ్యం సంపాదించుకొన్నారు కాని (తామెంతో ఆశపడిన తల్లి రాజ్యసుఖాలకు దూరం కావటంవలన) రాజ్యంపై పాండవులకు మక్కువ పోయింది. తన వారికి ఉపయోగించని రాజ్యం తమకూ అనవసరం అన్నట్లుగా అయింది. 'న వేదాధ్యయన 'సంప్రీతిః) అనే మూలం ఇట పరిహరించటం విశేషం. రాజ్యసుఖాదులలో తృప్తి లేదన్న మూలం కంటె ఆ భోగాలే త్యజించారన్న తెలుగులో ప్రత్యేకత ఉన్నది. రాజ్యంపై కూడా తలపు లేకుండా అన్ని సుఖాలూ వదలివేయటంవలన (దుఃఖంచేత కాంతివిహీనులు కావటంవలన పాండవులు రాజులుగా కనబడలేదు. రాజకార్యాలు చూడటం లేదు (29,2,3) 'పాడఱి (నష్టసంజ్ఞాః) యుండుదురు. మొత్తమ్మీద ఉన్నారు. అర్హస్థితి మాత్రం కాదు (29.4) ఏమి చెప్పుదున్ అనే మాట పాండవుల విచారం మాటలలో చెప్పటానికి వీలులేనంత అధికం అని కథకుడి (వైశంపాయనుడి) తాత్పర్యం. దానితో ముగింపు ఇంక నేను చెప్పలేను అనే అంశం నిరూపిస్తున్నట్లుగా ఉండటం విశేషం.

క. ద్రౌపదియు సుభద్రయు సం। తాపం బందుదురు; పాండుతనయులు దలరన్

భూపాల భవజ్జనకుని। చూ పందఱ మానసముల శోకము నదుమున్. 18

ప్రతిపదార్థం: పాండుతనయుల్= పాండురాజు కొడుకులు; తలరన్= దుఃఖిస్తుంటే; ద్రౌపదియున్= ద్రౌపదీ; సుభద్రయున్= సుభద్రా; సంతాపంబు= విచారం; అందుదురు= పొందుతుంటారు; భూపాల!= జనమేజయ రాజా!; భవత్! జనకుని= నీకు తండ్రి అయిన పరీక్షిత్తుడిని; చూపు= చూసికొనటం అనేది; అందఱ= పాండవులూ, ద్రౌపదీ, సుభద్రా మొదలైనవారందరి యొక్క; మానసముల= మనసులలో ఉన్నటువంటి; శోకము= విచారాన్ని; అదుమున్= అణచిపెట్టుతుంది.

తాత్పర్యం: పాండవుల విచారం ఇంకా అధికమయ్యేటట్లుగా ద్రౌపదీ, సుభద్రా బాధపడేవారు. ఓ జనమేజయ మహారాజా! నీ తండ్రి అయిన పరీక్షిత్తును చూచికొంటూ అందరూ మనసులో బాధ అణచుకొనేవారు.

విశేషం: (అభిమన్యు) అతని తమ్ముగుఱ్ఱలను (15.వ) తలచుకొనటంవలనను ద్రౌపదీ, సుభద్రలు (హతపుత్రులు) కుంతీ ప్రభృతులను గురించి విచారిస్తుంటే - అది పాండవులను ఇంకా బాధించేది. పరీక్షిత్తు వంశాంకురం. పాండవ వంశం నిలబడవలసింది పరీక్షిత్తు ఒక్కడివలననే. పరీక్షిత్తును అందరూ ప్రేమగా చూసేవారు. ఇంతవిచారం ఉన్నా వాళ్ళందరూ ఇంకా రాజ్యాన్ని అంటిపెట్టుకొని ఉండటానికి కారణం పరీక్షిత్తే. అందువలననే క్రమంగా ఇపుడు జనమేజయుడు 'భూపాలుడైనాడు. శోకము నదుమున్' మనవడిపై ప్రేమ కూడా (ఇంతమందికి) శోకాన్ని అణచిపెట్టబడ్డ శోకం (కుంతీ ప్రభృతులు స్మరణకు వచ్చిన సమయాలలో) ఉబికి అధికమవుతుందని 'అదుము' శబ్దం వ్యక్తం చేస్తుంది.

ఆ. పరమధీరు లైన పాండుతనూభవు। లిట్లు ధైర్యసార మెడలి వికల
బుద్ధు లగుచు నుండి పోవం గడంగి ర। య్యంధనృపతిఁ జూడ నధిపముఖ్య! 19

ప్రతిపదార్థం: అధిపముఖ్య!= రాజులలో శ్రేష్ఠుడా జనమేజయ మహారాజా!; పరమ ధీరులు+ఐ= ఉత్కృష్టమైన ధైర్యం కలిగినవారై; పాండుతనూభవులు= పాండురాజు కొడుకులు; ఇట్లు= ఈ ప్రకారంగా; ధైర్యసారము= ధైర్యంయొక్క గొప్పతనాన్ని; ఎడలి= (తొలగి) కోలుపోయి; వికల బుద్ధులు= కలతచెందిన బుద్ధి కలిగినవారు; అగుచున్+ఉండి= అయి; ఆ+అంధనృపతిన్= ఆ ధృతరాష్ట్రుడిని; చూడన్= చూడటానికి; పోవన్= పోయేటందుకు; కడంగిరి= పూనుకొన్నారు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! అత్యధిక ధైర్యం కలిగిన పాండవులు ఈ విధంగా ఉత్తమ ధైర్యం కోల్పోయి సరిగా లేని మనసులతో ఉండి, గ్రుడ్డివాడైన ఆ ధృతరాష్ట్రుడిని చూచేందుకు వెళ్ళటానికి పూనుకొన్నాడు.

విశేషం: 'పరమధీరులకు కూడా ధైర్య సారం పోవటం అనేది వారికి ధృతరాష్ట్రాదులపై ఉన్న ఆత్మీయతను వ్యక్తంచేస్తుంది. ధృతరాష్ట్రుడు 'అంధనృపతి' చూపులేనివాడు కాబట్టి ఆయనను చూడన్ బయలుదేరారు. ఆ నృపతి అంధుడు కాబట్టి తమ తల్లికంటె ధృతరాష్ట్రుడిని చూడటంలో ప్రాధాన్యం. గాంధారీ ప్రభృతులకూ (అంధ) నృపతి ఉపలక్షకం.

వ. అట్టియెడ సహదేవుండు పాండవాగ్రజునకుం బ్రణమిల్లి భరితవినయుం డై. 20

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సమయంలో; సహదేవుండు= సహదేవుడు; పాండవ+అగ్రజునకున్= ధర్మరాజుకు; ప్రణమిల్లి= నమస్కారం చేసి; భరిత వినయుండు+ఐ= నిండా అణకువ కలవాడై (ఇట్లా అన్నాడు.)

తాత్పర్యం: ఆ సమయంలో సహదేవుడు ధర్మరాజుకు ప్రణామంచేసి వినయంతో (తరువాతి పద్యంతో అన్వయం).

క. 'ఏను మును చెప్ప వెఱచితిఁ। గాని యధిప! గొంతిఁ జూడఁగా జను టర్హం
బైన పని; యింత కేదెస। దా నొందునొ విపినవాస దౌస్థిత్యమునన్? 21

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; ఏను= నేను; మును= ముందుగా; చెప్పన్= చెప్పటానికి; వెఱచితిన్+కాని= సంకోచించాను కాని; గొంతిన్= కుంతిని; చూడఁగాన్= చూడటంకొరకు; చనుట= అడవులకు వెళ్ళటం; అర్హంబు+ఐన పని= తగిన కార్యం; ఇంతకున్=ఇప్పటికే; విపిన+వాస దౌస్థిత్యమునన్= అరణ్యాలలో నివసించటంవలన కలిగిన దురవస్థల మూలంగా; తాను= ఆ కుంతి; ఏదెసన్= ఎటువంటి స్థితి; ఒందునొ?= పొందిందో?

తాత్పర్యం: ధర్మరాజా! నేను ముందే చెప్పటానికి సంకోచించాను గానీ కుంతిని చూడటానికి మనం అడవులకు వెళ్ళటం ఉచితమైన కర్తవ్యం. అరణ్యావాసపు శ్రమవలన కుంతి ఇప్పటికే ఏ స్థితిలో ఉన్నదో. (దుస్థ్సితి యొక్క భావార్థక రూపం దౌస్థ్సిత్యము)

తే. **గొంతి ప్రాణంబుతో నుండఁ గురువరేణ్య! । యచ్చటికిఁ జని యొకమరి యమ్మహాను**

భావ దర్శింప వలవదె? బావ నప్పు । ననుసరించుచు నెట్లున్న యదియొ సాధ్వి! 22

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశంలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; గొంతి= కుంతి; ప్రాణంబుతోన్+ఉండన్= బ్రతికి ఉన్నప్పుడే; ఒకమరి= ఒక పర్యాయం; అచ్చటికిన్= అడవికి; చని= వెళ్ళి; ఆ+మహానుభావన్= ఆ ఉత్తమురాలిని; దర్శింపన్= చూడటం; వలవదె?= తగదా?; సాధ్వి!= మంచి నడవడికల స్త్రీ (కుంతి); బావన్= బావగారి (ధృతరాష్ట్రుడినీ; అప్పన్= అక్కగారి (గాంధారి)నీ; అనుసరించుచున్= వెంట ఉండి; ఎట్లు= ఏ విధంగా; ఉన్న+అదియొ!= ఉన్నదో!

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! కుంతి ప్రాణాలతో ఉన్నప్పుడే ఒకసారి అడవికి వెళ్ళి ఆ మహాత్మురాలిని చూడటం ధర్మం. సాధువర్తనం కలిగిన కుంతి అక్క బావలను అనుసరిస్తూ నడుచుకొంటూ ఇప్పుడు ఎట్లా ఉన్నదో?

క. **ధృతరాష్ట్రుఁడు గాంధారియు । నతిమృదులాంగకులు వల్కలాజినధరులై**

వ్రతచర్యల వన్యాహా । రత నలఁగుచు నున్నవారు రాజవరేణ్యా! 23

ప్రతిపదార్థం: రాజవరేణ్యా!= రాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ధృతరాష్ట్రుఁడున్= ధృతరాష్ట్రుడూ; గాంధారియున్= గాంధారీ; అతి మృదుల+అంగకులు= మిక్కిలి సుకుమారం అయిన శరీరం కలవారు; వల్కల+అజినధరులు+ఐ= నారబట్టలు, మృగచర్మాలు ధరించినవారై; వ్రతచర్యలన్= వ్రతాలను ఆచరించటంచేత; వన్య+ఆహారతన్= అడవులలో లభించే కాయలు దుంపలు మొదలైనవి ఆహారంగా తీసికొనటంచేత; నలఁగుచున్= బాధపడుతూ; ఉన్నవారు= ఉన్నారు.

తాత్పర్యం: రాజా! ధృతరాష్ట్రుడూ, గాంధారీ చాలా సుకుమారులు. నారబట్టలు, మృగచర్మాలూ ధరించి, వివిధ వ్రతాలు ఆచరిస్తూ, కాయలు దుంపలు తీసికొంటూ చాలా నలిగిపోయి ఉన్నారు.

ఉ. **వారలఁ జూడఁ బోఁ దగు నవశ్యము దుర్దశ పుట్టకుండ మున్**

మీ'రని చెప్ప నప్పుడు సమీపమునం జెవి దార్చి నెవ్వగం

గూరుచు నున్న ద్రౌపది యగుం గరణీయము బంధు దుఃఖ సం

తారక! మీకు నీతఁ డుచితంబుగఁ జెప్పిన కార్య మెమ్మెయిన్. 24

ప్రతిపదార్థం: దుర్దశ= కష్టమైన స్థితి; పుట్టక+ఉండన్= కలగకుండా; మున్= ముందుగానే; వారలన్= ఆ గాంధారీ ధృతరాష్ట్రులను, కుంతిని; చూడన్= చూడటానికి; మీరు; అవశ్యము= తప్పకుండా; పోన్= అడవికి వెళ్ళటం; తగున్= మంచిది; అని= అనే విధంగా; చెప్పన్= సహదేవుడు ధర్మరాజుతో చెప్పగా; సమీపమునన్= అక్కడికి దగ్గర్లో; చెవి తార్చి= చెవి ఉంచి; నెవ్వగన్= సంపూర్ణమైన శోకంతో; కూరుచున్= మునుగుతూ; ఉన్న= ఉన్నటువంటి; ద్రౌపది; అప్పుడు= ఆ సమయంలో (ఇట్లా అన్నది); బంధు దుఃఖ సంతారక!= బంధువులను విచారంనుండి దాటించేవాడా! ధర్మరాజా!; ఉచితంబుగన్= తగు విధంగా; ఈతఁడు= ఈ సహదేవుడు; మీకున్= తమతో; చెప్పిన కార్యము= చెప్పినటువంటి పని; ఏ+మెయిన్= ఏ విధంగా నైనా; కరణీయము= చేయదగినది; అగున్= ఔతుంది.

తాత్పర్యం: ఆ గాంధారీ ధృతరాష్ట్రులకు ఇంకా కష్టదశ రాకుండా ముందుగానే వారిని చూడటానికి మీరు తప్పకుండా అడవికి వెళ్ళటం మంచిది' అని సహదేవుడు ధర్మరాజుతో చెప్పగా, దుఃఖంలో మునిగి అటువైపోక చెవి వేసి ఉంచిన ద్రౌపది అప్పుడు ధర్మరాజుతో ఇట్లా అన్నది; 'బంధువుల దుఃఖాన్ని నిర్మూలించేవాడా! సహదేవుడు మీకు చెప్పింది యుక్తం. ఏ విధంగానైనా తప్పకుండా ఇతడు చెప్పినట్లు చేయటం యుక్తం.

తే. గొంతి కోడండ్రు రెల్లను గురువరేణ్య! । యెత్తినడుగుల నున్నవా రత్తపస్వి
నీ వరిష్ఠ దర్శింపంగఁ బోవఁ గోరి । యనియె నట్టు లయ్యిరువురు నాడుటయును. 25

ప్రతిపదార్థం: కురువరేణ్య!= కురువంశ శ్రేష్ఠుడా ధర్మరాజా!; గొంతి కోడండ్రురు= కుంతీదేవి కోడళ్ళు (ద్రౌపది, సుభద్ర మొదలైనవారు); ఎల్లను= అందరూ; ఆ+తపస్వినీ వరిష్ఠన్= తాపసులలో శ్రేష్ఠురాలైన ఆ కుంతీదేవిని; దర్శింపంగన్= చూడటానికి; పోవన్= అరణ్యాలకు వెళ్ళటం; కోరి= అభిలషించి; ఎత్తిన+అడుగులన్= ప్రయాణానికి సిద్ధమై; ఉన్నవారు= ఉన్నారు; అనియెన్= అన్నది ద్రౌపది; ఆ+ఇరువురు= సహదేవుడు, ద్రౌపదీ; అట్టులు= ఆ విధంగా; ఆడుటయును= పలికిన వెంటనే.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! తాపసులలో ఉత్తమురాలైన ఆ కుంతిని చూడటానికి పోవాలనే కోరికతో ఆవిడ కోడళ్ళం అందరమూ, ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాం' అన్నది ద్రౌపది. సహదేవుడూ, ద్రౌపదీ ఇద్దరూ కూడా ఆ విధంగా చెప్పటంతో వెంటనే. (తరువాతి వచనంతో అన్వయం).

పాండవులు బంధుసహితంబుగా ధృతరాష్ట్రుఁ జూడఁబోవుట (సం. 15-29-18)

వ. అమ్మానవనాథుండు కాననగమనంబు నిశ్చయించి పడవాళ్ళం బలిపించి 'ధృతరాష్ట్రు దర్శింపఁ బోద; మనతి బహుళంబును బ్రధాన చతురంగ సముదీర్ణ భంగికంబునుం గా బలంబుల సమకట్టుం; డందలంబులునుం బాటబండ్లునుం గాఁ బెక్కాయితంబులు సేయుం; డనేక శకటంబులుం, బటకుటీరప్రకరంబును, నానావిధ భక్ష్య భోజ్యంబులునుం గొనివచ్చునట్లుగా నిపుణ పరిచారకుల నియమింపుండు; పౌర జనంబు లారాజుం జూచువేడ్కనెవ్వరు వచ్చినను వారల యోగక్షేమంబు లరసి సురక్షితంబుగా నడపింపం దగువారి నియోగింపుం; డెల్లి పయనం బని చాటింపుం' డని పనిచిన వార లట్లు చేయ మఱునాఁడు యుయుత్సునిం గృపాచార్యుని ధౌమ్యుని రావించి 'మీరు పురరక్షణంబునకు నిలువుం' డని యత్యాదరంబునం జెప్పి, 26

ప్రతిపదార్థం: ఆ+మానవనాథుండు= ఆ ధర్మరాజు; కాననగమనంబు= అడవులకు ప్రయాణం; నిశ్చయించి= నిర్ణయం చేసి; పడవాళ్ళన్= వివిధ సేనాపతులను; పిలిపించి= కబురుచేసి రప్పించి; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; దర్శింపన్= చూడటంకొరకు; పోదము; అనతి బహుళంబును= మరీ ఎక్కువ గాకుండా; ప్రధాన చతురంగ సముదీర్ణ భంగికంబునున్= ప్రశస్తమైన రథ, గజ, తురగ, పదాతి రూపమైన నాలుగంగాల గొప్ప విన్యాసం; కాన్= అయ్యేవిధంగా; బలంబులన్= సైన్యాలను; సమకట్టుండు= సిద్ధం చేయండి; అందలంబులునున్= పల్లకీలు; బాటబండ్లును= ఎడ్లబండ్లూ; కాన్= అయ్యే విధంగా; పెక్కు= వివిధాలైన వాహనాలు; అయితంబులు= సిద్ధం; చేయుండు= చేయండి; అనేక శకటంబులున్= అధికంగా (సరుకుల) బండ్లు; పటకుటీర ప్రకరంబులును= గుడారాల సమూహాలు; నానావిధ భక్ష్య భోజ్యంబులును= పలురకాలైన పిండివంటలు, ఇంకా తినే పదార్థాలును; కొనివచ్చునట్లునున్= తీసికొనివచ్చేవిధంగా; నిపుణ పరిచారకులన్= నేర్పుకలిగిన సేవకులను; నియమింపుండు= ఏర్పాటు చేయండి; ఆ రాజున్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; చూడన్= చూడాలనే; వేడ్కన్= కోరికతో; పౌరులు= పురజనులు; ఎవ్వరు= ఎవ్వరైనా; వచ్చినను= వస్తే;

వారల= ఆ పౌరులయొక్క; యోగక్షేమంబులు= ఉన్నత స్థితినీ దాని రక్షణాన్నీ; అరసి= జాగ్రత్తగా చూస్తూ; సురక్షితంబుగాన్= ప్రమాదం లేకుండా; నడపింపన్= తీసికొని వెళ్ళటానికి; తగువారిన్= సమర్థులైనవారిని; నియోగింపుండు= ఏర్పాటు చేయండి; పయనంబు= ప్రయాణం; ఎల్లి= రేపే; అని= అనేవిధంగా; చాటింపుండు= (ప్రజలకు) తెలియజేయండి; అని= అని చెప్పి; పనిచినన్= ఆజ్ఞాపించగా; వారలు= ఆ సేనాపతులు; అట్లు= ధర్మరాజు చెప్పిన ప్రకారంగా; చేయన్= చేయగా; మఱునాఁడు= మరుసటిరోజు; యుయుత్సునిన్= ధృతరాష్ట్రుడి (వైశ్యకు) కొడుకు యుయుత్సుడిని; కృపాచార్యునిన్= కృపుడిని; ధౌమ్యునిన్= తమ పురోహితుడైన ధౌమ్యుడిని; రావించి= పిలిపించి; మీరు= మీరందరూ; పురరక్షణంబునకున్= రాజధానిని కాపాడటానికి; నిలువుండు= ఇక్కడే ఉండండి; అని; అతి+ఆదరంబునన్= మిక్కిలి ప్రేమతో; చెప్పి= వారితో చెప్పి.

తాత్పర్యం: ధర్మరాజు అడవికి వెళ్ళటానికి నిర్ణయించి సేనాపతులను పిలిపించి 'మనం ధృతరాష్ట్రుడిని చూడటానికి పోదాం. మీరు మరీ ఎక్కువ కాకుండా రథ గజ తురగ పదాతి దళాలను సిద్ధం చేయండి. పల్లకీలు, ఎడ్లబండ్లు అధి కంగా ఏర్పాటు చేయండి. ఇంకా ఇతర వాహనాలు పెక్కు గుడారాలూ, రకరకాల పిండివంటలు, ఇతరమైన తిండ్లు తీసికొనిరావటానికి నేర్పుకలిగిన సేవకులను నియమించండి. ధృతరాష్ట్రుడిని చూడాలనే కోర్కెతో పురజనులు ఎవరు వచ్చినా వారికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా సౌకర్యాలను జాగ్రత్తగా చూచి నడిపించగలిగినవారిని ఏర్పాటు చేయండి. 'రేపే ప్రయాణం అని చాటించండి' అని ధర్మరాజు ఆజ్ఞాపించగా ఆ సేనాపతులు ఆ ప్రకారమే అన్ని ఏర్పాట్లు చేశారు. ధర్మరాజు ఆ మరునాడు యుయుత్సుడిని, కృపాచార్యుడిని, తమపురోహితుడు ధౌమ్యుడిని పిలిపించి మిక్కిలి ప్రేమతో తాములేని సమయంలో నగరం రక్షించటంకొరకు ఇక్కడే ఉండండి అని వారికి చెప్పి (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. ఏనికగములతో నేతెమ్ము నీ వని। బాహుదర్పోజ్జ్వలుఁ బవనతనయుఁ
దేరులగమి చెలువారు నీచే నని। దేవసమాను గాండీవధరుని,
గుఱ్ఱపు దళముల కొమరు వీ కలవడు। నని చారుతను మనోహరు నకులుఁ
గాల్బల మమరు నీ కలిసి వచ్చుట నని। సన్నుతచేష్టితుఁ బిన్నతమ్ముఁ

తే. బనిచె; వార లమ్మెయిఁ దూర్య నినద మెసఁగ। నాతపత్రావళి ధ్వజవ్రాత కలిత
రత్నరోచులు రోదోంతరంబు నిండ। నరుగుదెంచిరి వైభవ మతిశయిల్ల. 27

ప్రతిపదార్థం: బాహు దర్ప+ఉజ్జ్వలున్= భుజాల నిరంకుశ బలంతో ప్రకాశించే; పవన తనయున్= భీముడిని; నీవు; ఏనిక గములతోన్= ఏనుగుల బలంతో; ఏ+తెమ్ము= రావలసింది; అని= అని చెప్పి; పనిచెన్= నియోగించాడు; దేవసమానున్= దేవతలతో సమానుడైన; గాండీవధరునిన్= అర్జునుడిని; నీచేన్= నీవలన; తేరులగమి= రథ సమూహం; చెలువారు= శోభిస్తుంది; అని; చారుతను మనోహరున్= అందమైన శరీరంచేత మనసులను హరించేవాడు అయిన; నకులున్= నకులుడిని; నీకున్= నీకు; గుఱ్ఱపు దళముల= తురంగబలంయొక్క; కొమరు= పద్ధతి; అలవడున్= సాధ్యమౌతుంది; అని; సత్+మత చేష్టితున్= సాధుజనంచేత ప్రశంసించబడే; పిన్న తమ్మున్= చిన్న తమ్ముడు సహదేవుడిని; నీ కలసి వచ్చుటన్= నీతో కలిసి రావటంవలన; కాల్బలము= పదాతి దళం; అమరున్= ఒప్పుతుంది; అని; పనిచెన్= నియోగించాడు; వారలు= భీమ, అర్జున, నకుల, సహదేవులు; ఆ+మెయిన్= ధర్మరాజు నియమించిన ప్రకారంగా; తూర్య నినదము= ఢక్క మొదలైన వాద్యాల ధ్వనులు; ఎసఁగన్= అతిశయించగా; ఆతపత్ర= గొడుగుల; ఆవళి= వరుసతోను; ధ్వజ= పతాకల; వ్రాత= సమూహంతోను, కలిత= కూర్పబడి ఉన్న; రత్న= రత్నాల; రోచులు= కాంతులు; రోదస్+అంతరంబు= భూమి ఆకాశాల నడిమి ప్రదేశం అంతా; నిండన్= నిండగా; వైభవము= రాచరికం; అతిశయిల్లన్= ప్రకాశిస్తుండగా; అరుగుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: ధర్మరాజు బాహుబలంచేత ప్రశస్తి పొందిన భీముడిని గజబలంతో కలిసి రమ్మన్నాడు. దేవతలతో సమానమైన అర్జునుడి వలన రథబలం శోభిస్తుందన్నాడు. అందమైన నకులుడిని 'అశ్వబలం నడిపించటం నీకు అభ్యస్తమై ఉన్న' దన్నాడు. సాధుజన ప్రశంసలు పొందే చిన్నతమ్ముడు సహదేవుడిని నీతో కలిసి రావటంవలన కాల్బలం ప్రకాశిస్తుందన్నాడు. ఆ భీమార్జున నకుల సహదేవులు అన్నగారు ఆజ్ఞాపించిన పద్ధతిలో గజ రథ తురగ పదాతి బలాలతో, వాద్యాల ధ్వనులు రేగుతుండగా, గొడుగులలో, జెండాలలో కూర్చిన రత్నాల కాంతులు భూమ్యాకాశాల నడుమ నిండిపోగా వైభవంగా బయలుదేరారు.

వ. ద్రౌపదీ ప్రముఖ వధూజనంబులనుం దక్కునుం గల భరత భార్యల నందలంబులను గనకంపు బండ్లను నిడికొని రండని యంతఃపురాధికారుల నబ్భూరమణుండు నియమించిన, వార లట్ల చేసిరి; తానును మణిభా సమానంబును నీలవాలశోభిత షోడశ శ్వేతాశ్వ వ్యూఢంబును నైన రథం బెక్కి మౌక్తిక ప్రాలంబ మాలి కాద్యోతితంబు లగు నాతపత్రంబు లుల్లసిల్ల. 28

ప్రతిపదార్థం: ద్రౌపదీప్రముఖ వధూజనంబులనున్= ద్రౌపది మొదలైన పాండవ స్త్రీలను; తక్కునున్+కల= మిగిలిన; భరత భార్యలన్= భరతవంశపు వీరుల భార్యలను; అందలంబులనున్= పల్లకీలలోను; కనకంపు బండ్లను= బంగారపు బండ్లలోను; ఇడికొని= ఎక్కించుకొని; రండు+అని= తీసికొనిరండి; అని= అనిచెప్పి; ఆ+భూరమణుండు= ఆ ధర్మరాజు; అంతఃపుర+అధికారులన్= అంతఃపుర రక్షణ బాధ్యతలను చూచే అధికారులను; నియమించినన్= పంపగా; వారలు= ఆ అంతఃపురాధికారులు; అట్లు+అ= ధర్మరాజు ఆజ్ఞాపించిన విధంగానే; చేసిరి= చేశారు; తానును= తాను స్వయంగా; మణిభాసమానంబును= మణులతో ప్రకాశించేది; నీల= నల్లనైన; వాల= తోకలచేత; శోభిత= వెలుగుతున్న; షోడశ= పదహారు; శ్వేత= తెల్లని; అశ్వ= గుర్రాలతో; వ్యూఢంబును= కూర్పబడినది; ఐన= అయినటువంటి; రథంబు= రథాన్ని; ఎక్కి= అధిరోహించి; మౌక్తిక= ముత్యాలతో చేసిన; ప్రాలంబ= వేలాడే; మాలికా= దండలతో; ద్యోతితంబులు= ప్రకాశించేవి; అగు= అయినటువంటి; ఆతపత్రంబులు= గొడుగులు; ఉల్లసిల్లన్= ఒప్పుతుండగా.

తాత్పర్యం: ద్రౌపది మొదలైన పాండవులకు సంబంధించిన స్త్రీలనూ, ఇంకా మిగిలిన భరతవంశపు వారి భార్యలనూ, పల్లకీలలోను, బంగారపు బళ్ళలోనూ ఎక్కించుకొని తీసికొనిరండని ధర్మరాజు అంతఃపుర అధికారులను ఆదేశించాడు. వారు అట్లాగే చేశారు. ధర్మరాజు తానుకూడా వివిధ మణులతో ప్రకాశించేది, నల్లని తోకలు కలిగిన తెల్లటి గుర్రాలు పదహారింటిచేత కూర్చబడినది అయిన రథం ఎక్కి వ్రేలాడుతూ ఉన్న ముత్యాల మాలలు కలిగిన గొడుగులు ఒప్పుతుండగా. (తరువాతిపద్యంతో అన్వయం)

తే. వేణువీణారవంబులు వివిధ గాన। నాదములుఁ బాఠకారావ మేదురంబు
లగుచు వంది బృందముల వాక్యాలి బెరసి। దిశలు దీటుకొనంగఁ బ్రదీప్తలీల. 29

ప్రతిపదార్థం: వేణు వీణా రవంబులున్= పిల్లన గ్రోవులయొక్కయు, వీణలయొక్కయు ధ్వనులు; వివిధ గాన నాదములు= పలువిధాలైన పాటల ధ్వనులునూ; పాఠక+ఆరావ మేదురంబులు= (వేద) అధ్యాపకుల ధ్వనులతో సాంద్రములు; అగుచున్= అవుతూ; వంది బృందముల= బట్టుల (స్తోత్రపాఠకుల) గుంపుల; వాక్య+ఆలిన్= స్తుతి వాక్యాల సముదాయంతో; బెరసి= కూడుకొని; ప్రదీప్తలీలన్= మిక్కిలి ప్రకాశించేవిధంగా; దిశలు= దిక్కులలో; దీటుకొనంగన్= వ్యాపించగా.

తాత్పర్యం: వేణువుల, వీణల ధ్వనులూ, రకరకాల పాటల ధ్వనులూ, వేద అధ్యాపకుల కంఠ ధ్వనులతో అధికమై, స్తోత్రపాఠకుల స్తుతివాక్యాలతో కలిసి అత్యధికంగా ప్రకాశించే విధంగా దిక్కులనిండా వ్యాపించగా, (తరువాతి వచనంతో అన్వయం).

వ. వెడలెఁ వివిధ వాహనారూఢు లయి పౌరు లప్పూరువంశవరు ననుగమించిరిత్తెఱంగున మెఱయు మహిమ నుజ్జ్వలుం డగుచుం జని భాగీరథి యుత్తరించి పాండవోత్తముండు కురుక్షేత్రంబు ప్రవేశించి చనుచుండ.30

ప్రతిపదార్థం: వెడలెన్= బయలుదేరాడు; పౌరులు= పురజనులు; వివిధ వాహన+ఆరూఢులు+అయి= పలురకాలయిన వాహనాలను ఎక్కినవారై; ఆ+పూరువంశవరున్= పూరుమహారాజు వంశంలో శ్రేష్ఠుడైన ధర్మరాజును; అనుగమించిరి= వెన్నంటి వచ్చారు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; మెఱయు= మెరుస్తున్న; మహిమన్= గొప్పతనంచేత; ఉజ్జ్వలుండు= ప్రకాశిస్తున్నవాడు; అగుచున్= అవుతూ; పాండవ+ఉత్తముండు= పాండవులలో ఉత్తముడైన ధర్మరాజు; చని= ముందుకు వెళ్ళి; భాగీరథి= గంగానదిని; ఉత్తరించి= దాటి; కురుక్షేత్రంబు= కురుక్షేత్రంలో; ప్రవేశించి= చొచ్చి; చనుచున్+ఉండన్= ముందుకు వెళ్ళుతూ ఉండగా.

తాత్పర్యం: ధర్మరాజు అడవికి ప్రయాణమయ్యాడు. పౌరులు రకరకాల వాహనా లెక్కి, ఆ ధర్మరాజు వెంట వచ్చారు. ఈ విధంగా ప్రాభవం వెలయగా ధర్మరాజు వెళ్ళి గంగానదిని దాటి కురుక్షేత్రంలో ప్రవేశించి (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. సంయమివరుఁ డైన శతయూప మునిపతి। యాశ్రమంబునఁ దదుపాంత భాగ
మునఁ గదలీశోభియును మృగాకీర్ణంబు। నగు ధృతరాష్ట్రుని యాశ్రమంబు
నెఱిఁగిన వా రదె యిదె యంచుఁ బేర్కొని। చూపి చెప్పిన ధర్మసుతుఁడు దేరు
డిగిన భీమాదులు డిగ్గిరి; వాహనం। బులు సర్వజనులు నప్పురుష వరుల

ఆ. ననుసరించి; రజ్జనాధిపుఁ డయ్యాంబి। కేయు నాశ్రమంబు డాయఁ జనుచు
నచటిజనుల నడిగె 'నయ్య వేఁడీ?' యని। గద్గదిక నెలుంగు గడలుకొనఁగ. 31

ప్రతిపదార్థం: సంయమివరుఁడు= యతులలో శ్రేష్ఠుడు; ఐన= అయినటువంటి; శతయూప మునిపతి= శతయూపుడనే పేరు కలిగిన ఆ మునినాథుడియొక్క; ఆశ్రమంబునన్= ఆశ్రమంలో; తద్+ఉప+అంత భాగమునన్= దానికి దగ్గరలో; కదలీ శోభియును= అరటి చెట్లతో అందంగా ఉన్నది; మృగ+ఆకీర్ణంబున్= వివిధ మృగాలతో నిండినది; అగు= అయినటువంటి; ధృతరాష్ట్రుని ఆశ్రమంబున్= ధృతరాష్ట్రుడియొక్క ఆశ్రమాన్ని; ఎఱిఁగినవారు= తెలిసిన జనులు; అదె= అదిగో; ఇదె= ఇదిగో; అంచున్= అంటూ; పేర్కొని= పేరు చెప్పి; చూపి= చూపించి; చెప్పినన్= చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; తేరు= రథం; డిగినన్= దిగగా; భీమ+ఆదులున్= భీముడు మొదలైన తమ్ములు నలుగురూ కూడా; వాహనంబులు= తమ తమ వాహనాలను; డిగ్గిరి= దిగారు; సర్వజనులున్= ద్రౌపదీ ప్రముఖ కాంతలూ, పౌరులూ అందరు; ఆ+పురుషవరులన్= పురుషశ్రేష్ఠులగు ఆ పాండవులను; అనుసరించిరి= వారి వెంట నడిచారు; ఆ+జన+అధిపుఁడు= ఆ ధర్మరాజు; ఆ+ఆంబికేయున్+ఆశ్రమంబు= ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమాన్ని; డాయన్+చనుచున్= సమీపించి వెళ్ళుతూ; అచటి జనులన్= అక్కడ ఉన్న వారిని; ఎలుంగు= కంఠస్వరాన్ని; గద్గదికన్= డగ్గుత్తికతో; కడలుకొనఁగాన్= నిండగా (వ్యాపించగా); అయ్య= మా తండ్రి; వేఁడీ?= ఎక్కడ ఉన్నాడు?; అని= అనే విధంగా; అడిగెన్= ప్రశ్నించాడు.

తాత్పర్యం: అక్కడ యతిశ్రేష్ఠుడైన శతయూపుడి ఆశ్రమ సమీపంలో అరటి తోపులతో మనోజ్ఞమైనదీ, వివిధ మృగాలతో నిండినదీ అయి ఉన్న ధృతరాష్ట్రుడి ఆశ్రమం తెలిసినవారు 'అదిగో ఇదె' అని పేర్కొని ప్రశంసిస్తూ నిర్దేశించి చెప్పారు. ధర్మరాజు రథం దిగాడు. వెంటనే అతడి తమ్ముళ్ళు భీమాదులు వాహనాలు దిగారు. మిగిలిన స్త్రీలూ పౌరజనం అందరూ కూడా తమ తమ వాహనాలు దిగారు. అందరూ ధర్మరాజు వెంట నడుస్తున్నారు. ధర్మరాజు ధృతరాష్ట్రుడి ఆశ్రమం సమీపించి అక్కడ ఉన్న వారితో గొంతు బొంగురు వోవగా 'మా తండ్రి ఎక్కడ? అని అడిగాడు.

వ. అనిన వార లప్పుడమిఱేనితోడ. 32

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మరాజు అడుగగా; వారలు= అచ్చటి జనులు; ఆ+పుడమిఱేనితోడన్= ఆ రాజుతో.

తాత్పర్యం: తమ తండ్రి ఎక్కడ అని అడిగిన ధర్మరాజుతో ధృతరాష్ట్రుడి ఆశ్రమంలో ఉన్నవారు. (తరువాతి పద్యంతో అన్వయం)

క. 'యమునా స్నానంబునకును । సుమతోయాహరణమునకు సువ్రతుఁ డా సం
యమి చనియె' ననుచుఁ దన్మా । ర్గము సెప్పిరి నెమ్మిఁ దెలియఁ గౌరవముఖ్యా! 33

ప్రతిపదార్థం: సువ్రతుఁడు= ఉత్తమమైన వ్రతాలను ఆచరించే వాడు అయిన; ఆ సంయమి= ఆ ధృతరాష్ట్ర యతి; యమునా స్నానంబునకును= యమునానదిలో స్నానం చేయటానికి; సుమ తోయ ఆహరణమునకున్= పూవులూ, నీళ్ళూ, తీసికొని రావటంకొరకు; చనియెన్= వెళ్ళాడు; అనుచున్= అని; కౌరవముఖ్యా!= కురువంశంలో ప్రధానుడా! జనమేజయ మహారాజా!; తద్+మార్గము= యమునానదికి పోయే త్రోవ; నెమ్మిన్= ప్రేమతో; తెలియన్= వివరంగా; చెప్పిరి= చెప్పారు.

తాత్పర్యం: 'మంచి వ్రతాలను ఆచరిస్తూండేటటువంటి ఆ ధృతరాష్ట్ర యతి యమునలో స్నానంచేయటానికి పూలు, నీళ్ళూ తెచ్చుకొనటానికి వెళ్ళాడు' అని చెప్పి ఓ జనమేజయ మహారాజా! ఆ ఆశ్రమం వద్ద ఉన్న జనులు యమునకు వెళ్ళే మార్గం ధర్మరాజుకు వివరించి చెప్పారు.

పాండవులు కురుక్షేత్రంబున నున్న ధృతరాష్ట్ర గాంధారీ కుంతుల దర్శించుట (సం.15-31-6)

సీ. చెప్పినఁ బాండవు లప్పథంబున భక్తి । నరుగుచు నెదురుగ నరుగుదెంచు
నంబికానందనుఁ డాదిగాఁ గలవారిఁ । గని రప్పు డన్నలఁ గడచి శీఘ్ర
గామియై చని తల్లి కాళ్ళపైఁ బడి యేడ్చె । సహదేవుఁ డధిక బాష్పప్లుతాస్య
యగుచు నబ్భామిని వగచుచు నాతని । నెత్తి తాఁ గౌఁగిట నిఱియఁ జేర్చి

తే. పేరుకొని చెప్పె నతని గాంధారి కంతఁ । గూడి యతఁడును దారు నక్కురుకుమారు
లక్కురూద్వహు నన్నియతాత్ము దేవిఁ । గాంచి రనుజీవు లెఱిఁగింపఁ గౌరవేంద్ర! 34

ప్రతిపదార్థం: చెప్పినన్= చెప్పగా; పాండవులు= పాండురాజు కొడుకులు; ఆ+పథంబునన్= వారు చెప్పిన మార్గంలో; భక్తిన్= పూజ్యభావంతో; అరుగుచున్= యమునా నదివైపుగా వెళ్ళుతూ; ఎదురుగన్= తమకు ఎదురుగా; అరుగుదెంచు= వస్తూ ఉన్న; అంబికా నందనుఁడు= ధృతరాష్ట్రుడు; ఆదిగాన్= మొదలుగా; కలవారిన్= ఉన్న గాంధారీ, కుంతీ ప్రభృతులను; కనిరి= చూచారు;

అప్పుడు= ఆ సమయంలో; సహదేవుఁడు= సహదేవుడు; అన్నలన్= తనకు ముందు నడుస్తున్న నలుగురు అన్నలను; కడచి= దాటి; శీఘ్రగామి+ఐ= తొందరగా వెళ్ళేవాడై; చని= ముందుకు పోయి; తల్లి కాళ్ళపైన్= కుంతి పాదాలమీద; పడి= పడిపోయి; ఏడ్చెన్= శోకించాడు; ఆ+భామిని= ఆ కుంతిదేవి; అధిక= మిక్కుటమైన; బాష్ప= కన్నీటి; ప్లుత= ప్రవాహంగల; ఆస్య= ముఖం కలిగినది; అగుచున్= అవుతూ; వగచుచున్= దుఃఖిస్తూ; ఆతనిన్= తన పాదాలపై పడ్డ సహదేవుడిని, తాను= తను; ఎత్తి= లేవదీసి; కౌఁగిటన్= తన కౌగిలిలో; ఇఱియన్+చేర్చి= గట్టిగా పొదుపుకొని; గాంధారికిన్= గాంధారితో; అతనిన్= సహదేవుడిని; పేరుకొని= పేరు ప్రస్తావిస్తూ; చెప్పెన్= చెప్పింది; కౌరవ+ఇంద్ర!= కురువంశశ్రేష్ఠుడా! జనమేజయ మహారాజా!; అంతన్= అటు పిమ్మట; అతండును= ఆ సహదేవుడును; ఆ+కురుకుమారులు= ధర్మజుడు మిగిలిన పాండుకుమారులు; తారును= వారూ; కూడి= కలిసి; ఆ+కురు+ఉద్వహున్= కురువంశ ఉద్ధారకుడైన ఆ ధృతరాష్ట్రుడినీ; ఆ+నియత+ఆత్మదేవిన్= ఇంద్రియాలను అణచిన ఆ ధృతరాష్ట్రుడి భార్య గాంధారినీ; అనుజీవులు= పరిచారకులు; ఎఱిఁగింపన్= తెలియజెప్పగా; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమంవద్ద ఉన్నవారు ధృతరాష్ట్రుడు స్నానాదులకై వెళ్ళిన యమునానది మార్గం చెప్పగా, పాండవులు అదే మార్గంలో వెళ్ళుతున్నారు. అట్లా వెళ్ళుతూ ఎదురుగా వస్తూ ఉన్న ధృతరాష్ట్రుడిని, గాంధారిని, కుంతిని వారు చూచారు. అప్పుడు సహదేవుడు తనకు ముందున్న అన్నలను దాటి తొందరగా వెళ్ళి తల్లి కుంతీదేవి కాళ్ళపైబడి ఏడిచాడు. కుంతికూడా దుఃఖంతో కన్నీళ్ళు నిండిన ముఖంతో, సహదేవుడిని లేవదీసి గట్టిగా పొదుపుకొని గాంధారికి సహదేవుడు వచ్చాడని చెప్పింది. ఓ జనమేజయ మహారాజా! పిమ్మట ధర్మరాజాదులు కూడా వచ్చి సహదేవుడితో కలిసి, తమ రాకను అనుచరులు తెలియజేస్తుండగా, గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించుకొన్నారు.

చ. **కని మఱి తల్లి పాదములఁ గ్రందుగఁ జేర్చిరి మస్తకంబు; ల**
వ్వనితయు నందఱం బొదివి వత్సలతన్ మన మార్ద్రభావ మొం
ద నురలు నశ్రుబిందువుల దండడిఁ జిక్కఁగఁ గౌఁగిలించి వా
రి నయనవారి చేఁ దుడిచి ప్రీతిగ దీవెన లిచ్చె భూవరా! **35**

ప్రతిపదార్థం: కని= గాంధారీ ధృతరాష్ట్రులను చూచి; మఱి= అటు తరువాత; తల్లి పాదములన్= కుంతి కాళ్ళమీద; మస్తకంబులన్= తమ తమ తలలను; క్రందుగన్= ఒక్కసారిగా; చేర్చిరి= ఉంచారు; భూవరా!= ఓ జనమేజయ రాజా!; ఆ+వనితయున్= ఆ కుంతి కూడా; అందఱన్= కొడుకుల నందరినీ; పొదివి= దగ్గరకు తీసికొని; మనము= హృదయం; వత్సలతన్= పుత్రప్రేమతో; ఆర్ద్ర భావము= తడిసిపోవటాన్ని; ఒందన్= పొందగా; ఉరలు= దొర్లిపడుతున్న; అశ్రు బిందువులు= కన్నీటి చుక్కలు; దండడిన్= ఆధిక్యంతో; చిక్కఁగన్= గట్టిగా; కౌఁగిలించి= (కొడుకులను) కౌగిలించుకొని; వారి= కొడుకులయొక్క; నయనవారిన్= కన్నీటిని; చేన్= తన చేతితో; తుడిచి= తొలగించి; ప్రీతిగన్= ప్రేమతో; దీవెనలు= ఆశీస్సులను; ఇచ్చెన్= ఇచ్చింది.

తాత్పర్యం: ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు ఆ విధంగా గాంధారీ ధృతరాష్ట్రులను చూచి, ఒక్కసారిగా తల్లి కుంతి పాదాలపై తలలుంచి నమస్కరించారు. జనమేజయ మహారాజా! అపుడు కుంతీదేవి ఆ కొడుకులు అందరినీ పొదివిపట్టుకొని మనసు వాత్సల్యంతో నిండి, కన్నీటి బిందువులు జారిపడుతుండగా, పుత్రులను గట్టిగా కౌగిలించుకొని వాళ్ళ కన్నీళ్ళు చేతితో తుడిచి ప్రేమతో ఆశీర్వదించింది.

తే. **అట్టియెడఁ బాండవాగ్రజ నధిక వినయ। భరితుఁడై కాంచి భీమునిఁ బార్థుఁ గవలఁ**
గనియె సంజయుఁ డెంతయు గారవమున। నాదరించి రయ్యేవురు నతనిఁ బ్రీతి. **36**

ప్రతిపదార్థం: అట్టియెడన్= ఆ సందర్భంలో; సంజయుఁడు= సంజయుడు; పాండవ+అగ్రజున్= ధర్మరాజును; అధిక వినయ భరితుఁడు+ఐ= మిక్కిలి అణకువతో నిండినవాడై; కాంచి= చూచి; భీమునిన్= భీముడిని; పార్థున్= అర్జునుడిని; కవలన్= నకుల సహదేవులను; ఎంతయున్= ఎంతో; గారవమునన్= ప్రేమతో; కనియెన్= చూచాడు; ఆ+ఏవురున్= ఆ అయిదుగురు పాండవులును; ప్రీతిన్= ఇష్టంతో; అతనిన్= ఆ సంజయుడిని; ఆదరించిరి= సమ్మానించారు.

తాత్పర్యం: ఆ సమయంలో సంజయుడు ధర్మరాజును మిక్కిలి వినయంతో భీమార్జున నకుల సహదేవులను అత్యంత వాత్సల్యంతో చూచాడు. పాండవులు సంజయుడిని ప్రేమతో సమ్మానించారు.

సీ. **ద్రోవదిఁ దొట్టి వధూజనంబులుఁ దక్కుఁ । గలయట్టి భరత భార్యలుఁ గ్రమమునఁ**
గాంచిరి కురువృద్ధు గాంధారి గొంతిని; । వారలు గొనివచ్చు వారి కలశ
ములు పాండురాజ పుత్త్రులు పుచ్చికొని భరి । యించిరి; పురజను లెల్ల నధిక
వినయత నమ్ముపువ్వరను గని; రవ్వేళ । నందఱు ముదమంది; రట్లు దగిన

ఆ. **వారు బలసి యునికి వారణపురమున । నున్నయట్ల కాఁగఁ దన్నుఁ దలఁచె**
మదిఁ గురూద్వహుండు తదనంతరంబ ని । జాశ్రమమున కెలమి నరుగుదెంచి. **37**

ప్రతిపదార్థం: ద్రోవదిన్+తొట్టి= ద్రౌపదిని మొదలు పెట్టి; వధూ జనంబులును= పాండవ స్త్రీలు; తక్కున్+కల+అట్టి= మిగిలి ఉన్నటువంటి; భరత భార్యలు= భరతవంశపు స్త్రీలు; క్రమమునన్= వరసగా; కురువృద్ధున్= ధృతరాష్ట్రుడిని; గాంధారిన్= గాంధారిని; గొంతిని= కుంతిని; కాంచిరి= చూచారు; వారలు= వారు; కొనివచ్చు= తీసికొనివస్తున్న; వారి కలశములు= నీటి పాత్రలు; పుచ్చికొని= తాము అందుకొని; పాండురాజ పుత్త్రులు= పాండవులు; భరియించిరి= మోశారు; పురజనులు= పౌరులు; ఎల్లన్= అందరూ; అధిక వినయతన్= మిక్కిలి అణకువతో; ఆ+ముప్వరను= ఆ ముగ్గురిని; కనిరి= చూచారు; ఆ+వేళన్= అటువంటి సమయంలో; అందఱున్= అక్కడి వారందరూ; ముదము= సంతోషం; అందిరి= పొందారు; అట్లు= ఆ విధంగా; తగినవారు= అర్హులైనవారు; బలసి= కూడుకొని; ఉనికిన్= ఉండటంతో; కురు+ఉద్వహుండు= ధృతరాష్ట్రుడు; తన్నున్= తనను గురించి; మదిన్= మనసులో; వారణపురమునన్= హస్తినలోనే; ఉన్న+అట్లు= ఉన్నాననే విధంగా; కాఁగన్= అయినట్లుగా; తలఁచెన్= అనుకొన్నాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ఎలమిన్= ఉత్సాహంతో; నిజ+ఆశ్రమంబునకున్= తన తపోవనానికి; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: ద్రౌపది మొదలైన పాండవ స్త్రీలు, ఇంకా మిగిలిన భరతవంశపు రాజుల భార్యలు, క్రమంగా, ధృతరాష్ట్రుడి తరువాత గాంధారిని, ఆ తరువాత కుంతిని చూచారు. ఆ ముగ్గురు పట్టుకొని వస్తున్న నీటి పాత్రలను పాండుకుమారులు అందుకొని తీసికొనివచ్చారు. ధృతరాష్ట్రుడిని చూడటానికి వచ్చిన పౌరులు అందరూ ఆ ముగ్గురిని మిక్కిలి వినయంతో చూచారు. అటువంటి సమయంలో అందరూ సంతోషంగా ఉన్నారు. తనవారంతా తన చుట్టూ ఉండటంతో ధృతరాష్ట్రుడు మనసులో తాను హస్తినాపురంలోనే ఉన్నట్లుగా భావించాడు. తరువాత ఉత్సాహంగా తన ఆశ్రమానికి వెళ్ళి. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఉ. **తారక శోభితాంబర విధంబునఁ బొల్పెసఁగంగ నాశ్రమో**
దారతలంబు బంధుజనతాకలనంబునఁ దాను జంద్రు నో

ప్పార వహించి విస్ఫురితుఁ డై తనరెం గురుభర్త వచ్చి ర

చ్చేరువఁ గల్గు తాపసులు చెచ్చెరఁ బార్థులఁ జూచు వేడుకన్. **38**

ప్రతిపదార్థం: బంధుజనతా కలనంబునన్= చుట్టాలతో నిండి ఉండటంచేత; ఆశ్రమ+ఉదార తలంబు= ధృతరాష్ట్రుడియొక్క గొప్ప ఆశ్రమ ప్రదేశం; తారక శోభిత+అంబర విధంబునన్= నక్షత్రాలతో ప్రకాశించే ఆకాశంవలె; పొల్పు= అందం; ఎసఁగంగన్= అతిశయించగా; కురుభర్త= ఆ ధృతరాష్ట్రుడు; తాను= స్వయంగా; చంద్రు+ఒప్పు+ఆరన్= చంద్రుడియొక్క సౌందర్యం అధికంగా; వహించి= ధరించి; విస్ఫురితుఁడు+ఐ= ప్రకాశించేవాడై; తనరెన్= ఒప్పుతున్నాడు; ఆ+చేరువన్= ఆ సమీపంలో; కల్గు= ఉన్న; తాపసులు= మునులు; పార్థులన్= పాండవులను; చూచువేడుకన్= చూడాలనే కుతూహలంతో; చెచ్చెరన్= వేగంగా; వచ్చిరి= అక్కడికి వచ్చారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి బంధువులు మొదలైన జనాలలో నిండి ఉండటంవలన ఆశ్రమ ప్రదేశం నక్షత్రాలతో ప్రకాశిస్తున్న ఆకాశంవలె ఉండి అందులో ధృతరాష్ట్రుడు స్వయంగా చంద్రుడివలె ప్రకాశిస్తున్నాడు. ఆ సమయంలో కుంతి కొడుకులను చూడాలనే కోరికతో ఆ సమీపంలో ఉండే తాపసులు ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి వచ్చారు.

విశేషం: అలం: ఉపమ.

వ. **వచ్చినం గని వారల నెల్లను సవినయ ప్రణామంబులం బ్రీతులం జేసి పాండవు లలరు మొగంబులతో ధృతరాష్ట్రుంబరివేష్టించి యుండిరి; వనితాజనంబులు నొక్కవలన నిలిచి; రుచితాసనంబులనున్న యమ్మునులు సంజయు నాలోకించి 'ధృతరాష్ట్ర బంధు జనంబుల నందఱం బేరువేర నేర్పడ మా కెఱింగింపవే' యని యడిగిన నతండు వారల కి ట్లనియె.** **39**

ప్రతిపదార్థం: వచ్చినన్= రాగా; పాండవులు= పాండురాజు కొడుకులు; కని= చూచి; సవినయ ప్రణామంబులన్= అణకువతో కూడిన పాదాభివందనాలతో; వారలన్= ఆ తాపసులను; ఎల్లను= అందరినీ; ప్రీతులన్+చేసి= సంతోషించినవారుగా చేసి; అలరు మొగంబులతోన్= వికసించిన ముఖాలతో; ధృతరాష్ట్రున్= ధృతరాష్ట్రుడిని; పరివేష్టించి+ఉండిరి= చుట్టుకొని ఉన్నారు; వనితాజనంబులున్= ద్రౌపది మొదలైన స్త్రీలు అందరూ; ఒక్కవలనన్= ఒక ప్రక్కగా; నిలిచిరి= నిలుచుని ఉన్నారు; ఉచిత+ఆసనంబులన్= తమకు తగిన ఆసనాలమీద; ఉన్న= కూర్చున్న; ఆ+మునులు= పాండవులను చూడవచ్చిన మునులు; సంజయున్= సంజయుడిని; ఆలోకించి= చూచి; ధృతరాష్ట్ర బంధుజనంబులన్= ధృతరాష్ట్రుడి చుట్టాలను; అందఱన్= అందరినీ; పేరు పేరన్= ప్రత్యేకంగా ఒక్కొక్కరిని; ఏర్పడన్= స్పష్టంగా; మాకున్= మాకు; ఎఱింగింపవే= తెలుపవలసింది; అని; అడిగినన్= అడుగగా; అతండు= సంజయుడు; వారలకున్= ఆ తపసులతో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= చెప్పాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి వచ్చిన మునులపాదాలకు పాండవులు వినయంగా నమస్కారాలు చేసి వారిని సంతోషపెట్టారు. ఆనందంతో విచ్చుకొన్న ముఖాలతో ఆ పాండవులు ధృతరాష్ట్రుడి చుట్టూ కూర్చున్నారు. ద్రౌపది మొదలైన స్త్రీలు అంతా ఒక ప్రక్కగా నిలబడ్డారు. తమకు తగిన ఆసనాలమీద కూర్చున్న ఆ మునులు సంజయుడిని చూచి ధృతరాష్ట్రుని యొక్క చుట్టాలందరిని 'పేరు పేరునా మాకు తెలియజెప్పు'మని అడిగారు. అప్పుడు వారితో సంజయుడు ఇట్లా చెప్పాడు.

సీ. **'జాంబూనదచ్ఛాయ చందంబు వర్ణంబు। గలిగిన పలుచని గనప మేను,**
నుచిత దీర్ఘత్వ సమున్నత ఘ్రాణంబు। నిడుదలైన విశాల నేత్రములును,
గంఠీరవంబు రేఖయు నొప్పఁ జూడ్కికి। నెంతయు వ్రేఁగైన యితఁడు ధర్మ
తనయుఁ; డెఱ్ఱఁదనంబుఁ దనరిన మూఁపులు। నాయత స్ఫీతంబు లైన బాహు

తే. **వులును వెడందయురంబు నై పొలుచు నితఁడు। భీముఁ; డుజ్జ్వల సుందర శ్యామ తనువు**
వారణేంద్రు కైవడియును, వారిజముల। యట్టి కనుదోయిఁ గల యితం డర్జునుండు. **40**

ప్రతిపదార్థం: జాంబూనదచ్ఛాయ= మేలిమి బంగారు కాంతియొక్క; చందంబు= విధం; వర్ణంబు= రంగు; కలిగిన= కలిగి ఉన్నటువంటి; పలుచని= సన్ననైన; గనపమేనున్= ఉన్నతమైన శరీరము; ఉచిత= తగినంత; దీర్ఘత్వ= పొడుగుతో; సమ్+ఉన్నత= ఎత్తుగా ఉన్న; ఘ్రాణంబున్= ముక్కు; నిడుదలు+ఐన= దీర్ఘములు అయినటువంటి; విశాల నేత్రములును= పెద్ద కన్నులు; కంఠీరవంబు= సింహంయొక్క; రేఖయున్= తీరూ; ఒప్పన్= ప్రకాశిస్తుండగా; చూడ్కికిన్= చూపునకు; ఎంతయున్= ఎంతో; వ్రేఁగు+ఐ= సహించరానివాడైన; ఇతఁడు= ఈ వ్యక్తి; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ఎఱ్ఱఁ దనంబును= (మేని) ఎరుపురంగు; తనరిన మూఁపులున్= ఎత్తయిన భుజ అగ్రభాగాలు; ఆయత స్ఫీతంబులు+ఐన= మిక్కిలి పొడుగై విస్తరించినవైన; బాహువులును= భుజాలు; వెడఁద+ఉరంబును= విశాలమైన వక్షస్స్థలము; ఐ= కలిగి; పొలుచు ఇతఁడు= ప్రకాశిస్తున్న ఈ వ్యక్తి; భీముఁడు= భీమసేనుడు; ఉజ్జ్వల= ప్రకాశిస్తున్న; సుందర= అందమైన; శ్యామ= నల్లని రంగు కలిగిన; తనువున్= శరీరమూ; వారిజముల+అట్టి= పద్మాలవంటి; కనుదోయిన్= కన్నుగవయూ; వారణ+ఇంద్రు+కైవడియును= ఉత్తమమైన ఏనుగువంటి తీరు; కల+ఇతండు= కలిగిన ఈ వ్యక్తి; అర్జునుండు= అర్జునుడు.

తాత్పర్యం: మేలిమి బంగారుకు ప్రతిబింబమైన పసిమిరంగు కలిగిన సన్నని శరీరం, తగినంత పొడుగు, ఎత్తూ కలిగిన ముక్కు, పొడుగ్గా ఉన్న పెద్ద పెద్ద కన్నులు, సింహం తీరు కలిగి చూపునకు అధికమైన ఇతడు ధర్మరాజు, ఎరుపురంగు శరీరం, ఎత్తైన భుజాలు పొడుగ్గా విస్తరించి ఉన్న భుజాలూ, విశాలమైన వక్షస్స్థలము కలిగి ఉన్న ఈ వ్యక్తి భీముడు, బాగా ప్రకాశిస్తున్న అందమైన నల్లటి శరీరం, తామరలవంటి కన్నులు, గజేంద్రుడి వంటి తీరూ కలిగిన ఇతడు అర్జునుడు.

తే. **సుందరాకారమునఁ దమ కెందు సదృశు। లొరులు లేమి తెల్లం బగుచుండ గొంతి**
యుభయ పార్శ్వంబు లందుఁ గూర్చున్న విష్ణు। శతమఖోపముల్ వినయభూషితులు కవలు. **41**

ప్రతిపదార్థం: సుందర+ఆకారమునన్= అందమైన రూపం విషయంలో; తమకున్= తమతో (నకుల సహదేవులతో); సదృశులు= సమానమైనవారు; ఒరులు= ఇతరులు; ఎందున్= ఎక్కడ కూడా; లేమి= లేకపోవటం; తెల్లంబు= స్పష్టం; అగుచున్+ఉండన్= అవుతుండగా; గొంతి= కుంతియొక్క; ఉభయ పార్శ్వంబులందున్= రెండుప్రక్కలా; కూర్చున్న= ఆసీనులై ఉన్న; విష్ణు శతమఖ ఉపముల్= విష్ణువుతోను, ఇంద్రుడితోను, పోలిక కలిగినవారు; వినయ భూషితులు= అణకువే అలంకారంగా కలవారు అయినవారు; కవలు= నకుల సహదేవులు.

తాత్పర్యం: అందమైన రూపంలో తమకు సాటివచ్చేవారు ఎక్కడా లేరనే విషయం స్పష్టమవుతుండగా కుంతికి రెండు ప్రక్కలా కూర్చున్న విష్ణుని ఇంద్రుని పోలినవారు, అణకువే అలంకారంగా ఉన్నవారు అయిన ఈ ఇద్దరు నకుల సహదేవులు.

సీ. **నీలోత్పల చ్ఛాయఁ బోలు మై చాయయు, । నవపద్మదళములఁ దెవడు మెఱుఁగుఁ**
గనుదోయి, మధ్యాత్వమునకుఁ బ్రవేశించు । ప్రాయంబు, నత్యభిరామ మూర్తి
యలవడఁ గైకొన్న యతులిత సంపద । చందంబు దోఁపించు చారుగౌర
వంబును గలుగు నివ్వనిత పాంచాలి; యి । య్యింతి పార్శ్వమునఁ గట్టెఱ్ఱ మేను

తే. **వనజ సన్నిభ ముఖమునై యినుని మహిమ । యుజ్జ్వలాకృతి దాల్చినట్లున్న యీ ల**
తాంగి నారాయణుని చెలియలు సుభద్ర । నరుని వల్లభ సంయమినాథులార! **42**

ప్రతిపదార్థం: సంయమినాథులార!= శ్రేష్ఠులైన మునులారా!; నీల+ఉత్పలచ్ఛాయ= నల్ల కలువలయొక్క రంగును; పోలు= పోలిన; మై చాయయున్= శరీరపు రంగు; నవ పద్మ దళములన్= క్రొత్తగా (వికసించిన) తామరపువ్వుయొక్క రేకులను; తెవడు= నిందించేటటువంటి; మెఱుఁగున్+కనుదోయి= కాంతిమంతములైన కనులజంటా; మధ్యాత్వమునకున్= మధ్య అనే నాయిక యొక్క, లక్షణంలో; ప్రవేశించు= ప్రవేశిస్తున్న; ప్రాయంబున్= వయసు; అతి+అభిరామమూర్తి= మిక్కిలి మనోజ్ఞమైన రూపం; అలవడన్= సిద్ధించేటట్లుగా; కైకొన్న= స్వీకరించిన; అతులిత సంపద= సాటిలేని సమృద్ధియొక్క; చందంబు= విధం; తోఁపించు= స్ఫురింపజేసేటటువంటి; చారు గౌరవంబును= గొప్పమన్ననా; కలుగు ఈ+వనిత= కలిగి ఉన్న ఈ స్త్రీ; పాంచాలి= ద్రౌపది; ఈ+ఇంతి= ఈ ద్రౌపదియొక్క; పార్శ్వమునన్= ప్రక్కన; కడు+ఎఱ్ఱ మేను= మిక్కిలి ఎర్రనైన శరీరం; వనజ సన్నిభ ముఖమును= పద్మంతో సమానమైన ముఖము; ఐ= కలిగి; ఇనుని మహిమ= సూర్యుడియొక్క గొప్పతనం; ఉజ్జ్వల+ఆకృతి= ప్రకాశించే రూపం; తాల్చిన+అట్లు= ధరించిన విధంగా; ఉన్న= ఉన్నటువంటి; ఈ లతాంగి= ఈ తీగబోడి; నారాయణుని చెలియలు= శ్రీకృష్ణుడి చెల్లెలు; నరుని వల్లభ= అర్జునుడి భార్య- సుభద్ర.

తాత్పర్యం: నల్లకలువలవంటి శరీరపు రంగు, అపుడే వికసించిన తామరపూవు రేకులను పరిహసించి ప్రకాశిస్తున్న కళ్ళూ, అపుడే మధ్యా దశలో ప్రవేశిస్తున్న వయసు కలిగి మనోహరమైన ఆకారాన్ని ధరించిన సాటిలేని సంపదల తీరు స్ఫురింపజేసే గొప్ప మన్నన కలిగిన ఈమె ద్రౌపది. ద్రౌపదికి ప్రక్కన బాగా ఎర్రనైన శరీరం పద్మంవంటి ముఖం కలిగి, సూర్యతేజస్సు రూపు ధరించినట్లుగా ఉన్న ఈమె శ్రీకృష్ణుడి చెల్లెలు, అర్జునుడి భార్య సుభద్ర.

ఆ. **వీరి కెలనఁ గనక గౌర మధూకాభ । తనువు లొప్పుచున్న వనిత లురగ**
పాండ్య సుతలు, నరుని భార్య; లులూపి చి । త్రాంగద యనఁ బరఁగ నాహ్వయములు. **43**

ప్రతిపదార్థం: వీరికెలనన్= ఈ ద్రౌపదీ సుభద్రల ప్రక్కన; కనక= బంగారంవలె; గౌర= పసుపు పచ్చని; మధూక+ఆభ= ఇప్పపూవుతో సమానంగా ఎర్రని; తనువులు= శరీరాలు; ఒప్పుచున్న= ప్రకాశిస్తున్న; వనితలు= ఆ స్త్రీలు; ఉరగ పాండ్య సుతలు= నాగ, కన్యపాండురాజు కూతురు అయినవారు; నరుని భార్యలు= అర్జునుడి సతులు; ఆహ్వయములు= ఆ ఇద్దరి పేర్లు; ఉలూపి= (ఉరగవనిత) ఉలూపి; చిత్రాంగద= (పాండ్యసుత) చిత్రాంగద; అనన్= అనే విధంగా; పరఁగున్= ఒప్పుతున్నాయి.

తాత్పర్యం: ఈ ద్రౌపదీ సుభద్రల ప్రక్కన తమ మేనులు బంగారంవలె పసుపూ, మధూకంవలె ఎరుపు రంగుతో ప్రకాశిస్తూ ఉన్నవారు-ఒకరు నాగకన్య, ఇంకొకరు పాండ్యరాజు కూతురు. వీరు అర్జునుడి భార్యలు, ఉలూపి చిత్రాంగద అని వీరి పేర్లు.

సీ. ఇందీవరచ్ఛాయ కెనయైన చాయ నొ। ప్పిన మేను గలుగు నీ భీతహరిణ
నయన భీముని భార్య; నవ్యచంపక దామ। గౌరాంగి యైన యిక్కమలవదన
సహదేవు గృహిణి; మేచకనవకువలయ। వర్ణంబునకు సరివచ్చు కాంతిఁ
జెలు వైన తనువునఁ బొలుచు నిన్నలినాయ। తాక్షి మాద్రీదేవి యగ్రతనయు

తే. పత్ని; వీరల కెలనఁ బాపటలు లేక। ధౌతసిత వస్త్ర పరిధానలై తనువుల
నిభృతి దోఁపఁగ నున్న యిన్నెలఁత లాంబి। కేయు కోడంద్రు కరుణావిధేయులార! 44

ప్రతిపదార్థం: కరుణా విధేయులార!= దయకు లోబడిన తాపసులారా!; ఇందీవరచ్ఛాయకున్= నల్ల కలువల కాంతికి; ఎన= సాటి; ఐన= అయినటువంటి; చాయన్= రంగుతో; ఒప్పిన మేను= ప్రకాశిస్తున్న శరీరం; కలుగు= కలిగి ఉన్న; ఈ భీతహరిణనయన= ఈ భయపడ్డ లేడి కన్నులవంటి కన్నులు గల స్త్రీ, భీముని పెండ్లాము; నవ్యచంపకదామ గౌర+అంగి= నూతనములైన సంపెంగ పూలదండవలె పసుపురంగు శరీరం కలిగినది; ఐన= అయినటువంటి; ఈ+కమలనయన= ఈ తామరవంటి కన్నులు గల స్త్రీ; సహదేవు గృహిణి= సహదేవుడి భార్య; మేచక నవ కువలయ వర్ణంబునకున్= నల్లనైన క్రొత్త కలువపూవు రంగుతో; సరివచ్చు కాంతిన్= సాటివచ్చే ప్రకాశంతో; చెలువు+ఐన= అందమైనటువంటి; తనువునన్= శరీరంతో; పొలుచు= ఒప్పుతున్న; ఈ+నలిన+ ఆయత+అక్షి= తామరరేకులవలె విశాలమైన కన్నులుగల ఈ స్త్రీ; మాద్రీదేవి= మాద్రియొక్క; అగ్రతనయు పత్ని= పెద్ద కొడుకు నకులుడి భార్య; వీరల కెలనన్= ఈ కుంతి కోడళ్ళ ప్రక్కన; పాపటలు= ముత్తయిదువ లక్షణమైన సీమంతాలు; లేక= లేకుండా; ధౌత సిత వస్త్ర పరిధానలు= శుభ్రంచేయబడ్డ తెల్లటి వస్త్రాలు ధరించినవారు; ఐ= అయి; తనువుల నిభృతి= శరీరాల గోపనం; తోఁపఁగన్= తోచే విధంగా; ఉన్న= ఉన్నటువంటి; ఈ+నెలఁతలు= ఈ స్త్రీలు; ఆంబికేయు కోడంద్రు= ధృతరాష్ట్రుడి కోడళ్ళు.

తాత్పర్యం: కరుణకు లోబడిన తాపసులారా! నల్లకలువల కాంతికి సాటివచ్చే రంగుతో ఉన్న శరీరంగల ఈమె భీముడి భార్య (శ్రీకృష్ణుడితో ఎప్పుడు విరోధించే రాజచమూపతి సోదరి), క్రొత్త సంపంగిపూల దండవలె గౌరవర్ణంతో ఉన్న శరీరం కలిగిన ఈ పద్మాక్షి సహదేవుడి భార్య (జరాసంధుడి కూతురు). అప్పుడే విచ్చుకొన్న నల్లకలువలతో సమానమైన రంగుగల శరీరంతో ప్రకాశిస్తున్న ఈ పద్మదళనేత్ర (మాద్రి పెద్దకొడుకు) నకులుడి భార్య. వీరికి ప్రక్కగా పాపటలు లేకుండా ఉతికిన తెల్లని చీరలు ధరించి శరీరం దాచుకొంటూ ఉన్న ఈ స్త్రీలు ధృతరాష్ట్రుడి కోడళ్ళు (భరత భార్యలు).

తే. వీరి చందంబ యై కడు గారవమునఁ। దను సుభద్ర పొదువ నున్న తరుణి ద్రోణ
కర్ణముఖ యోధవీరులఁ గలఁచి తెగిన। యట్టి యభిమన్యు ప్రియ యుత్తరాభిధాన. 45

ప్రతిపదార్థం: వీరి చందంబు+అ= ధృతరాష్ట్రుడి కోడళ్ళ విధమే; ఐ= అయి; సుభద్ర= అత్త అయిన సుభద్ర; తనున్= తనను; కడున్= మిక్కిలి; గారవమునన్= ప్రేమతో; పొదువన్= దగ్గరకు తీసికొనగా; ఉన్న= ఉన్నటువంటి; తరుణి= స్త్రీ; ద్రోణ కర్ణ ముఖ యోధ వీరులన్= ద్రోణుడు, కర్ణుడు మొదలైన యుద్ధ నిపుణులైన పరాక్రమవంతులను; కలఁచి= కలతపెట్టి; తెగిన+అట్టి= మరణించినటువంటి; అభిమన్యు ప్రియ= అభిమన్యుడి భార్య; ఉత్తరా+అభిధాన= ఉత్తర అనే పేరు కలిగినది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి కోడళ్ళవలె భర్త లేని లక్షణాలతో ఉండి, సుభద్ర ఎంతో ప్రేమతో దగ్గరకు తీసికొన్న స్త్రీ, ద్రోణుడు కర్ణుడు మొదలైన మహావీరులనే యుద్ధంలో కష్టపెట్టి మరణించిన అభిమన్యుడి భార్య; పేరు ఉత్తర.

వ. అని చూపి చెప్పె, నప్పు డాంబికేయుండు కౌంతేయాగ్రజున కిట్లనియె. 46

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; చూపి= చూపించి; చెప్పెన్= చెప్పాడు; అప్పుడు= ఆ సమయంలో; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కౌంతేయ+అగ్రజునకున్= ధర్మరాజుతో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని సంజయుడు ధృతరాష్ట్రుడి బంధువులందరిని చూపించి ఆ తాపసులకు వివరించి చెప్పాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

సీ. 'కుశలివై యుండుదే కురువంశ సత్తమ! । పౌరజనులు జానపదులుఁ దెఱఁగు
తో నిన్ను ననుసరింతురె? తమ్ము లందఱు । సుఖ ముందురే? నీదు సఖులు సుఖులె
బంధులు సంతోషభరితులే? యిష్ట భృ । త్యులు తగవైన కోర్కులు ఫలింపఁ
గ్రాలుదురే? హర్షలీలలఁ బూర్వ రా । జన్యుల నడవడి సలుపఁబడునె?

ఆ. నయముతోడి యప్పనముల భండారంబుఁ । బెనుతె? యగ్రహార జనులమీఁద
గాలి యైన సుడియఁగా నీక యరయుదే? । యనఘ! పుణ్యకీర్తు లతిశయిల్ల. 47

ప్రతిపదార్థం: కురువంశ సత్తమ!= కురుమహారాజు వంశంలో శ్రేష్ఠుడా! ధర్మరాజా!; కుశలివి= క్షేమం కలిగినవాడివి; ఐ= అయి; ఉండుదు+ఏ?= ఉన్నావా?; పౌరజనులు= ప్రజలు; జానపదులు= పల్లెల్లో ఉండే ప్రజలందరూ; తెఱఁగుతోన్= పద్ధతి ప్రకారం; నిన్నున్= నిన్ను; అనుసరింతురు+ఎ?= అనుసరించుకొని ఉన్నారా?; తమ్ములు= ఏ అనుజులు; అందఱున్= అంతా; సుఖముందురు+ఏ?= సుఖంగా ఉన్నారా?; నీదు సఖులు= నీ మిత్రులు; సుఖులు+ఎ?= సుఖంగా ఉన్నారా?; బంధులు= చుట్టాలు; సంతోష+భరితులు+ఏ?= ఆనందంతో నిండి ఉన్నారా?; ఇష్ట భృత్యులు= నీకు ప్రియమైన సేవకులు; తగవు= సముచితాలు; ఐన= అయినటువంటి; కోర్కులు= కోరికలు; ఫలింపన్= సిద్ధించటంతో; హర్షలీలలన్= సంతోషంగా; క్రాలుదురు+ఏ?= ఒప్పుతూ ఉన్నారా?; పూర్వ రాజన్యుల= నీకు పూర్వులైన ఉత్తమరాజులు అనుసరించిన; నడవడి= ధర్మమార్గం; చలుపఁబడును+ఎ?= నీ చేతకూడా ఆచరింపబడుతున్నది కదా?; నయముతోడి= న్యాయమైన పద్ధతిలో; అప్పనములన్= పన్నులతో; భండారంబున్= కోశాన్ని; పెనుతు+ఎ?= పెంచుతున్నావా?; అనఘ!= పాపరహితుడా! ధర్మరాజా!; పుణ్యకీర్తులు= పుణ్యం కీర్తి; అతిశయిల్లన్= పెంపొందే విధంగా; అగ్రహార జనుల మీఁదన్= సమ్మానంతో ఇచ్చిన అగ్రహారాలలోని ప్రజలమీద; గాలి+ఐనన్= గాలికూడా; సుడియఁగాన్+ఈక= సోకకుండా; అరయుదు+ఏ?= కాపాడుతున్నావా?

తాత్పర్యం: కురువంశంలో శ్రేష్ఠుడా! నీవు క్షేమంగా ఉన్నావు కదా! పల్లె పట్టణ ప్రజలంతా పద్ధతి ప్రకారం నిన్ను అనుసరిస్తూనే ఉంటున్నారా? నీ తమ్ముళ్ళు అందరూ సుఖంగా ఉన్నారా? నీ మిత్రులు సుఖంగా ఉన్నారా? చుట్టాలు పూర్తిగా సంతోషంగా ఉన్నారా? నీ కిష్టమైన సేవకులు సముచితమైన కోర్కెలు తీరటంతో సంతోషంగా ఉన్నారా? నీకు పూర్వులైన రాజులు నడచిన ధర్మమార్గాన్నే నీవూ అనుసరిస్తున్నావు కదా! న్యాయంగా తీసికొనే పన్నులతో కోశాగారాన్ని పెంచుతున్నావా? పాపరహితుడా! ధర్మరాజా! పుణ్యమూ, కీర్తి పెరిగే విధంగా దేవబ్రాహ్మణుల కిచ్చిన అగ్రహారాలపై గాలికూడా వీచకుండా జాగ్రత్తగా కాపాడుతున్నావా?

క. మిత్ర నరపతుల శాత్రవ। ధాత్రీశుల నెమ్మిఁ బరుసఁ దనమున వశతా
పాత్రములుగఁ జేయుదె? సుచ। రిత్ర! యుదాసీన నృప పరీక్ష నడచునే? 48

ప్రతిపదార్థం: సుచరిత్ర!= మంచి నడవడికలవాడా! ధర్మరాజా!; మిత్ర నరపతులన్= నీకు మిత్రులైన; రాజులనూ; శాత్రవ ధాత్రీ+ఈశులన్= శత్రువులైన రాజులనూ; నెమ్మిన్= ప్రేమతో; పరుసఁదనమునన్= కాఠిన్యంతో; వశతా పాత్రములుగన్= నీకు వశమయ్యే వారినిగా; చేయుదు+ఎ?= చేస్తున్నావా?; ఉదాసీన నృప పరీక్ష= తటస్థులైన రాజులను గూర్చిన పరీక్ష; నడచున్+ఏ?= కొనసాగుతుందా?

తాత్పర్యం: ఉత్తమమైన నడవడి కలిగిన ధర్మరాజా! మిత్రులైన రాజులను ప్రేమతో, శత్రువులైన రాజులను కాఠిన్యంతో, నీకు వశంలో ఉండేటట్లుగా చేసికొంటున్నావు కదా! మిత్రులూ, శత్రువులూ కాకుండా తటస్థంగా ఉండే రాజులను గూర్చి జాగ్రత్తగా పరీక్ష జరుపుతున్నావు కదా!

క. దేవతల కతిథులకుఁ బితృ। దేవతలకుఁ బూజనములఁ దృప్తి యొనర్తే?
యీ వసుధఁ జతుర్వర్ణ జ। నావళులు నిజోచితక్రియలఁ దగ మనునే? 49

ప్రతిపదార్థం: పూజనములన్= తగిన అర్చనలతో; దేవతలకున్= దైవాలకు; అతిథులకున్= ఆకలి దప్పి మొదలగు వాటితో వచ్చినవారికి; పితృదేవతలకున్= దేవతలైన తన వంశంలో పూర్వ వ్యక్తులకు; తృప్తి= సంతోషాన్ని; ఒనర్తు+ఏ?= కలిగిస్తున్నావా?; ఈ వసుధన్= ఈ భూమిమీద; చతుర్+వర్ణ ఆవళులు= బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులుగా నాలుగు వర్ణాలకు సంబంధించిన ప్రజాళి; నిజ+ఉచిత క్రియలన్= తమకు తమకు తగిన పనులతో; తగన్= ధర్మయుక్తంగా; మనున్+ఏ?= జీవిస్తున్నది కదా?

తాత్పర్యం: దేవతలను, అతిథులను, పితృదేవతలను పూజలతో తృప్తి పరుస్తున్నావు కదా! ఈ భూమిపై నున్న నాలుగు వర్ణాల ప్రజలు తమ తమ వృత్తులలో ధర్మబద్ధంగా జీవిస్తున్నారా?

తే. బాలురకును దుర్బలులకు భామినులకు। వృద్ధులకును మనంబుల వెఱపు లేని
యట్టి మెలఁకువ గలిగెడునట్లు గాఁగ। నడచునే యాజ్ఞ పురమునఁ బుడమియందు.' 50

ప్రతిపదార్థం: బాలురకున్= పిల్లలకు; దుర్బలులకున్= బలహీనులకు; భామినులకున్= స్త్రీలకు; వృద్ధులకున్= ముసలివారికి; మనంబులన్= మనసులలో; వెఱపు= భయం; లేని+అట్టి= లేనటువంటి; మెలఁకువ= జాగరూకత; కలిగెడు+అట్లు+కాఁగన్= సంభవించే విధంగా; ఆజ్ఞ= నీ ఆదేశం; పురమునన్= రాజధానిలోను; పుడమియందున్= రాజ్యంలోనూ; నడచున్+ఏ?= సాగుతున్నదా?

తాత్పర్యం: పిల్లలు, బలహీనులు, స్త్రీలు, వృద్ధులు, మనసులో భయంలేకుండా జీవించే విధంగా నీ ఆజ్ఞలు నగరంలోను, రాజ్యంలోను చెల్లుతున్నాయి కదా?

క. అనిన విని యా నృపతి య। జ్జనపతితో నిట్టు లనియె 'జగదీశ్వర! నీ
వినుతోపదేశమున భవ। దనుయుక్తము లెల్ల నడచు నవికలభంగిన్.' 51

ప్రతిపదార్థం: అనినన్= ధృతరాష్ట్రుడు ఆ విధంగా పలుకగా; ఆ నృపతి= ఆ ధర్మరాజు; విని= ఆలకించి; ఆ+జనపతితోన్= ఆ ధృతరాష్ట్ర నరనాథుడితో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు; జగత్+ఈశ్వర!= మహారాజా!; నీ వినుత ఉపదేశమునన్= నీవు చేసిన గొప్ప రాజధర్మ ఉపదేశంవలన; భవత్+అనుయుక్తములు= నీవు ప్రశ్నించినవి; ఎల్లన్= అన్నీ; అవికలభంగిన్= లోటు లేని విధంగా; నడచున్= జరుగుతున్నాయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఆ విధంగా ప్రశ్నించగా విని ధర్మరాజు అతడితో ఇట్లా అన్నాడు; 'మహారాజా! ఇపుడు నీవు ప్రశ్నించిన విషయాలు అన్నీ నాకు నీవు చేసిన రాజనీతి ఉపదేశం మూలంగా ఏ లోటు లేకుండా సాగుతున్నాయి.'

వ. అని పలికి యిట్లనియె. 52

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పలికి= చెప్పి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడి ప్రశ్నలకు ఆ విధంగా సమాధానం చెప్పిన ధర్మరాజు ధృతరాష్ట్రుడితో మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. 'ఆయాసము సైరింపని । మీ యొడలు తపఃక్రియలకు మెయికొనియెనె? భూ
నాయక! శుశ్రూష దగం । జేయునొకో గొంతి డప్పిఁ జెందక మీకున్. 53

ప్రతిపదార్థం: భూనాయక!= ధృతరాష్ట్ర మహారాజా!; ఆయాసము= శ్రమను; సైరింపని= ఓర్వలేని; మీ+ఒడలు= తమ శరీరం; తపస్+క్రియలకున్= తపశ్చర్యలకు; మెయికొనియెన్+ఎ!= పూనుకొన్నది కదా!; గొంతి= కుంతీదేవి; డప్పిన్= అలసట; చెందక= లేకుండా; మీకున్= తమకు; తగన్= తగు విధంగా; శుశ్రూష= సేవ; చేయున్+ఒకో?= చేస్తున్నది కదా?

తాత్పర్యం: 'రాజా! కష్టాలను తట్టుకోలేని మీ శరీరం శరీర క్లేశ కారణమైన ఉపవాసాది వ్రతనియమాలకు పూనుకొన్నది కదా! కుంతి అలసట లేకుండా మీకు అర్హమైన విధంగా సేవలు చేస్తున్నది కదా!

క. మా పెద్దతల్లి యలజడి । కోపి తపోవృత్తి గడపుచున్నదియె? సుత
వ్యాపాదనకారుల మముఁ । బాపాత్ములఁ దలఁచి యెట్లు పలుకునొ మీతోన్? 54

ప్రతిపదార్థం: మా పెద్దతల్లి= మా జ్యేష్ఠమాత; అలజడికిన్= శ్రమకు; ఓపి= ఓర్చుకొని; తపోవృత్తిన్= నియమవంతమైన ప్రవర్తనం; కడపుచున్నది+ఎ?= గడుపుతున్నదా?; సుతవ్యాపాదన కారులన్= కొడుకులను మరణంపాలు చేసిన; పాప+ఆత్ములన్= దురాత్ములైన; మమ్మున్= మమ్ములను; తలఁచి= స్మరించి; మీతోన్= తమతో; ఎట్లు= ఏ విధంగా; పలుకున్+ఒ!= మాటాడుతుందో!

తాత్పర్యం: మా పెద్దమ్మ గాంధారి బాధల కోర్చుకొని తపస్సు ఆచరిస్తున్నదా? తన కొడుకులను చంపిన దుర్మార్గులుగా మమ్ములను తలచుకొని మీతో ఏమంటున్నదో.

ఆ. సంజయుండు తపము జాలికిఁ జాలి వ । ర్తిల్లుచున్నవాఁడె? ధీరచిత్తుఁ
డిచట లేఁడు విదురుఁ డెచటి కేఁగినవాఁడొ? । యతనిఁ జూడ వలయు నధిప! నాకు.' 55

ప్రతిపదార్థం: సంజయుఁడు= సంజయుడు; తపము జాలికిన్= తపస్సువలన కలిగే శ్రమకు; చాలి= ఓర్చుకొని; వర్తిల్లుచున్+ఉన్నవాఁడె?= తపస్సు చేస్తూ ఉన్నాడా?; అధిప!= రాజా!; ధీరచిత్తుఁడు= నిర్వికారమైన మనస్సు కలిగినవాడు; విదురుఁడు= విదురుడు; ఇచటన్+లేఁడు= ఇక్కడ మీతోపాటు కనిపించటం లేదు; ఎచటికిన్= ఎక్కడికి; ఏఁగినవాఁడు+ఒ?= వెళ్ళాడో?; నాకున్= నాకు; అతనిన్= ఆ విదురుడిని; చూడన్ వలయున్= చూడాలి.

తాత్పర్యం: సంజయుడు తపస్సువలన శ్రమకు ఓర్చుకొంటున్నాడా! రాజా! దృఢమైన చిత్తం కలిగిన విదురుడు ఇక్కడ లేడు; ఎక్కడికి వెళ్ళాడు? నేను అతడిని చూడాలి.'

వ. అనుటయు ధృతరాష్ట్రుఁడు ధర్మతనయుతోడ. 56

ప్రతిపదార్థం: అనుటయున్= అని ధర్మరాజు పలుకగా; ధృతరాష్ట్రుఁడు; ధర్మతనయుతోడన్= ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా అనగానే ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో, ఇట్లా అన్నాడు (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'ఏఁ దపంబున కోర్తు నెంతయు; శుశ్రూష। యలయక గొంతి మా కాచరించు;
వినుము! గాంధారియు ననఘచరిత్ర త। పోనిష్ఠ కోర్చు; నిమ్మాననీయ
మిముఁ దలంచిన యప్డు మెచ్చి దీవించు; సం। జయుఁడు ప్రాజ్ఞుఁడు; తపశ్చరణమునకు
విసువఁడు; మముఁ బాసి విదురుఁ డెచ్చట నేనిఁ। జరియించు మునిజనాశ్చర్యకారి

ఆ. యగుచు; జలము లనిల మాహారముగఁ గొను;। నవియు నదియుఁ గొనక యయిన నుండు;
శూన్య విపినమున విదైన్య స్వతంత్ర సం। చారియై వసించుఁ గౌరవేంద్ర! 57

ప్రతిపదార్థం: కౌరవ+ఇంద్ర!= కురువంశ శ్రేష్ఠుడా! ధర్మరాజా!; ఏను= నేను; తపంబునకున్= తపస్సుకు; ఓర్తున్= సహిస్తాను; గొంతి= కుంతీదేవి; మాకున్= మాకు; శుశ్రూష= సేవ; అలయక= అలసటలేకుండా; ఆచరించున్= చేస్తుంది; వినుము= వినుము; ఎంతయున్= చాలాబాగా; ఆచరించున్= చేస్తున్నది; అనఘ చరిత్ర!= పాపం లేని నడవడి కలవాడా! ధర్మరాజా!, వినుము= (ఈ అంశం శ్రద్ధగా విను; ఈ+మాననీయ= గౌరవింపదగిన; గాంధారియున్= గాంధారికూడా!; తపోనిష్ఠన్= శ్రద్ధగా తపసు చేయడంతో; ఓర్చున్= సమర్థురాలై ఉన్నది; మిమున్= మిమ్మల్ని (పాండవులను); తలంచిన అప్డు= స్మరించిన సందర్భంలో; మెచ్చి= మిమ్మల్ని ప్రశంసచేసి; దీవించున్= మేలు కలిగేటట్లుగా ఆశీర్వదిస్తుంటుంది; సంజయుండు= సంజయుడు; ప్రాజ్ఞుఁడు= అన్నీతెలిసినవాడు; (కాబట్టి) తపస్ చరణమునకున్= తపస్సు ఆచరించటంలో; విసువండు= విసుగుపడడు; విదురుండు= విదురుడు; మమున్= మమ్మల్ని; (ధృతరాష్ట్రాదులను) విడిచి= వదలిపెట్టి; ఎచ్చటికిన్+ఏని(న్)= ఎక్కడెక్కడో; చరియించున్= తిరుగుతుంటాడు; ముని-జన-ఆశ్చర్య-కారి+అగుచున్= తాపసులకు సైతం ఆశ్చర్యం కలిగిస్తూ ఉన్నవాడై; జలములు= నీళ్ళూ; అనిలమున్= గాలీ; ఆహారముగన్= భోజనంగా; కొనున్= స్వీకరిస్తుంటాడు; అవియున్= ఆ నీళ్ళూ; అదియున్= ఆ గాలీ కూడా; కొనక= స్వీకరించకుండా కూడా; ఉండున్= ఉంటాడు; శూన్య-విపినమునన్= నిర్మానుష్యమైన, అడవిలో; వి-దైన్య= స్వతంత్ర; సంచారి= విచారం లేకుండా, స్వేచ్ఛగా తిరిగేవాడు; ఐ= అయి; వసించున్= ఉంటాడు;

తాత్పర్యం: ధర్మరాజా! నేను తపస్సు ఆచరించటానికి సమర్థుడనై ఉన్నాను. మాకు కుంతి అలుపు లేకుండా, ఎంతో చక్కగా సేవలు చేస్తున్నది పాపం (దోషం) లేని వర్తనం కలవాడా (జాగ్రత్తగా వినుము) (మీకు) పూజ్యురాలయిన

గాంధారి కూడా తపస్సు శ్రద్ధగా చేసికొనే సామర్థ్యం కలిగి ఉన్నది. మీరు గుర్తుకు వచ్చినప్పుడు ఈమె మిమ్మల్ని పొగడుతూ మీకు మేలు కలగాలని ఆశీర్వదిస్తుంటుంది. సంజయుడు బుద్ధిమంతుడు. తపస్సు ఆచరించటంలో ఏ మాత్రమూ వెనుదీయడు. ఇంక విదురుడు మమ్మల్ని విడిచిపెట్టి ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. మునులకు సైతం వింత అనిపించే విధంగా, నీళ్ళూ, గాలీ మాత్రమే ఆహారంగా తీసికొంటాడు. ఒక్కొక్కసారి అది కూడా తీసికొనకుండానే ఉంటాడు. మనుష్యులు తిరగని అడవిలో నిర్విచారంగా స్వేచ్ఛగా (తిరుగుతూ) ఉంటాడు.

క. ఒక్కొకమరి డబ్బాటీ। చక్కటిఁ గాన నగు ననియె జనవర తోఁచెన్
గ్రక్కున నప్పుడ విదురుం। డక్కౌంతేయాగ్రజున కనతిదూరమునన్. 58

ప్రతిపదార్థం: ఒక్క+ఒకమరి= ఒక్కొక్క పర్యాయం; డబ్బాటు= ఆకస్మికంగా; ఈ చక్కటిన్= ఈ ప్రదేశంలో; కానన్-అగున్= (ఆ విదురుడు) కనబడతాడు; అనియెన్= అని (ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో) అన్నాడు; జనవర!= ఓ జనమేజయ మహారాజా!; అప్పుడు+అ= (ధృతరాష్ట్రుడు చెప్పిన) ఆ సమయంలోనే; ఆ+కౌంతేయ+అగ్రజునకున్= కుంతి కొడుకులలో పెద్దవాడైన ఆ ధర్మరాజుకు; అనతిదూరమునన్= (మరీ దూరంగా కాకుండా) కొంచెం దూరంలో; గ్రక్కునన్= ఆకస్మికంగా; విదురుండు= విదురుడు; తోఁచెన్= కనపడ్డాడు;

తాత్పర్యం: ఒక్కొక్కసారి (గుబాలున) అప్రయత్నంగా ఈ ప్రదేశంలో కూడా కనబడుతాడు విదురుడు' అని ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో అన్నాడు. అదే సమయంలో కొంచెం దూరంలో ఆ విదురుడు హఠాత్తుగా ధర్మరాజుకు కనపడ్డాడు.

వ. కాంతారధూళి మలినాంగుండును జటీభూతకేశపాశుండును దిగంబరుండును నగు విదురుం డట్లు దోఁచి యయ్యాశ్రమంబున నున్న జనంబులం గని మగుడి పోవంజూచె; ధర్మతనయుండు తన యనుచరుల నిలువుం డనుచుఁదా నొక్కరుండును సత్వరంబుగా నవ్వినుత ప్రభావుని వెనుకం జనియె; నతండు గుల్మాంత రితుం డగుచుం దోఁచుచుఁ బోవం బోవ నప్పాండ వాగ్రజుం డెలుంగెత్తి 'యో విదుర! నిలునిలు; మేను యుధిష్ఠిరుండ; నిన్నుఁ గాన వచ్చితి 'నని పలుకుచుం బాఱిన నమ్మహాత్ముండు మరలి కనుంగొని వివిక్త ప్రదేశంబున నొక్క పాదపంబు చేరి నిలిచిన. 59

ప్రతిపదార్థం: కాంతార= అడవిలోని; ధూళి= దుమ్ముచేత; మలిన= మట్టిగొట్టుకొన్న; అంగుండును= (శరీర) అవయవాలు కలవాడూ; జటీ భూత= జడలుగా ఏర్పడిన (జడలు గట్టిన); కేశ= తలవెంట్రుకల యొక్క; పాశుండును= సమూహం కలవాడూ; దిగంబరుండును= ఒంటిమీద గుడ్డలు లేనివాడూ; అగు= అయినటువంటి; విదురుండు= విదురుడు; అట్లు= ఆ ప్రకారంగా ఆకస్మికంగా; తోఁచి= (ధృతరాష్ట్రాశ్రమంలోని జనులకు) కనబడి; ఆ+ఆశ్రమంబునన్= ఆ ధృతరాష్ట్రుడి తపోవనంలో; ఉన్న= (క్రొత్తగా చేరి) ఉన్నటువంటి; జనంబులన్= (చాలా మంది) మనుష్యుల్ని; కని= చూచి; మగిడి= వెనక్కు తిరిగి; పోవన్ చూచెన్= (పోదామనుకొన్నాడు) పోతున్నాడు; ధర్మతనయుండు= ధర్మరాజు; తన-అనుచరులన్= తనను వెన్నంటి ఉండే జనాన్ని; నిలువుండు= (నా వెంట రావద్దు) ఇక్కడ నిలిచి ఉండండి; అనుచున్= అని చెప్తూ; తాను-ఒక్కరుండును= తాను (ధర్మరాజు) ఒక్కడు మాత్రమే; సత్వరంబుగాన్= వేగంగా; ఆ+వినుతప్రభావుని= ప్రశంసించబడే గొప్పతనం కలిగిన ఆ విదురుడి యొక్క; వెనుకన్= వెనకే; చనియెన్= వెళ్ళాడు; అతండు= ఆ విదురుడు; గుల్మ-అంతరితుండు= తీగ పొదలలో కనబడకుండా ఉన్నవాడు;

అగుచున్= అవుతూ; తోఁచుచున్= నడుమనడుమ కనబడుతూ; పోవన్-పోవన్= ఇంకా ఇంకా ముందుకి వెళ్ళుతూ ఉంటే; ఆ+పాండవ అగ్రజుండు= ఆ ధర్మరాజు; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి (గట్టిగా); ఓవిదురా!= ఓవిదురా!; నిలు-నిలుము= నిలబడుము నిలబడుము; ఏను= నేను; యుధిష్ఠిరుండన్= ధర్మరాజును; నిన్నున్= నిన్ను; కానన్= చూడటానికి; వచ్చితిన్= వచ్చాను; అని పలుకుచున్= అని అంటూ; పాఱినన్= విదురుడి వెంట పరుగెత్తుతుంటే; ఆ+మహాత్ముండు= గొప్పవాడైన ఆ విదురుడు; మరలి= వెనక్కు (ధర్మరాజు) వైపు తిరిగి; కనుంగొని= (ధర్మరాజును) చూచి; వివిక్త ప్రదేశంబునన్= జనా లెవ్వరూ లేని చోట; ఒక్క పాదపంబు= ఒకానొక చెట్టు వద్దకు; చేరి= చేరుకొని; నిలిచినన్= ఆగి ఉండగా.

తాత్పర్యం: అడవిలోని దుమ్ముతో, ఒళ్ళంతా మట్టి గొట్టుకొని పోయి, జడలు గట్టిన జుట్టుతో దిగంబరంగా ఉన్న విదురుడు ఆ విధంగా అకస్మాత్తుగా కనబడి ఆ ఆశ్రమంలో (కొత్త) జనాలను చూచి వెనుకకు తిరిగి వెళ్ళిపోసాగాడు. అప్పుడు ధర్మరాజు తన అనుచరులను వెంటరాకుండా అక్కడే నిలిచి ఉండండని చెప్పుతూ ఒక్కడే ఆ విదురుడి వెంట వెళ్ళాడు. ఆ విదురుడు పొదలలో దూరి నడుమ నడుమ కనబడుతూ, ముందు ముందుకు వేగంగా వెళ్ళుతున్నాడు. అప్పుడు ధర్మరాజు గొంతెత్తి పెద్దగా 'ఓ విదురా! ఓ విదురా! ఆగుము ఆగుము నేను ధర్మరాజును. నిన్ను చూద్దామని వచ్చాను' అని అరుస్తూ విదురుడి వెంట పరుగెత్తుతున్నాడు. అప్పుడు విదురుడు వెనుకకు తిరిగి ధర్మరాజును చూచి ఏకాంతంగా ఉండే చోట ఒకానొక చెట్టు దగ్గరకు వెళ్ళి ఆగి నిలుచున్నాడు.

విదురుఁడు యోగమార్గంబున ధర్మరాజునందుఁ గలియుట (సం.15-33-22)

సీ. ధర్మతనూజుండు తత్సమీపంబున । కేఁగి యయ్యోగి కట్టెదుర నిలిచి
యాతండు నయనంబు లర్ధమీలితములై । యుండంగ నూరక యున్నఁ గాంచి
'నిర్మలాత్మక ! యేను ధర్మసూనుఁడ; నన్నుఁ । గనువిచ్చి చూడవే!' యనుడు నతఁడు
ఱెప్పల నెగయించి యప్పాండవోత్తముఁ । దప్పక చూచి యుదాత్త యోగ

తే. బలము గైకొని యింద్రియములను బ్రాణ । ములను నింద్రియములుఁ బ్రాణములను గలిపి
నిజశరీరంబు విడిచి యా నృపతి తనువు । సొచ్చెఁ దేజోమయత్వవిస్ఫూర్తి మెఱయ. 60

ప్రతిపదార్థం: ధర్మతనూజుండు= ధర్మరాజు; తద్-సమీపంబునకున్= ఆ విదురుడి దగ్గరకు; ఏఁగి= వెళ్ళి; ఆ+యోగి= ధ్యానంలో నిమగ్నుడైన ఆ విదురుడి యొక్క; కడు+ఎదురన్= ఎట్ట ఎదురుగా; నిలిచి= నిలువబడి; అతండు= ఆ యోగి (విదురుడు); నయనంబులు= కళ్ళు; అర్ధ-మీలితంబులు= సగం మూయబడినవి; ఐ-ఉండంగన్= అయిఉండగా; ఊరక-ఉన్నన్= నిర్వికారంగా ఉండగా; కాంచి= (ధర్మరాజు) చూచి; నిర్మల+ఆత్మక= స్వచ్ఛమైన మనసు కలవాడా! (విదురా); ఏను= నేను; ధర్మసూనుండన్= ధర్మరాజును; నన్నున్= నన్ను; కనువిచ్చి= కళ్ళు తెరిచి; చూడవే= చూడవలసింది; అనుడున్= అని ధర్మరాజును; పల్కఁగా= (వేడుకొనగా); అతఁడు= విదురుడు; ఱెప్పలన్= కనురెప్పల్ని; ఎగయించి= ఎత్తి; ఆ+పాండవ+ఉత్తమున్= ఆ ధర్మరాజును; తప్పక= నిశితంగా (దీర్ఘంగా); చూచి= చూచి; ఉదాత్త-యోగ-బలము= గొప్పదయిన యోగశక్తిని; కైకొని= ఆశ్రయించి; ఇంద్రియములను= ధర్మరాజుయొక్క బాహ్యాంతరింద్రియాలలో; ప్రాణములను= ధర్మరాజు ప్రాణాలతో; ఇంద్రియములన్= తన (విదురుడి) ఇంద్రియాలూ; ప్రాణములున్= తన (విదురుడి) ప్రాణాలూ; కలిపి= సంయోగం చెందేటట్లు చేసి; నిజశరీరంబు= తన (విదురుడి) శరీరాన్ని; విడిచి= వదలి పెట్టి; తేజస్+మయత్వ-విస్ఫూర్తి= తేజస్సుతోనిండినట్లు తళుకులు; మెఱయన్= ప్రకాశించగా; ఆ నృపతి తనువున్= ఆ ధర్మరాజుయొక్క శరీరాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు;

తాత్పర్యం: ధర్మరాజు విదురుడి దగ్గరకు వెళ్ళి అతడికి ఎదురుగా నిలబడ్డాడు. యోగి అయిన ఆ విదురుడు అరమూసిన కన్నులతో మాటాడకుండా నిశ్చలంగా ఉండిపోయాడు. అది చూచి ధర్మరాజు-'స్వచ్ఛమైన హృదయం కలవాడా! నేను ధర్మరాజును. కనులు తెరిచి నన్ను చూడు' అని ప్రార్థించాడు. అపుడు విదురుడు మెల్లగా కనురెప్పలెత్తి ధర్మరాజును తదేకంగా చూస్తూ యోగశక్తితో తన ఇంద్రియాలను ధర్మరాజు ఇంద్రియాలలోనూ, తన ప్రాణాలను ధర్మరాజు ప్రాణాలలోనూ కలిపి, తన శరీరం విడిచిపెట్టి, కాంతిమయమైన రూపంతో ఆ ధర్మరాజు శరీరంలో ప్రవేశించాడు.

ఆ. **వినుము ధర్మపుత్త్రు తనువునఁ గాంతియు । లావు నప్పు డగ్గలంబు లయ్యె,**
నొలసె బుద్ధి యధిక బల; మట్టు లగు టతఁ । డెఱిఁగి చోద్యమంది యెలమి నొందె. 61

ప్రతిపదార్థం: వినుము= జనమేజయమహారాజా! వినుము; అప్పుడు= విదురుడు ధర్మరాజు శరీరంలో ప్రవేశించినపుడు; ధర్మపుత్త్రు= ధర్మరాజు యొక్క; తనువునన్= శరీరంలో; కాంతియున్= తేజస్సూ; లావును= శక్తీ; అగ్గలంబులు= అధికములు; అయ్యెన్= అయ్యాయి; బుద్ధి= ప్రతిభ; అధిక బలము= అధికమైన పటుత్వాన్ని; ఒలసెన్= పొందింది; అట్టులు అగుట= తాను అధిక శక్తి మంతుడు కావటం; అతఁడు= ఆ ధర్మరాజు; ఎఱిఁగి= గ్రహించి; చోద్యము= ఆశ్చర్యం; అంది= పొంది; ఎలమిన్= సంతోషాన్ని; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: విదురుడు ధర్మరాజులో కలిసిన తర్వాత ధర్మరాజు శరీరానికి కాంతీ, శక్తీ అధికమయ్యాయి. బుద్ధి ఇంకా బలవంతమయింది. అట్లా కావటం గ్రహించి ధర్మరాజు ఆశ్చర్యంతో సంతోషించాడు.

క. **తదనంతరంబ యప్పతి । విదురశవము ప్రాను సెంది వికృతరహితమై**
నిదురమెయి నొఱగియున్న ప । గిది నుండం జూచి యగ్నికృత్యము నడపన్. 62

ప్రతిపదార్థం: తద్-అనంతరంబు+అ= ఆ తర్వాత; ఆ+పతి= ఆ ధర్మరాజు; విదురశవము= విదురుడి (ప్రాణంలేని) శరీరం; ప్రాను చెంది= చలనరహితమై; వికృత-రహితము-ఐ= మార్పు చెందినది కానిదై (మార్పులేకుండా; నిదురమెయిన్= నిద్రతో; ఒఱగి ఉన్నపగిదిన్= వాలిపోయిన విధంగా; ఉండన్= ఉండగా; చూచి= చూచి; అగ్నికృత్యము= అగ్నికార్యం (దహనం); నడపన్= ఆచరించటానికి ఊహచేశాడని (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఆ తరువాత విదురుడి శవం చలించకుండా, ఏ మార్పూ చెందకుండా (ప్రాణం ఉన్నప్పటి వలెనే) నిద్రతో వాలిపోయిన విధంగా ఉండటం చూచి ధర్మరాజు ఆ విదురుడి శరీరానికి అగ్నికార్యం (దహనం) చేయదలచాడు.

చ. **తలఁచిన మింట నొక్కెలుఁగు 'ధర్మతనూజ! యతిత్వ గౌరవో**
జ్జ్వలుని కళేబరంబునకు వహ్నివిధాన మొనర్చు టర్హమే?
వల'దని మ్రోసె; నమ్మనుజవల్లభుఁ డప్పని దక్కి పోయి భ్రా
తలకును దండ్రికిన్ సువిదితంబుగ నంతయునుం గ్రమంబునన్. 63

ప్రతిపదార్థం: తలఁచినన్= అనుకోగా; మింటన్= ఆకాశంలో; ఒక్క+ఎలుఁగు= ఒకానొక స్వరం (ఇట్లా వినబడ్డది); ధర్మతనూజ!= ధర్మరాజా!; యతిత్వ-గౌరవ+ఉజ్జ్వలుని= యతి లక్షణాల ఆధిక్యం చేత ప్రకాశించే విదురుడియొక్క; కళేబరంబునకున్=

శరీరానికి; వహ్ని-విధానము= అగ్నికార్యం; ఒనర్చుట= చేయటం; అర్హము+ఏ?= తగునా?; వలదు= ఆవిధంగా (దహనం) చేయవద్దు; అని= అనే విధంగా; మ్రోసెన్= ధ్వనించింది; ఆ+మనుజవల్లభుండు= ఆ (ధర్మ)రాజు; ఆ+పని= విదురుడి శరీరాన్ని దహనం చేసే పని; తక్కి= మానుకొని; పోయి= తిరిగి (ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి) వెళ్ళి; భ్రాతలకున్= భీముడు మొదలైన సోదరులకూ; తండ్రికిన్= పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి)వెళ్ళి; భ్రాతలకున్= భీముడు మొదలైన సోదరులకూ; తండ్రికిన్= పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుడికీ; సువిదితంబుగన్= స్పష్టంగా; అంతయునున్= విదురుడి సమక్షంలో జరిగిన వృత్తాంతం అంతా; క్రమంబునన్= మొదటినుండి ఒక వరుసలో, (తరువాతి వచనంతో అన్వయం)

తాత్పర్యం: విదురుడి శరీరానికి అగ్ని సంస్కారం చేయాలని ధర్మరాజు అనుకొనగా, అప్పుడు ఆకాశంలోనుండి ఒకానొక స్వరం 'ధర్మరాజా! యతిధర్మపు గొప్పదనంతో ప్రకాశించే విదురుడి దేహాన్ని దహనం చేయటం తగునా? ఆ విధంగా చేయవద్దు' అని ధ్వనించింది. అప్పుడు ధర్మరాజు ఆపని మానుకొని తిరిగి (ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి) వెళ్ళి అక్కడ ఉన్న తమ్ముళ్లతోనూ, తండ్రితోనూ జరిగిన సంఘటన అంతా క్రమంగా చెప్పాడు'.

వ. ఎల్లవారును వినుచుండం జెప్పిన నందఱు నద్భుత రసంబున మునింగిరి; పదంపడి ధృతరాష్ట్రుం డామంత్ర ణంబు సేయ మునిజనులు నిజనివాసంబులకుం జనిరి; తదనంతరంబ యాంబికేయుండు ధర్మనందనుని తోడ. 64

ప్రతిపదార్థం: ఎల్లవారును= ద్రౌపదీ ప్రభృతులైన స్త్రీ జనమూ, పాండవులను చూడవచ్చిన తాపసులూ అందరూ; వినుచుండన్= వింటుండగా; చెప్పినన్= విదురుడి వృత్తాంతాన్ని ధర్మరాజు చెప్పగా; అందఱున్= అక్కడివారందరూ; అద్భుతరసంబునన్= అద్భుతం అనే రసంలో; మునింగిరి= మునిగిపోయారు; పదంపడి= తర్వాత; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఆమంత్రణంబు-చేయన్= వీడ్కోలు చెప్పగా; మునిజనులు= పాండవులను చూడవచ్చిన తాపసులు; నిజవాసంబులకున్= తమ తమ నివాసస్థలాలకు; చనిరి= వెళ్ళారు; తద్+అనంతరంబు+అ= ఆతర్వాత; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; ధర్మనందనుని తోడన్= ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: ద్రౌపది మొదలైన స్త్రీ జనమూ పాండవులను చూడవచ్చిన తాపసులు అందరూ వింటుండగా, తమ్ములతోనూ, ధృతరాష్ట్రుడితోనూ ధర్మరాజు విదురుడి వృత్తాంతం అంతా క్రమంగా చెప్పాడు. అది విని వారంతా ఆశ్చర్యంలో మునిగిపోయారు. తరువాత ధృతరాష్ట్రుడు వీడ్కోలు చెప్పగా (పాండవులను చూడటానికి వచ్చిన) తాపసులు తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు. అటు పిమ్మట ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. 'భరతకులోత్తమ! ఫలమూలముల నుప । యోగింపు మొసఁగెద నొదవి తనకు
నెయ్యది యాహారమయ్యె నాతిథ్యంబు । దానిన నడపుట ధర్మసరణి'
యనవుడు 'నట్ల కా' కని ఫలంబులు మూల । ములు నుపయోగించె మోదభరితుఁ
డగుచు నప్పాండుసుతాగ్రణి యబ్భంగి । నఖిలజనములు నాహారకలన

తే. మాచరించి రయ్యందఱు నవని శయన । మొంది యారాత్రి నిద్రించి రుదితసూర్య ।
కాలమగుటయు, సముచిత కర్మకరణ । మనుజులును దాను నడపె నమ్మనుజవిభుఁడు. 65

ప్రతిపదార్థం: భరత కుల+ఉత్తమ!= భరతవంశంలో శ్రేష్ఠుడా, ధర్మరాజా!; ఫల-మూలములన్= పండ్లనూ, దుంపలనూ; ఒసఁగెదన్= ఇస్తాను; ఉపయోగింపుము= ఆహారంగా తీసికొమ్ము; ఏ+అది= ఏది; తనకున్= తనకు; ఒదవి= లభించిన; ఆహారము; అయ్యెన్= అవుతుందో; దానన్+అ= ఆ పదార్థంతోనే; ఆతిథ్యంబు= అతిథి భోజనాన్ని; నడపుట= ఉపయోగించటం; ధర్మసరణి= ధర్మబద్ధమైన మార్గం; అనవుడున్= అని ధృతరాష్ట్రుడు పల్కగా; ఆ+పాండు-సుత+అగ్రణి= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ఆ ధర్మరాజు; అట్లు+అ కాక= అట్లే అగుగాక అని; మోద-భరితుఁడు= సంతోషంతో నిండినవాడు; అగుచున్= అవుతూ; ఫలంబులు(న్)= పండ్లూ; మూలములున్= దుంపలూ; ఉపయోగించెన్= ఆహారంగా తీసుకున్నాడు; అఖిల జనములున్= భీమాదులైన (మిగిలిన) జనమంతా; ఆ+భంగిన్= అదేవిధంగా (సంతోషభరితులై ఫలమూలాలు); ఆహారకలనము= ఆహారం తీసికొనే పని; ఆచరించిరి= చేశారు; ఆ+అందఱున్= ధర్మరాజు మొదలైన (ధృతరాష్ట్రాదులను చూడవచ్చిన) వారు అందరూ; ఆ రాత్రి= ఆరోజు రాత్రి; అవనిశయనము= నేలమీద పడకను; ఒంది= పొంది; నిద్రించిరి= నిద్రపోయారు; ఉదిత-సూర్యకాలము= సూర్యుడు ఉదయించే సమయం; అగుటయున్= అయినవెంటనే (ప్రాతఃకాలంలో); ఆ+మనుజవిభుఁడు= ఆ ధర్మరాజు; తాను(న్)= తానూ; అనుజులును= భీమాదులైన తమ్ముళ్ళూ; సముచిత-కర్మ-కరణము= ఆ కాలానికి తగిన సంధ్యావందనాది కర్మలను చేయటం; నడపెన్= పూర్తి చేశాడు.

తాత్పర్యం: భరతవంశశ్రేష్ఠుడా! పండ్లూ, దుంపలూ, ఇస్తాను. ఆహారంగా గ్రహించుము. తమకున్నదీ తాను తినేదీ ఏదో అదే అతిథులకూ పెట్టటమే ధర్మం అన్నాడు ధృతరాష్ట్రుడు. అప్పుడు ధర్మరాజు సరేలెమ్మని సంతోషంతో ఆ పండ్లూ మూలాలూ భుజించాడు. భీమాది బంధువులూ, పౌరులూ అందరూ కూడా అదే విధంగా సంతోషంతో ఫలమూలాలు తిన్నారు. ఆరోజు రాత్రి అందరూ నేలమీద పడుకొని నిద్రపోయారు. సూర్యు డుదయించటంతో ధర్మరాజు తనూ, తమ్ములూ ప్రాతఃకాలంలో ఆచరించవలసిన సంధ్యావందనాది క్రియలు ఆచరించారు.

వ. అట్లు కాలోచితకృత్యంబులు నడపి సహోదరసహితుండును దారోపేతుండును నర్హపరివారానుగతుండును నై యాశ్రమపథంబు గలయ మెలంగి, పావనస్నాన పావకార్చన జపధ్యానాది తాపసధర్మచర్యా విధంబులు, నానామృగ నిర్భయ సంచార ప్రకారంబులు వివిధపక్షికుల నిశ్శంక కేళీవిభవంబులు నాలోకించి, కృత ప్రాతస్సవనకరణీయుం డై యున్న కురువృద్ధు కడకు వచ్చి వందనాభినందన వచనంబుల నతని యుల్లంబు పల్లవింపంజేసి యతఁడు వనుపఁ బవిత్రాసనోపవిష్టుం డై. 66

ప్రతిపదార్థం: అట్లు= ఆప్రకారంగా; కాల+ఉచిత-కృత్యంబులు= సూర్యోదయ (ప్రాతః) కాలంలో చేయవలసిన పనులను; నడపి= పూర్తిచేసి; సహోదరసహితుండును= భీముడు మొదలైన తమ్ములతో కూడిన వాడూ; దార+ఉపేతుండును= భార్య తోడుగా ఉన్నవాడూ; అర్హ-పరివార-అనుగతుండును= తగినంత సేవకజనం చేత అనుసరించబడే వాడూ; ఐ= అయి; (ధర్మరాజు) ఆశ్రమపథంబు= ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమ ప్రదేశం అంతా; కలయన్-మెలంగి= కలియ (సంపూర్ణంగా) తిరిగి; పావన= పవిత్రమైన; స్నాన= స్నానమూ; పావక= అగ్నియొక్క; అర్చన= పూజలు; జప= జపమూ; (మంత్రాదులను ఆవృత్తి చేయటం); ధ్యాన= ధ్యానమూ (తత్త్వాన్ని మనసులో భావన చేయటం); ఆది= మొదలైన; తాపస= మునులయొక్క; ధర్మ= కర్తవ్యాలను; చర్యా= ఆచరించే; విధంబులు(న్)= తీరులూ; నానా= రకరకాల; మృగ= జంతువుల వలని; నిర్భయ= భయంలేని, స్వేచ్ఛతో కూడిన; సంచార= తిరగటాల; ప్రకారంబులు(న్)= పద్ధతులూ; వివిధవిభవంబులు= అనేక విధాలయిన; పక్షి= పక్షుల; కుల= గుంపుల; నిశ్శంక= సంకోచంలేని; కేళీ= విహారాల; విభవంబులున్= గొప్పతనాలూ; ఆలోకించి= చూచి; కృత= చేయబడిన; ప్రాతర్= ఉదయకాలపు; సవన= (సోమ) యజ్ఞానికి సంబంధించిన; కరణీయుండు= క్రియలు కలిగిన వాడు; ఐ= అయి; ఉన్న= ఉన్నటువంటి;

కురువృద్ధు కడకున్= ధృతరాష్ట్రుడి వద్దకు; వచ్చి= చేరుకొని; వందన-అభినందన-వచనములన్= నమస్కారాలూ, సంతోషం కలిగించేవీ అయిన మాటలతో; అతని-ఉల్లంబు= ఆ ధృతరాష్ట్రుడి మనస్సు; పల్లవింపంగన్+చేసి= సంతోషించేటట్లుచేసి; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; పనుపన్= అనుమతించగా; పవిత్ర-ఆసన- ఉపవిష్టుండు= పావనమైన ఆసనం మీద కూర్చున్నవాడు; ఐ= అయి.

తాత్పర్యం: ఆ విధంగా ధర్మరాజు సూర్యోదయం అయిన సమయంలో అపుడు చేయవలసిన పనులు చేసి, తమ్ములతోనూ, భార్యతోనూ, కలిసి తగిన పరివారం వెంటరాగా ఆ ఆశ్రమ ప్రాంతం అంతా తిరిగి, అక్కడ పవిత్రమైన స్నానం, అగ్నిపూజనం, జపం, ధ్యానం, మొదలైన మునులు చేసే పనులు ఆచరింపబడుతూ ఉండటమూ, రకరకాల జంతువులు భయంలేకుండా స్వేచ్ఛగా తిరుగుతుండటమూ, వివిధ పక్షులు గుంపులై నిస్సంకోచంగా విహరిస్తూ ఉన్నప్పటి వైభవమూ చూచాడు. ఆ తరువాత ప్రాతఃకాలంలో చేయవలసిన (సోమ) యజ్ఞానికి సంబంధించిన కర్తవ్యాలను ఆచరించి కూర్చున్నటువంటి ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి అతడికి నమస్కారాలు, ప్రశంసలూ, పలికి, ఆ ధృతరాష్ట్రుడి ఆజ్ఞమీద ఒక పరిశుద్ధమైన ఆసనంమీద కూర్చున్నాడు ధర్మరాజు.

చ. అనుజులుఁ దాను భక్తి మెయి నమ్మహనీయునిఁ గొల్చియుండ న
య్యునికిఁ గనుంగొనంగఁ గరముత్సుకతన్ శతయూపుఁ డాదిగా
మునివరు లేఁగుదెంచినఁ బ్రమోదమునం గుశపీఠరాజిపై
నునుపఁగఁ బంచె గాఢవినయోక్తుల నా ధృతరాష్ట్రుఁ డందఱన్. 67

ప్రతిపదార్థం: అనుజులున్= తమ్ముళ్ళూ, భీమాదులు; తాను(న్)= తానూ (ధర్మరాజు); ఆ+మహనీయునిన్= ఆ పూజ్యుని ధృతరాష్ట్రుడిని, భక్తి మెయిన్= సేవా భావంతో; కొల్చి= సేవించి; ఉండన్= (అక్కడే) ఉండగా; ఆ+ఉనికిన్= ఆస్థితిని; కనుంగొనంగన్= చూడటంకొరకు; శతయూపుఁడు= శతయూపుడనే వాడు; ఆదిగన్= మొదలుగా, మునివరులు= శ్రేష్ఠులైన (పరిసరాల్లోని) మునులు; కరము= మిక్కిలి; ఉత్సుకతన్= కుతూహలంతో; తాపసులు ఏఁగుదెంచినన్= (ధృతరాష్ట్రుడి వద్దకు) రాగా; ఆ ధృతరాష్ట్రుఁడు; అందఱన్= ఆ తపసులందరినీ; కుశపీఠరాజిపైన్= దర్భాసన సమూహంపై; ఉనుపఁగన్= కూర్చుండేవిధంగా (కూర్చోబెట్టండని); ప్రమోదమునన్= సంతోషంతో; గాఢ-వినయ-ఉక్తులన్= మిక్కిలి అణకువ కలిగిన మాటలతో; పంచెన్= నియోగించాడు.

తాత్పర్యం: ఆ ధర్మరాజు తమ్ముళ్ళతో కలిసి (తాను) ఆ ధృతరాష్ట్రుడిని భక్తితో సేవిస్తూ అక్కడ ఉన్నాడు. అటువంటి వాళ్ళను చూడటానికి శతయూపుడు మొదలైన మునులు మిక్కిలి ఉత్సాహంతో అక్కడికి వచ్చారు. వాళ్ళందరినీ దర్భాసనాలపై ఆసీనులు కండి అని ధృతరాష్ట్రుడు మిక్కిలి సంతోషంగా అణకువ మాటలతో చెప్పాడు.

వ. అట్లున్న యమ్మునిజనంబులును బాండు పుత్త్రులునుం బరమధర్మమయ సంభాషణంబులు సేయుచుండ నినుండు నభోమధ్యగతుం డయ్యె; నప్పు డాంబికేయుండు సవినయంబుగా నత్తాపసోత్తములతో 'మీకు మధ్యందిన కృత్యంబు లాచరింపవలయు; విజయం చేయుం'డనిన వారలు నిజనివాసంబులకుం జనిరి; తదనంతరంబ కౌంతేయుల మాధ్యాహ్నిక కరణీయంబులు నిర్వర్తించుట కరుగుం డని పనిచె; నని చెప్పినవిని జనమేజయుం డప్పాండవేయు లవ్విధంబున వనంబున నెన్ని దినంబులు వసియించి?' రని యడిగిన వైశం పాయనుం డిట్లనియె. 68

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; ఉన్న= ఉన్నటువంటి; ఆ+మునిజనంబులును= శతయూపుడు మొదలైన తాపసులూ; పాండుపుత్త్రులునున్= పాండవులూ; పరమ-ధర్మమయ సంభాషణంబులు= ఉత్తమమైన ధర్మంతో నిండిన మాటలు; చేయుచుండన్= ఆడుతుండగా; ఇనుండు= సూర్యుడు; నభన్+మధ్యగతుండు= ఆకాశంలో నడిమి భాగానికి వచ్చినవాడు; అయ్యెన్= అయ్యాడు; అప్పుడు= ఆసమయంలో; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; సవినయంబుగాన్= అణకువతో; ఆ+తాపస+ఉత్తములతోన్= ఆ మునివరులతో; మీకున్= మీకు; మధ్యందిన కృత్యంబులు= మాధ్యాహ్నిక కార్యాలు; ఆచరింపవలయున్= నిర్వర్తించవలసిఉన్నది కాబట్టి విజయం చేయుండు, మీ నివాసాలకు వెళ్ళండి; అనినన్= అని పల్కగా; వారలు= ఆ మునిశ్రేష్ఠులు; నిజ నివాసంబులకున్= తమ నెలవులకు; చనిరి= వెళ్ళారు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; మాధ్యాహ్నిక-కరణీయంబులు= మధ్యాహ్నవేళ ఆచరింపవలసిన పనులు; నిర్వర్తించుటకున్= పూర్తిచేయటానికి; అరుగుండు= వెళ్ళండి; అని= అని చెప్పి; కౌంతేయులన్= పాండవులను; పనిచెన్= పంపించాడు (ధృతరాష్ట్రుడు); అని= ఆ ప్రకారంగా; చెప్పినన్= వైశంపాయనుడు చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు= జనమేజయమహారాజు; ఆ+పాండవేయులు= ఆ పాండవులు, ఆ+విధంబునన్= ఆ తీరుగా; ఎన్ని దినంబులు= ఎన్నాళ్ళు; వనంబునన్= అరణ్యంలో; వసియించిరి?= ఉన్నారు?; అని= అని; అడిగినన్= ప్రశ్నించగా; అతనికిన్= ఆ జనమేజయుడితో ; వైశంపాయనుండు= వైశంపాయనముని; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ఆవిధంగా ధృతరాష్ట్రుడితో పాండవులూ, శతయూపుడూ మొదలైన మునులూ కలిసి ఉత్తమమైన ధర్మంతో నిండిన ఆలాపాలు చేస్తుండగా సూర్యుడు ఆకాశమధ్యానికి వచ్చాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ఆ మునులను 'మీకు మధ్యాహ్నం చేయవలసిన పనులు నడపవలసి ఉన్నది కాబట్టి మీ స్థానాలకు వెళ్ళండి' అని వినయంగా చెప్పాడు. ఆ మునులు తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు. తరువాత మాధ్యాహ్నికాలైన పనులు ఆచరించండని ధృతరాష్ట్రుడు పాండవులను కూడా పంపాడు-అని వైశంపాయనుడు చెప్పగా జనమేజయుడు విని 'పాండవులు ఆ విధంగా అరణ్యంలో ఎన్నాళ్ళున్నారు?' అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'ధరణీశ! పాండునందను లట్లు సాంతఃపు। రంబును సపరివారంబుఁగాఁగ
నడవికి నేఁగి యయ్యంబికానందనుఁ। గాంచిన దినమునఁ గరము నియతి
ఫలమూలసమితి నాఁకలి పుచ్చి భూమిశ। యనమున నిద్రించి రాగరిష్ఠుఁ
డమ్మహితాత్ముల కర్థితో మఱునాఁ। డనుజ్ఞ యిచ్చిన, సుమనోజ్ఞములును

ఆ. సన్నుతములు నైన యన్నపానాదుల। ననుభవించి మృదులహారి తల్ప
ముల శయించి; రట్లు నెలనాళు లయ్యెడ। నతనిఁ గొల్చియుండి రధిపముఖ్య! 69

ప్రతిపదార్థం: ధరణీ+ఈశ!= (జనమేజయ)రాజా!; పాండునందనులు= పాండవులు; స-అంతపురంబును= ద్రౌపదీ ప్రభృతులైన అంతఃపుర స్త్రీలతోనూ; సపరివారంబున్= భృత్యులతోనూ కూడినవారు; కాఁగన్= అయి; అట్లు= ఆ ప్రకారంగా; ధృతరాష్ట్రాదులను చూచే నిమిత్తం; అడవికిన్ ఏఁగి= అడవికి వెళ్ళి; ఆ+అంబికానందనున్= ఆ ధృతరాష్ట్రుడిని; కాంచిన దినమునన్= చూచిన రోజు; కరము= మిక్కిలి; నియతిన్= నియమంగా; ఫలమూల-సమితిన్= పండ్లూ, వేళ్ళ సముదాయంతో; ఆఁకలిపుచ్చి= ఆకలి తీర్చుకొని; భూమిశయనమునన్= నేల పక్క (పరపు)గా; నిద్రించిరి= నిద్ర చేశారు; మఱునాఁడు= తరువాతిరోజు; ఆ గరిష్ఠుఁడు= దొడ్డవాడైన ఆ ధృతరాష్ట్రుడు; ఆ+మహిత+ఆత్ములకున్= దొడ్డ బుద్ధులైన ఆ పాండవులకు; అర్థితోన్= ప్రేమతో; అనుజ్ఞ= అనుమతి; ఇచ్చినన్= ఇవ్వగా; సుమనోజ్ఞములును= మనస్సు కింపు కలిగించేవి; సన్నుతములు= ప్రశస్తాలూ; ఐన= అయినటువంటి;

అన్న-పాన+ఆదులన్= భోజనమూ, పానీయమూ మొదలైన వాటిని; అనుభవించి= ఆస్వాదించి; మృదుల-హారి-తల్పములన్= కోమలములూ మనోహరములూ అయిన శయ్యలమీద; శయించిరి= నిద్రించారు; అధిపముఖ్య!= రాజులలో శ్రేష్ఠుడా! జనమేజయా!; అట్లు= ఆవిధంగా (పాండవులు); ఆ+ఎడన్= వనంలో; నెలనాళులు= నెలరోజులు; అతనిన్= ధృతరాష్ట్రుడిని; కొల్చి= సేవిస్తూ; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! అంతఃపుర కాంతలతోనూ, తగిన పరివారంతోనూ కలిసి (ధృతరాష్ట్రాదులను చూడటానికి) పాండవేయులు అడవికి వెళ్ళిన ఆ రోజు నియమంగా ధృతరాష్ట్రు డిచ్చిన ఫలమూలాదులతో ఆకలి తీర్చుకొని నేలమీద నిద్రించారు. ఆ మరునాడు ధృతరాష్ట్రుడు ప్రేమతో అనుమతించగా మనసుకు ఇష్టమైనవీ, ప్రశస్తమైనవీ అయిన భోజనాలూ, పానీయాలూ ఆస్వాదించి, కోమలంగానూ మనోహరంగానూ ఉన్న శయ్యలమీద నిద్రించారు. జనమేజయ మహారాజా! పాండవేయు లావిధంగా ధృతరాష్ట్రుడి ఆశ్రమవనంలో ఆ ధృతరాష్ట్రుడిని సేవించుకొంటూ నెలనాళ్ళున్నారు.

వ. పదంపడి యొక్కనాఁ డెప్పటియట్ల పాండుపుత్త్రులు గాంధారీ కుంతీసముపాసితుండయియున్న విచిత్రవీర్యపుత్త్రుంబరివేష్టించియుండ నవ్విశిష్ట గోష్ఠికై శతయూపప్రభృతి మునివరులు చనుదెంచిన నక్కురువృద్ధుఁడర్ఘ్యంబు లగునాసనంబులు వెట్టించి సంభావించిన. 70

ప్రతిపదార్థం: పదంపడి= తరువాత; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; ఎప్పటిఅట్లు+అ= ఎప్పటివలెనే; పాండుపుత్త్రులు= పాండవులు; గాంధారీ-కుంతీ-సముపాసితుండు+అయి= గాంధారి చేత, కుంతి చేత సేవించబడుతూ; ఉన్న= ఉన్నటువంటి; విచిత్ర వీర్యపుత్త్రున్= ధృతరాష్ట్రుడిని; పరివేష్టించి-ఉండన్= చుట్టుకొనిఉండగా; ఆ+విశిష్ట-గోష్ఠికై= అసాధారణమైన ఆ సమావేశానికి; శతయూప-ప్రభృతి-మునివరులు= శతయూపుడు మొదలైన మునిశ్రేష్ఠులు; చనుదెంచినన్= రాగా; ఆ+కురువృద్ధుండు= ఆ ధృతరాష్ట్రుడు; అర్ఘ్యంబులు= (ఆ మునులకు) తగినవి; అగు-ఆసనంబులు= అయినటువంటి ఆసనాలను; పెట్టించి= ఏర్పాటు చేయించి; సంభావించినన్= గౌరవించగా.

తాత్పర్యం: తరువాత ఒకానొకరోజు పాండవులు ఎప్పటివలెనే, గాంధారిచేత, కుంతిచేత పూజించబడుతున్న ధృతరాష్ట్రుడి చుట్టూ కూర్చుని ఉన్నారు. అసామాన్యమైన ఆ సమావేశానికి శతయూపుడు మొదలైన మునులు వచ్చారు. ధృతరాష్ట్రుడు వారికి తగిన ఆసనాలు ఏర్పాటు చేయించి గౌరవించగా.(తరువాతి పద్యంతో అన్వయం)

వేదవ్యాసుఁడు పాండవసహితుండైన ధృతరాష్ట్రునాశ్రమంబునకు వచ్చుట (సం.15-34-21)

సీ. సముచితంబులు సధర్మములును నైన స। ల్లాపముల్ సెల్ల నుల్లంబు లలర
వార లున్నెడ సత్యవతికొడు కందుల। కేతేర నందఱు నెదురువోయి
వినతులై భక్తిఁ దోడ్కొనివచ్చి యతులకృ। ష్ణాజిన దర్భోత్తరాసనమున
నునిచి యమ్మునివరుననుమతిఁ దమతమ। యాసనంబుల నుండి; రమ్మహాత్ము

ఆ. నర్చితునిగఁ జేసి నాంబికేయుఁడు దద। నంతరంబ సమధికాదరమున
నతఁడు మధుర మృదు విధాక్షరంబుగ నమ్మ। హీశముఖ్యుతోడ నిట్టు లనియె. 71

ప్రతిపదార్థం: సముచితంబులు(ను)= మిక్కిలి యుక్తములైనవీ; సధర్మములను= వేద శాస్త్రాదులలో చెప్పబడిన అంశాలతో కూడినవీ; ఐన= అయినటువంటి; సల్లాపముల్= మంచి మాటలు; చెల్లన్= సాగుతుండగా; వారలు= పాండవాదులు; ఉల్లంబులు= మనసులు; అలరన్= సంతోషిస్తూ; ఉన్న+ఎడన్= ఉన్నటువంటి సమయంలో; అందులకున్= ఆచోటికి; సత్యవతి కొడుకు= వేదవ్యాసమూర్తి; ఏతేరన్= రాగా; అందఱున్= పాండవాదులు అందరూ; ఎదురు-పోయి= వ్యాసుడికి ఎదురువెళ్ళి; వినతులు+ఐ= వంగి నమస్కరించిన వారై; భక్తిన్= సేవా ధర్మంతో; తోడ్కొని వచ్చి= వ్యాసుడిని ఆశ్రమంలోనికి తీసికొనివచ్చి; అతుల= సాటిలేని; కృష్ణ-అజిన= కృష్ణమృగ చర్మం; దర్భ+ఉత్తర= దర్భలతో చేయబడిన; ఆసనంబునన్= ఆసనం మీద (దర్భాసనం మీద కృష్ణమృగ చర్మం కప్పబడింది); ఉనిచి= కూర్చుండజేసి; ఆ+మునివరు+అనుమతిన్= ఆ వ్యాసమహర్షి అనుజ్ఞతో; తమ తమ-ఆసనంబులన్= (వ్యాసుడికి స్వాగతం చెప్పడానికి ఎదురుగా వెళ్ళిన) అందరూ తమ తమ ఆసనాలమీద; ఉండిరి= కూర్చున్నారు; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; ఆ+మహాత్మున్= గొప్పవాడైన ఆ వేదవ్యాసుడిని; అర్చితునిగన్+చేసెన్= పూజించాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; అతఁడు= ఆ వ్యాసుడు; సమ్-అధిక-ఆదరమునన్= మిక్కిలి వాత్సల్యంతో; మధుర-మృదు-విధా-అక్షరంబుగన్= తీయనైన (ఇంపైన) మెత్తదనం కలిగిన మాటలతో; ఆ+మహీ+ఈశ-ముఖ్యు తోడన్= ఆ (ధృతరాష్ట్ర) మహారాజుతో; ఇట్టులు= ఈ ప్రకారంగా; అనియె(న్)= అన్నాడు.

తాత్పర్యం: (ధృతరాష్ట్రుడి చుట్టూ కూర్చున్న పాండవులూ, ఆ సమావేశానికి వచ్చిన శతయూపాది మునులు అందరూ) మిక్కిలి యుక్తమయినవీ, ధర్మంతో కూడినవీ, అయిన మంచిమాటలు సాగుతుంటే మనసులు సంతోషిస్తూ ఉన్న సమయంలో అక్కడికి వేదవ్యాసమహర్షి వచ్చాడు. అందరూ వ్యాసుడికి భక్తితో ఎదురువెళ్ళి పాదాభివందనం చేసి, వెంటఉండి ఆశ్రమానికి తీసికొనివచ్చారు. సాటిలేనటువంటి కృష్ణమృగచర్మం కప్పిన దర్భాసనం మీద ఆ వ్యాసమహర్షిని కూర్చుండబెట్టారు. వ్యాసుడి అనుమతితో, అందరూ తమ తమ ఆసనాల మీద కూర్చున్నారు. అపుడు ధృతరాష్ట్రుడు వ్యాసమహర్షిని పూజింపచేశాడు. తర్వాత ఆ వ్యాసుడు ధృతరాష్ట్రుడితో తియ్యని మెత్తని పలుకులతో ఇట్లా అన్నాడు.

సీ. 'వనవాసమున నీకు మన మలవడియెనే? । నియతిమైఁ దాపసక్రియల కోర్చి
నడపెదవే పుత్త్రనాశజమైనశో । కము భవదంతరంగంబునందు
లేదు గదా? ధర్మవేదిని గాంధారి । యుమ్మలికంబు లే కున్న యదియె?
నీకుఁ బరిజ్ఞాననిష్ఠ గల్గెనె? గొంతి । శుశ్రూష మీ కొనర్చునె తగంగ?

తే. రాజ్య మొల్లక వచ్చె నరణ్యవాస । మునకు నీయమ; మీరు రాఁ దనకు నింట
నిలువఁ దగ దని యిమ్మేలు నీదు బుద్ధి । నొలసి యుండునె కౌరవకులపవిత్ర! 72

ప్రతిపదార్థం: కౌరవ-కుల-పవిత్ర!= కురువంశంలో నిర్మలమైనవాడా!; నీకున్= నీకు; మనము= మనస్సు; వనవాసమునన్= అరణ్యాలలో నివసించటంలో; అలవడియెన్+ఏ?= అలవాటు పడిందా?; తాపస-క్రియలకున్= మునిధర్మాన్ని నిర్వర్తించటంలో; ఓర్చి= ఓర్పు కలిగి; నియతిమైన్= నియమబద్ధంగా; నడపెదవు+ఏ?= జరుపుతున్నావా?; భవత్-అంతరంగమునందున్= నీ మనసులో; పుత్త్ర-నాశజము= కొడుకులు మరణించటం వలన కలిగినది; ఐన= ఐనటువంటి; శోకము= దుఃఖం; లేదు కదా= ఇపుడు ఉండలేదు గదా; ధర్మవేదిని= ధర్మం తెలిపిన; గాంధారి= గాంధారి; ఉమ్మలికంబు= విచారం; లేక-ఉన్న-అది-ఎ?; లేకుండా ఉన్నదిగదా; నీకున్= నీకు; పరిజ్ఞాన నిష్ఠ= పరిపూర్ణమైన జ్ఞానం యొక్క స్థిరత్వం; కల్గెనె?= సంభవించిందా?; గొంతి= కుంతీదేవి; మీకున్= మీకు; తగంగన్= తగువిధంగా; శుశ్రూష= సేవ; ఒనర్చున్+ఎ?= చేస్తున్నదా?; మీరు= మీరు (గాంధారీ, ధృతరాష్ట్రులు) రాన్= (ఆశ్రమవాసానికి) అడవులకు రాగా; తనకున్= తనకు (కుంతి); ఇంటన్= ఇంట్లో (రాజధానిలో); నిలువన్=

ఉండిపోవటం; తగదు= యుక్తం కాదు; అని= అనిచెప్పి; ఈఅమ= ఈ కుంతి; రాజ్యము= కొడుకుల రాజ్యం; ఒల్లక= అంగీకరించకుండా; అరణ్యావాసమునకున్= మీతో అరణ్యాలలో ఉండడానికి; వచ్చెన్= వచ్చింది; మేలు= కుంతి శుశ్రూషార్థం మీతో అరణ్యాలకు రావడం అనే మంచిపని; నీదు బుద్ధిన్= నీమనసులో; ఒలసి ఉండునె?= మరపురాక నిలిచి ఉంటుందా?

తాత్పర్యం: 'కురువంశంలో పుణ్యాత్ముడా, ధృతరాష్ట్రా! నీ మనసు వనవాసానికి అలవాటు పడిందా? ముని ధర్మాలను ఓర్పుతో నియమంగా ఆచరిస్తున్నావా? కొడుకులు నశించిపోయారనే దుఃఖం నీ మనసులో లేదుగదా! ధర్మం తెలిసిన గాంధారి దుఃఖించడం లేదు కదా! నీకు సంపూర్ణమైన జ్ఞానం స్థిరంగా ఏర్పడిఉన్నదా గదా! కుంతి మీకు తగువిధంగా సేవలు చేస్తున్నదా? మీరు అరణ్యావాసానికి వస్తుంటే తాను ఇంట్లో ఉండటం యుక్తం కాదని (కొడుకుల) రాజ్యం కూడా విడిచిపెట్టుకొని మీ సేవకొరకు మీ వెంట అరణ్యాలకు వచ్చింది ఈమె. ఆ విధంగా కుంతి చేసిన మేలుపని నీ మనసులో మరపురాకుండా నిలిచిఉన్నదా?

చ. అనఘ! యజాతశత్రునెడ నాదరణాతిశయాన్వితంబె నీ
మనము? వృకోదరున్ నరుని మాద్రితనూజుల సత్క్రియాభినం
దనముల గారవింతె? వినుతస్థితిఁ దద్దయు నిర్మలత్వ మొం
దెనె భవదీయచిత్తమున ధీమహితా! దృఢశాంతిమూలమై.' 73

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా (ధృతరాష్ట్రా)!; నీ మనము= నీ మనస్సు; అజాతశత్రు-ఎడన్= ధర్మరాజు విషయంలో; ఆదరణ+అతిశయ-అన్వితంబు+ఎ?= మిక్కిలి ప్రేమతో కూడి ఉన్నదా?; వృక+ఉదరున్= భీముడిని; నరునిన్= అర్జునుడినీ; మాద్రి తనూజులన్= మాద్రికొడుకులు-నకుల సహదేవులనూ; సత్క్రియా+అభినందనములన్= ఆదరణంతోనూ, ప్రశంసలతోనూ; గారవింతు+ఎ?= లాలన చేస్తున్నావా?; ధీ మహితా!= బుద్ధిచేత గొప్పవాడా! (ధృతరాష్ట్రా)!; భవదీయ-చిత్తమునన్= నీమనస్సులో; వినుత-స్థితిన్= ప్రశంసింపదగిన ఉనికితో; దృఢ-శాంతి-మూలము= స్థిరమైన (అంతర్) ఇంద్రియాలశాంతికి ఆధారం; ఐ= అయి; నిర్మలత్వము= స్వచ్ఛత; తద్దయున్= అధికంగా; ఒందెన్+ఎ?= కలిగిందా?

తాత్పర్యం: పాపంలేనివాడా! ధృతరాష్ట్రుడా! నీ మనసు ధర్మరాజుపై మిక్కిలి ప్రేమతో ఉన్నదా? భీమ, అర్జున, నకుల, సహదేవులను మంచితనంతోనూ, ప్రశంసలతోనూ ఆదరిస్తున్నావా? దొడ్డబుద్ధికలవాడా!, నీ మనసులో స్థిరమైన శాంతికి ఆధారంగా, ప్రశంసార్హంగా, నిర్మలభావం ప్రాప్తించిందా?'

వ. అని యంత నిలువక. 74

ప్రతిపదార్థం: అని= వ్యాసుడు ఆ విధంగా పలికి; అంతన్= అంతటితో; నిలువక= ఆగకుండా (ఇంకా ఈ విధంగా అన్నాడు).

తాత్పర్యం: అని అడిగిన వ్యాసుడు అంతటితో ఆగకుండా (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. 'వినుము! దీర్ఘవైర వృత్తియు' ద్రోహచిం । తనము లేక వాక్కు మనము నొక్క
చంద మగుట సకలజనములకును బంధు । సంపదాప్తి పరమసాధనంబు.' 75

ప్రతిపదార్థం: వినుము= ధృతరాష్ట్రా వినుము; దీర్ఘ-వైర-వృత్తియున్= చాలాకాలం శత్రుభావంతో ఉండటమూ; ద్రోహ చింతనము(ను)= (దీర్ఘకాలం) అపకారపు ఆలోచనమూ; లేక= లేకుండా; వాక్కు(ను)= మాటా; మనమున్= మనస్సూ; ఒక్క చందము= ఒకేవిధం; అగుట= కావటం; సకల జనములకున్= అందరికీ; బంధు= చుట్టాల (మిత్రుల); సంపద్= సంపదను (ఆధిక్యాన్ని); ఆప్తి= పొందటానికి; పరమ= ఉత్తమమైన; సాధనంబు= ఉపకరణం.

తాత్పర్యం: 'ధృతరాష్ట్రా! వినుము. ఎవరితోనైనా చాలకాలంగా విరోధంతో నడుచుకొనటమూ, అపకారం చేయాలనుకొనటమూ లేకుండా, మాటా, మనసూ ఒకే విధంగా ఉండటమే అందరికీ బంధు సంపద సిద్ధింపజేసే మార్గం'.

వ. అని చెప్పి వెండియు. 76

ప్రతిపదార్థం: అని= పైవిధంగా; చెప్పి= (ధృతరాష్ట్రుడితో) పలికి; వెండియు(న్)= తిరిగి (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: పై విధంగా చెప్పి తర్వాత మళ్ళీ వ్యాసుడు (తరువాతి పద్యంతో అన్వయం).

సీ. 'విదురుండు దేహంబు విడిచిన తెఱఁగెల్ల । నెఱిఁగితె? మాండవ్యుఁ డిచ్చినట్టి
పటుశాపమున శూద్ర భావంబు నొందిన । ధర్మదేవత బోధనిర్మలాత్ముఁ
డైన యమ్మహనీయుఁ డట్లగుటంబుజా । సనుని యాజ్ఞాపనమున విచిత్ర
వీర్యనృపాధీన విశ్రుతక్షేత్రంబు । నం దేఁ బ్రవర్తింప నధిప! కలిగె

తే. ధర్మదేవత మాఱట తనువు సూవె । యీ యుధిష్ఠిరు నుజ్జ్వలకాయ; మింత
యెఱిఁగి కాదె యమ్మహిత యోగీశ్వరుఁడు స । మీడ్య యోగబలంబున నితనిఁ గలసె. 77

ప్రతిపదార్థం: అధిప!= (ధృతరాష్ట్ర) రాజా!; విదురుండు= విదురుడు; దేహంబు= శరీరం; విడిచిన తెఱఁగు= త్యజించిన విధం; ఎల్లన్= సమస్తం; ఎఱిఁగితి+ఎ= తెలిసికొన్నావా; బోధ నిర్మల-ఆత్ముఁడు= వివేకంతో దోషంలేని బుద్ధిగలవాడు; ఐన=అయినటువంటి; ఆ+మహనీఁయుడు= ఆ మహాత్ముడు (విదురుడు); మాండవ్యుఁడు= మాండవ్యుడనే మహర్షి; ఇచ్చిన+అట్టి= ఇచ్చినటువంటి; పటుశాపమునన్= ఘోరమైన శాపంవలన; శూద్రభావంబున్= శూద్రత్వాన్ని; ఒందిన= పొందినట్టి; ధర్మదేవత= యమధర్మరాజు; అంబుజ+ఆసనుని= బ్రహ్మ; (పద్మం ఆసనంగా కలవాడు); ఆజ్ఞాపనమునన్= ఆదేశం చేత; విచిత్రవీర్య= విచిత్రవీర్యుడనే; నృప= రాజుయొక్క (నీ తండ్రియొక్క); అధీన= అధీనమందున్న; విశ్రుత= ప్రసిద్ధమైన; క్షేత్రంబునందున్= భార్య అయిన అంబికయొక్క దాసియందు; ఏను= నేను (వ్యాసుడు); ప్రవర్తింపన్= వ్యవహరించగా (బోధ నిర్మల-ఆత్ముఁడు)= వివేకంచేత దోషంలేని బుద్ధికలవాడు; ఐన= అయినటువంటి; ఆ+ మహనీయుఁడు=మహాత్ముడైన ఆ విదురుడు; అట్లు= ఆ ప్రకారంగా (మాండవ్య శాపం వలన యముడే శూద్రుడుగా, విదురుడుగా); అగుట= కావటం; కలిగెన్= సంభవించింది; ఈ యుధిష్ఠిరుని= ఈ ధర్మరాజుయొక్క; ఉజ్జ్వల కాయము= కాంతిమంతమైన శరీరం; ధర్మదేవత= ధర్ముడి; మాఱట తనువు= రూపాంతరమే; చూవె!= సుమా!; ఇంత= ఇది అంతా; ఎఱిఁగి= తెలిసిఉండటం వలననే; కాదె= కదా; ఆ+మహిత యోగి+ఈశ్వరుఁడు= మహాత్ముడు, యోగులలో శ్రేష్ఠుడూ ఐన ఆ విదురుడు; సమ్+ఈడ్య-బలంబునన్= మిక్కిలి ప్రశంసించదగిన యోగశక్తిచేత; ఇతనిన్= ఈ ధర్మరాజు (శరీరంలో); కలసెన్= కలిసిపోయాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! విదురుడు శరీరం త్యజించిన తీరు తెలుసా? పూర్వం మాండవ్య మహర్షి ఇచ్చిన ఘోరమైన శాపం వలన శూద్రుడుగా పుట్టిన యమధర్మరాజే జ్ఞానం వలన నిర్మలబుద్ధీ, మహాత్ముడూ అయిన ఆ విదురుడు బ్రహ్మదేవుడి ఆజ్ఞప్రకారం నేను విచిత్ర వీర్యమహారాజు అధీనంలో ఉన్న అంబికా దాసి యందు వర్తించడం వలన యముడు విదురుడై శూద్రుడుగా పుట్టటం సంభవించింది. ఈ ధర్మరాజుయొక్క శరీరం ఆ యమధర్మరాజుయొక్క రూపాంతరమే. అది తెలిసినవాడు గాబట్టే గొప్ప యోగి అయిన విదురుడు తన యోగబలంతో ధర్మరాజులో కలిసిపోయాడు.

ఆ. అట్లు దేవతామయాత్మకుఁ డైన యి । వ్విభుఁడు నిన్నుఁ బ్రేష్యవృత్తి నిట్లు
గొలిచి యునికి బుద్ధిఁ దలపోసి సంతస । మంది యుండుదే కులాగ్రగణ్య!' 78

ప్రతిపదార్థం: కుల+అగ్రగణ్య!= కౌరవవంశంలో ప్రథమంగా పరిగణించదగిన వాడా!; శ్రేష్ఠుడా, ధృతరాష్ట్రా!; అట్లు= ఆవిధంగా మారుతనువు పొందిన ధర్మదేవతగా; దేవతామయ+ఆత్మకుఁడు= దేవతాలక్షణాలు నిండిన అంత స్వరూపం గలవాడు; ఐన= అయినటువంటి; ఈ+విభుఁడు= ఈ ధర్మరాజు; నిన్నున్= నిన్ను; ఇట్లు= ఈవిధంగా; ప్రేష్యవృత్తిన్= భృత్యుడి పద్ధతిలో; కొలిచి-ఉనికి= సేవిస్తూ ఉండటం; బుద్ధిన్= నీ మనసులో; తలపోసి= స్మరించి; సంతసము= సంతోషం; అంది= పొంది; ఉండుదు+ఏ?= ఉన్నారా?

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా!, ఆవిధంగా రూపాంతరం పొందిన ధర్మదేవతకాబట్టి దేవతాస్వరూపుడైన ఈ ధర్మరాజు ఈ విధంగా భృత్యుడివలె నిన్ను సేవిస్తూ ఉండటం నీమనసులో స్మరించి ఆనందిస్తున్నావా?'.

వ. అనిన విని వైచిత్రవీర్యుం డప్పారాశర్యునకుఁ బరమవినయంబున నిట్లనియె, 79

ప్రతిపదార్థం: అనినన్= అని వ్యాసుడు చెప్పగా; విని= ఆలకించి; వైచిత్ర వీర్యుండు= ధృతరాష్ట్రుడు; ఆ+పారాశర్యునకున్= ఆ వ్యాసమహర్షితో; ఇట్లు= ఈ విధంగా; అనియె (న్)= అన్నాడు.

తాత్పర్యం: వ్యాసు డట్లా అనగా విని ధృతరాష్ట్రుడు, అణకువతో వ్యాసుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'వనవాస మించుకయును నాకు దుఃఖంబు । సేయదు; దేహంబుఁ జిత్తమును ద
పఃక్రియలకుఁ బనుపడి యున్నయవి నన్ను । గాంధారిఁ బుత్త్రశోకం బొకింత
యేనియుఁ బొందంగ నీఁడు సభక్తిక । మైన వృత్తమున ధర్మాత్మజుండు
మునివర! యితనిపై ననుజుల మీఁద వ । త్సలము నా హృదయ మిద్ధరణివిభుఁడు

ఆ. దేవతాత్ముఁ డగుట దెల్ల మై యునికి మ । ద్వచనవర్తనములవలన నితఁడ
యెఱిఁగి యుండుఁ గొంతి తెఱఁగు శుశ్రూషయు । నద్భుతంబు ముదము నావహించు. 80

ప్రతిపదార్థం: నాకున్= నాకు (ధృతరాష్ట్రుడికి); వనవాసము= అరణ్యంలో నివసించటం; ఇంచుకయును= కొంచెం కూడా; దుఃఖంబు= కష్టం; చేయదు= కలిగించలేదు; తపఃక్రియలకున్= మునులు ఆచరించవలసిన ధర్మాలు నిర్వహించటంలో; దేహంబున్= (నా) శరీరమూ; చిత్తమును= (నా) మనస్సు; పనుపడి-ఉన్నవి= తగి (అలవాటుపడి) ఉన్నాయి; వృత్తమున(న్)=

సభక్తికము ఐన భక్తితో కూడిన నడవడితో; ధర్మజుండు= ధర్మరాజు; నన్ను(న్)= నన్నూ; గాంధారిన్= గాంధారినీ; పుత్త్రశోకంబు= కొడుకుల (మరణం వలని) దుఃఖం; ఒక+ఇంత+ఏనియున్= కొంచెం కూడా; పొందంగన్-ఈఁడు= పొందనివ్వటం లేదు; మునివర!= మునిశ్రేష్ఠుడా!; నా హృదయము= నా మనస్సు; ఇతనిపైన్= ఈ ధర్మరాజుమీదా; అనుజులమీఁదన్= (ఈ ధర్మరాజు) తమ్ముళ్ళపైనా; వత్సలము= ప్రేమ కలిగిఉన్నది; ఈ+ధరణివిభుఁడు= ఈ (ధర్మ) రాజు; దేవతా-ఆత్ముఁడు= దైవ స్వరూపుడు; అగుట= కావటం; తెల్లము+ఐ= నాకు తెలిసినదై; ఉనికి= ఉండటం; మత్-వచన-వర్తనముల వలనన్= నా మాటలవలన, చేతలవలన; ఇతఁడు+అ= ఈ ధర్మరాజే; ఎఱిఁగి-ఉండున్= తెలిసికొని ఉంటాడు; గొంతి తెఱఁగు= కుంతీదేవి పద్ధతీ; శుశ్రూషయున్= ఆమె మాకు చేసే సేవ; అద్భుతంబు(న్)= (మాకు) ఆశ్చర్యాన్నీ; ముదమున్= సంతోషాన్నీ; ఆవహించున్= నింపుతున్నాయి.

తాత్పర్యం: 'మహర్షీ! అరణ్య నివాసం నాకు కొంచెం కూడా కష్టం కలిగించలేదు. తాపస ధర్మాలను ఆచరించటంలో నా శరీరమూ, మనస్సూ రెండూ సమర్థమై (అలవాటుపడి) ఉన్నాయి. భక్తితో కూడిన నడవడితో ధర్మరాజు నాకూ గాంధారికీ, పుత్ర వినాశం వలని దుఃఖం లేకుండా చేశాడు. ధర్మరాజుమీదా అతడి తమ్ముళ్ళమీదా నా మనస్సు ప్రేమతో నిండిఉన్నది. ఈ ధర్మరాజు దైవస్వరూపుడు అనే విషయం నాకు తెలుసు. అది నా మాటలవలన, చేతల వలన ధర్మరాజుకూ వ్యక్తమయ్యే ఉంటుంది. ఇంక కుంతి రాజ్యం విడిచి మా సేవకై అరణ్యాలకు వచ్చిన విధమూ, ఆమె మాకు చేస్తున్న సేవా, ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగిస్తున్నాయి.

వ. నాకుం బరిజ్ఞానంబును మానస నిర్మలత్వంబును భవత్ ప్రసాదంబునం గలిగెడుఁగాక' యనియె; నా సమ యంబున ద్రౌపదీసుభద్రలును దక్కునుంగల్గు నంగనాజనంబులును బారాశర్య సందర్శన ప్రవణత్వంబునం జనుదెంచి సభక్తి ప్రణామంబు లాచరించి యంతంత నిలిచి; రయ్యలఘుజ్ఞాన మాననీయుండు ధృతరాష్ట్రు తోడ. 81

ప్రతిపదార్థం: నాకున్= నాకు; పరిజ్ఞానంబున్= తత్త్వమును గూర్చిన సంపూర్ణమైన వివేకమూ; మానస-నిర్మలత్వంబును= మనస్సు దోషరహితం కావటమూ; భవత్-ప్రసాదంబునన్= మీదయచేత; కలిగెడున్-కాక= సిద్ధించాలి; అనియెన్= అన్నాడు (ధృతరాష్ట్రుడు); ఆ సమయంబునన్= అప్పుడు; ద్రౌపదీసుభద్రలును= ద్రౌపదీ, సుభద్రా; తక్కునున్+కల్గు= మిగిలిఉన్న; అంగనాజనంబులును= స్త్రీలూ; పారాశర్య-సందర్శన ప్రవణత్వంబునన్= వ్యాసుడిని చూడాలనే ఆసక్తితో; చనుదెంచి= అక్కడికి వచ్చి; సభక్తి ప్రణామంబులు= (వ్యాసుడికి) అణకువతో, పాదాభివందనాలు; ఆచరించి= చేసి; అంత+అంత= ఇంచుకదూరంలో అక్కడక్కడా; నిలిచిరి= నిలబడి ఉన్నారు; ఆ+అలఘు+జ్ఞాన-మాననీయుండు= సమగ్రమైన జ్ఞానంచేత పూజించదగిన ఆ వ్యాసమహర్షి; ధృతరాష్ట్రుతోడ(న్)= ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు).

తాత్పర్యం: నాకు సంపూర్ణమైన జ్ఞానమూ, మనసు దోషరహితం కావటమూ, నీ దయవలన సంభవించుగాక! అన్నాడు ధృతరాష్ట్రుడు. ఆ సమయంలో ద్రౌపది, సుభద్ర ఇంకా మిగిలిన స్త్రీ జనమూ వ్యాసమహర్షిని చూడాలనే ఉత్కంఠతో, అక్కడికి వచ్చి వ్యాసుడికి వినయంగా పాదాభివందనం చేసి కొంచెం దూరంగా నిలుచున్నారు. అప్పుడు వ్యాసమహర్షి ధృతరాష్ట్రుడితో. (తరువాతి పద్యంతో అన్వయం)

ఉ. మీయెడ చింత వాయఁగ సమీహితబుద్ధి యొనర్పఁ గోరి యే
నీ యెడ కిప్డు వచ్చితి నభీష్టము వేఁడుము శంక దక్కి భూ

నాయక! యెల్లభంగిని మనః ప్రియముం దగ నిత్తు' నన్నఁ గౌం

తేయు లెలర్చి; రవ్వసుమతీపతి మోదము నొందె నెంతయున్. 82

ప్రతిపదార్థం: భూనాయక!= ధృతరాష్ట్ర మహారాజా!; మీయెడ చింత= మీకు మానసికమైన విచారం; పాయఁగన్= తొలగిపోయేటట్లు; సమీహిత-బుద్ధి= కోరుకొన్న జ్ఞానం; ఒనర్పన్+కోరి= సిద్ధింపజేయదలచి; ఈ+ఎడకున్= ఈచోటికి; ఇప్డు= ఈ సమయంలో; ఏను= నేను; వచ్చితిన్= వచ్చాను; శంక= సందేహం; తక్కి= విడిచిపెట్టి; అభీష్టము= నీకు(బాగా) కావలసింది; వేఁడుము= కోరుకొమ్ము; మనస్+ప్రియమున్= నీ మనసునకు ఇష్టమైనదానిని; ఎల్లభంగిన్= ఏ విధంగానైనా సరే; తగన్= సముచితంగా; ఇత్తున్= నెరవేరుస్తాను; అన్నన్= అని వ్యాసుడు పల్కగా; కౌంతేయులు= పాండవులు; ఎలర్చిరి= సంతోషించారు; ఆ+ వసుమతీ-పతి= ఆ ధృతరాష్ట్ర భూమి నాయకుడు; ఎంతయున్= ఎంతో; మోదమున్= ఆనందం; ఒందెన్= పొందాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! మీ మనసులోని చింతలన్నీ తొలగించి ఉత్తమమై, మీరు కోరుకొంటున్న జ్ఞానాన్ని మీకు కలగజేయటం కొరకే నేను ఇక్కడికి, ఈ సమయంలో వచ్చాను. సందేహపడకుండా నీ కిష్టమైనది అడుగుము. ఏవిధంగానైనా సరే మీ కోర్కె నెరవేరుస్తాను, అని వ్యాసుడు అనడంతో పాండవులు సంతోషించారు. ధృతరాష్ట్రుడుకూడా ఎంతో ఆనందించాడు.

వ. వ్యాసుండు వెండియు. 83

తాత్పర్యం: వ్యాసుడు తిరిగి, (ఇట్లా అంటున్నాడు. తరువాతి పద్యంతో అన్వయం)

చ. 'అనఘ! యమానుషం బయినయట్టిద యైనను నా తపంబుపెం

పునకు మునీంద్రు లద్భుతముఁ బొందఁగ మీ కవలీల నిత్తు నే'

ననుటయు నా కురుక్షితిపుఁ డాదటఁ గోరఁగ మీర లిందు వ

చ్చిన కరుణామయాదర విశేషముకంటెను మేలు గల్గునే? 84

ప్రతిపదార్థం: అనఘ!= పాపం లేనివాడా!; అమానుషంబు= (నీ అభీష్టం) మనుష్యులకు సాధ్యంకానిది అయిన; అట్టిది+అ= అయినటువంటిదే; ఐనను= అయినటప్పటికీ; నాతపంబు-పెంపునకున్= నా తపస్సు యొక్క మహిమకు; ముని+ఇంద్రులు= (ఈ) మునిశ్రేష్ఠులు; అద్భుతమున్= ఆశ్చర్యం; పొందఁగన్= పొందుతుండగా; నేను= నేను; మీకున్= మీకు; అవలీలన్= సులువుగా; ఇత్తున్= (మీ కోరిక) తీరుస్తాను; అనుటయున్= అని వ్యాసుడు (మళ్ళీ) చెప్పగానే; ఆ-కురు-క్షితిపుఁడు= కురువంశపు రాజయిన ఆ ధృతరాష్ట్రుడు; మీరు= మీరు (వ్యాసుడు); అదటన్= (మాపై) ప్రేమతో; ఇందున్= ఇచ్చటికి (మావద్దకు); వచ్చిన= వచ్చినటువంటి; కరుణా-మయ-ఆదర-విశేషముకంటెను= దయతో నిండిన వాత్సల్యం కంటె; మేలు= ఎక్కువైనటువంటి శుభం; కోరఁగన్= మేం కోరుకొనటానికి ఇంకొకటి; కల్గునే?= ఉంటుందా?

తాత్పర్యం: నా తపస్సుకు మునిశ్రేష్ఠులంతా ఆశ్చర్యపడేటట్లుగా, 'నీ కోరిక మానవమాత్రులకు సాధ్యం కానటువంటిదైనా సరే, తేలికగా ఇస్తాను'. అని వ్యాసుడు అనటంతో ఆ ధృతరాష్ట్రుడు 'మీరు మా వద్దకు రావటంలో దయతో నిండిన వాత్సల్యంకంటె మేం కోరుకొనదగిన మేలు మరొకటి ఏమున్నది?' అన్నాడు.

క. మానుష మైన నమానుష। మైనను బ్రార్థనకు విషయమైనది భవదీ

యానూనకృపకు నెక్కుడు। గా నొక్కఁడుఁ గాన నేను గారుణ్యనిధీ! 85

ప్రతిపదార్థం: కారుణ్య-నిధీ!= దయకు గని వంటివాడా!, (వ్యాసమహర్షీ)!; ప్రార్థనకున్= వేడుకొనటానికి; విషయము= లక్ష్యం; ఐనది= అయినటువంటిది; భవదీయ-అనూన-కృపకున్= అత్యంతమైన మీ దయకంటె; ఎక్కుడుగాన్= ఎక్కువగా; మానుషము= మనుష్యులకు సాధ్యమైనది; ఐనన్= అయినా; అమానుషము= మనుష్యులకు సాధ్యంగానిది; ఐనను= అయినా; ఒక్కఁడున్= ఒకదానినికూడా; నేను= నేను; కాన(ను)= తలపను.

తాత్పర్యం: దయకు నిధివంటివాడా!, (వ్యాసమహర్షీ) గాఢమైన మీ దయకంటె అధికంగా కోరుకొనదగిన వస్తువు, ఇంకొకటి మానుషం గానీ, అమానుషం గానీ నాకు ఏమీ కనబడలేదు.

ఆ. సంయమీంద్ర! నాదుజన్మంబు సఫలతఁ। బొందె మీరు విమలబుద్ధి నింత
యాదరించినపుడ; లే దింకఁ బరలోక। భీతి ధన్యతముఁడ నైతి నేను. 86

ప్రతిపదార్థం: సంయమి+ఇంద్ర!= మునులలో శ్రేష్ఠుడా!; (వ్యాసమహర్షీ); మీరు= తమరు (వ్యాసుడు); విమలబుద్ధిన్= స్వచ్ఛమైన మనస్సుతో; ఇంత= ఇంత (అత్యధికం)గా దర్శనమిచ్చి, కోర్కె ఇస్తానని); ఆదరించినపుడు+అ= వాత్సల్యం చూపినపుడే; నాదుజన్మంబు= నా పుట్టుక; సఫలతన్= సార్థక్యాన్ని; పొందెన్= పొందింది; ఇంకన్= ఇకపైన; పరలోక-భీతి= ఉత్తమ లోకాలను గూర్చి అవి కలుగుతాయో లేదో అనే భయం; లేదు= పోయింది; నేను= నేను; ధన్యతముఁడన్= ఉత్తమ పుణ్యావంతుడిని; ఐతిన్= అయ్యాను.

తాత్పర్యం: (వ్యాస) మునివరా! మీరు స్వచ్ఛమైన మనసుతో నాపై వాత్సల్యం చూపిన సమయంలోనే నా జన్మ సార్థకమైంది. ఉత్తమలోకాలను గూర్చిన దిగులు పోయింది. నేను అందరికంటె పుణ్యాం చేసికొన్నాను.

వ. అట్లయినను మీ రొక్కటి గోరు మనిన నామనంబున నెప్పుడుం గలయది యెఱింగింపవలసె; విన్నవించెద. 87

ప్రతిపదార్థం: అట్లు-అయినను= అంతే అయినా; మీరు= తమరు; ఒక్కటి= ఏదైనా ఒక్కటి; కోరుము= అడుగుము; అనినన్= అన్నందువలన; నా మనంబునన్= నామనస్సులో; ఎప్పుడున్= నిరంతరంగా, (రాత్రింబగళ్ళు); కల+అది= ఉన్నటువంటిది; ఎఱింగింపన్-వలసెన్= మీకు తెలుపవలసి వచ్చింది; విన్నవించెద (న్)= అది తమకు మనవి చేసికొంటాను.

తాత్పర్యం: అయినప్పటికీ ఏదో ఒకటి కోరుకొమ్మని తమరు అన్నందుచేత, ఎంతో కాలంగా నా మనసులో ఉన్న ఒకవిషయం మీకు చెప్పవలసివచ్చింది. అది మనవి చేసికొంటాను.

సీ. దుష్టచిత్తుం డగు దుర్యోధనుండు ని। ష్పాపస్వభావులఁ బాండుసుతులఁ
బరిభవించి సమస్తనరనాథు లనిఁ గరి। తురగయుతంబుగాఁ ద్రుంగఁజేసి
ధరణి రాజ్యముఁ గోరి గురుభీష్మకర్ణాది। సత్పురుషుల నెల్లఁ జంపికొనియె;
నన్నీచునకుఁగా 'మహారాజు లాంధ్రను। బిడ్డల విడిచి యభేద్య ధైర్య,

తే. వృత్తి రణమృతిఁ బొంది; రవ్విభుల కేది। గతియొ? యిమ్మెయి మూఢులై కలనఁ బడిన
కురుకుమారకు లెట్లైరొ పరమబోధ। మహిత! యెఱుఁగని వగ పెద్ద మాన్పు మనియె. 88

ప్రతిపదార్థం: దుష్టచిత్తుఁడు= చెడ్డబుద్ధి కలవాడు; అగు= అయినటువంటి; దుర్యోధనుండు= దుర్యోధనుడు; నిన్+ పాప-స్వభావులన్= దోషం లేని నడవడి కలిగిన (వారిని); పాండుసుతులన్= పాండవులను; పరిభవించి= అవమానపెట్టి; ధరణి రాజ్యము= ఈ భూమిపై ఆధిపత్యాన్ని; కోరి= అభిలషించి; కరి-తురగ-యుతంబుగాన్= ఏనుగుల బలం గుఱ్ఱాల బలంతో గూడ; సమస్త నర-నాథులు= రాజులు అందరూ; అనిన్= యుద్ధంలో; త్రుంగన్= నశించే విధంగా; చేసి= యుద్ధం చేసి; గురు-భీష్మ-కర్ణ-ఆది- సత్పురుషులన్= ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు మొదలైన గొప్ప వ్యక్తులను; ఎల్లన్= అందరినీ; చంపికొనియెన్= (చేతులారా) నిర్మూలించుకొన్నాడు; ఆ+నీచునకున్+కాన్= అటువంటి అధముడి కొరకు; మహారాజులు= గొప్ప గొప్ప రాజులు; ఆండ్రను= తమ భార్యలనూ; బిడ్డల(న్)= పిల్లలనూ; విడిచి= వదలిపెట్టి; అభేద్య ధైర్య వృత్తి(న్)= చెదరని గుండె దిటవు కలిగిన నడవడితో; రణమృతిన్= యుద్ధంలో చావు; పొందిరి= పొందారు; ఆ+విభులకున్= అటువంటి వీర (యుద్ధ) మరణం పొందిన మహారాజులకు; ఏది గతియొ= (మరణానంతరం) ఎటువంటి గతి కలిగినదో ఈ+మెయి= ఈ విధంగా; మూఢులై= మూర్ఖులై; కలనన్+పడిన= యుద్ధంలో మరణించిన; కురుకుమారకులు= కౌరవులు; ఎట్లు+ఐరి+ఒ= అయినారో; ఎఱుఁగని= తెలియ లేదనే; వగ= బాధ; పెద్ద= నాకు చాల ఎక్కువగా ఉన్నది; పరమబోధ-మహిత!= ఉత్తమమైన జ్ఞానం చేత గొప్పవాడా!; మాన్పుము= (నా చింతను) పోగొట్టవలసింది; అనియెన్= అన్నాడు (ధృతరాష్ట్రుడు).

తాత్పర్యం: చెడుబుద్ధి కలిగిన దుర్యోధనుడు పుణ్యాత్ములైన పాండవులను అవమానపెట్టి, నేల (రాజ్యం) కొరకు, గజాశ్వబలంతో సహా నేలమీది రాజులందరూ యుద్ధంలో నశించిపోయేటట్లు చేశాడు. ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు మొదలైన గొప్పవారిని చేతులార చంపుకొన్నాడు. ఆ అధముడి (దుర్యోధనుడి) కొరకు మహారాజులంతా పెండ్లాలను పిల్లలను వదలుకొని చెదరని గుండె ధైర్యంతో యుద్ధంచేసి ఆ యుద్ధంలో మరణించిన ఆ మహాపురుషులకు తరువాత ఎటువంటి లోకాలు సిద్ధించాయి? మూర్ఖంగా యుద్ధానికి దిగి అందులో మరణించిన కౌరవవంశవీరులు మరణానంతరం ఏమైపోయారు? అనేది తెలియకపోవటం అనే దుఃఖం నాకు చాలా ఎక్కువగా ఉన్నది. ఉత్తమజ్ఞానం వలన గొప్పవాడా! (వ్యాసమహర్షీ) ఆ నా బాధను పోగొట్టవలసింది' అన్నాడు ధృతరాష్ట్రుడు.

వ. అనుటయు న ప్రేముడి పలుకులు విని గాంధారికిం గుంతికిం బాంచాలికి సుభద్రకు మఱియునుం గలయంగనలకుం జిత్తంబుల నెవ్వగలు గ్రొత్తలయ్యెః నప్పు డాసుబలనందన పట్టావృతలోచనత్వంబునన చూచి దయాధామం బై యున్న యా మామ నుద్దేశించి మోడ్చిన చేతు లద్దెసకు నిగిడ్చి యిట్లనియె. 89

ప్రతిపదార్థం: అనుటయున్= ధృతరాష్ట్రుడు ఆ విధంగా అనటంతో; ఆ+ప్రేముడిపలుకులు= స్నేహంనిండిన (ధృతరాష్ట్రుడి) ఆ మాటలు; విని= ఆలకించి; గాంధారికిన్= గాంధారికీ; పాంచాలికిన్= ద్రౌపదికీ; సుభద్రకున్= సుభద్రకూ; మఱియునున్= ఇంకా; కల-అంగనలకున్= అక్కడ ఉన్న మిగిలిన కౌరవ స్త్రీలకూ; చిత్తంబులన్= మనసులలో; నెవ్వగలు= పరిపూర్ణమైన దుఃఖాలు; క్రొత్తలు-అయ్యెన్= అప్పుడే అపూర్వంగా ఏర్పడినట్లు అయ్యాయి; అప్పుడు= ఆ సమయంలో; సుబలనందన= గాంధారి; పట్ట-ఆవృత-లోచనత్వంబునన్+అ= పట్టంచేత ఆవరించబడిన (మూయబడ్డ) కన్నులు గలిగినది అయి; చూచి= వ్యాసుడిని చూచి; దయాధామంబు= దయకు నిలయం; అయి= ఐ; ఉన్న ఆ మామన్= ఉన్నటువంటి మామ అయిన వ్యాసుడిని; ఉద్దేశించి= లక్ష్యంగా చేసికొని; మోడ్చిన చేతులు= జోడించిన చేతులను; ఆ+దెసకున్= వ్యాసుడివైపు; నిగిడ్చి= ఉంచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు ఆ విధంగా మాటాడగానే, స్నేహపూరితాలయిన ఆ మాటలు విని, గాంధారికీ, కుంతికీ, ద్రౌపదికీ, సుభద్రకూ, ఇంకా ఇతర (కౌరవ) స్త్రీలకూ, (స్వజన వియోగం వలన) మనసులో నిండి ఉన్న బాధలు అపుడే

క్రొత్తగా కల్గినట్లయింది. అపుడు గాంధారి పట్టంతో కప్పబడిఉన్న కళ్లతోటే వ్యాసుడిని చూచి, దయకు నిలయం అయిన తన మామ (ధృతరాష్ట్రుడి తండ్రి) అయిన వ్యాసుడిని గూర్చి, చేతులు జోడించి నమస్కరిస్తూ ఇట్లా అన్నది.

సీ. 'మునినాథ యీ రాజు తనయు లందఱును గ। య్యంబునఁ దెగినదియాదిగాఁ బ
దాఱేండ్లు వగలపా లగుచుఁ దత్సన్నిధి। గల్గుటఁ గోరు;లోకంబు లెన్ని
యన్నియుఁ జూపంగనైనను జాలుదు। నిర్మలతపమున పేర్మి నీవు
పుత్త్రసాన్నిధ్య మీ భూపతి కొనరించు। టెంతటిపని? నీకు గొంతి ద్రుపద

తే. రాజపుత్త్రి సుభద్ర కౌరవ కుమార। శతము భార్యలు నూర్వురు సొమదత్తి
పత్ని, యత్తన్వియత్త యప్పడఁతి యత్త। గోరుదురు యుద్ధమృతబంధుకోటిఁ జూడ. 90

ప్రతిపదార్థం: మునినాథ!= మునులలో శ్రేష్ఠుడా!; తనయులు= దుర్యోధనాదులైన కొడుకులు; అందఱును= మొత్తం; కయ్యంబునన్= యుద్ధంలో; తెగినది= నశించిపోవటం; ఆదిగాన్= మొదలుగా; ఈ రాజు= ఈ ధృతరాష్ట్రుడు; పది-ఆఱు+ఏండ్లు= పదహారు సంవత్సరాలు; వగలపాలు= దుఃఖాలకు లోను; అగుచున్= అవుతూ; తద్-సన్నిధి= ఆ కొడుకులను కలిసికొనాలని; కోరున్= కోరుతూ ఉంటాడు; నీవు= నీవు (వ్యాసుడు); నిర్మల తపము పేర్మిన్= శుద్ధమైన తపస్సుయొక్క ఆధిక్యంతో; ఎన్ని లోకంబులు= ఈ సృష్టిలో మొత్తంగా ఎన్నిలోకాలు ఉన్నాయో; అన్నియున్= అవి అన్నీ కూడా; చూపంగన్-చూపించటానికి; చాలుదు(వు)= సమర్థుడివి; ఈ భూపతికిన్= ఈ ధృతరాష్ట్ర మహారాజుకు; పుత్త్రసాన్నిధ్యము= ఒక్కసారి కొడుకుల దగ్గర ఉండే అవకాశం; ఒనరించుట= కలిగించటం; నీకున్= నీకు; ఎంత పని?= ఎంతటి పని?; గొంతి= కుంతి; ద్రుపద రాజ-పుత్త్రి= ఆమె కోడలు (ద్రుపదమహారాజు కూతురు) ద్రౌపది; సుభద్ర= ఆమె కోడలు సుభద్ర; కౌరవ కుమారశతము= దుర్యోధనాదులయిన కౌరవవీరులు వందమందియొక్క; భార్యలు= పెండ్లాలు; నూర్వురు(న్)= వంద మందీ; సొమదత్తి పత్ని= సోమదత్తుడి కొడుకైన భూరిశ్రవుడి భార్యా; ఆ+తన్వి= ఆ భూరిశ్రవుడి భార్యకు; అత్త= (భూరిశ్రవుడి తల్లి) సోమదత్తుడి భార్యా; ఆ+పడఁతి= ఆ సోమదత్తుడి భార్యయొక్క; అత్త= అత్తగారూ; (సోమదత్తుడి భార్యయొక్క; అత్త; అత్తగారూ; సోమదత్తుడి తల్లి..అంటే బాహ్లికుడి భార్యా) యుద్ధ మృత బంధు కోటిన్= యుద్ధంలో మరణించిన తమ తమ బంధువుల సమూహాన్ని; చూడన్= చూడాలని; కోరుదురు= కోరుతూ ఉంటారు.

తాత్పర్యం: (వ్యాస) మునిశ్రేష్ఠుడా! యుద్ధంలో కొడుకులందరూ మరణించింది మొదలుగా ఇప్పటికి పదహారేళ్ళ నుండి ఈ ధృతరాష్ట్ర మహారాజు (పుత్ర) శోకంతో ఉండి తన పుత్త్రుల సమీపం చేరుకొనాలని కోరుకొంటూ ఉన్నాడు. అత్యంతమైన నీ తపశ్శక్తితో ఈ సృష్టిలోనే మొత్తం ఎన్ని లోకాలు ఉన్నాయో ఆ వాటినన్నింటినీ చూపించగలిగిన నీకు ఈ ధృతరాష్ట్రుడికి పుత్రుల లోకాలు చూపించటం ఎంత పని? కుంతి, ద్రౌపది, సుభద్ర, (నూరుమంది) కౌరవుల భార్యలు నూరుమందీ, భూరిశ్రవుడి భార్యా, సోమదత్తుడి భార్యా, బాహ్లికుడి భార్యా, యుద్ధంలో మరణించిన తమ తమ బంధువులను చూడాలని కోరుతున్నారు.

వ. అంతయును భవదీయ దివ్యబోధంబు గనుచుండు. 91

ప్రతిపదార్థం: అంతయును= ఈ విషయం అంతా; భవదీయ-దివ్య-బోధంబు= నీ గొప్పదయిన నీ జ్ఞానం; కనుచున్+ఉండున్= చూస్తూనే (తెలిసే) ఉంటుంది.

తాత్పర్యం: ఇది అంతా గొప్పదైన నీ జ్ఞానానికి అందే ఉంటుంది.

క. పరమమునీంద్ర! సమరమృత । కురువీరుల మా మనముల గోడుడుగ భవ
త్కరుణ వెలయ లోకం బ । చ్చెరువందఁగఁ జూపవే విచిత్రపుమహిమన్'. 92

ప్రతిపదార్థం: పరమ-ముని+ఇంద్ర!= మునిశ్రేష్ఠులలో ఉత్కృష్టుడా!, (వ్యాసమహర్షీ); మా మనముల గోడు= ధృతరాష్ట్రాదులమైన మా (భరతవంశ్యుల) మనస్సులలో నిండిన బాధ; ఉడుగన్= తొలగేటట్లుగా; భవత్-కరుణ= నీ దయ; వెలయన్= ప్రకటితం కావటం చేత; లోకంబు= లోకంలోని జనమంతా; అచ్చెరువు= ఆశ్చర్యం; అందఁగన్= పొందేవిధంగా; విచిత్రపు మహిమన్= వింతగొలిపే గొప్పతనంతో; సమర-మృత-కురువీరులన్= యుద్ధంలో మరణించిన కౌరవవీరులను; చూపవే= మాకు కనబరచవా?

తాత్పర్యం: ముని శ్రేష్ఠులలో ఉత్తముడా!; వ్యాసమహర్షీ!, మా అందరి మనసులోని చింత తొలగిపోయేటట్లు, నీ దయ ప్రకటింపబడటంతో లోకమంతా ఆశ్చర్యపడేటట్లు, ఆశ్చర్యకరమైన నీ గొప్పతనంతో, యుద్ధంలో మరణించిన కురువంశపువారిని మాకు చూపించవలసింది'.

చ. అనునెడ గొంతి వాడువదనాబ్జముతోడ మదిం దలంచెఁ గ
ర్ణుని; నది యత్తపోధనవరుం డెదఁ గాంచి దయానురక్తి న
వ్వనిత గుఱించి యిట్లను 'భవన్మతి నొందిన కోర్కి సెప్పు మే
ననఘచరిత్ర! దాని ఫల మందఁగఁజేసి యలంతఁ బాపెదన్' 93

ప్రతిపదార్థం: అను+ఎడన్= గాంధారి ఆవిధంగా అంటున్న సమయంలో; గొంతి= కుంతీదేవి; వాడు-వదన-అబ్జము-తోడన్= వాడిపోయిన పద్మం అనే ముఖంతో; మదిన్= మనస్సులో; కర్ణునిన్= కర్ణుడిని; తలంచెన్= స్మరించింది; ఆ+తపస్+ధనవరుండు= తపస్సంపద గలిగిన ఆ వ్యాసుడు; అది= కుంతి మనసులోని విషయం; ఎదన్= తన మనసులో; కాంచి= గ్రహించి; దయా+అనురక్తిన్= దయతో కూడిన వాత్సల్యంతో; ఆ+వనిత-గుఱించి= ఆ కుంతిని ఉద్దేశించి; ఇట్లు= ఈ ప్రకారంగా; అనున్= అన్నాడు; అనఘ చరిత్ర!= దోషం లేని నడవడిగలదానా!; భవత్-మతిన్= నీ మనస్సును; ఒందిన= ప్రవేశించిన; కోర్కి= వాంఛితం; చెప్పుము= చెప్పుము; ఏను= నేను; దాని ఫలము= దానికి ప్రయోజనాన్ని; అందఁగన్+చేసి= (నీకు) కలుగ జేసి; అలంతన్= నీ విచారం; పాపెదన్= పోగొట్టుతాను.

తాత్పర్యం: గాంధారి ఆ విధంగా అనటంతో కుంతి వాడిపోయిన ముఖ కమలంతో మనసులో కర్ణుడిని స్మరించింది. తపస్సంపన్నుడైన వ్యాసు డది గ్రహించి వాత్సల్యంగా కుంతితో ఇట్లా అన్నాడు. 'పవిత్రమైన నడవడికలదానా! నీ మనసులో కలిగిన కోర్కె ఏమిటో చెప్పుము. దాని ప్రయోజనం అందించి, నీ విచారం పోగొట్టుతాను'.

వ. అనిన విని యయ్యుంతి సంతసిల్లి యా సంయమివల్లభునకు దండప్రణామంబు చేసి చేతులు మోడ్చి లజ్జా సహితం బగు నంతరంగంబుతో వినయనమ్ర యగుచు నిట్లనియె. 94

ప్రతిపదార్థం: అనినన్= అని వేదవ్యాసుడు పలుకగా; విని= ఆలకించి; ఆ+ఇంతి= కుంతి; సంతసిల్లి= ఆనందించి; ఆసంయమి వల్లభునకున్= మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడికి; దండ-ప్రణామంబు= సాష్టాంగంగా నమస్కారం; చేసి= ఆచరించి; చేతులు మోడ్చి=

చేతులు జోడించి; లజ్జాసహితంబు= సిగ్గుతో కూడినది; అగు= అయిన; అంతరంగంబుతోన్= మనస్సుతో; వినయ-నమ్ర= అణకువతో వంగినది; అగుచున్= అవుతూ; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నది.

తాత్పర్యం: వ్యాసుడు అట్లా అనటంతో కుంతి సంతోషించి ఆ మునిశ్రేష్ఠుడికి సాష్టాంగపడి, నమస్కరించి, చేతులు జోడించి, సిగ్గుపడుతున్న మనసుతో, అణకువతో వంగి వ్యాసుడితో ఇట్లా అన్నది.

కుంతి వేదవ్యాసునితోఁ గర్ణుఁడు దనకు జన్మించిన తెఱంగెఱింగించుట (సం.15.38.1)

సీ. 'దేవతలకు నీవ దేవత; విట్టి ని । న్మామగాఁ బడసితి మహితకరుణ
ననుఁ జూచి నాదువిన్నప మాదరింపు మేఁ । గన్యాత్వదశ నుండఁగా మదీయ
జనకుని కడకుఁ గోపనుఁ డైన దుర్వాసుఁ । డన్మహాముని వచ్చె; నతని సవిన
యార్చన కలనాసమారాధితుండుగాఁ । జేసితిఁ బ్రీతుఁడై 'చెలువ! నీకు

ఆ. నిత్తు వరము; వేఁడు మెయ్యది కోరికి?' । యనియె; నతఁడు 'మీ ప్రియంబుకంటె
ననఘ! మిగులు కోర్కియును గలదే? నాకు । నంటిఁ; గాని యొకఁడు నడుగ నైతి. 95

ప్రతిపదార్థం: దేవతలకున్= దేవతలకు గూడా; నీవు+అ= నీవే; దేవతవు= దేవుడివి; ఇట్టి= ఇటువంటి (దైవాలకు దైవమైనటువంటి); నిన్= నిన్ను; మామగాన్= మామ (భర్త తండ్రి)గా, (సమీప బంధువుగా); పడసితిన్= నేను పొందగలిగాను; ననున్= నన్ను; మహిత కరుణన్= అత్యంతమైన దయతో; చూచి= అనుగ్రహించి; నాదు విన్నపము= నా వేడుకోలును (నేను చెప్పే మాటలు); ఆదరింపుము= వాత్సల్యంతో వినవలసింది; ఏను= నేను; కన్యాత్వదశన్= కన్నెప్రాయంలో ఉండగా; మదీయ-జనకుని-కడకున్= నా తండ్రి వద్దకు; కోపనుఁడు= కోపస్వభావుడు; ఐన= అయినటువంటి; దుర్వాసుండు= దుర్వాసుడు; అన్-మహాముని= అనే పేరుగలిగిన గొప్ప ముని; వచ్చెన్= వచ్చాడు; అతనిన్= ఆ మహామునిని; స-వినయ-అర్చన-కలనా-సమ్- ఆరాధితుండు= అణకువతో కూడిన పూజలను సమకూర్చటంచేత చక్కగా సేవించబడినవాడు; కాన్= అయ్యేవిధంగా; చేసితిన్= (నేను) చేశాను; అతఁడు= అందుకు ఆ దుర్వాసుడు; ప్రీతుఁడు= సంతోషించినవాడు; ఐ= అయి; చెలువా!= అమ్మాయీ! (కుంతీ); నీకున్= నీకు; వరము= వరాన్ని; ఇత్తున్= ఇస్తాను; వేఁడుము= అడుగుము; కోరిక= నీ కోరిక; ఏ+అది!= ఏమిటి?; అనియెన్= అన్నాడు; అనఘ!= పుణ్యాత్మా!; మీ ప్రియంబుకంటెన్= మీరు సంతోషించటం కంటె; మిగులు= అధికమైన; కోర్కియును= కోర్కెగూడా; నాకున్= నాకు; కలదు+ఏ?= ఉంటుందా?; అంటిన్= అన్నాను; కాని= అంతేతప్ప; ఒకఁడున్= ఏదీకూడా; అడుగన్+ఐతి(న్)= కోరలేదు.

తాత్పర్యం: దైవాలందరకు నువ్వే దేవుడివి. అటువంటి నిన్ను మామగా పొందగలిగాను. నాపై దయఉంచి నా మనవిని ప్రేమతో వినవలసింది. నేను కన్యాప్రాయంలో ఉండగా కోపస్వభావుడైన దుర్వాసుడు మానాన్న (పెంచిన తండ్రి కుంతిభోజుడి) దగ్గరకు వచ్చాడు. నేను ఆ మహామునిని అణకువతో పూజించి సేవించాను. అతడు సంతోషించి, అమ్మాయీ 'నీకు వర మిస్తాను. కోరుకొమ్ము ఏం కావాలి?' అన్నాడు. అప్పుడు నేను 'పుణ్యాత్మా! మీరు సంతోషించటం కంటె ఎక్కువైన కోరిక నాకేముంటుంది?' అన్నాను తప్ప ఏ ఒక్కటీ వేడుకొనలేదు.

వ. అమ్మాట తనమనంబునకు రానిచందంబు మొగంబునం దోఁప నత్తాపసవరుండు 'వరం బెల్లభంగి నొసంగక పోవ; నడుగు' మనుటయు, వెఱచియు నాదువేడ్కతెఱం గట్ల యగుటను 'బుత్త్రుంగోరితిఁ గోరిన నమ్ముని

పతి యొక్క మంత్రం బనుగ్రహించి 'దీన నీ వావహించిన దేవతలు భవద్వశగతులై సుతజన్మంబు గలిగింతురు;
విశేషించి ధర్మువునకుఁ దల్లివి గాఁగలదాన' వని పలికి యంతర్ధానంబు చేసిన. 96

ప్రతిపదార్థం: ఆ+మాట= నేను అన్న ఆ మాట; తన మనంబునకున్= తన (దుర్వాసుడి) మనస్సునకు; రాని చందంబు= నచ్చని విధం; మొగంబునన్= అతడి (దుర్వాసుడి) ముఖంమీద; తోఁపన్= కనబడుతుండగా; ఆ+తాపసవరుండు= మునిశ్రేష్ఠుడైన ఆ దుర్వాసుడు; ఎల్లభంగిన్= ఏ విధంగానైనా; వరంబున్= మేలును; ఒసంగక= ఇవ్వకుండా; పోవన్= వెళ్ళను; అడుగుము= కోరుకొమ్ము; అనుటయున్= అని దుర్వాసోమహర్షి అనటం వలన; వెఱచియున్= భయపడీ; నాదువేడ్క తెఱంగు= నా కోరికతీరు; అట్లు+అ= అదే ప్రకారం; అగుటను= కావటంచేతా; పుత్త్రున్= కొడుకును; కోరితిన్= అడిగాను; కోరినన్= నేను ఆ విధంగా కోరటంతో; ఆ+మునిపతి= మునులలో శ్రేష్ఠుడైన ఆ దుర్వాసుడు; ఒక్క మంత్రంబు= ఒకానొక మంత్రాన్ని; అనుగ్రహించి= (నాకు) ఉపదేశించి; నీవు= నీవు; దీనన్= ఈ మంత్రంతో; ఆవహించిన-దేవతలు= రప్పించినటువంటి దేవతలు; భవత్-వశ-గతులు= నీకులోబడిన వారు (నీవు చెప్పిన విధంగా నడుచుకొనేవారు); ఐ= అయి; సుతజన్మంబు= నీకు కొడుకు పుట్టటాన్ని; కలిగింతురు= కలగజేస్తారు; విశేషించి= అందులో ప్రత్యేకంగా; ధర్మువునకున్= ధర్మదేవత (యమధర్మరాజు)కు; తల్లివి= (నీవు) జన్మనిచ్చేదానివి; కాన్+కలదానవు= అవుతావు అని; పలికి= చెప్పి; అంతర్ధానంబు చేసినన్= (ఆ దుర్వాసుడు) మాయమయిపోవటంతో, (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: (మీరు సంతోషించటంకంటె మించిన కోర్కె నాకు ఏముంటుంది? అని) నేను (కుంతి) అన్నమాట తన మనసుకు నచ్చకపోవటం ముఖంలో కనబడుతుండగా మునిశ్రేష్ఠుడైన ఆ దుర్వాసుడు 'ఏమైనాసరే నీకు వరం ఇవ్వకుండా ఇక్కడినుండి వెళ్ళను అడుగు' మన్నాడు. ఆ మాటలకు భయంతోనూ, 'నా కోరిక కూడా ఆ విధంగానే ఉండటం వలననూ నేను కొడుకు నిమ్మని అడిగాను. దానితో దుర్వాసోమహర్షి నాకు ఒక మంత్రాన్ని ఉపదేశించి. 'ఈ మంత్రంతో నీవు ఏ దేవతలను రప్పిస్తావో ఆ దేవతలు నీకు వశమై కొడుకులను గలుగజేస్తారు. ప్రత్యేకించి నీవు యమధర్మరాజుకు తల్లివి అవుతావు' అని చెప్పి మాయమైపోయాడు.

ఆ. అద్భుతమునఁ బొంది యమ్మంత్రరూప ము। ల్లమున నెప్పుడును దలంతు; నొక్క
నాఁడు మేడమీఁదఁ బోఁడిమి నే నుండి। కంటిఁ బొడుచుచున్న కమలమిత్త్రు. 97

ప్రతిపదార్థం: అద్భుతమునన్-పొంది= ఆశ్చర్యపడి; ఉల్లమునన్= మనసులో; ఎప్పుడును= నిరంతరమూ; ఆ+మంత్రరూపము= దుర్వాసుడు ఉపదేశించిన మంత్రాన్ని; తలంతున్= స్మరిస్తూఉండే దాన్ని; ఒక్కనాఁడు= ఒకరోజు; నేను= నేను; మేడమీఁదన్= మేడపైన; పోఁడిమిన్= సుఖంగా; ఉండి= ఉన్నదానినై; పొడుచుచున్న-కమలమిత్రున్= ఉదయించే సూర్యుడిని; కంటిన్= చూచాను.

తాత్పర్యం: (మంత్రం ఉపదేశించి దుర్వాసుడు అదృశ్యం అయిపోవటంతో) చాలా ఆశ్చర్యపడి నా మనసులో ఆ మంత్రాన్నే నిరంతరమూ స్మరిస్తూ ఉండేదాన్ని. ఒకరోజు నేను మేడమీద హాయిగా ఉండి ఉదయించే సూర్యుడిని చూచాను.

క. కని యిది కన్యకు దోషం। బని తలఁపక బాల్యసంభృతాజ్ఞానము వే
డ్కనొనర్ప నావహించితి। ముని మంత్ర బలమున సూర్యు మునినాథవరా! 98

ప్రతిపదార్థం: మునినాథవరా!= మునిశ్రేష్ఠులలో శ్రేష్ఠుడా!, వ్యాసమహర్షీ; కని= ఆ సూర్యుడిని చూచి; ఇది= తాను కోరుకొనబోతున్నది (పుత్రుడిని పొందటం); కన్యకున్= వివాహం కాని స్త్రీకి; దోషంబు= తప్పు; అని తలఁపక= అనుకొనకుండా; బాల్య-సంభృత-అజ్ఞానము= పిన్నతనం వలన పరిపూర్ణమైన తెలివి లేకపోవటం; వేడ్కన్= వినోదాన్ని; ఒనర్పన్= కలిగించగా, మునిమంత్రబలమునన్= ఆ దుర్వాసుడిచ్చిన మంత్రశక్తితో; సూర్యున్= ఆ సూర్యుడిని; ఆవహించితిన్= రప్పించాను.

తాత్పర్యం: ఋషి శ్రేష్ఠుడా! ఆ ఉదయించే సూర్యుడిని చూచి దుర్వాసుడిచ్చిన మంత్రశక్తితో పెళ్ళికాని పిల్లకు ఇది (పుత్రులు పొందటం) తప్పు అని ఎంచకుండా, చిన్నతనం వలన కలిగిన అజ్ఞానంతో, వినోదంగా సూర్యుడిని రప్పించాను.

తే. **ఆవహించిన నద్దేవుఁ డాకసమున। నాత్మమూర్తి వర్తింప మూర్త్యంతరంబు**
దాల్చి నాకడ కేతెంచెఁ దత్క్షణంబ। నాదుచిత్త మాశ్చర్యమగ్నంబు గాఁగ. **99**

ప్రతిపదార్థం: ఆవహించినన్= (ఆ విధంగా మంత్రములతో) రప్పించగా; ఆ+దేవుఁడు= ఆ సూర్యభగవానుడు; ఆత్మమూర్తి= తన చండస్వరూపం; ఆకసమునన్= ఆకాశంలో (యథాపూర్వంగా) వర్తింపన్= ప్రకాశిస్తూ ఉండగా; మూర్తి+అంతరంబు= వేరొక; ఆకారాన్ని; తాల్చి= ధరించి; నాదుచిత్తము= నామనస్సు; ఆశ్చర్యమగ్నంబు= ఆశ్చర్యంలో మునిగినది; కాఁగన్= కాగా; తద్+క్షణంబు+అ= వెంటనే; నాకడకున్= నావద్దకు; ఏతెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: ఆ విధంగా దుర్వాసుడిచ్చిన మంత్రాన్ని స్మరించటంతో ఆ మంత్రబలం వలన సూర్యభగవానుడు ఆకాశంలో తన రూపం అలాగే ఉండగా ఆక్షణంలోనే ఇంకొక రూపం ధరించి నా మనసు ఆశ్చర్యంలో మునిగిపోతుండగా నావద్దకు వచ్చాడు.

వ. **ఇట్లు చనుదెంచి.** **100**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈఆప్రకారంగా; చనుదెంచి= వచ్చి.

తాత్పర్యం: సూర్యుడు ఈ విధంగా (తన సహజరూపం ఆకాశంలో ఉంచి మరొక రూపంతో కుంతివద్దకు) వచ్చి (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. **'అడుగు మిచ్చెద వరం' బనిన వడంకుచుఁ। గేలు మొగిడ్చి 'పొం డేల యిచట'**
ననిన 'వృథాహ్వాన మాచరించుట తప్పు। నిన్నును నెవ్వఁడు నీకు మంత్ర
మిచ్చె నాతని శపియింతుఁ జుమ్మీ!'యని। పలికె నయ్యర్కుఁ; డే నలికి గురుని
నిరపరాధుని శాపనిహతుఁగాఁ జేయుట। కోర్వక పుత్త్రకు నొసఁగు దేవ

తే. **కృప భవత్సము' ననిన నయ్యపరిమేయ। తేజుఁ డాత్మతేజమున నా దృఙ్ముఖేంద్రి**
యములు మనసును సమ్మోహితములు సేసి। యపుడు తనయుండు పుట్టెడు' ననియెఁ బిదప. **101**

ప్రతిపదార్థం: అడుగుము= ఏమి కావాలో కోరుకొమ్ము; వరంబు= నీకోరిక; ఇచ్చెదన్= ఇస్తాను; అనినన్= అని సూర్యుడు పలుకగా; వడంకుచున్= వణకిపోతూ; కేలు= చేతులు; మొగిడ్చి= జోడించి; పొండు= వెళ్ళిపొండి; ఇచటన్= ఇక్కడికి; ఏల=

(రావటం) ఎందుకు?; అనినన్= అని నేను (కుంతి) పల్కగా; వృథా-ఆహ్వానము= వ్యర్థం అయిన పిలుపు; ఆచరించుట= చేయటం; తప్పు= దోషం; నిన్నును= నిన్నూ (కుంతినీ)?; నీకున్= నీకు; మంత్రము= (దేవతలనాహ్వానింపజేసే) ఈ మంత్రాన్ని; ఎవ్వఁడు ఇచ్చెన్= ఎవడు ఇచ్చాడో; అతనిన్= వాడినీ; శపియింతున్+చుమ్మీ= శపిస్తాను సుమా; అని= అనే విధంగా; ఆ+అర్కుఁడు= ఆ సూర్యుడు; పలికెన్= అన్నాడు; ఏను= నేను; అలికి= భయపడి; గురునిన్= మంత్రం ఉపదేశించిన ఆ ఆచార్యుడు దుర్వాసుడిని; నిర్+అపరాధునిన్= ఏ తప్పూ చేయనివాడిని; శాప-నిహతున్= సూర్యుడిశాపంతో దెబ్బతిన్నవాడు; కాన్= అయ్యేటట్లు; చేయుటకున్= చేయటానికి; ఓర్వక= తట్టుకొనలేక; దేవ!= (సూర్య) భగవానుడా!; కృపన్= దయతో; భవత్-సమున్= నీకు సాటివచ్చేటటువంటి; పుత్త్రకున్= కొడుకును; ఒసఁగు(ము)= ఇమ్ము; అనినన్= అని నేను (కుంతి) పల్కగా; ఆ అపరిమేయతేజుఁడు= మేరలేని కాంతి కలిగిన ఆ సూర్యుడు; అపుడు= ఆ సమయంలో; ఆత్మతేజమునన్= తన కాంతితో; నా-దృక్-ముఖ-ఇంద్రియములు(ను)= (నా) కనులు మొదలైన ఇంద్రియాలను; మనసును= హృదయాన్ని; సమ్మోహితములు చేసి= ఆకర్షించబడ్డవాటినిగా చేసి; పిదపన్= తర్వాత; తనయుండున్= (నీకు) కొడుకు; పుట్టెడున్= పుట్టుతాడు; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: 'కోరుకొమ్ము వరమిస్తా' నన్నాడు సూర్యుడు. నేను వణకిపోతూ చేతులు జోడించి వెళ్ళండి ఎందుకిక్కడ' అన్నాను. 'వ్యర్థంగా ఆహ్వానించటం తప్పు. నిన్నూ, నీకు ఈ మంత్రం ఉపదేశించినవాడినీ ఇద్దర్నీ శపిస్తాను' అన్నాడు సూర్యుడు. నేను భయపడి ఏ తప్పూ ఎరుగనివాడు మంత్రం ఉపదేశించిన ఆచార్యుడు దుర్వాసుడు శాపం పాలుకావడానికి అంగీకరించలేక, 'దేవా! దయతో నీ వంటి కొడుకు నిమ్మని సూర్యుడిని అడిగాను. అత్యంత తేజస్సు కలిగిన ఆ సూర్యుడు తన తేజస్సుతో కన్నులు మొదలైన నా యింద్రియాలనన్నింటినీ, మనసునూ ఆకర్షించి 'నీకు కొడుకు పుట్టుతాడు' అని చెప్పాడు.

వ. అని నిర్దేశించి. 102

ప్రతిపదార్థం: అని= ఆవిధంగా; నిర్దేశించి= నిర్ణయించి చెప్పి.

తాత్పర్యం: నీకు కొడుకు పుట్టుతాడని సూర్యుడు కుంతికి నిర్ణయం చేసి చెప్పి. (తరువాతి పద్యంతో అన్వయం)

తే. 'నీకుఁ గన్యాత్వ వికలత గాక యుండ। వరము నిచ్చితి' ననుచు దివమున కరిగె;
జనకముఖబంధుచిత్తవంచనము నడపి। గూఢ మందిరాంతరమునఁ గొడుకుఁ గంటి. 103

ప్రతిపదార్థం: కన్యాత్వ వికలత= కన్యయొక్క ధర్మం చెడిపోయినది; కాక+ఉండన్= కాకుండే విధంగా; నీకున్= నీకు; వరమున్= వరాన్ని; ఇచ్చితిన్= ఇచ్చాను; అనుచున్= అంటూ సూర్యుడు; దివమునకున్= ఆకాశానికి; అరిగెన్= వెళ్ళాడు; జనక= తండ్రి; ముఖ= మొదలైన; బంధు= చుట్టాల; చిత్త= బుద్ధియొక్క; వంచనము(నే)= మోసం; నడిపి= చేసి; గూఢ-మందిర-అంతరమునన్= రహస్యపు గృహంలో; కొడుకున్= కొడుకును; కంటిన్= కన్నాను.

తాత్పర్యం: 'వివాహం కాకుండానే కొడుకును కనటం వలన నీ కన్యాత్వం చెడిపోకుండా నీకు వరమిస్తున్నాను' అని చెప్పి సూర్యుడు ఆకాశంలోకి వెళ్ళిపోయాడు. నేను (కుంతి) కూడా తండ్రి మొదలైన నా వాళ్ళందరి కన్నుగప్పి రహస్య మందిరంలో కొడుకును కన్నాను.

క. **కని యేటిలో నిడితిఁ గలఁ। గని నట్లయి యుండెఁ దత్ప్రకారం; బిది మీ**
కనినయది దివ్య బోధంబున నత్తెఱఁ గంతరంగమునఁ గొని కాలున్. 104

ప్రతిపదార్థం: కని= (ఆవిధంగా రహస్యంగా కొడుకును) ప్రసవించి, (ఆకొడుకును); ఏటిలోన్= గంగానదిలో; ఇడితిన్= పడేశాను; తద్+ప్రకారంబు= ఆ విధంగా కొడుకును కనటమూ, గంగలో విడవటమూ అనే మొత్తం వృత్తాంతమూ; కలన్= కలలో; కనిన-అటు= చూచిన విధంగా అయి; ఉండెన్= జరిగినట్లున్నది; ఇది= ఈ విషయం అంతా; దివ్య-బోధంబునన్= అలౌకికమైన జ్ఞానంవలన; మీ-కనిన-అది= తమకు (వ్యాసుడికి) తెలిసినదే; ఆ+తెఱఁగు= ఆ కర్ణుడి జన్మవృత్తాంతం; అంతరంగమునన్= నా మనసులో; కొని= నిలిచి; కాలున్= మండుతున్నది.

తాత్పర్యం: (రహస్యంగా కొడుకును) కని ఆ కొడుకును నదిలో వదలివేశాను. ఆ సంఘటన అంతా కలలో జరిగినట్లుగా ఉన్నది. జ్ఞానవిశేషం వలన ఇది అంతా మీకు (వ్యాసుడికి) తెలిసినదే. ఆ పుత్రుడి విధానం నా మనసులో నిలిచి దహిస్తున్నది. (మండుతుంది.)

తే. **పాప మయ్యెఁ గా కుండె నప్పనిఁ దలంచి। యళుకుచుండుదు; మద్భయ మపనయింపుఁ**
డతులకరుణ నిక్కురువృద్ధునభిమతమును। సఫలముగఁ జేయుఁ డివి నాకు సద్వరములు. 105

ప్రతిపదార్థం: పాపము-అయ్యెన్= పాపమే అవుతుందో; కాక+ఉండెన్= కాదో; ఆ+పనిన్= కన్న బిడ్డను నీటిలో వదలివేయటం అనే ఆ పనిని; తలంచి= తలచుకొని; అళుకుచున్+ఉండుదున్= భయపడుతూ ఉంటాను; అతుల కరుణన్= సాటిలేని దయతో; మత్+భయము= నా భయాన్ని; అపనయింపుఁడు= పోగొట్టండి; ఈ+కురువృద్ధు-అభిమతమును= ఈధృతరాష్ట్రుడి (పుత్రాదుల మరణానంతర గతులను తెలిసికొనాలనే) కోరికను; సఫలముగన్= సిద్ధించేటట్లు; చేయుఁడు= చేయండి; ఇవి= ఈరెండే; నాకున్= నాకు; సత్-వరములు= గొప్ప అభీష్టాలు.

తాత్పర్యం: పాపమో కాదో కాని కన్న కొడుకును నీటిలో విడిచిన ఆ పనిని తలచుకొని ఎప్పుడూ భయపడుతుంటాను. దయచేసి నా భయాన్ని పోగొట్టండి; మరణానంతరం పుత్త్రాదుల గతులు తెలిసికొనాలనే ఈ ధృతరాష్ట్రుడి కోర్కెను సిద్ధింపజేయండి. ఇవే నాకు అభీష్టాలు.

వ. **అనిన విని యమ్మునీంద్రుం డమ్మానిని కిట్లనియె.** 106

ప్రతిపదార్థం: అనినన్= అని కుంతి పల్కగా; విని= ఆలకించి; ఆ+ముని+ఇంద్రుండు= మునులలో శ్రేష్ఠుడైన ఆ వ్యాసుడు; ఆ+మానినికిన్; ఆమె (కుంతి)తో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: కుంతి ఆవిధంగా చెప్పగా విని వ్యాసమహర్షి ఆమెతో ఇట్లా అన్నాడు.

సీ. **'నీ చెప్పినది యెల్ల నిక్కంబు కోడల!। యెగ్గు నీ యందు లే; దేల వెఱవ?**
సుర లద్భుతాపాదిచరితులు; కర్ణున। కట్లుగా నున్నది యగుటఁ జేసి
యేటిలో నాతని నిడి తీవు; కన్యాత్వ। హాని లే కున్కిఁ గులాగ్రగణ్య
వైతి; భవద్వృత్త మమలిన మగుటకు। ననుమాన మించుక యైన వలవ'

ఆ. **దనుచు నాదరార్ద్రుఁడయి పల్కి గాంధారి। తోడ 'నీవు సుతులఁ దోడఁబుట్టు**
వులను గాంతు, నీదు చెలియలు గొంతియుఁ। గర్ణుఁ జూడఁ గాంచు గణ్యచరిత! **107**

ప్రతిపదార్థం: కోడల!= కోడలా, కుంతీ!; నీ చెప్పినది= నీవు చెప్పినటువంటిది; ఎల్లన్= మొత్తం; నిక్కంబు= నిజం; నీయందున్= నీలో; ఎగ్గు= దోషం; లేదు= లేదు; వెఱవన్= భయపడటం; ఏల?= ఎందుకు?; సురలు= దేవతలు; అద్భుత+ఆపాది-చరితులు= వింతలు పుట్టించే నడవడి కలవారు; కర్ణునకున్= కర్ణుడివిషయంలో; అట్లు= ఆవిధంగా; కాన్+ఉన్నది= జరగవలసి ఉన్నది; అగుటన్-చేసి= కాబట్టి; అతనిన్= కర్ణుడిని; ఏటిలోన్= గంగలో; ఇడితి(వి)= వదిలేశావు; కన్యాత్వ-హాని= నీలో కన్యాభావానికి హాని; లేక-ఉన్కిన్= లేకపోవటం చేత; ఈవు= నీవు; కుల-అగ్రగణ్యవు= ఈ వంశంలో శ్రేష్ఠురాలివి; ఐతి(వి)= అయినావు; భవత్-వృత్తము= నీ చరిత్ర; అమలినము= నిష్కళంకం; అగుటకున్= కావటంలో; ఇంచుక-ఐనన్= కొంచెం కూడా; అనుమానము= సందేహం; వలవదు= తగదు; అనుచున్= అంటూ; ఆదర+ఆర్ద్రుఁడు= వాత్సల్యంతో నిండి (తడిసి)నవాడు; అయి= ఐ; పల్కి= చెప్పి; గాంధారితోడన్= గాంధారితో; గణ్యచరిత!= ప్రశంసించదగిన నడవడి కలదానా!; నీవు= నీవు; సుతులన్= దుర్యోధనాదులైన కొడుకులనూ; తోడబుట్టువులను= శకుని మున్నగు సోదరులనూ; కాంతు(వు)= చూస్తావు; నీదు చెలియలు= నీకు చెల్లెలయిన; గొంతియున్= కుంతికూడా; కర్ణున్= (కొడుకైన) కర్ణుడిని; చూడన్-కాంచున్= చూడగలుగుతుంది.

తాత్పర్యం: 'కోడలా!, కుంతీ!. నీవు చెప్పినదంతా యథార్థం. నీలో ఏదోషమూ లేదు. భయ మెందుకు? దేవతలు వింతలు కల్పిస్తుంటారు. కర్ణుడికి ఆ విధంగా జరగవలసి ఉన్నది కాబట్టి అతడిని గంగలో విడిచావు. నీ కన్యాత్వానికి భంగం లేదు కాబట్టి ఈ వంశంలో నీవు శ్రేష్ఠురాలి వైనావు. నీ చరిత్ర నిష్కళంకం అనటంలో ఏ మాత్రమూ సందేహం లేదు'. అని వాత్సల్యాతిశయంతో పలికాడు వ్యాసమహర్షి. ఆ తరువాత గాంధారితో 'మంచి నడవడి కలదానా!, నీవు దుర్యోధనాదులైన కొడుకులనూ, శకుని ప్రభృతులైన సోదరులనూ చూస్తా విప్పుడు. నీ చెల్లెలు కుంతి కూడా కర్ణుడిని చూడగలుగుతుంది.

ఉ. **ద్రౌపదియున్ సుభద్రయును దక్కటి కాంతలు భ్రాతృపుత్త్ర పౌ**
త్త్రోపవిలోక నోత్సవము నొందుదు రిచ్చటి కిప్డు వచ్చు టే
నీ పని యాచరించుటకు; నిమ్మనుజేంద్రుఁడు నీవు గొంతి చిం
తాపరితాపనోదన విధంబుగఁ గోరితి రట్లు చేసెదన్. **108**

ప్రతిపదార్థం: ద్రౌపదియున్= ద్రౌపదీ; సుభద్రయును= సుభద్రా; తక్కటి-కాంతలు(న్)= మిగిలిన భరతవంశపు స్త్రీలూ; భ్రాతృ= సోదరులనూ; పుత్త్ర= కొడుకులనూ; పౌత్త్ర= మనుమలనూ; ఉపవిలోకన= చూడటం అనే; ఉత్సవమున్= సంతోషాన్ని; ఒందుదురు= పొందుతారు; ఏను= నేను; ఇచ్చటికిన్= ఈ చోటికి; ఇప్డు= ఈ సమయంలో; వచ్చుట= రావడం; ఈపని= మీరు కోరిన ఈపని; ఆచరించుటకున్= చేయటానికే; ఈ+మనుజ+ఇంద్రుఁడు= ఈ (ధృతరాష్ట్ర) మహారాజు; నీవు= నీవు (గాంధారి); గొంతి= కుంతీ; చింతా-పరితాపనోదన-విధంబుగన్= (పుత్రాదులను) గురించిన ఆలోచనలూ, దుఃఖమూ తొలగిపోయేటట్లుగా; కోరితిరి= అడిగారు; అట్లు= మీరు కోరుకొన్నవిధంగా; చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: ద్రౌపదీ, సుభద్రా, ఇతర భరతస్త్రీలూ, తమ తమ సోదరులనూ, కొడుకులనూ, మనుమలనూ చూచే ఆనందకర స్థితిని పొందుతారు. నేను ఇక్కడికి ఇప్పుడు వచ్చింది ఆపని చేయటానికే. ఈ ధృతరాష్ట్రుడూ, నీవూ (గాంధారి) కుంతీ, దుఃఖం తొలగించుమని కోరారు. ఆ విధంగా చేస్తాను.

క. నీ కొడుకులకు మనుమలకు । శోకింపఁగ వలదు; వారు శూరత వెలయం
జే కొనిరి రణమరణమున । నాక భువనసుఖము సద్గుణస్తవనీయా! 109

ప్రతిపదార్థం: సత్+గుణ స్తవనీయా!= మంచి గుణాల చేత ప్రశంసించ దగిన దానా! (గాంధారీ); నీ కొడుకులకున్= దుర్యోధనాదు లయిన నీ పుత్రులను గూర్చి; మనుమలకున్= లక్ష్మణకుమారాదులైన మనవళ్ళను గురించీ; శోకింపఁగన్= దుఃఖించటం; వలదు= వద్దు; వారు= నీకొడుకులూ, మనుమలూ; శూరత= తమ పరాక్రమం; వెలయన్= వెల్లడి కాగా; రణ-మరణమునన్= యుద్ధంలో సంభవించిన మరణంతో; నాక-భువన-సుఖము= స్వర్గలోక సౌఖ్యాన్ని; చేకొనిరి= పొందారు.

తాత్పర్యం: మంచి గుణాల చేత స్తుతింపదగిన దానా! గాంధారీ! కొడుకులను గురించీ, మనుమలను గురించీ నీవు విచారించవద్దు. వాళ్ళు తమ పరాక్రమం వెల్లడి అయ్యేవిధంగా యుద్ధంలో మరణించటం వలన స్వర్గలోక సౌఖ్యాలను పొందారు.

ఆ. భామ! విను మవశ్య భవితవ్య మైన భా । రతరణంబు పొంటె నతుల మహిమ
మాననీయ దేవయోనులు జననంబు । నొంది రిందు మనుజయోనులందు. 110

ప్రతిపదార్థం: భామ!= వనితా! (గాంధారీ); వినుము= వినుము; అవశ్య-భవితవ్యము= తప్పక జరుగవలసినది; ఐన= అయినటువంటి; భారతరణంబుపొంటెన్= భారతయుద్ధం కొరకుగా; అతుల మహిమన్= సాటిలేని గొప్పతనం చేత; మాననీయ దేవయోనులు= గౌరవించదగిన దేవతలు మొ॥; ఇందున్= ఈ భూమిపై; మనుజయోనులందు(న్)= మానవజాతిలో; జననంబున్= పుట్టుకను; ఒందిరి= పొందారు.

తాత్పర్యం: గాంధారీ! తప్పకుండా జరిగి తీరవలసిన భారతయుద్ధం కొరకుగా, సాటిలేని మహత్తు గలిగిన దేవతలు మొదలైన అమానుషపు పుట్టుక గలవాళ్ళూ, ఈ భూమిమీద మానవజాతిలో పుట్టారు.

సీ. ధృతరాష్ట్రుఁ డనఁగ వర్తిల్లెడు మేటి గం । ధర్వుఁడీ ధృతరాష్ట్రధరణివిభుఁడు
తన్వి! పాండుఁడు మరుద్గణ మయజని; ధర్మ । దేవత సూవె యుధిష్ఠిరుండు;
పవనుండు భీముఁడై ప్రభవించె; నరుఁ డను । ముని యర్జునుం డయి జనన మొందె.
నారాయణుఁడు కృష్ణనాముఁడై జనియించెఁ; । గనుఁగొను కవల నాశ్వినులు గాఁగ;

తే. ద్వాపరంబుగ నెఱుఁగు గాంధార రాజు; । గలి సుయోధనుఁ డయ్యె; రాక్షసులు పుట్టి
రతని యనుజులై; కర్ణుని నరుణకిరణుఁ । గాఁగ; నభిమన్యుఁ జంద్రునిఁ గాఁగఁ గనుము. 111

ప్రతిపదార్థం: ఈ-ధృతరాష్ట్రవిభుఁడు= (నీ యెదుట ఉన్న) ఈ ధృతరాష్ట్రుడు అనే పేరుతో; వర్తిల్లెడు= ఉన్న; మేటి-గంధర్వుఁ డు= గంధర్వనాయకుడు (రాజు); పాండుఁడు= పాండురాజు; మరుద్గణ-మయ-జని= మరుత్తుల అంశతో కూడిన పుట్టుక కలవాడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ధర్మదేవత= యమధర్మరాజు; చూవె= సుమా; భీముఁడు+ఐ= భీమసేనుడుగా; పవనుండు= వాయుదేవుడు; ప్రభవించెన్= పుట్టాడు; అర్జునుఁడు-అయి= అర్జునుడుగా; నరుఁడు అనుముని= నరుడు అనేపేరు గలిగిన ముని; జనియించెను= పుట్టాడు; కృష్ణనాముఁడు+ఐ= కృష్ణుడు అనే పేరు గలిగిన వాడుగా; నారాయణుఁడు= నారాయణుడనే ముని; జననము-ఒందెన్= పుట్టాడు; కవలన్= నకుల, సహదేవులను; ఆశ్వినులు= అశ్వినిదేవతలు; కాఁగన్= అయిఉన్నట్లు;

కనుఁగొను(ము)= గ్రహించుము; గాంధార రాజు= గాంధార రాజు (శకుని); ద్వాపరంబుగన్= ద్వాపరుడు అని; ఎఱుఁగు(ము)= తెలుసుకొమ్ము; కలి= కలిపురుషుడే; సుయోధనుఁడు= దుర్యోధనుడు; అయ్యెన్= అయిఉన్నాడు; అతని-అనుజులు-ఐ= ఆ దుర్యోధనుడి తమ్ములు, దుశ్శాసనాదులుగా; రాక్షసులు= రాక్షసులు; పుట్టిరి= జన్మించారు; కర్ణునిన్= కర్ణుడిని, అరుణ కిరణున్-కాఁగన్= సూర్యుడిగానూ; అభిమన్యున్= అభిమన్యుడిని; చంద్రునిన్-కాఁగన్= చంద్రుడిగానూ; కనుము= గ్రహించుము.

తాత్పర్యం: (గాంధారీ!) ఈ ధృతరాష్ట్ర మహారాజు ధృతరాష్ట్రుడనే గంధర్వరాజు, మరుత్తులనే దేవతల అంశతో పుట్టినవాడు పాండురాజు, ధర్మరాజు (యమ) ధర్మరాజే సుమా! వాయుదేవుడు భీముడుగా పుట్టాడు. నరుడు అనే పేరుగల ముని అర్జునుడుగాను, నారాయణుడు కృష్ణుడుగానూ పుట్టారు. నకుల సహదేవులుగా అశ్వినీ దేవతలు పుట్టారు. ద్వాపరం శకునిగానూ, కలిపురుషుడు దుర్యోధనుడు గానూ, రాక్షసులు దుశ్శాసనాదులైన దుర్యోధనుడి తమ్ములుగానూ పుట్టారు. కర్ణుడు సూర్యుడనీ, అభిమన్యుడు చంద్రుడనీ గ్రహించుము.

క. **అనలుఁడు ధృష్టద్యుమ్నుం । డన ద్రౌపదితోడఁబుట్టె; ననిలుని యంశం**
బున జనియించె శిఖండియు; । ననిమిషగురుఁ డుద్భవించె నస్త్రగురుండై. **112**

ప్రతిపదార్థం: ధృష్టద్యుమ్నుండు= ధృష్టద్యుమ్నుడు; అనన్= అనే పేరుతో; ద్రౌపదితోడన్= ద్రౌపదితో; అనలుఁడు= అగ్నిదేవుడు; పుట్టెన్= పుట్టాడు; శిఖండియున్=(ఇంక) శిఖండి; అనిలుని-అంశంబునన్= వాయుదేవుడి అంశతో; జనియించెన్= పుట్టాడు; అస్త్రగురుండు అయి= (కురుకుమారులకు అస్త్రవిద్యను నేర్పే ఆచార్యుడు) ద్రోణుడుగా; అనిమిష-గురుఁడు= దేవతలకు గురువైన బృహస్పతి; జనియించెన్= పుట్టాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు ద్రౌపదికి తోబుట్టువుగా ధృష్టద్యుమ్నుడనే పేరుతో పుట్టాడు. వాయుదేవుడి అంశతో శిఖండి పుట్టాడు. బృహస్పతి ద్రోణాచార్యుడుగా జన్మించాడు.

తే. **వినుము వసుశక్తి గాంగేయుఁ డనఁగ జనన । మొందె; రుద్రాంశమున ద్రౌణి యుదయ మయ్యెఁ**
దెలియఁ జెప్పితిఁ గొందఱు కలరు మఱియు । నిర్జరాసురాంశముల జన్మించినారు.' **113**

ప్రతిపదార్థం: వినుము= గాంధారీ! వినుము; గాంగేయుఁడు= గంగ కొడుకు (భీష్ముడు); అనఁగన్= అనే విధంగా; వసుశక్తిన్= అష్టవసువులలో (అష్టమ) చివరివాడు; జననము-ఒందెన్= పుట్టాడు; ద్రౌణి= ద్రోణపుత్రుడైన అశ్వత్థామ; రుద్ర-అంశమునన్= రుద్రుడి అంశతో; ఉదయము-అయ్యెన్= జన్మించాడు; తెలియన్-చెప్పితిన్= ఈ విషయాలు (ఇన్ని) నీకు తెలియజేశాను; నిర్జర+ అసుర-అంశములన్= దేవతల, రాక్షసుల అంశలతో; జన్మించినవారు= పుట్టినటువంటి వారు; మఱియున్= ఇంకా; కొందఱు= కొంతమంది; కలరు= ఉన్నారు.

తాత్పర్యం: గాంధారీ! వినుము (అష్టమ) వసువే గంగకు కొడుకుగా భీష్ముడి అంశతో జన్మించాడు. అశ్వత్థామ రుద్రాంశభవుడు. ఈ విధంగా కొందరి విషయం నీకు తెలియజేశాను. దేవరాక్షసఅంశలతో పుట్టినవారు ఇంకా కొంతమంది ఉన్నారు'.

క. **అని పలికి 'మీ మనంబుల । వనట సమస్తంబుఁ బుచ్చి వైచెద నాతోఁ**
జనుదెండు మీరు గంగకుఁ । గనియెద రనిఁ దెగిన బంధుగణముల నచటన్.' **114**

ప్రతిపదార్థం: అని= అనేవిధంగా; పలికి= చెప్పి; మీ మనంబులన్= మీమీ హృదయాలలో ఉన్న; వనట= దుఃఖం; సమస్తంబున్= మొత్తమూ; పుచ్చివైచెదన్= తొలగిస్తాను; నాతోన్= నాతో (వ్యాసుడితో కలిసి; మీరు= మీరందరూ; గంగకున్= గంగానది వద్దకు; చనుదెండు= రండి; అనిన్= యుద్ధంలో; తెగిన= మరణించిన; బంధుగణములన్= మీ మీ చుట్టాలను; అచటన్= ఆ గంగవద్ద; కనియెదరు= చూస్తారు.

తాత్పర్యం: అనిచెప్పి వ్యాసుడు, 'మీ మనసులలో ఉన్న దుఃఖం మొత్తం పూర్తిగా పోగొట్టుతాను. నాతో గంగానది వద్దకు రండి. యుద్ధంలో మరణించిన మీమీ బంధువులను ఆ గంగానది వద్ద చూస్తారు.'

తే. **అనుచు నుత్థితుఁ డగుటయు నార్పుటెలుఁగు । లాకసం బంద ధృతరాష్ట్రుఁ డాది గాఁగఁ**
గలుగు నా సర్వజనులు నొక్కటఁ గడంగి । యరిగి రమ్మునినాథుతోఁ గురువరేణ్య! 115

ప్రతిపదార్థం: కురువరేణ్య!= ఓ జనమేజయ మహారాజా!; అనుచున్= ఆ విధంగా చెప్తూనే; ఉత్థితుండు+అగుటయున్= (వ్యాసమహర్షి ఆసనంనుండి) లేచినవాడు కాగా; ఆర్పు+ఎలుఁగులు= ఆనందం నిండిన అరుపులు (కంఠ ధ్వనులు); ఆకసంబు-అందన్= నింగిని తాకుతుండగా; ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడు; ఆది-కాఁగన్= మొదలుగా; కలుగు= అక్కడ ఉన్న; సర్వజనులున్= జనం అంతా; ఒక్కటన్= ఒక్కసారిగా; కడంగి= పూని; ఆ మునినాథుతోన్= ఆ వ్యాసమహర్షితో కలిసి; అరిగిరి= (గంగానదికి) వెళ్ళారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! వ్యాసమహర్షి అట్లా అంటూనే ప్రయాణానికి సిద్ధమై ఆసనం నుండి లేచి నిలబడగా, ఆనందంతో నిండిన అరుపులు ఆకాశం అంటుతుండగా, ధృతరాష్ట్రుడు మొదలైన అక్కడి జనమంతా ఒక్కసారిగా లేచి ఆ వ్యాసమహర్షితో కలిసి గంగానదికి వెళ్లారు.

క. **అరుగఁగ మునిజనములు న । చ్చెరు వందుచు నమ్మునీంద్రు సేవించి మరు**
త్సరిదుపకంఠ తలమునకు । నరిగిరి కౌతుకము మనములందు నెలకొనన్. 116

ప్రతిపదార్థం: అరుగఁగన్= ధృతరాష్ట్రాదులు ఆ విధంగా గంగకు బయలుదేరి వెళ్ళగా; మునిజనములున్= శతయూపుడు మొదలైన తాపసులు కూడా; అచ్చెరువు= ఆశ్చర్యం; అందుచున్= పొందుతూ; ఆ+ముని+ఇంద్రున్= మునులలో శ్రేష్ఠుడయిన ఆ వ్యాసుడిని; సేవించి= అర్చించి; మనములందున్= తమతమ మనసులలో; కౌతుకము= కుతూహలం; నెలకొనన్= చోటు చేసికొనగా; మరుత్= దేవతల; సరిత్= నది (గంగ) యొక్క; ఉపకంఠతలమునకున్= సమీపప్రాంతానికి; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: వ్యాసుడితో ధృతరాష్ట్రాది కురువంశ్యులు బయలుదేరి వెళ్ళుతుంటే, అక్కడే ఉన్న శతయూపుడు మొదలైన ఇతర మునులు గూడా వ్యాసవచనాలకు ఆశ్చర్యపడుతూ ఆయనను పూజించి మనసులలో (మృత వీరులను చూచే) కుతూహలం నిండగా, గంగాసమీపానికి వెళ్ళారు.

వ. **అట్లు పౌరజానపదసహితు లై సకలజనంబులుం జని సాత్యవతేయుండు వనుప భాగీరథీతీరంబున విడిసి; ర వ్విచిత్రచరిత్రుండు దన చేయంబూనిన పని మఱునాఁడు రేపకడ సేయువాఁడుగాఁ బలికిన నయ్యందఱు నద్దినశేషంబు నా యామినియును శతసంవత్సరంబులుంబోలె నుండ సూర్యోదయసమయం బగుటయుఁ**

గాలోచితకృత్యంబు లాచరించి ధృతరాష్ట్రుండును బాండుతనయులుం దపోధనులు నప్పారాశర్యుపాలికి నరిగి యమ్మునివరుం బరివేష్టించిరి; గాంధారీప్రముఖభామినులు నేతెంచి యొక్కవలన నతనిం గొలిచి యుండిరి; సర్వజనులు నఱ్ఱు లెత్తికొని యంతంత నిలిచిరి; తదనంతరంబ. 117

ప్రతిపదార్థం: అట్లు= ఆ ప్రకారంగా; పౌర-జానపద-సహితులు+ఐ= నాగరులూ, పల్లీయులూ అయిన జనంతో కూడినవారయి; సకల జనంబులున్= అక్కడి వారందరూ; చని= గంగాతీరానికి పోయి; సాత్యవతేయుండు= (సత్యవతి కొడుకు) వ్యాసుడు; పనుపన్= అనుమతించగా; భాగీరథీతీరంబునన్= గంగానది ఒడ్డున; విడిసిరి= బసచేశారు; ఆ+విచిత్ర చరిత్రుండు= వింత నడవడి కలిగిన ఆ వ్యాసమహర్షి; తనచేయన్+పూనిన-పని= తాను చేస్తానన్న (మృతవీరులను చూపటం అనే) పనిని; మఱునాఁడు= తరువాతి రోజు; రేపకడ= ఉదయంపూట; చేయువాఁడుగాన్= చేస్తానని; పలికినన్= చెప్పగా; ఆ+అందఱున్= అది చూడ వచ్చిన వారు అందరూ; ఆ+దినశేషంబు= ఆరోజు పగలులో మిగిలిన భాగమూ; ఆ+యామినియున్= ఆ రాత్రీ; శతసంవత్సరంబులున్+పోలెన్= నూరేండ్లంతగా; ఉండన్= దీర్ఘమై ఉండగా; సూర్య-ఉదయంబు= ప్రొద్దుపొడవటం; అగుటయున్= కావటంతో; కాల+ఉచిత కృత్యంబులు= ప్రాతఃకాలంలో ఆచరించవలసిన పనులూ; ఆచరించి= చేసి; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడూ; పాండుతనయులున్= పాండవులూ; తపోధనులు= (శతయూపాది) మునులూ; ఆ+పారాశర్యుపాలికిన్= (పరాశరుడి కొడుకు అయిన) ఆ వ్యాసమహర్షి వద్దకు; అరిగి= పోయి; ఆ+మునివరున్= ఆ వ్యాసమహర్షిని; పరివేష్టించిరి= చుట్టుకొన్నారు; గాంధారీ-ప్రముఖ-భామినులున్= గాంధారి మొదలైన స్త్రీలు కూడా; ఏతెంచి= వ్యాసుడి వద్దకు వచ్చి; అతనిన్= ఆ వ్యాసుడిని; కొలిచి= సేవించి; ఒక్కవలనన్= ఒకవైపుగా; ఉండిరి; సర్వజనులున్= మిగిలిన ముని, పౌర, జానపద జనులందరూ; అఱ్ఱులు= మెడలు; ఎత్తుకొని= పైకి చాచికొని; (వ్యాసుడిని చూస్తూ); అంత+అంత= అక్కడక్కడ; నిలిచిరి= నిలువబడ్డారు; తదనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: ఆ విధంగా నగరవాసులూ, పల్లెవాసులతో సహా వ్యాస ధృతరాష్ట్రాదులందరూ కదలి గంగ వద్దకు వెళ్లారు. వ్యాసుడి ఆజ్ఞతో, గంగ ఒడ్డున ధృతరాష్ట్రాదులు బస చేశారు. అపుడు వింతపోకడలు గలిగిన ఆ వ్యాసుడు తాను చేయవలసిన మృతకురువీరులను చూపించేపని మరునాడు ఉదయం చేస్తా ననటంతో, మిగిలిన ఆ పగలూ, ఆరోజు రాత్రీ వందసంవత్సరాలవలె గడిపారు. అంతా సూర్యుడు ఉదయించిన వెంటనే ప్రాతఃకాలంలో చేయవలసిన పనులన్నీ పూర్తి చేసికొని ధృతరాష్ట్రుడూ, పాండవులూ, మునులూ వ్యాసుడి వద్దకు వెళ్ళి ఆయనచుట్టూ చేరారు. గాంధారి మొదలైన స్త్రీలు కూడా వచ్చి వ్యాసుడిని సేవించి ఒక ప్రక్కగా నిలుచున్నారు. ఇంక మిగిలిన జనమంతా వచ్చి వ్యాసుడివైపు మెడలు చాచి చూస్తూ అక్కడక్కడా నిలబడి ఉన్నారు. తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం)

వ్యాసుఁడు ధృతరాష్ట్రాదులకు భారతరణ మృతుల రావించి చూపుట (సం॥ 15-40-4)

సీ. **సాత్యవతేయుండు జాహ్నవీసలిలావ। గాహన మొనరించి గారవమున**
నింపారు నెలుఁగున 'నిందు రం' డనవుడు। నీ కేమి సెప్పదు? నీటియందు
రవ మగ్గలముగ రారాజుఁ దమ్ములుఁ దత్కు। మారవర్గము నభిమన్యుఁ డాది
యగు పాండుపౌత్త్రులు నర్కజుండును బాహ్లి। కప్రముఖాఖిల కౌరవులును

తే. **ద్రుపదమాత్స్యులు వారి బంధులును శకుని। యును దదీయానుజులును నాతని తనూజ**
రాజియును భీష్మగురులఁ బురస్కరించి। కొనుచుఁ దమదివ్యదేహముల్ కొమరు మిగుల. 118

ప్రతిపదార్థం: సాత్యవతేయుండు= (సత్యవతి కొడుకు) వ్యాసుడు; జహ్నవీ-సలిల-అవగాహనము= గంగనీటిలో మునుక; ఒనరించి= చేసి; గారవమునన్= వాత్సల్యంతో; ఇంపు+ఆరు+ఎలుఁగునన్= మాధుర్యం నిండిన (కంఠస్వరం) గొంతుతో; ఇందున్= ఇచ్చటికి; రండు= (మృత వీరులూ!) రండి; అనవుడున్= అనగానే; నీకున్= నీకు (జనమేజయుడితో); ఏమి చెప్పుదున్?= (నేను, వైశంపాయనుడు) ఏమి చెప్పేది?; నీటియందున్= ఆ గంగనీటిలో; రవము= శబ్దం; అగ్గలముగన్= అధికంగా; రారాజున్= దుర్యోధనుడూ; తమ్ములున్= దుశ్శాసనాదులయిన దుర్యోధనుడి తమ్ముళ్ళూ; తద్-కుమార వర్గమున్= లక్ష్మణాదులయిన ఆ ధార్తరాష్ట్రుల కుమార సమూహము; అభిమన్యుఁడు= అభిమన్యుడు; ఆది= మొదలు; అగు-పాండుపౌత్రులున్= అయినటువంటి పాండురాజు మనుమళ్ళూ; అర్కజుండును= (సూర్యుడివలన పుట్టిన) కర్ణుడూ; బాహ్లిక= బాహ్లికుడు; ప్రముఖ= మొదలుగా; అఖిల= సమస్తమైన; కౌరవులును= కురువంశ్యులూ; ద్రుపద-మాత్స్యులు= ద్రుపదుడూ (మత్స్యదేశం రాజైన) విరాటుడూ; వారి బంధులును= ధృష్టద్యుమ్నాదులైన ద్రుపద విరాటుల (పుత్రాది) బంధువులూ; శకునియును= శకునీ; తదీయ-అనుజులును= ఆ శకుని సోదరులూ; అతని తనూజ-రాజియును= వారి కుమారవర్గమూ; భీష్మ-గురులన్= భీష్ముడినీ, ద్రోణుడినీ; పురస్కరించుకొనుచున్= ముందుగా ఉంచుకొని; తమ-దివ్య దేహముల్= తమ తమయొక్క ప్రకాశించేటటువంటి అలౌకిక శరీరాలు; కొమరు= సౌకుమార్యం; మిగులన్= అతిశయించగా.

తాత్పర్యం: వ్యాసమహర్షి గంగాజలంలో మునుకవేసి ప్రేమతో తియ్యనైన గొంతుతో ఇక్కడికి (భారతయుద్ధంలో మరణించిన వారిని) రండి అన్నాడు. జనమేజయ మహారాజా! నీ కేమని చెప్పేది? అపుడు ఆ నీళ్ళలోనుండి పెద్దగా చప్పుడు ఆరంభమైంది. దానితోటే, దుర్యోధనుడూ, అతడి తమ్ముళ్ళూ, ఆ ధార్తరాష్ట్రుల కొడుకులూ మొదలైన ధృతరాష్ట్రుడి కుటంబం వారూ, అభిమన్యుడూ, ఉపపాండవులూ మొదలైన పాండురాజు కుటుంబం వారూ, కర్ణుడూ, ఇంకా బాహ్లికుడు (సోమదత్తుడు) మొదలైన కురువీరులందరూ, ద్రుపదుడూ, విరాటుడూ (ధృష్టద్యుమ్నుడూ, ఉత్తరుడూ మొదలైన) వాళ్ళ చుట్టాలూ, శకునీ, అతడి సోదరులూ, కొడుకులూ భీష్ముడూ, ద్రోణుడూ మొదలుగా గల వాళ్ళు తమ దివ్యశరీరాలు ప్రకాశిస్తుండగా కనబడ్డారు.

ఆ. **దివ్య మాల్యములును దివ్యాంబరంబులు। దివ్య భూషణములు దివ్యలేప**
నములుఁ జెన్నుఁ జేయఁ దమ మిత్ర సుభటసం। దోహములును దారుఁ దోఁచి రధిప! **119**

ప్రతిపదార్థం: అధిప!= ఓ జనమేజయ మహారాజా!; దివ్య-మాల్యములును= స్వర్గ (ఊర్ధ్వ) లోకానికి సంబంధించినటువంటి పూమాలలూ; దివ్య+అంబరంబులు(న్)= దివ్యములైనటువంటి వస్త్రాలూ; దివ్య-భూషణములు= దివ్యములైన ఆభరణాలూ; దివ్య-లేపనములు(న్)= దివ్యములయిన మైపూతలూ; చెన్నున్+చేయన్= అందాన్ని కలిగిస్తుండగా; తమ-మిత్ర-సుభట-సందోహములును= తమకు మిత్రుల బంటుల సమూహాలూ; తారున్= తామూ (దుర్యోధనాదులూ); తోఁచిరి= కనబడ్డారు.

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ఆ దుర్యోధనాదులు మానవలోకానికి అతీతమయిన లోకాలకు సంబంధించిన పూలమాలలూ, అటువంటి దివ్యమయిన వస్త్రాలూ, దివ్యమైన అలంకారాలూ, దివ్యమైన మైపూతలూ అందగిస్తుండగా, తమతమ మిత్రుల, బంట్ల సముదాయాలూ తామూ కనబడ్డారు.

వ. **అట్టియెడ.** **120**

ప్రతిపదార్థం: అట్టి+ఎడన్= ఆ సమయంలో..

తాత్పర్యం: (దుర్యోధనాదులైన భారతయుద్ధంలో మరణించిన వారు అందరూ గంగలో తోచిన) ఆ సమయాన.(తరువాతి పద్యంతో అన్వయం)

క. తగ నా కురువృద్ధునకు నొ। సఁగె నాఁటికి నెల్లదృష్టి సాత్యవతేయుం
డగణితతపఃప్రభావం। బు గని యధిక విస్మయంబుఁ బొందఁగ జనముల్. 121

ప్రతిపదార్థం: అగణిత-తపస్+ప్రభావంబు= గణించడానికి సాధ్యంగాని (వ్యాసుడి) తపఃశక్తి; కని= చూచి; జనముల్= అక్కడివారు అందరూ; విస్మయంబున్= ఆశ్చర్యాన్ని; పొందఁగన్= పొందుతుండగా; సాత్యవతేయుండు= వ్యాసుడు; ఆ కురు వృద్ధునకున్= ఆ ధృతరాష్ట్రుడికి; నాఁటికిన్= అప్పటికి; తగన్= తగినట్లుగా; ఎల్లదృష్టిన్= పూర్తిగా చూపును; ఒసఁగెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: తన తపః ప్రభావాన్ని చూచి జనమంతా ఆశ్చర్యపడేవిధంగా వ్యాసుడు ఆ ధృతరాష్ట్రుడికి అప్పటికి తగినట్లుగా సంపూర్ణదృష్టిని ఇచ్చాడు.

వ. అవ్విశేషంబు విని యద్భుత ప్రమద భరితయై నిజనయనంబుల బంధించిన పట్టం బపనయించి గాంధారి యును గనుంగొనుచుండ. 122

ప్రతిపదార్థం: గాంధారియును= గాంధారి కూడా; ఆ+విశేషంబు= ధృతరాష్ట్రుడికి దృష్టి రావటం అనే విశేషం; విని= ఆలించి; అద్భుత-ప్రమద-భరిత+ఐ= ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ నిండినది అయి; నిజ-నయనంబులన్= తన కళ్ళకు; బంధించిన-పట్టంబు= కట్టిన వస్త్రాన్ని; అపనయించి= తొలగించి; కనుంగొనుచున్-ఉండన్= చూస్తూ ఉండగా.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడికి చూపురావటం అనే విశేషం విని ఆశ్చర్యానందాలతో గాంధారి కూడా తన కళ్ళకు కట్టిన వస్త్రాన్ని తొలగించి (దుర్యోధనాదులను) చూస్తుండగా, (తరువాతి పద్యంతో అన్వయం)

క. అవ్విధమునఁ దోఁచిన మఱి। నవ్వుచుఁ దెగడుచును బెరసి నరవర! పగ లే
కవ్వీరవరులు నెయ్యము। నివ్వటిలఁగ విలసనములు నెఱయ మెఱయఁగన్. 123

ప్రతిపదార్థం: నరవర!= ఓ జనమేజయ మహారాజా!; ఆ+విధమునన్= ఆ తీరుగా; తోఁచినన్= యుద్ధ మృతవీరులు కనబడగా; మఱి= అపుడు; ఆ+వీరవరులు= ఆ దుర్యోధనాదులు; నవ్వుచున్= నవ్వుతూ; తెగడుచున్= పరిహాసాలు ఆడుకొంటూ; బెరసి= సంఘీభావంతో కలిసి; పగ= విరోధం; లేక= లేకుండా; నెయ్యము= స్నేహం; నివ్వటిలఁగన్= అతిశయించగా; విలసనములు= కాంతులు; నెఱయన్= సంపూర్ణంగా; మెఱయఁగన్= మెరుస్తూ ఉండగా.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! ఆ విధంగా (గాంధారీధృతరాష్ట్రులతో కూడా అందరూ చూస్తూ ఉండగా) కనబడిన దుర్యోధనాదులైన వీరశ్రేష్ఠులు, నవ్వుతూ, పరిహాసాలాడుకొంటూ, కలిసి మెలిసి శత్రుత్వం లేకుండా, స్నేహం వర్ధిల్లుతుండగా, కాంతులు బాగా ప్రకాశిస్తూ ఉండగా (ఉన్నారు.)

తే. చతురగంధర్వు లప్సరోజనులు గాన। ములఁ బ్రమోద మొనర్పంగఁ బొగడ వంది
సమితి నిరహంకృతులు హృదయముల గౌర। వములు తెల్లంబు సేయంగ వచ్చి రొప్పి. 124

ప్రతిపదార్థం: చతుర-గంధర్వులు= నేర్పరులయిన గంధర్వులు; అప్సరస్+జనులు= అప్సరసలు; గానములన్= వివిధములైన పాటలతో; ప్రమోదము= (తమకు) సంతోషం; ఒనర్పంగన్= కలిగిస్తుండగా; వంది-సమితి= భట్రాజుల బృందం; పొగడన్= (తమను) స్తుతిస్తుండగా; హృదయముల గౌరవములు= సంకుచితపు ఆలోచనలు లేని ఉదారబుద్ధిని; తెల్లంబు= స్పష్టం; చేయంగన్= చేస్తుండగా; నిర్+అహంకృతులు= అహంకారం లేనటువంటి వారుగా (దుర్యోధనాదులు); ఒప్పి= ప్రకాశిస్తూ; వచ్చిరి= ధృతరాష్ట్రాదులవద్దకు వచ్చారు.

తాత్పర్యం: నిపుణులైన గంధర్వులూ, అప్సరసలూ వివిధగానాలతో సంతోషపెట్టుతుండగా, స్తోత్రపాఠకుల సమూహం స్తుతిస్తుండగా, అహంకారం లేనటువంటి ఆ దుర్యోధనాదులు తమ ఉదారబుద్ధిని ప్రకటిస్తూ, ధృతరాష్ట్రాదుల సమీపానికి వచ్చారు.

వ. ఇట్లు వచ్చి సకలబంధుజనంబులకుం బరమప్రమోదం బావహిల్లం గలిపి సముచితాచారంబులు నడపి; రా
రెండు దెఱంగులవారలు నర్హ ప్రకారంబులఁ బితామహాచార్య శిష్య మాతృ మాతామహ పితృపితామహ భ్రాతృ
జామాతృ పుత్త్రపుత్త్రీభగినీ పౌత్త్ర దౌహిత్ర శ్వశుర శ్వశ్రూస్నుషా మాతుల స్యాలక ప్రియ ప్రియా మిత్ర
సమాగమసుఖంబు లనుభవించుచు. 125

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా (అత్యంత వైభవంతో దుర్యోధనాదులు); వచ్చి= (ధృతరాష్ట్రాదుల వద్దకు) వచ్చి; సకలబంధు జనంబులకున్= అక్కడ ఉన్న బంధువులకు అందరికీ; పరమ-ప్రమోదంబు= ఉత్తమమైన సంతోషం; ఆవహిల్లన్= కలుగగా; కలిసి= కూడుకొని; సముచిత-ఆచారంబులు= తగువిధంగా (పెద్దలకు ప్రణామాలూ, పిన్నలకు ఆశీస్సులూ ఇత్యాదిగా) చేయవలసిన పనులు; నడపిరి= ఆచరించారు; ఆ రెండు దెఱంగులవారలు= ఆ రెండు విధాలయిన వారు (దివ్య దేహాలతో ఉన్న దుర్యోధనాదులూ, మానవులైన ధృతరాష్ట్రాదులూ); అర్హప్రకారంబులన్= తగువిధంగా; పితామహ= భీష్ముడితో; ఆచార్య= ద్రోణుడితో; శిష్య= శిష్యులతో; మాతృ= తల్లులతో; మాతామహ= తల్లులయొక్క తండ్రులతో; పితృ= తండ్రులతో; పితామహ= తండ్రులయొక్క తండ్రులతో; భ్రాతృ= సోదరులతో; జామాతృ= అల్లుళ్ళతో; పుత్త్ర= కొడుకులతో; పుత్త్రీ= కూతుళ్ళతో; భగినీ= అక్కా, చెల్లెళ్ళతో; పౌత్త్ర= (కొడుకు కొడుకు) మనవళ్ళతో; దౌహిత్ర= కూతురు కొడుకులతో; శ్వశుర= మామలతో; శ్వశ్రూ= అత్తలతో; స్నుషా= కోడళ్ళతో; మాతుల= మేనమామలతో; స్యాలక= బావమరదులతో; ప్రియ= (భర్త) ప్రియులతో; ప్రియా= ప్రియురాండ్ర (భార్యల)తో; మిత్త్ర= స్నేహితులతో; సమాగమ-సుఖంబు= కలియటంలోని ఆనందం; అనుభవించుచు(న్)= పొందుతూ.

తాత్పర్యం: ఈ విధంగా వైభవంతో వచ్చి దుర్యోధనాదులు అక్కడ ఉన్న తమ చుట్టాలందరికీ అత్యుత్తమమైన ఆనందం కలిగించి, చేయవలసిన సత్కారాది ఆచారాలు చేశారు. అపుడు ఆ రెండు విధములైన వారూ (దుర్యోధనాది దివ్యశరీరులూ, ధృతరాష్ట్రాది మానవ శరీరులూ) తగువిధంగా పరస్పరం-భీష్మ ద్రోణులూ (గురువులూ), శిష్యులూ, తల్లులూ, వారి (తల్లుల) తండ్రులూ, తండ్రులూ, వారి (తండ్రుల) తండ్రులూ, సోదరులూ, అల్లుళ్ళూ, కొడుకులూ, కూతుళ్ళూ, అక్క చెల్లెళ్ళూ, కొడుకు కొడుకులూ, కూతురు కొడుకులూ, మామలూ, అత్తలూ, కోడళ్ళూ, మేనమామలూ, బావమరదులూ, భర్తలూ, స్నేహితులూ కలిసికొనటంలోని ఆనందం అనుభవిస్తూ, (తరువాతి పద్యంతో అన్వయం)

తే. అనఁగి పెనఁగి నాఁడెల్ల నిచ్ఛానురూప। వృత్తి వర్తిల్లుచుండి; రవ్విధము సకల
జనుల నద్భుతరసమున మునుఁగఁ జేసె;। నే మనఁగ వచ్చు నా సంయమీంద్రు మహిమ. 126

ప్రతిపదార్థం: నాఁడు= ఆరోజు; ఎల్లన్= మొత్తమూ; ఇచ్ఛా+అనురూప-వృత్తిన్= తమ తమ ఇష్టానికి సరి అయిన ప్రవర్తనతో; అనఁగి-పెనఁగి= (అందరూ) కలిసి, మెలిసి; వర్తిల్లుచుండిరి= ఉన్నారు; ఆ+విధము= ఆ తీరు; సకల-జనులన్= అక్కడి వారందరినీ; అద్భుత-రసమునన్= ఆశ్చర్యం అనే రసం (ప్రవాహం)లో; మునుఁగన్-చేసెన్= ముంచింది; ఆ-సంయమి+ఇంద్రు-మహిమ= మునిశ్రేష్ఠుడయిన ఆ వ్యాసుడి మాహాత్మ్యం, (జనమేజయా); ఏమి-అనఁగన్-వచ్చున్?= ఏతీరుగా చెప్పటానికి సాధ్యం అవుతుంది?

తాత్పర్యం: ఆరోజంతా వాళ్ళు అందరూ తమ ఇష్టం వచ్చినట్లుగా, కలిసి మెలిసి వ్యవహరించారు. ఆ విధంగా (దివ్యులు మానవులతో స్వస్వరూపంతో వచ్చి కలిపి ఉండటం) అందరినీ ఆశ్చర్య ప్రవాహంలో ముంచింది. (జనమేజయా!) మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడి మహిమ ఏమని చెప్పటానికి సాధ్యం అవుతుంది?

వ. **మఱునాఁడు రేపకడ యప్పారాశర్యుండు ననుప నయ్యిరు దెఱంగులవారలుం బరస్పరామంత్రణంబు సేసి; రాశూరజనంబులు తమతమలోకంబులకుం జనువారై జాహ్నవీజలంబులం బ్రవేశింప, నన్నిలింపవందనీ యుండు దానును జొచ్చి యచ్చటినుండి 'పతుల ననుగమింప వలసిన యంగనలు గంగాతోయంబులంగ్రుం కుటకు రం 'డనిన విని విధవలగు వీరభార్య లెల్లను ధృతరాష్ట్ర గాంధారీ కుంతీ ధర్మనందనుల యనుజ్ఞల గొని రయంబునం జని భాగీరథీ సలిలమగ్నలై మానుష దేహంబులు విడిచి దేవతనువులు దాల్చి దివ్యాలంకార సమలంకృతమూర్తులై మగలం గలసి; రవ్విశేషంబు చూచి సర్వజనులు నత్యంతాశ్చర్యసంతోషాధీన మానసులై రని చెప్పి వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె.** 127

ప్రతిపదార్థం: మఱునాఁడు= తరువాతిరోజు; రేపకడ= ఉదయానే; ఆ+పారాశర్యుండు= (పరాశరమహర్షి కొడుకైన) ఆ వ్యాసుడు; పనుపన్= పంపగా; ఆ+ఇరుదెఱంగులవారలున్= దేవ-మానుషదేహులైన ఆ రెండు విధాలవారూ; పరస్పర+ఆమంత్రణంబు; ఒకరినొకరు వీడుకోలును; చేసిరి= చెప్పుకొన్నారు; ఆ శూరజనంబులు= (యుద్ధంలో మరణించిన) ఆ (దుర్యోధనాది) వీరులు; తమతమ లోకంబులకున్= (రణ మరణానంతరం) ఎవరికి కలిగిన లోకాలకు వారు; చనువారు+ఐ= వెళ్ళేవారు అయి-(వెళ్ళుతూ) జాహ్నవీ- జలంబులన్= గంగ నీటిలోకి; ప్రవేశింపన్= చొరబడగా; ఆ+నిలింపవందనీయుండు= దేవతలచే నమస్కరింపదగిన వ్యాసుడు; తానును= తానుకూడా; చొచ్చి= గంగాజలంలో ప్రవేశించి; అచ్చటన్= అక్కడే; ఉండి= నిలిచి (ఇట్లా అన్నాడు); పతులన్= తమ తమ భర్తలను; అనుగమింప(న్) వలసిన-అంగనలు= అనుసరించి వెళ్ళవలసిఉన్న స్త్రీలు; గంగా తోయంబులన్= గంగానదీ జలంలో; క్రుంకుటకు(న్)= మునగడానికి; రండు= రండి; అనినన్= అని (వ్యాసుడు) పల్కగా; విని= ఆలకించి; విధవలు= భర్తను కోల్పోయిన వారు; అగు-వీర- భార్యలు= అయినటువంటి వీరుల భార్యలు; ఎల్లను= అందరూ; ధృతరాష్ట్ర-గాంధారీ-కుంతీ-ధర్మనందనుల-అనుజ్ఞలు= ధృతరాష్ట్రుడియొక్క, గాంధారియొక్క, కుంతియొక్క, ధర్మరాజు యొక్క అనుమతులు; కొని= స్వీకరించి; రయంబునన్= వేగంగా; చని= వెళ్ళి; భాగీరథీ-సలిల-మగ్నలు= గంగానదీ జలంతో మునిగినవారు; ఐ= అయి; మానుషదేహంబులు= మనుష్యులకు సంబంధించిన శరీరాలను; విడిచి= వదలి; దివ్య తనువులు= దివ్యమైన శరీరాలు; తాల్చి= ధరించి; దివ్య-అలంకార- సమలంకృత- మూర్తులు= దివ్యమయిన ఆభరణాదులతో అలంకరించబడిన రూపం కలవారు; ఐ= అయి; మగలన్= తమ తమ భర్తలను; కలిసిరి= కూడుకొన్నారు; ఆ+విశేషంబు= ఆ సంఘటనను; చూచి= చూచి; సర్వజనులున్= అక్కడివారు అందరూ; అత్యంత-ఆశ్చర్య-సంతోష-అధీన-మానసులు= మిక్కిలి ఎక్కువైన ఆశ్చర్యానికీ, ఆనందానికీ, లోబడిన మనసులు కలవారు; ఐరి= అయ్యారు; అని= అనే ప్రకారంగా; చెప్పి= పలికి; వైశంపాయనుఁ డు= వైశంపాయనముని; జనమేజయునకున్= జనమేజయుడితో; ఇట్లు= ఈ ప్రకారంగా; అనియె(న్)= అన్నాడు.

తాత్పర్యం: మర్నాడు ఉదయాన్నే వ్యాసుడి నియోగం మీద రెండు విధాలైన వారూ (దివ్య-దుర్యోధనాది, మానుష ధృతరాష్ట్రాది) దేహులూ, పరస్పరం వీడ్కోలు తీసికొన్నారు. దివ్యదేహులయిన ఆ వీరులు (రణ మరణానంతరం సంభవించిన) ఎవరిలోకాలకు వారు వెళ్ళటం కొరకు గంగ నీళ్ళలోకి దిగారు. దేవతలచేత సైతం అర్చింపదగిన ఆ వ్యాసుడు తాను గూడా గంగలో దిగి అక్కడే ఉండి-'భర్తలను అనుసరించి వెళ్ళవలసిన స్త్రీలు ఈ గంగలో మునగ డానికి రండి' అన్నాడు. విధవలైన (ఆవీరుల) స్త్రీలు అందరూ, ధృతరాష్ట్ర గాంధారి, కుంతి, ధర్మరాజుల అనుమతి తీసికొని తొందరగా వెళ్ళి గంగలో మునిగి, మనుష్య శరీరాలు విడిచిపెట్టి దివ్యదేహాలు ధరించి, దివ్యాలంకారాలతో తమ తమ భర్తలను కలుసుకొన్నారు. ఆ సంఘటనను చూచి అక్కడి వారందరి మనసులూ ఆశ్చర్యంతో, సంతోషంతో నిండిపోయాయి' అని చెప్పి వైశంపాయనముని జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. **'జననాథ! యీ ప్రియసంగమోత్సవ కథ। వినినఁ బఠించిన వేవిధములఁ**
బరమప్రియము లిందుఁ బరలోకమున సంభ। వించు మనమ్మున కించు భంగి
బాంధవయోగశోభనము వర్తిల్లు; న। నాయాసమున నామయాపగమము
గలుగు; భూదేవనికాయంబునకు దీనిఁ। దగ వినిపించిన ధార్మికులకు

తే. **నవ్యయానంద సంప్రాప్తి యావహిల్లుఁ;। దత్పరతఁ గొనియాడిన దైవతములు**
నీచదశఁ బొందకుండంగఁ గాచి తిరిగి। మే లొనర్తురు భరతభూపాలవర్య!' **128**

ప్రతిపదార్థం: జననాథ!= (జనమేజయ మహా) రాజా!; ఈ ప్రియసంగమ+ఉత్సవ-కథ= ఇష్టులైన వారు కలసికొన్న ఆనందదాయకమైన ఈ వృత్తాంతం; వినినన్= వినగా; పఠించినన్= చదివినా; వే విధములన్= అనేక ప్రకారాలుగా; ఇందున్= ఈ లోకంలోనూ; పరలోకమునన్= ఊర్ధ్వలోకాలలోనూ; పరమ-ప్రియములు= ఉత్తమములయిన అభీష్టాలు; సంభవించున్= నెరవేరుతాయి; మనమ్మునకున్= హృదయానికి; ఇంచు భంగిన్= ఇష్టం కలిగించే విధంగా; బాంధవ-యోగ-శోభనము= బంధువులను కలిసికొనే మేలు; వర్తిల్లున్= కలుగుతుంది; అనాయాసమునన్= సులువుగా; ఆమయ-అపగమము= రోగాలు తొలగిపోవటం; కలుగున్= సంభవిస్తుంది; దీనిన్= ఈ కథను; తగన్= సముచితంగా; ధార్మికులకున్= సత్యశౌచాది ధర్మ ఆచరణ శీలురకు; వినిపించినన్= చదివి వినిపిస్తే (అటువంటి); భూదేవనికాయమునకున్= బ్రాహ్మణుల సముదాయానికి; అవ్యయ+ఆనంద-సంప్రాప్తి= తరగని సంతోషం చేకూరటం; ఆవహిల్లున్= సంభవిస్తుంది; భరతభూపాల వర్య!= భరతవంశ రాజులలో శ్రేష్ఠుడా; జనమేజయా!; తత్పరతన్= ఈ కథపై తాత్పర్య (విశ్వాస) బుద్ధితో; కొనియాడినన్= ప్రశంసిస్తే; వారికి; దైవతములు= దేవతలు; నీచదశన్= తక్కువస్థితిని; పొందక+ఉండంగన్= పొందకుండా; కాచి= కాపాడి; తిరిగి= ఇంకా; మేలు= శుభం; ఒనర్తురు= కలుగజేస్తారు.

తాత్పర్యం: జనమేజయ రాజా! ఇష్టులైన వారు కలిసికొన్న ఈ వృత్తాంతాన్ని విన్నా, చదివినా, ఆ జనులకు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ అనేక విధాలుగా అత్యుత్తమాలు అయిన కోరికలు నెరవేరుతాయి. మనసారా సంతోషం కలిగేటట్లు తమతమ బంధువులను కలిసికొనే ఆనందకరమైన స్థితిని వారు పొందుతారు. ఏమాత్రం కష్టం లేకుండా వారి రోగాలు తొలగిపోతాయి. ఈ కథను సముచితంగా ధర్మబుద్ధులకు చదివి వినిపించిన బ్రాహ్మణులకు తిరుగులేని ఆనందం కలుగుతుంది. పూర్తి నమ్మకంతో దీనిని ప్రశంసిస్తే వారికి, దేవతలు ఏ విధమైన కష్టమూ కలుగకుండా; ఇంకా అధికంగా శుభం కలుగజేస్తారు.

వ. **అనిన విని జనమేజయుండు వైశంపాయనుతో 'ధృతరాష్ట్రుం డట్లు కృష్ణద్వైపాయన ప్రసాదలబ్ధం బైన తత్కాల కలితదృష్టి విశేషంబున బంధులోకంబు నాలోకించి మఱియేమి వర్తనంబున నుండెఁ? బాండవు లెట్లు వర్తించి? రెఱింగింపవే' యనుటయు నతనికి నతం డిట్లనియె.** **129**

ప్రతిపదార్థం: అనినన్= అని వైశంపాయనుడు చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు= జనమేజయుడు; వైశంపాయనుతోన్= వైశంపాయనమునితో (ఇట్లా అన్నాడు); ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; అట్లు= ఆ విధంగా; కృష్ణద్వైపాయన-ప్రసాద-లబ్ధము= వ్యాసమహర్షి యొక్క దయచేత పొందబడినది; ఐన= అయినటువంటి; తద్-కాల-కలిత-దృష్టి-విశేషంబునన్= ఆ సమయానికి మాత్రం కలిగిన ప్రత్యేకమైన చూపుతో; బంధులోకంబున్= భీష్మాది బంధు సమూహాన్ని; ఆలోకించి= చూచి; మఱి= ఆతరువాత; ఏమి= ఎటువంటి; వర్తనంబునన్= నడవడితో; ఉండెన్= ఉన్నాడు; పాండవులు= పాండురాజు కొడుకులు; ఎట్లు= ఏ విధంగా; వర్తించిరి?= ఉన్నారు?; ఎఱింగింపవే= తెలుపవలసింది; అనుటయున్= అనగా; అతనికిన్= ఆ జనమేజయుడితో; అతండు= వైశంపాయనుడు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: వైశంపాయను డావిధంగా చెప్పగా విని జనమేజయుడు (వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు) 'ధృతరాష్ట్రుడు ఆ తీరుగా వ్యాసమహర్షి కరుణవలన పొందిన ఆనాటి చూపుతో, తన బంధువులను చూచి, ఆ తరువాత ఏ ప్రకారంగా నడచుకొన్నాడు? పాండవులు ఎట్లా ఉన్నారు? తెలియజేయవలసింది' అని ప్రార్థించగా అపుడు వైశంపాయనుడు జనమేజయుడితో ఇట్లా అన్నాడు.

ధృతరాష్ట్రుఁడు భాగీరథీ తీరంబుననుండి నిజాశ్రమంబు ప్రవేశించుట (సం.15-44-2)

సీ. **అ య్యద్భుతపువృత్త మమ్మెయిఁ జెల్లిన। ధృతరాష్ట్రమేదినీపతి తపస్వి**
గణము సవినయంబుగా నిజస్థానయా। నమునకు నామంత్రితముగఁ జేసి
యాశ్రమభూమికి నరిగెఁ దోడన పాండు। రాజనందనులును రా నుదాత్త
తేజు సత్యవతీ తనూజు మున్నిడికొని। యప్పు డమ్మునిపతి యతనితోడ

తే. **'నీవు వేదశా స్త్రార్థముల్ భావితాత్ము। లగు మునీంద్రులచేఁ జెవులార వింటి,**
కంటి తనయుల నీ కన్న కంటె నొప్పి। యుండుదురు వారు దివిసౌఖ్యయోగ మెసఁగ. **130**

ప్రతిపదార్థం: ఆ+అద్భుతపు వృత్తము= ఆశ్చర్యకరమైన ఆ (ప్రియ సమాగమ) సన్నివేశం; ఆ-మెయిన్= ఆ విధంగా; చెల్లినన్= పూర్తికాగా; ధృతరాష్ట్రమేదినీపతి= ధృతరాష్ట్ర మహారాజు; సవినయంబుగాన్= నమ్రతతో; తపస్విగణమున్= (శతయూపాది) మునుల సముదాయాన్ని; నిజ-స్థాన-యానమునకున్= తమ, తమచోట్లకు వెళ్ళటానికి; ఆమంత్రితముగన్= వీడ్కోలు చెప్పి; పాండురాజ-నందనులు= పాండవులు; తోడన= తనతో (వెంట); రాన్= వస్తూండగా; ఉదాత్త-తేజున్= మిక్కిలి ప్రకాశవంతుడైన; సత్యవతీ-తనూజున్= (సత్యవతి కొడుకు) వ్యాసుడిని; మున్ను-ఇడికొని= ముందు ఉంచుకొని; ఆశ్రమభూమికిన్= తన ఆశ్రమ ప్రదేశానికి; అరిగెన్= వెళ్ళాడు; అప్పుడు= ధృతరాష్ట్రుడు ఆశ్రమానికి వెళ్ళిన తరువాత; ఆ+మునిపతి= మునిశ్రేష్ఠుడైన ఆ వ్యాసుడు; అతని తోడన్= ఆ ధృతరాష్ట్రుడితో (ఇట్లా అన్నాడు); నీవు= నీవు; భావిత-ఆత్ములు= ఆత్మజ్ఞానులయిన; మునీంద్రులచేన్= మునిశ్రేష్ఠులవలన; వేద-శాస్త్ర-అర్థముల్= వేదాలయొక్క, ధర్మశాస్త్రాలయొక్క అంశాలను; చెవులు-ఆరన్= సమగ్రంగా; వింటి(వి)= విన్నావు; తనయుల(న్)= (మృతులయిన) కొడుకులను; కంటి(వి)= ఇపుడు చూచావు; వారు= ఆ కొడుకులు; దివి(న్)= స్వర్గంలో; సౌఖ్య-యోగము= ఆనందంతోడి సంబంధం; ఎసఁగన్= అతిశయించగా; నీ కన్న కంటెన్= ఇపుడు నీవు చూచిన దాని కంటె గూడా; ఒప్పి ఉండుదురు= సుఖంగా ఉంటారు.

తాత్పర్యం: ఆశ్చర్యకరమైన ఆ సంఘటన ఆ విధంగా పూర్తి కావటంతో; ధృతరాష్ట్రుడు వినయంతో వీడ్కోలు చెప్పగా (శతయూపాది) మునులు తమతమ నెలవులకు వెళ్ళిపోయారు. పాండవులు తనవెంట వస్తుండగా వ్యాసమహర్షిని ముందుంచుకొని ధృతరాష్ట్రుడు కూడా తన ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ వ్యాసుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు 'ఆత్మజ్ఞానులైన మునిశ్రేష్ఠుల వలన వేద శాస్త్రవిషయాలు సంపూర్ణంగా విన్నావు. యుద్ధంలో మరణించిన నీ కొడుకులను చూచావు. నీ కొడుకులు స్వర్గసుఖాలతో నీవు చూచినదానికంటె అధికంగా ఆనందంగా ఉన్నారు.

ఉ. కావున నింక వారికయి కౌరవసత్తమ! యుమ్మలింప కా
త్మావిల భావముం దపము నగ్గలికం బెడఁబాపు నిన్ను సం
భావనఁ గొల్చి యొక్కనెల పాండవముఖ్యుఁడు నిల్చె నిష్ఠమై
నీ వనభూమి; నీ వసుమతీశ్వరుఁ బొమ్మనఁ గాదె వీటికిన్?' 131

ప్రతిపదార్థం: కౌరవ సత్తమ!= కురువంశపు వారిలో శ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా!; కావునన్= (నీ కొడుకులు సుఖంగా ఉన్నారు. నీవు చూచావు) కాబట్టి; ఇంకన్= ఇకపైన; వారికయి= కొడుకులను గూర్చి; ఉమ్మలింపక= కుమిలిపోక; ఆత్మ+ఆవిల-భావమున్= మనసులోని కలతనూ; తపము+అగ్గలికన్= తపస్సు యొక్క తీవ్రతను; పెడఁబాపు(ము)= విడిచిపెట్టుము, పాండవ ముఖ్యుఁడు= ధర్మరాజు; సంభావనన్= సగౌరవంగా; నిష్ఠమైన్= శ్రద్ధతో; నిన్నున్= నిన్ను; కొల్చి= సేవించి (సేవిస్తూ); ఈ వనభూమిన్= ఈ అరణ్యం (ఆశ్రమం)లో; ఒక్కనెల= ఒక మాసం పాటు; నిల్చెన్= ఉండిపోయాడు; ఈ వసుమతీ-ఈశ్వరున్= ఈ (ధర్మ) రాజును; వీటికిన్= (హస్తి) నగరానికి; పొమ్ము+అనన్+కాదె!= పొమ్మని చెప్పవచ్చుగదా!

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! ధృతరాష్ట్రా! నీ కొడుకులను చూచావు. వాళ్ళు ఎంతో సుఖంగా ఉన్నారు కాబట్టి ఇకనైనా వాళ్ళను గూర్చి కుమిలిపోకుండా, మనసులో కలతనూ, తపసులో తీవ్రతనూ విడిచిపెట్టు! ధర్మరాజు పూజ్యభావంతో శ్రద్ధగా నిన్ను సేవిస్తూ అరణ్యంలో ఒక నెల రోజులు ఉన్నాడు. ఇంక ఈ (ధర్మ) రాజును రాజధానికి వెళ్ళుమని చెప్పవచ్చునుగదా!

వ. అని చెప్పిన నప్పౌరవోత్తముం 'డట్ల చేసెద' నని పలికి యమ్మునిసత్తమునకుం బ్రణమిల్లి 'భవదీయకృపా విశేషం బునం గృతార్థుండనైతి' నని యతని నామంత్రితుం జేసినం, బాండవులుం దగ నప్పరమమునిని వీడ్కొని; రయ్యం దఱను దీవించి యమ్మహాత్ముం డంతర్హితుం డయ్యెఁ; దదనంతరంబ. 132

ప్రతిపదార్థం: అని= ఈ ప్రకారంగా; చెప్పినన్= వ్యాసమహర్షి చెప్పగా; ఆ+పౌరవ+ఉత్తముండు= పురువంశ శ్రేష్ఠుడైన ఆ ధృతరాష్ట్రుడు; అట్లు+అ= ఆ (వ్యాసుడు చెప్పిన) విధంగానే; చేసెదన్= చేస్తాను; అని-పలికి= అని చెప్పి; ఆ+ముని సత్తమునకున్= మునులలో శ్రేష్ఠుడయిన ఆ వ్యాసమహర్షికి; ప్రణమిల్లి= ప్రణామం చేసి; భవదీయ-కృపా-విశేషంబునన్= మీయొక్క, దయ పెంపుతో; కృతార్థుండన్= కోరికలు తీరిన వాడిని; ఐతిన్= అయ్యాను; అని= అనిచెప్పి; అతనిన్= ఆ వ్యాసుడిని; ఆ మంత్రితున్-చేసినన్= వీడుకోలు చెప్పగా; పాండవులున్= పాండవులు గూడా; ఆ+పరమమునిన్= ఆ ఉత్తమ ఋషిని; తగన్= సముచితంగా; వీడ్కొనిరి= వీడుకోలు చెప్పారు; ఆ+మహాత్ముండు= ఆ వ్యాసమహర్షి; ఆ+అందఱను= ధృతరాష్ట్రుడు మొదలైన అక్కడి వారిని అందరినీ; దీవించి= ఆశీర్వదించి; అంతర్హితుండు-అయ్యెన్= అదృశ్యం అయ్యాడు; తద్-అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: వ్యాసుడు ఆ విధంగా చెప్పగా ధృతరాష్ట్రుడు అట్లాగే చేస్తానని చెప్పి ఆ మహర్షికి ప్రణామం చేసి మీ దయవలన కృతార్థుడినయ్యాను అని చెప్పి వ్యాసుడికి వీడ్కోలు పలికాడు. అప్పుడు పాండవులుకూడా తగువిధంగా ఆ మహర్షికి వీడ్కోలు చెప్పారు. వ్యాసుడు వాళ్ళందరినీ ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు. ఆ తరువాత.

సీ. **ఆంబికేయుండు ధర్మాత్మజుఁ జిత్తసం। ప్రీతి మోమునఁ దోఁపఁ బేరఁ బిలిచి**
'వసుమతీకార్య నిర్వహణంబు పెద్దకొ। ల్వున నుండి నీ వనుదినము నడప
కునికి కర్తవ్యమే? వినుకులు భీష్మాది। మహితులచేత సమగ్రభావ
మొందినయవి యింక నుపదేశ మేమియు। వలవదు; రంధ్ర మొవ్వని జనంబు

తే. **వేచు; ననుజానుగతుఁడవై వేగపొమ్ము। దారయుతముగఁ బురికి నుదారచరిత!**
నీ కతమ్మున మున్న నా శోక మెల్లఁ। బాసెఁ, దేజంబు సౌఖ్యానుభవముఁ గంటి. **133**

ప్రతిపదార్థం: ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; మోమునన్= ముఖంమీద; చిత్తసంప్రీతి= మనసులోని సంతుష్టి; తోఁపన్= కనబడుతుండగా; ధర్మాత్మజున్= ధర్మరాజును; పేరన్= పేరుతో (ప్రేమగా); పిలిచి= దగ్గరకు పిలిచి; ఉదారచరిత!= ఉత్తమమైన నడవడి కలవాడా!; వసుమతీ-కార్య-నిర్వహణము= రాజ్యానికి సంబంధించిన (పాలన) పనులు నడపటం; పెద్ద= ప్రధానమైన అంశం; నీవు= నీవు; అనుదినము= ప్రతిరోజు; కొల్వునన్= కొలువులో; ఉండి= ఉనికిగలిగి; నడపక-ఉనికి= నిర్వహించకుండా ఉండటం; కర్తవ్యము+ఏ?= (నీకు) చేయదగినదేనా?; భీష్మ+ఆది-మహితుల చేతన్= భీష్ముడు మొదలైన గొప్పవారి వలన; వినుకులు= నీవు విని తెలిసికొన్న రాజనీతి విషయాలు; సమగ్ర-భావము= సంపూర్ణత్వాన్ని; ఒందినయవి= పొందాయి; ఇంకన్= ఇంక కొత్తగా; ఉపదేశము= చెప్పవలసినది; ఏమియున్= ఏమీ; వలవదు= లేదు; ఒవ్వనిజనంబు= గిట్టనివారు; రంధ్రము= (నీ) పొరపాటును గూర్చి; వేచున్= ఎదురుచుస్తూ ఉంటారు (అందుచేత); అనుజ-అనుగతుఁడవు+ఐ= తమ్ములచేత అనుసరించబడే వాడివి అయి; దార-యుతముగన్= భార్యలతో; వేగ= త్వరగా; పురికిన్= (హస్తి) నగరానికి; పొమ్ము= వెళ్ళుము; నీకతమునన్= నీకారణంగా; నా శోకము= (పుత్ర) దుఃఖం; ఎల్లన్= సమస్తం; మున్ను+అ= ఇంతకు మునుపే; (దుర్యోధనాదులను ఇట్లా చూడకముందే); పాసెన్= తొలగిపోయింది; తేజంబు(న్)= ఉత్సాహం; సౌఖ్య-అనుభవమున్= ఆనంద అనుభూతినీ; కంటి(న్)= పొందాను.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు మనసులోని సంతోషం ముఖంపై వ్యక్తం అవుతుండగా ధర్మరాజును దగ్గరకు పిలిచి (ఇట్లా అన్నాడు). ఉత్తమమైన నడవడి కలవాడా! ధర్మరాజా! రాజ్యకార్యనిర్వహణం ప్రముఖమైన విషయం (కష్టంతో కూడినది). కొలువులో ఉండి నీవు స్వయంగా ప్రతిరోజూ రాజకార్యాలు నడపకుండా ఉండటం తగునా? భీష్ముడు మొదలైన మహాత్ముల వలన రాజనీతులు సమగ్రంగా తెలిసికొని ఉన్నావు. క్రొత్తగా చెప్పవలసిం దేమీ లేదు. గిట్టనిజనం నీ ప్రమాదం కొరకు వెదకుతూ ఉంటారు. అందుచేత నీవు వెంటనే తమ్ముళ్ళను వెంటబెట్టుకొని భార్యలతో హస్తినగరానికి వెళ్ళుము. నీ వల్ల నా (పుత్ర) శోకం పూర్తిగా ఇంతకు మునుపే పోయింది. ఉత్సాహమూ, సుఖానుభూతీ కలిగాయి.

చ. **'తపమునెడన్ మదీయమతి తత్పర గావున దాని కోర్తు నీ**
వపగతఖేదమానసుఁడ వై నను నిం దతినిష్ఠ నొందఁ బం
చి పురజనంబు సమ్మదముఁ జెందఁగ సైనికు లుల్లసిల్లఁగా
నృపవర! యేఁగి రాజ్య భరనిర్వహణం బొనరింపు', నావుడున్. **134**

ప్రతిపదార్థం: నృపవర!= (ధర్మ) రాజా!; మదీయ-మతి= నా మనస్సు; తపము-ఎడన్= తపస్సు విషయంలో; తత్పర= లగ్నమై ఉన్నది; కావునన్= అందుచేత; దానికిన్= తపస్సు; ఓర్తున్= సహించగలను (అందుచేత); నీవు= నువ్వు; అపగత-ఖేద-మాన సుఁడవు= పోయిన విచారం కలిగిన మనస్సు గలవాడవు (మనసులో విచారం విడిచిపెట్టి); ఐ= అయి; ననున్= నన్ను; అతినిష్ఠన్= మిక్కిలి శ్రద్ధతో; ఇందున్= ఈ అరణ్యంలో; ఒందన్= (తపస్సు చేస్తూ) ఉండటానికి; ఎంచి= ఏర్పరచి; (నన్నిక్కడే వదలి) పురజనంబు= పౌరులు; సమ్మదమున్= సంతోషం; చెందఁగన్= పొందేటట్లు; సైనికులు= బంటులు; ఉల్లసిల్లఁగాన్= ఉత్సాహం పొందేటట్లుగా; ఏఁగి= (హస్తినగరానికి) వెళ్ళి; రాజ్య-భర-నిర్వహణంబు= సామ్రాజ్యపు-కార్యభారాన్ని వహించటం; ఒనరింపు(ము)= చేయుము; నావుడున్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా, (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడా ధర్మరాజా! నామనస్సు తపస్సు మీద లగ్నమై ఉన్నది. కాబట్టి తపస్సును నేను సులువుగా ఆచరించగలను.అందుచేత నీవు నిర్విచారంగా నన్ను ఈ అరణ్యంలో విడిచి, తపస్సు చేసికొననిచ్చి పౌరులు (రాజ్య ప్రజలు) సంతోషించేటట్లుగా, సైన్యం ఉత్సాహం చెందే విధంగానూ, హస్తినగరానికి వెళ్ళి రాజకార్యాలను నిర్వహించుము. అని ధృతరాష్ట్రుడు చెప్పగా (ధర్మరాజు ఇట్లా అన్నాడు.)

సీ. **ధర్మతనూజుఁ డాతని తోడ నిట్లను । 'నధిప! భీమాదుల నరుగఁ బనుపు**
పుడమి రక్షింప; నీ యడుగులకడ నేను । నిలిచి మా తల్లుల నిన్నుఁ గొలిచి
యంచితతపమున కనుగుణం బైనట్టి । శుశ్రూషణము సేయుచును దపోని
యతితోడ నుండెద; ననవుడు గాంధారి । యి ట్లనఁ దగు 'నన్న 'యీవ కావె

తే. **కురుకులమునకు సంరక్షకుఁడవు; నీవు । తండ్రులకుఁ బిండ మొసఁగఁ గర్తవు; భవజ్జ**
నకునిపంపు చేయుము; భూజనము దలంక । కుండఁ బొ; మ్మది ప్రియము మా యుల్లములకు.' **135**

ప్రతిపదార్థం: ధర్మతనూజుఁడు= ధర్మరాజు; అతని తోడన్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు= ఈవిధంగా; అనున్= అన్నాడు; అధిప!= (ధృతరాష్ట్ర) రాజా! పుడమి(న్)= రాజ్యాన్ని; రక్షింపన్= కాపాడటం కొరకు; అరుగన్= (రాజ్యానికి తిరిగి) వెళ్ళటానికి; భీమాదులన్= భీముడు మొదలైనవారిని; పనుపు(ము)= పంపించుము; నేను= నేను మాత్రం; నీ-అడుగుల-కడ(న్)= మీ పాదాల చెంతనే (ఇక్కడే, మీతో); నిలిచి= ఉండి; మా తల్లులన్= మా తల్లులు అయిన గాంధారినీ, కుంతినీ; నిన్నున్= నిన్నూ (ధృతరాష్ట్రుడిని); కొలిచి= సేవించి; అంచిత-తపమునకున్= మీ గొప్ప తపస్సుకు; అనుగుణంబు= తగినది; ఐన-అట్టి-శుశ్రూషణము= అయినటువంటి సేవ; చేయుచున్= చేస్తూ; తపస్-నియతి తోడన్= తపస్సుపై శ్రద్ధతో; ఉండెదన్= (ఇక్కడే) ఉంటాను; అనవుడు(న్)= అని ధర్మరాజు పలుకగా; గాంధారి= గాంధారి (ఇట్లా అన్నది); ఇట్లు= ఈవిధంగా; అనఁదగున్+అన్న!= అనటం ఉచితమేనా నాయనా?; కురుకులమునకున్= కురువంశానికి; సంరక్షకుఁడవు= కాపాడవలసినవాడివి; ఈవు+అ= నీవే; కావే!= కావా!; తండ్రులకున్= (పాండురాజు, మొ॥) వంశంలోని పెద్దలకు; పిండము= పిండాన్ని (శ్రాద్ధక్రియలలో); ఒసఁగన్= ఇవ్వటం; కర్తవు= చేయవలసిన వాడివి; నీవు= నీవే; భవత్-జనకుని-పంపు= నీ తండ్రి (ధృతరాష్ట్రుడు) చెప్పినది; చేయుము= ఆచరించుము; భూజనము= రాజ్యంలోని ప్రజలు; తలంకక-ఉండన్= కంగారు పడకుండా; పొమ్ము= (వెంటనే) రాజధానికి వెళ్ళుము; మా-ఉల్లములకున్= మా అందరి మనస్సులకూ; అది= నీవు రాజధానికి వెళ్ళటమే; ప్రియము= ఇష్టం.

తాత్పర్యం: ధర్మరాజు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. 'రాజా! రాజ్యాన్ని రక్షించడానికి (రాజధానికి) భీముడు మొదలైన వారిని పంపించుము. నేను ఇక్కడే మీ పాదాల వద్ద ఉండి, గాంధారినీ, కుంతినీ సేవించుకొంటూ, మీ తపస్సుకు తగినట్లుగా మీకు సేవ చేసికొంటూ తపోదీక్షలో ఉంటాను', ఆ మాటలకు గాంధారి ఇట్లా అన్నది. 'నాయనా! నీవు ఈ

విధంగా మాటాడవచ్చునా! కురువంశాన్ని రక్షించవలసిన వాడివి నీవే కదా! పాండుప్రభృతులైన తండ్రులకు శ్రాద్ధకర్మలు నిర్వహించటానికి నీవే కర్తవు. అందుచేత నీ తండ్రి (ధృతరాష్ట్రుడు) చెప్పినట్లు చేయుము. ప్రజలు కలత చెందకుండా వెంటనే రాజ్యానికి తిరిగి వెళ్ళు. అదే మా మనస్సులకు ఇష్టమైనది'.

వ. అని పలికిన, నప్పాండవాగ్రజుండు పాండురాజాగ్రమహిషితో నిట్లనియె. 136

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పలికినన్= (గాంధారి) అనగా; ఆ+పాండవ+అగ్రజుండు= పాండురాజు కొడుకులలో పెద్దవాడైన ఆ ధర్మరాజు; పాండురాజ-అగ్ర-మహిషితోన్= పాండురాజు యొక్క పెద్ద భార్యతో; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: గాంధారి ఆ విధంగా అనటంతో ధర్మరాజు కుంతితో ఈ ప్రకారంగా అన్నాడు.

ఆ. 'ఇట్లు మీరు నన్ను నెంతయుఁ దఱిమిన । విపినభూమి మిమ్ము విడిచి పోవ
నియ్యకొనదు నాదుహృదయంబు; మునువోలెఁ । గలుగ దిపుడు రాజ్యకాంక్ష నాకు. 137

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మీరు= మీరందరూ (గాంధారీ ధృతరాష్ట్రులూ, కుంతీ); తఱిమినన్= ఇక్కడినుంచి వెంటబడి వెళ్ళగొట్టినప్పటికీ; మిమ్మున్= మీ అందరినీ; విపినభూమిన్= అరణ్యదేశంలో; విడిచి= వదలిపెట్టి; పోవన్= రాజ్యానికి తిరిగి వెళ్లటానికి; నాదుహృదయంబు= నా మనస్సు; మును+పోలెన్= ఇదివరకటివలె; ఇయ్యకొనదు= అంగీకరించటం లేదు; నాకున్= నాకు; ఇపుడు= ఇప్పుడు; రాజ్యకాంక్ష= రాజ్యంమీద కోరిక; కలుగదు= లేదు.

తాత్పర్యం: ఈ విధంగా మీరందరూ నన్ను ఎంతగా వెంటబడి తరిమినెట్టినా మిమ్మల్ని ఈ అడవిలో విడిచి వెళ్ళటానికి ఇదివరకటివలె నా మనసు అంగీకరించటంలేదు. మునుపు ఉన్నట్లు ఇపుడు నాకు రాజ్యంమీద కోరిక లేదు.

క. విను పాంచాలురు మాత్స్యులు । వనితా జనశేషులైరి; వారలు లేమిన్
జననీ! శూన్యంబై తోఁ । చినయది రాజ్యంబు నాదు చిత్తంబునకున్. 138

ప్రతిపదార్థం: జననీ!= అమ్మా!; విను= వినుము; పాంచాలురు(న్)= పాంచాల (ద్రుపద) వంశపు వారూ; మాత్స్యులు= విరాటనగరస్థులూ; వనితా-జన-శేషులు= ఆడవాళ్ళు మాత్రమే మిగిలిన వాళ్ళు; ఐరి= అయ్యారు; వారలు= ఆ పాంచాల, మాత్స్యులు; లేమిన్= లేనందువలన; రాజ్యంబు= ఆ రాజ్యం; నాదు చిత్తంబునకున్= నా మనసుకు; శూన్యంబు+ఐ= నిర్జనం (సారం లేనిది)గా; తోఁచినయది= కనిపించింది.

తాత్పర్యం: అమ్మా! వినుము, పాంచాల వంశంలోనూ, మాత్స్యవంశంలోనూ (పురుషులంతా యుద్ధంలో మరణించటంతో) ఆడవాళ్లు మాత్రమే మిగిలారు. వాళ్ళు ఎవరూ లేకపోవటం చేత ఆ రాజ్యం నా బుద్ధికి శూన్యంగా కనబడుతున్నది.

వ. అట్లుంగాక. 139

తాత్పర్యం: అంతే కాకుండా (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సమరము దీఱినకోలెను । శమనిరతా! నా మనంబు సారతపమునన్
రమియింపఁ గోరు యుష్మ । త్సమధిక తపమునకు నేను సందడి సేయన్.' 140

ప్రతిపదార్థం: శమనిరతా!= స్థిరమైన అంతరింద్రియ నిగ్రహంకలదానా!. తల్లీ!; సమరము= కురుక్షేత్ర యుద్ధం; తీఱినకోలెను= పూర్తి అయినప్పటినుండి కూడా; నామనంబు= నా మనసు; సార-తపమునన్= పరమార్థమైన తపస్సులో; రమియింపన్= ఆసక్తం కావటాన్ని; కోరున్= వాంఛిస్తున్నది; నేను= (అటువంటి) నేను; యుష్మద్-సమధిక-తపమునకున్= తీవ్రమయిన మీ అందరి తపస్సుకు; సందడి= విఘ్నం; చేయన్= (నేను) కలిగించను.

తాత్పర్యం: అంతరింద్రియ నిగ్రహగుణంలో స్థిరమయిన తల్లీ! భారతయుద్ధం ముగిసినప్పటి నుండి నా మనస్సు తపస్సునందే ఆసక్తమై ఉన్నది. నేను మీ తీవ్రమైన తపస్సుకు ఏ విధంగానూ ఆటంకం కలిగించను.

సీ. **అన విని సహదేవుఁ డతనితో 'నేఁ దప । మాచరించెద; వీర లందఱకును**
శుశ్రూష సేయు చియ్యాశ్రమంబున' నన్న । నక్కుమారునిఁ గుంతి యక్కుఁ జేర్చి
'వలవదు మీరు రా వలఁతులై మామీఁది । భక్తి నింపెసఁగ నీ పలుకు నెట్లు
పలుక మీ యునికి తపమునకు విఘ్నంబ । కాక యెఱిఁగి మీర లెల్లభంగి

ఆ. **మాకు నియమవిధి సమాచరణములపై?। నింత యెఱిఁగి మీర లెల్లభంగి**
నరుగు టొప్పుఁ గాని కురుకులోద్వహు మాట । గొనక యునికి చనదు తనయులార! **141**

ప్రతిపదార్థం: అనన్= అని ధర్మరాజు పలుకగా; విని= ఆలకించి; సహదేవుఁడు= సహదేవుడు; అతనితోన్= ధర్మరాజుతో (ఇట్లా అన్నాడు); ఈ+ఆశ్రమంబునన్= ఈ (ధృతరాష్ట్రుడి) ఆశ్రమంలోనే ఉండి; వీరలు-అందఱకున్= కుంతి మొదలైన వీరికందరికి; శుశ్రూష= సేవ; చేయుచున్= చేస్తూ; తపము= తపస్సు; నే(ను)= నేను; ఆచరించెదన్= చేస్తాను; అన్నన్= అనగా; కుంతి= కుంతీదేవి; ఆ+కుమారునిన్= చిన్నకొడుకైన ఆ సహదేవుడిని; అక్కున్+చేర్చి= తన గుండెలకు హత్తుకొని. (ఇట్లా అన్నది); తనయులార!= కొడుకులారా!; మీరు= మీరు (ధర్మరాజాదులు); రా-వలఁతులు= రాజధర్మంలో సమర్థులు; ఐ= అయిఉండి; మామీఁది భక్తిన్= తల్లిదండ్రులపైన పూజ్య (సేవా) భావంతో; ఇంపు= ఇష్టం; ఎసఁగన్= అతిశయించే విధంగా; ఈ పలుకులు= ఈ రాజ్యం వద్దు. తపస్సు చేస్తాం అనే మాటలు; ఇట్లు= ఈ విధంగా (నేనంటే నేనని పోటీపడి); పలుకన్= అనటం; వలవదు= తగదు; మీ+ఉనికి= ఇక్కడ మీ స్థితి (మీరు ఇక్కడ ఉండటం); తపమునకున్= (మా) తపస్సుకు; విఘ్నంబు+అ= అవరోధమే; కాక= అట్లా కాక; మాకున్= మాకు; నియమ-విధి-సమాచరణములపైన్= తాపసుల నియమాలూ, విధులూ ఆచరించటం విషయంలో; ఏక+అగ్రత= నిశ్చలబుద్ధి; ఎట్లు= ఏ విధంగా; కలుగున్?= సంభవిస్తుంది?; మీరు= మీరు; ఇంత= ఇది అంతా; ఎఱిఁగి= గ్రహించి; ఎల్లభంగిన్= అన్ని విధాలుగానూ; అరుగుట= (రాజ్యానికి తిరిగి) వెళ్ళటం; ఒప్పున్= మంచిది (కర్తవ్యం); కాని= అంతే తప్ప; కురుకుల-ఉద్వహు-మాట= కురువంశాన్ని ఉద్ధరించేవాడయిన ఈ ధృతరాష్ట్రుడి మాటను; కొనక= అనుసరించక; ఉనికి= ఇక్కడే ఉండటం; చనదు= తగినది కాదు.

తాత్పర్యం: ధర్మరాజు ఆ విధంగా పల్కటం విని సహదేవుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు. (కుంతీ ప్రభృతులైన) వాళ్ళందరికీ సేవలు చేస్తూ ఈ ఆశ్రమంలో ఉండి తపస్సు నేను చేస్తాను. ఆ చిన్నవాడి (కొడుకు) మాటలకు కుంతి సహదేవుడిని, గుండెలకు హత్తుకొని ఇట్లా అన్నది. 'కొడుకులారా! మీరు రాజధర్మంలో సమర్థులయిఉండీ మా (తల్లిదండ్రుల) మీద సేవాదృష్టితో, ఈ మాటలు ఇట్లా అనటం తగదు. మీరు ఇక్కడ ఉండటం మా తపస్సుకు ఆటంకమే అవుతుంది తప్ప తాపసధర్మ ఆచరణంలో మాకు నిబ్బరమైన బుద్ధి ఎట్లా కలుగుతుంది? మీరు ఇది

మొత్తం గ్రహించి రాజ్యానికి తిరిగి వెళ్ళటమే అన్ని విధాలుగానూ ఉచితం. కురువంశ-ఉద్ధారకుడైన ఈ ధృతరాష్ట్రుడి మాట వినకుండా మీరు ఈ ఆశ్రమంలో ఉండిపోవటం ఉచితం కాదు'.

వ. 'మీకు సర్వకార్యంబుల యెడను శుభంబులయ్యెడును; బోయి రం' డనిన నజాతశత్రుండు మఱియొండు వలుకం బుయిలోడి ధృతరాష్ట్రునితోడం' దపోమహనీయులైన మిమ్ముం గొలిచి గత కల్మషుండ నైతి మీ యాజ్ఞాపనంబు దలనిడికొని పురంబునకుం బోయి వచ్చెద' ననుటయు నక్కురువృద్ధుం డతని దీవించుచు నాలింగనంబు చేసి, భీమసేను సాంత్వన వచనంబులం బ్రీతుం గావించి కౌఁగిలించుకొని, గాండీవిం గొనియాడి సంశ్లేషం బాచరించి, కవల సంభావించి పరిరంభణంబు నిర్వర్తించిన, నయ్యేవురు నతని పాదంబులకుఁ బ్రణమిల్లి యాశీర్వాదంబులు వడసి. 142

ప్రతిపదార్థం: మీకున్= మీకు (పాండవులకు); సర్వకార్యంబుల-ఎడమ= అన్ని పనులలోనూ; శుభంబులు= మేళ్ళు; అయ్యెడును= అగుగాక; పోయిరండు= వెళ్ళిరండి; అనినన్= అని కుంతి పలుకగా; అజాతశత్రుండు= ధర్మరాజు; మఱి-ఒండు= మరొక మాట; పలుకన్= చెప్పటానికి; పుయిలోడి= జంకి; ధృతరాష్ట్రునితోడన్= ధృతరాష్ట్రుడితో; తపోమహనీయులు= తపశ్శక్తిచేత గొప్పవారయిన; మిమ్మున్= మిమ్మల్ని; కొలిచి= సేవించి; గతకల్మషుండన్= పాపాలు తొలగిపోయిన వాడిని; ఐతిన్= అయినాను; మీ-ఆజ్ఞాపనంబు= (రాజధానికి తిరిగివెళ్ళుచున్న) మీయొక్క ఆనతిని; తలన్-ఇడికొని= శిరసా వహించి (తలదాల్చి); పురంబునకున్= హస్తినగరానికి; పోయి వచ్చెదన్= వెళ్ళివస్తాను; అనుటయున్= అని ధర్మరాజు పలుకగా; ఆ+కురువృద్ధుండు= ఆ ధృతరాష్ట్రుడు; అతనిన్= ధర్మరాజును; దీవించుచున్= ఆశీర్వదిస్తూ; ఆలింగనంబు-చేసి= కౌగిలించుకొని; భీమసేనున్= భీముడిని; సాంత్వన-వచనంబులన్= సముదాయింపు మాటలతో; ప్రీతున్= సంతోషించిన వాడిని; కావించి= చేసి; కౌఁగిలించుకొని= దగ్గరకు తీసికొని; గాండీవిన్= అర్జునుడిని; కొనియాడి= పొగడి; సంశ్లేషంబు= కౌగిలింతను; ఆచరించి= చేసి; కవలన్= నకులసహదేవులను; సంభావించి= మన్నింపు మాటలతో ఆదరించి; పరిరంభణము= కౌగిలి; నిర్వర్తించినన్= నడపగా; ఆ+ఏవురు= ఆ పాండవులైదుగురు; అతని పాదంబులకున్= ధృతరాష్ట్రుడి కాళ్ళకు; ప్రణమిల్లి= నమస్కారం చేసి; ఆశీర్వాదంబులు= ధృతరాష్ట్రుడి ఆశీస్సులు; పడసి= పొంది.

తాత్పర్యం: మీకు అన్ని పనుల్లోనూ మేలు కలుగుతుంది. ఇక వెళ్ళిరండి అన్నది కుంతి. ధర్మరాజు కుంతితో ఇంకొక మాట అనటానికి సంకోచించాడు. ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు. తపశ్శక్తిచేత మహిమగల మిమ్మల్ని సేవించి నేను నా పాపాలన్నీ పోగొట్టుకొన్నాను. మీ ఆజ్ఞ తలదాల్చి హస్తినగరానికి వెళ్లి వస్తాను' అన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును ఆశీర్వదిస్తూ, గుండెలకు హత్తుకొన్నాడు. భీముడిని సముదాయింపుమాటలతో సంతృప్తిపరిచి, కౌగిలించుకొన్నాడు. అర్జునుడిని పొగడి ఆలింగనం చేసికొన్నాడు. నకులసహదేవులను మన్నించి కౌగిలించుకొన్నాడు. అపు డా పాండవులు అయిదుగురూ ధృతరాష్ట్రుడి పాదాలకు ప్రణామం చేసి, ధృతరాష్ట్రుడి ఆశీస్సులు పొందారు.

సీ. అతిభక్తి గాంధారి యడుగుల కెఱఁగిన । నద్దేవి వారల నక్కుఁ జేర్చి
దీవించె; వారుఁ గుంతీ చరణంబులు । ఫాలముల్ వొందంగఁ బ్రణతు లైనఁ
దప్పక గ్రుచ్చి యందఱ నొక్క కౌఁగిటఁ । బొదివి యాశీర్వాదములు గ్రమమున
నర్మిలిపెంపున నలరుమనంబుతో । వేర్వేఱ యిచ్చె నా వీరజనని

తే. ద్రుపద పుత్త్రికా ప్రభృతి వధూజనములు। తగు తెఱంగుల మామ నత్తలను వీడు
కొనిరి వారును వారు నగ్గురు జనముల। నల్ల వలగొని చనిరి నృపాగ్రగణ్య! 143

ప్రతిపదార్థం: నృప+అగ్ర-గణ్య!= రాజులలో ప్రథముడా! జనమేజయ మహారాజా!; అతిభక్తిన్= మిక్కిలి పూజ్యభావంతో; గాంధారి+అడుగులకున్= గాంధారి పాదాలకు; ఎఱఁగినన్= (పాండవులు) వంగి నమస్కారం చేయగా; ఆ+దేవి= ఆ గాంధారి; వారలన్= ఆ పాండవులను; అక్కున్+చేర్చి= గుండెకు హత్తుకొని; దీవించెన్= ఆశీర్వదించింది; వారున్= ఆ పాండవులు కూడా; ఫాలముల్= తమ నుదుటి ప్రదేశాలు (శిరస్సులు); కుంతీచరణంబులు= కుంతీదేవి పాదాలను; పొందఁగన్= తాకగా; ప్రణతులు= ప్రణామంచేసినవారు; ఐనన్= కాగా; ఆ-వీర-జనని= పాండవ వీరులను కన్న ఆ కుంతి; తప్పక= గట్టిగా; గ్రుచ్చి= పట్టుకొని; అందఱన్= పాండవులు అయిదుగురినీ; ఒక్క కౌఁగిటన్= ఒకే (సారి) కౌగిలిలో; పొదివి= దగ్గరకు తీసికొని; అర్మిలి పెంపునన్= అధికమైన వాత్సల్యంతో; అలరు-మనంబుతోన్= సంతృప్తి నిండిన మనస్సుతో; వేర్వేఱ= ఎవరికి వారికిగా; క్రమమునన్= (ధర్మరాజాదులకు) వరుసగా; ఆశీర్వాదములు= దీవెనలు; ఇచ్చెన్= ఇచ్చింది; ద్రుపద పుత్త్రికా= ద్రౌపది; ప్రభృతి= మొదలైన; వధూ-జనములు= స్త్రీలు; మామన్= మామ అయిన ధృతరాష్ట్రుడినీ; అత్తలను= అత్తలయిన గాంధారినీ, కుంతినీ; తగుతెఱంగులన్= తగిన పద్ధతులలో; వీడుకొనిరి= వీడ్కోలు తీసికొన్నారు; వారును= పాండవులూ; వారు= ద్రౌపది మొదలయిన స్త్రీలు; ఆ+గురుజనములన్= ధృతరాష్ట్రాదులైన పెద్దలను; అల్ల(న్)= మెల్లగా; వలగొని-చనిరి= (చుట్టుగా తిరిగారు) ప్రదక్షిణం చేసి వెళ్లారు.

తాత్పర్యం: జనమేజయమహారాజా! తరువాత పాండవులు గాంధారి పాదాలకు నమస్కరించారు. ఆమె వాళ్ళను కౌగిలించుకొని దీవించింది. ఆ తర్వాత పాండవులు కుంతీదేవి పాదాలపై శిరసులుంచి నమస్కరించారు. వీరమాత అయిన కుంతి వారిని గట్టిగా పట్టుకొని అందరినీ ఒకేసారి కౌగిలిలోనికి తీసికొని వాత్సల్యం నిండిన మనసుతో, వరుసగా అందరికీ వేరు వేరుగా ఆశీస్సు లిచ్చింది. అటుపిమ్మట ద్రౌపది మొదలయిన స్త్రీ జనంగూడా తగు విధంగా ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీదేవులనుంచి వీడుకోలు తీసికొన్నారు. ఆ పాండవులు, ద్రౌపదీ ప్రభృతులైన స్త్రీలు అందరూ ధృతరాష్ట్రాదులకు మెల్లగా ప్రదక్షిణం చేశారు.

క. చని పరిజనములుఁబౌరులు। ననుమోదము తోడఁ గొలువ నరిగిరి నగరం
బునకున్ గన్నుల పండువు। జనపదముజనం బొనర్ప జనసంస్తుత్యా! 144

ప్రతిపదార్థం: జన సంస్తుత్యా!= ప్రజలచేత పొగడబడే వాడా! (జనమేజయా!); చని= ప్రదక్షిణం చేసి; (పాండవులు-ద్రౌపద్యాది స్త్రీలూ, ధృతరాష్ట్రాదులకు-వలగొని) అనుమోదముతోడన్= సంతోషంతో; పరిజనములున్= సేవకులూ; పౌరులున్= ప్రజలూ; కొలువన్= సేవిస్తుండగా; జనపదము-జనంబు= (దారిలో) పల్లె ప్రజలు; కన్నుల పండువు= (నేత్రపర్వం= కంటికి ఇంపు) సంతోషం; ఒనర్పన్= కల్గించగా; నగరంబునకున్= హస్తినగరానికి; అరిగిరి= వెళ్ళారు.)

తాత్పర్యం: ప్రజల ప్రశంసలు పొందిన వాడా! (జనమేజయ మహారాజా!) ఆ విధంగా పాండవులూ, ద్రౌపదీ ప్రభృతి స్త్రీలూ, ధృతరాష్ట్రాదులకు ప్రదక్షిణంచేసి-తమసేవకులూ, (తమతో వచ్చిన) ప్రజలూ సంతోషంగా తమను సేవిస్తుండగా, (ప్రయాణంలో దారిలో) పల్లె ప్రజలు కనువిందు చేయగా హస్తినగరానికి వెళ్ళారు.

వ. అరిగి సముచిత వర్తనంబుల నుండిరి; కొంతకాలంబు చనిన నొక్కనాఁడు నారదమునీంద్రుం డనుజనహితుం
డై యున్న ధర్మతనయుకడకుఁ జనుదెంచిన, నజ్జననాథుండు దమ్ములుం దానును నమ్మహాత్మునకు భక్తిం

బ్రణమిల్లి యాసనార్ఘ్య పాద్యాదిసత్కారంబు లొనర్చి తదీయ సమీపంబున నాసీనులై; రతని వదనంబు విలోకించి వినయం బెసంగ నమ్మహీపతి 'మహా భాగ! యెందుండి రాక! యేదేశంబులఁ జరించితిరి? నేను మీకు నేమిపని సేయుదుఁ జెప్పుం 'డనిన నప్పరమసంయమి యప్పుడమిఱేనితోడ. **145**

ప్రతిపదార్థం: అరిగి= (పాండవులు హస్తినగరానికి) వెళ్ళి; సముచితవర్తనంబులన్= అర్హమైన నడవడులతో; ఉండిరి= ఉన్నారు; కొంతకాలంబు= ఈ విధంగా కొంతకాలం; చనినన్= కడచిపోగా; అనుజ-సహితుండు= తమ్ములతో కూడినవాడు; ఐ= ఉన్న; ధర్మతనయుకడకున్= ధర్మరాజు వద్దకు; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; నారదమునీంద్రుండు= ముని శ్రేష్ఠుడైన నారదుడు; చనుదెంచినన్= రాగా; ఆ+మహాత్మునకున్= మహానుభావుడయిన ఆ నారదమునికి; ఆ+జననాథుండు= ఆ (ధర్మ) రాజు; తమ్ములున్= భీముడు మొదలైన తమ్ముళ్ళూ; తానును= తానూ; భక్తిన్= భక్తితో; ప్రణమిల్లి= పాదాభివందనం చేసి; ఆసన+అర్ఘ్య+పాద్య- ఆది-సత్కారంబులు= కూర్చుండటానికి ఆసనం చూపటం అర్చనకూ, పాదప్రక్షాళనకూ నీళ్ళు ఇవ్వటం, మొదలైన గౌరవాన్ని తెలిపే పనులు; ఒనర్చి= చేసి; తదీయ-సమీపంబునన్= ఆ నారదమునికి దగ్గరగా; ఆసీనులు+ఐరి= (పాండవులు) కూర్చున్నారు; ఆ+మహీపతి= ఆ (ధర్మ) రాజు; అతనివదనంబు= నారదుడి ముఖాన్ని; విలోకించి= చూచి; వినయంబు= నమ్రభావం; ఎసంగన్= అతిశయించగా; మహాభాగ!= మహాత్మా!; రాక= తమరు ఇక్కడికి రావటం; ఎందున్+ఉండి?= ఎక్కడినుంచి?; ఏదేశంబులన్= ఏయే చోట్ల; చరించితిరి?= తిరిగారు?; మీకున్= మీకొరకుగా; నేను= నేను (ధర్మరాజు); ఏమిపని= ఏపని; చేయుదున్= చేయఁగలను; చెప్పుండు= తెలియజేయండి; అనినన్= అని ధర్మరాజు పలుకగా; ఆ+పరమ-సంయమి= ఆ మునిశ్రేష్ఠుడయిన ఆ నారదుడు; ఆ+పుడమిఱేనితోడన్= ఆ(ధర్మ)రాజుతో, (తరువాతి పద్యంతో అన్వయం.)

తాత్పర్యం: ఆ విధంగా హస్తినగరానికి వెళ్ళిన పాండవులు అర్హమైన ప్రవర్తనతో ఉంటున్నారు. ఇట్లా కొన్నాళ్ళు గడచిన తరువాత ఒకరోజు ధర్మరాజు తమ్ముళ్ళతో కలిసి కూర్చుని ఉన్నసమయంలో నారదుడు వచ్చాడు. అపుడు తమ్ముళ్ళూ, తానూ నారదుడికి ప్రణామం చేసి, ఆసనం చూపి, అర్ఘ్యం, పాద్యం మొదలైన మర్యాదలు చేసి ఆ నారదుడి వద్దనే కూర్చున్నాడు. అపుడా ధర్మరాజు నారదుడి ముఖం చూస్తూ-వినయం అధికం కాగా (ఇట్లా అన్నాడు) 'మహాత్మా! తమరు ఎక్కడినుండి వస్తున్నారు? ఎక్కడెక్కడ సంచరించారు? మీ కొరకు నేను చేయగలిగిన పని ఏమిటి? తెలియజేయండి' అన్నాడు. అప్పుడు నారదమహర్షి ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

నారదుఁడు పాండవులకు ధృతరాష్ట్రాదుల నిర్యాణంబు చెప్పుట. (సం.15-45-1)

సీ. **'భూపవరేణ్య! తపోవనంబుననుండి। వచ్చితిఁ దీర్థసేవా పరత్వ**
మున నేను బహుదేశములఁ జరించితి; నినుఁ। గని పెద్దకాలంబు గానఁ జూడఁ
దివిరి యిందులకు నేతెంచితి; ధృతరాష్ట్రు। చరితంబు జాహ్నవీపరిసరంబు
జనములచే వింటి' ననిన నజ్జనపతి। 'యా రాజవరుఁడు గాంధారి గొంతి

తే. **సంజయుండు సమాధాన సహితులై శ। రీరముల వింత పుట్టకున్నారె?' యనియె;**
ననుడు నద్దేవముని 'వారి యఖిల వర్త। నంబు వినుము సుస్థిర హృదయంబుతోడ.' **146**

ప్రతిపదార్థం: భూపవరేణ్యా!= (భూమిని పాలించే వారిలో) శ్రేష్ఠుడా! ధర్మరాజా!; నేను= నేను (నారదుడు); తపోవనంబున-నుండి= ముని ఆశ్రమమునుండి; వచ్చితిన్= వచ్చాను; తీర్థసేవా-పరత్వమునన్= పుణ్య తీర్థాలను సేవించటంలో లగ్నమయిన బుద్ధితో; బహు దేశములన్= అనేకములైన దేశాలలో; చరించితిన్= తిరిగాను; నినున్= నిన్ను (ధర్మరాజును); కని= చూచి; పెద్ద-కాలంబు=చాలా కాలమైనది; కానన్= కాబట్టి; చూడన్= నిన్ను చూడాలని; తివిరి= (కుతూహలంగలిగి సప్రయత్నంగా) ఇందులకున్= హస్తినగరానికి; ఏతెంచితిన్= వచ్చాను; ధృతరాష్ట్ర చరితంబు= ధృతరాష్ట్రుడియొక్క వృత్తాంతాన్ని; జాహ్నవీ-పరిసరంబు-జనములచేన్= గంగానదికి చుట్టుప్రక్కల ఉన్న జనాలవలన; వింటిన్= విన్నాను; అనినన్= అని నారదుడు పల్కగా; ఆ+జనపతి= ఆ (ధర్మ) రాజు; ఆ రాజవరుఁడు= రాజులలో శ్రేష్ఠుడైన ఆ ధృతరాష్ట్రుడూ; గాంధారి= గాంధారీ; గొంతి= కుంతీదేవీ; సంజయుండున్= సంజయుడూ; సమాధాన- సహితులు-ఐ= స్థిరమైన తపస్సమాధితో కూడిన వారు అయి; శరీరములన్= తమ దేహాలలో; వింత= వైపరీత్యం; పుట్టక= ఏర్పడకుండా; ఉన్నారె?= సుఖంగా ఉన్నారా?; అనియెన్= అన్నాడు; అనుడున్= ధర్మరాజు ఆ విధంగా ప్రశ్నింపగా; ఆ+దేవముని= ఆ నారదమహర్షి (ఇట్లా అన్నాడు); వారి-అఖిల-వర్తనంబు= ధృతరాష్ట్రాదుల వృత్తాంతం మొత్తమూ; సుస్థిర-హృదయంబుతోడన్= సావధానమతితో; వినుము= వినుము.

తాత్పర్యం: 'రాజులలో శ్రేష్ఠుడా! ధర్మరాజా! ఆశ్రమం నుండి వస్తున్నాను. పుణ్య తీర్థాలను సేవించాలనే కోరికతో చాలా దేశాలు తిరిగాను. నిన్ను చూచి చాల కాలమైనది కాబట్టి ఒకసారి చూచిపోదామని ఇక్కడికి వచ్చాను. గంగానది చుట్టుపక్కల జనంవలన ధృతరాష్ట్రాదుల వృత్తాంతం విన్నాను.' అనిన నారదుడి మాటలు విని ఆ ధర్మరాజు' ఆ ధృతరాష్ట్ర మహారాజు, గాంధారీ, కుంతీ, సంజయుడూ, నిశ్చలతపోదీక్షతో, శరీరాలకు ఏ విధమైన వైపరీత్యమూ కలగకుండా సుఖంగా ఉన్నారా?' అని అడిగాడు. అందుకు నారదుడు వారి సంగతులన్నీ (చెప్పుతాను) సావధానబుద్ధితో వినుము'. (అన్నాడు).

వ. అని పలికి యిట్లను 'మీరు పోయి కాంతారంబున నక్కురువృద్ధుం గొలిచియుండి, యతం డనుమతి సేయ నిట
వచ్చితిరి; మఱి కొన్ని దినంబులకు. 147

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; ఇట్లు= (నారదుడు) ఈ విధంగా; అనున్= అన్నాడు; మీరు= పాండవులు; పోయి= (ధృతరాష్ట్రాదులను చూడటానికి) వెళ్ళి; కాంతారంబునన్= అడవిలో; ఆ+కురువృద్ధున్: ఆ ధృతరాష్ట్రుడిని; కొలిచి+ఉండి= సేవిస్తూ ఉండి; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; అనుమతి చేయన్= పంపగా; ఇటన్= రాజ్యానికి; వచ్చితిరి= వచ్చారు; మఱి= తరువాత; కొన్నిదినంబులకున్= కొన్ని రోజులకు.

తాత్పర్యం: నారదుడు ఆ విధంగా పలికి మళ్ళీ ఇట్లా అన్నాడు. 'మీరు (పాండవులు) ధృతరాష్ట్రాదులను చూడడానికి వెళ్ళి అరణ్యంలో ఆ ధృతరాష్ట్రుడిని సేవించి-అతడు పంపించగా రాజ్యానికి తిరిగి వచ్చారు. ఆ తరువాత కొన్నినాళ్ళకు (తరువాతి పద్యంతో అన్వయం)

సీ. ఆ రాజు నియతి గాంధారియు గొంతియు । సంజయుండును దోన చనఁగ నగ్ని
హోత్రంబు గొని యాజకోత్కరం బగ్రేస । రంబయి పో నిజాశ్రమము విడిచి
యరిగె గంగాద్వార పరిసరారణ్య భా । గమునకు; నందు దుష్కరతపంబు
వాయుభక్షతఁ బూని చేయఁ దొడంగె; గాం । ధారియు నీళ్ళ నాహారకలన

తే. **మోపి యొనరించె; గొంతి మాసోపవాస । నియమ మూఁది వర్తించె; సంజయుఁడు సప్త**
భోజనాంతరితం బగు భోజనంబు । వ్రతము గాఁగఁ జరించెఁ గౌరవ్యముఖ్య! 148

ప్రతిపదార్థం: కౌరవ్య-ముఖ్య!= కురువంశ్యులలో ఎన్నదగిన ధర్మరాజా!; నియతిన్= నియమంతో; గాంధారియున్= గాంధారీ; గొంతియున్= కుంతీ; సంజయుండును= సంజయుడూ; తోన్+అ= వెంటనే; చనఁగన్= రాగా; యాజక+ఉత్కరంబు= ఋత్విక్కుల సమూహం; అగ్నిహోత్రంబు= అగ్నిని; కొని= తీసికొని; అగ్రేసరంబు= (ధృతరాష్ట్రుడికి) ముందుగా; పోన్= పోతూఉండగా; ఆ రాజు= ఆ ధృతరాష్ట్రుడు; నిజ+ఆశ్రమము= (శతయూపాశ్రమ సమీపంలో ఏర్పరచుకొన్న) తన తపోవనాన్ని; విడిచి= వదలిపెట్టి; గంగా-ద్వార-పరిసర-అరణ్య-భాగమునకున్= గంగ పుట్టిన చోటికి (గురుద్వారం) సమీపంలో ఉన్న అడవి ప్రదేశానికి; అరిగెన్= వెళ్ళాడు; అందున్= ఆ అరణ్యంలో; వాయుభక్షతన్= కేవలం గాలి మాత్రమే ఆహారంగా తీసికొనటం అనే నియమం; పూని= అనుసరించి; దుస్-కర తపంబు= అసాధ్యమైన తపస్సు; చేయన్-తొడంగెన్= చేయటం ప్రారంభించాడు; గాంధారియున్= గాంధారి కూడా; నీళ్ళన్= నీటిని; ఆహార-కలనము= ఆహారంగా స్వీకరించే నియమాన్ని; ఓపి= అనుసరించి; ఒనరించెన్= తపస్సు చేసింది; గొంతి= కుంతి; మాస-ఉపవాస-నియమము= నెలరోజులు ఉపవాసం చేసేటటువంటి (నెలకొక్కసారి ఆహారం తీసికొనే) కట్టుబాటును; ఊఁది= ఆశ్రయించి; వర్తించెన్= తపస్సు చేస్తూ ఉన్నది; సంజయుఁడు(న్)= సంజయుడు కూడా; సప్తభోజన+అంతరితంబు= ఏడు భోజనాల వ్యవధానంతో (ఏడుపూటల కొకసారి); భోజనంబు= భోజనం తీసికొనటం; వ్రతము+కాఁగన్= నియమంగా; చరించెన్= ఆ అరణ్యంలో తపస్సు ఆచరించాడు.

తాత్పర్యం: కురుశ్రేష్ఠుడా! ధర్మరాజా! నియమవంతంగా, గాంధారీ, కుంతీ, సంజయుడూ తనను వెన్నంటి వస్తుండగా, ఋత్విక్కులు అగ్నులు తీసికొని తనకు ముందుగా నడుస్తుండగా, ఆ ధృతరాష్ట్రుడు తన ఆశ్రమాన్ని విడిచిపెట్టి గంగా ముఖం పరిసరాలలో ఉన్న అరణ్యాలకు వెళ్ళాడు. అక్కడ కేవలం గాలి ఆహారంగా ఇతరులకు అసాధ్యతపస్సు ప్రారంభించాడు. గాంధారి నీళ్ళు మాత్రం ఆహారంగా తీసికొంటూ తపస్సు ఆచరించింది. మాసోపవాసంతో నెలకొక సారి భోజనం తీసికొంటూ కుంతీ, ఏడుపూటల కొక పర్యాయం భోజనం తీసికొంటూ సంజయుడూ అక్కడ తపస్సు చేశారు.

తే. **యాజకులు దార యక్కురురాజు భక్తి । యుక్తి నొద్దనుండఁగ నగ్నిహోత్ర హోమ**
మాచరింతు రొక్కొకమరి యతఁడు పర్ణ । శాల వెడలి శూన్యాటవి సంచరించు. 149

ప్రతిపదార్థం: ఆ+కురురాజు= ఆ ధృతరాష్ట్రుడు; భక్తియుక్తిన్= పూజ్యభావంతో కూడి; ఒద్దన్= సమీపంలో; ఉండఁగన్= ఉండగా; యాజకులు= ఋత్విక్కులు; అగ్నిహోత్ర-హోమము= అగ్నులలో విధ్యుక్తంగా, హోమాన్ని; ఆచరింతురు= చేస్తుంటారు; ఒక్క+ఒక్క మరి= ఒక్కొక్కసారి; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; పర్ణశాల(న్)= ఆశ్రమాన్ని; వెడలి= విడిచిపెట్టి; శూన్య-అటవిన్= నిర్జనమైన అరణ్యాలలో; సంచరించున్= తిరుగుతుంటాడు.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్రుడు భక్తి భావంతో, సమీపంలో ఉండగా ఋత్విక్కులు హోమంచేసేవారు. ఒక్కొక్కసారి ఆశ్రమం విడిచి నిర్జనమైన అరణ్యాలలో తిరుగుతుంటాడు ఆ ధృతరాష్ట్రుడు.

వ. **విషమ ప్రదేశంబుల నవ్విభునకు సంజయుండును । గాంధారికిఁ గుంతియుఁ గన్నై మెలంగుదు; రొక్కనాఁడు**
వారలందఱు గంగాద్వారంబునం గృతస్నానులై యాశ్రమంబునకు వచ్చుచుండ మహావాతోద్ధూతంబై.150

ప్రతిపదార్థం: విషమ-ప్రదేశంబులన్= సమంగాలేని చోట్ల; ఆ+విభునకున్= ఆ ధృతరాష్ట్రుడికి; సంజయుండును= సంజయుడూ; గాంధారికిన్= గాంధారికి; కుంతియున్= కుంతీ; కన్ను+అయి= నేత్రంగా; మెలంగుదురు= మసలుకొంటారు; ఒక్కనాఁడు= ఒకానొకరోజు; వారలు+అందఱున్= ధృతరాష్ట్రుడు మొదలైన వారంతా; గంగాద్వారంబునన్= గంగాముఖంలో; కృతస్నానులు-ఐ= స్నానం చేసిన వారయి; ఆశ్రమంబునకున్= తమ తపోవనానికి; వచ్చుచున్+ఉండన్= వస్తూండగా; మహా-వాత-ఉద్ధూతంబు+ఐ= పెద్ద సుడిగాలిచేత-ఎగసిపడుతూ.

తాత్పర్యం: సమంగాని కష్టమైన స్థలాలలో ధృతరాష్ట్రుడికి సంజయుడూ, గాంధారి, కుంతీ కన్నులవలె మసలుకొనేవారు. ఒకరోజు వాళ్ళందరూ గంగాద్వారంలో స్నానం చేసి తిరిగి ఆశ్రమానికి వస్తూ ఉండగా పెద్ద సుడిగాలిలో ఎగసి పడుతూ-(దావానలం వ్యాపించిందని తరువాతి పద్యంతో అన్వయం).

సీ. **పటుతరం బగు ఛటచ్ఛటరవ మెసఁగంగ । మ్రాఁకులుఁ బొదలును గాఁచికొనుచుఁ**
గమరును నార్తనాదంబును బెల్లుగ । నఖిలమృగంబుల నాఁచికొనుచు
లాఁగలఁ బుట్టల లోఁగిన శిఖల భు । జంగమ కులముల మ్రింగికొనుచు
వెగడొంది యఱచుచు నెగయు బల్పులుఁ గులఁ । బొగ నూర్ధ్వకీలలఁ బొదివి కొనుచు

తే. **దెసల నన్నిటఁ దన సముదీర్ణగతులు । దారుణ స్ఫురణమున విస్తార మొంద**
ఖేచరులకును భయముగ నేచి పరఁగె । నద్భుతోద్భవం బైన మహానలంబు. 151

ప్రతిపదార్థం: పటుతరంబు= మిక్కిలి దృఢం; అగు= అయినటువంటి; ఛట చ్ఛటరవము= ఛట, ఛట, అనే విధమైన మోత; ఎసఁగన్= అతిశయిస్తుండగా, మ్రాఁకులున్= పెద్ద పెద్ద చెట్లనూ; పొదలున్= పొదరులనూ; కాఁచికొనుచున్= కాల్చుకొంటూ; కమరును= కాల్పులూ (చర్మం కాలిన వాసనా); ఆర్తనాదములును= బాధతో చేసిన అరుపులూ; పెల్లుగన్= అధికం కాగా; అఖిల మృగంబులన్= సమస్తమైన జంతువులనూ; ఆఁగి కొనుచున్= ఆక్రమించుకొంటూ; లాఁగలన్= బొరియలలోనూ; పుట్టలన్= (పాము) పుట్టలలోనూ; లోఁగినన్= (లోపలకు) చొచ్చుకుపోయినా; శిఖలన్= మంటలతో; భుజంగమ-కులములన్= పాముల సముదాయాలను; మ్రింగికొనుచున్= మింగివేస్తూ (దగ్ధం చేస్తూ); వెగడు= భయం; ఒంది= పొంది; అఱచుచున్= అరుస్తూ; ఎగయు= ఆకాశంలోకి ఎగిరిపోతున్న; బల్-పులుఁగులన్= అధికమైన పక్షులనూ; పొగన్= పొగతోను; ఊర్ధ్వ కీలలన్= ఎత్తైన జ్వాలలతోనూ; పొదివికొనుచున్= తనలోపలికి లాక్కుంటూ; దెసలన్-అన్నిటన్= దిక్కులన్నింటినిండా; తన-సముదీర్ణ-గతులు= తన (దావాగ్ని) యొక్క-హెచ్చిన-పోకడలు; దారుణ-స్ఫురణమునన్= భయం కలిగిస్తూ; విస్తారము+ఒందన్= విరివికాగా; అద్భుత+ఉద్భవంబు= ఆశ్చర్యంగా పుట్టినది; ఐన= అయినటువంటి; మహా+అనలంబు= గొప్ప అగ్ని; ఖేచరులకును= ఆకాశంలో సంచరించే దేవాదులకు సైతం; భయముగన్= భయం పుట్టిస్తూ; ఏచి= పెరిగి; పరఁగెన్= వ్యాపించింది.

తాత్పర్యం: ధృడమైన-ఛట,ఛటా అనే ధ్వనులు హెచ్చుతుండగా పెద్ద పెద్ద మాకులనూ, పొదలనూ కాలుస్తూ, కాలుస్తూ బాధతోడి అరుపులూ అధికం అవుతుండగా, సమస్తమైన జంతువులను ఆక్రమించుకొంటూ కన్నాలలోనూ, పుట్టలలోనూ ప్రవేశించినా (తన) మంటలతో పాములను మింగుతూ, భయంతో అరుస్తూ ఆకాశంలోకి ఎగిరిపోతున్న పక్షులను పొగతోనూ, జ్వాలలతోనూ, తనలోపలికి లాక్కుంటూ, అన్ని దిక్కులలోనూ అడ్డు లేకుండా ఉన్న తన పోకడలు భయం కలిగిస్తుండగా ఆశ్చర్యంగా ఏర్పడిన మహాగ్ని దేవగంధర్వాది ఆకాశ గాములకు సైతం భయం పుట్టిస్తూ పెరిగి వ్యాపించింది.

వ. ఇట్లెరగలి చిచ్చు గవిసి చుట్టు ముట్టిన నమ్మనుజనాథుండును నన్నాతులు నిరాహారులై యునికిం జేసి యొక్క చోటఁ దటియ నుఱికి తొలంగిపోవ లావులేరై; రట్టియెడ నా రాజర్షిసత్తముండు సంజయుతోడ. 152

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఎరగలి-చిచ్చు= దావాగ్ని; కవిసి= వ్యాపించి; చుట్టు-ముట్టినన్= చుట్టూనిండగా; ఆ+మనుజ నాథుండును= ఆ ధృతరాష్ట్ర మహారాజు; ఆ+నాతులు(న్)= ఆ స్త్రీలు గాంధారీ, కుంతీ; నిరాహారులు= ఆహారం తీసికొనని వారు; ఐ= అయి; ఉనికిన్-చేసి= ఉండటం వలన; ఒక్కచోటన్= వేరొక చోటికి; తటియన్= చేరుకొనటానికి; ఉఱికి= పరుగెత్తి; తొలఁగిపోవన్= ఆ ప్రదేశంనుంచి వదలి వెళ్ళిపోవటానికి; లావు= శక్తి; లేరు+ఐరి= లేనివారు అయినారు; అట్టిఎడన్= ఆ పరిస్థితిలో; ఆ రాజర్షి సత్తముండు= రాజ ఋషులలో ఉత్తముడైన ఆ ధృతరాష్ట్రుడు; సంజయుతోడన్= సంజయుడితో (తరువాతి పద్యంతో అన్వయం).

తాత్పర్యం: ఆవిధంగా అడవినిప్పు విస్తరించి తమను ముట్టడించగా ఆ ధృతరాష్ట్రుడూ, గాంధారీ, కుంతీ నిరాహారంగా ఉండటం వలన ఆచోటు వదలి వేరొకచోటికి వెళ్ళటానికి శక్తిలేని వారయినారు. అటువంటి స్థితిలో ధృతరాష్ట్రుడు సంజయుడితో ఇట్లా అన్నాడు.

సీ. 'ఒక్కింత దెఱపి నీ వెక్కడ నైనను। గనుఁగొని పొ మ్మగ్ని దనుకకుండ'
నని చెప్పి తలఁగిపోఁ దనకు గాంధారికిఁ। గుంతిభోజాత్మజకును నశక్య
మగుటయుఁ జెప్పిన నడలొంది యా సూత। సుతుఁడు 'మీరును నొకచోట వెడలి
పోవుట గలిగినఁ బోదు గా కే దవా। గ్నికి మిమ్ము నెర చేసి యకట పోదు

ఆ. నే మహాత్మయనుడు 'నిలువాసి యిట్లున్న। జనుల కివ్విధమున సమయు టెగ్గు
గాదు; నీకుఁ బోవఁగా వచ్చి యుండంగఁ। బోవ కునికి పాపమునకుఁ బట్టు.' 153

ప్రతిపదార్థం: నీవు= నీవు; ఎక్కడన్+ఐనను= ఏ చోట అయినా; ఒక్క+ఇంత= కొంచెం; తెఱపి= దావాగ్ని లేనిది; కనుఁగొని= చూచికొని; అగ్ని= దావాగ్ని; తనుకక-ఉండన్= సోకకుండా; పొమ్ము= వెళ్ళిపొమ్ము; అని చెప్పి= సంజయుడికి చెప్పి, తనకున్= తనకూ (ధృతరాష్ట్రుడికీ); గాంధారికిన్= గాంధారికీ; కుంతిభోజ-ఆత్మజకున్= (కుంతిభోజుడి కూతురు) కుంతికీ; తలఁగి= అగ్నిని తప్పుకొని; పోన్= వెళ్ళిపోవటానికి; అశక్యము= సాధ్యంకానిది; అగుటయున్= కావటమూ; చెప్పినన్= చెప్పగా; ఆ సూతసుతుఁడు= (సూతుడి కొడుకు) సంజయుడు; అడలు+ఒంది= భయపడి; మీరును= మీరందరూ; ఒకచోటన్= వేరొక (నిప్పులేని) చోటికి; వెడలి-పోవుట= ఈ (అగ్నినిండిన) చోటు విడిచి వెళ్ళటం; కలిగినన్= జరిగితే; ఏన్+పోదున్= నేనూ వెళ్లుతాను; కాక= అలా కాకుండా; అకట!= అయ్యో!; మహాత్మ!= దేవా!; మిమ్మున్= మిమ్మల్ని; దవ+అగ్నికిన్= అడవి అగ్గికి; ఎర-చేసి= ఆహుతిగా చేసి; పోదునే?= (నేను) పోగలనా?; అనుడున్= అని సంజయుడు చెప్పగా; ఇలు-పాసి= ఇల్లు విడిచిపెట్టి; ఇట్లు= ఈప్రకారంగా రక్షించుకోవడం అసాధ్యమై; (తాపసులై); ఉన్న జనులకున్= ఉన్నటువంటివారికి; ఈ-విధమునన్= ఈప్రకారంగా (అగ్నిపాలయి); సమయుట= మరణించటం; ఎగ్గు= కీడు (తప్పు); కాదు= కానేరదు; నీకున్= నీకు (సంజయుడికి); పోవఁగాన్= తప్పించుకొని పోవటానికి; వచ్చి-ఉండంగన్= సాధ్యమై ఉండగా; పోవక= (తప్పించుకొని) పోకుండా; ఉనికి= (ఇక్కడే) ఉండటం; పాపమునకున్= పాపానికి; పట్టు= స్థానం.

తాత్పర్యం: 'ఎక్కడైనా దావాగ్ని లేని కొంచెం చోటు చూచుకొని ఈ నిప్పు సోకకుండా నీవు వెళ్ళిపొమ్మ'- అనిచెప్పి ధృతరాష్ట్రుడు తనకూ, గాంధారికీ, కుంతికీ, అట్లా తప్పించుకొనిపోవటం సాధ్యంకాక పోవటాన్ని కూడా తెలియజేశాడు (సంజయుడికి), అపుడు సంజయుడు భయపడి 'మహానుభావా! మీరుకూడా ఈ చోటు విడిచి వేరొక చోటికి వెళ్ళితే

నేనూ వెళ్ళుతా గాని అయ్యో! మిమ్మల్ని ఈ దావాగ్నికి ఆహుతి చేసి నేనొక్కడిని వెళ్ళగలనా?' అన్నాడు. అపుడు ధృతరాష్ట్రుడు 'ఇల్లు వదలి ఈ విధంగా (తప్పించుకొనటానికి సాధ్యంగాని స్థితిలో) ఉన్నవారు ఈ ప్రకారంగా (అప్రయత్నంగా, బలవంతంగా) మరణించటం తప్పు (పాపం) కాదు, తప్పుకొని రక్షించుకొనే అవకాశం ఉన్న నీవు తప్పుకొనకుండా ఇక్కడే ఉండటం పాపహేతువు'.

వ. అని పలికి యతనిం బోవ నొడంబఱిచి యప్పౌరవ సత్తముండు సమాహితచిత్తుండై ప్రాఙ్ముఖాసీనుం డయ్యెఁ; గాంధారియుం గుంతియు నవ్విధంబునం గూర్చుండి; రప్పుడు సంజయుండు ధృతరాష్ట్రుతో 'యోగయుక్తుం డవు గ' మ్మనియెఁ; నతండు నట్లు సేసెఁ; దదనంతరంబ. 154

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలికి= చెప్పి; అతనిన్= సంజయుడిని; పోవన్= తమను (అగ్నిని) విడిచి వెళ్ళటానికి; ఒడంబఱిచి= అంగీకరింపజేసి; ఆ+పౌరవసత్తముండు= పురువంశంలో పుట్టిన శ్రేష్ఠుడు-ధృతరాష్ట్రుడు; సమాహితచిత్తుండు= నిశ్చలమైన మనస్సు కలిగినవాడు; ఐ= అయి; ప్రాక్+ముఖ+ఆసీనుండు= తూర్పుముఖంగా కూర్చున్నవాడు; అయ్యెన్= అయ్యాడు; గాంధారియున్= గాంధారీ; కుంతియున్= కుంతికూడా; ఆ+విధంబునన్= ఏకాగ్రమైన మనస్సుతో తూర్పు ముఖంగా; కూర్చుండిరి= కూర్చున్నారు; అప్పుడు= ఆసమయంలో; సంజయుండు= సంజయుడు; ధృతరాష్ట్రుతోన్= ధృతరాష్ట్రుడితో; యోగ-యుక్తుండవు= మనస్సుయొక్క వ్యాపారాలను నిరోధించి (జీవాత్మను పరమాత్మయందు కలవటం కలిగి)న వాడివి; కమ్ము= అగుము; అనియెన్= అన్నాడు; అతండున్= ఆ ధృతరాష్ట్రుడుకూడా; అట్లు= సంజయుడు చెప్పినవిధంగా; చేసెన్= చేశాడు; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత.

తాత్పర్యం: అని చెప్పి సంజయుడిని, తమను వదలి వెళ్ళిపోవటానికి ఒప్పించి, ఆ ధృతరాష్ట్రుడు మనసును నిశ్చలంగా చేసికొని తూర్పుముఖంగా కూర్చున్నాడు. గాంధారీ, కుంతీ కూడా ఆవిధంగానే కూర్చున్నారు. అపుడు సంజయుడు ధృతరాష్ట్రుడితో- 'చిత్తవ్యాపారాలను నిరోధించు- (జీవాత్మను పరమాత్మతో కలిసిఉంచు)' మని చెప్పాడు. ధృతరాష్ట్రుడు అట్లాగే చేశాడు. ఆ తరువాత. (తరువాతి పద్యంతో అన్వయం.)

ఆ. ఒక్కతెఱపి సంజయుఁడు సని హిమశైల। మెక్కెఁ;నంత వారి నెల్ల నగ్ని
వొదివికొనియెఁ; నిట్లు వోయి రమ్మువ్వురుఁ। బుణ్యలోకమునకు భూపవర్య! 155

ప్రతిపదార్థం: భూవర్య!= రాజశ్రేష్ఠుడా! ధర్మరాజా!; సంజయుండు= సంజయుడు; ఒక్కతెఱపిన్= కొంచెం సందు చూచుకొని; చని= వెళ్ళిపోయి; హిమశైలము= హిమాలయం; ఎక్కెన్= చేరుకొన్నాడు; అంతన్= ఆ తరువాత; వారిన్ ఎల్లన్= వారిని అందరినీ (కుంతీ, గాంధారీ ధృతరాష్ట్రులను); అగ్ని= దావాగ్ని; పొదివికొనియెన్= తనలో ఇముడ్చుకొన్నది; ఆ+మువ్వురు= ఆ ముగ్గురూ (ధృతరాష్ట్రుడు-గాంధారి-కుంతి); ఇట్లు= ఈ విధంగా; పుణ్యలోకమునకున్= పుణ్యవంతుల లోకానికి, సద్గతికి; పోయిరి= వెళ్ళిపోయారు.

తాత్పర్యం: ధర్మరాజా! సంజయుడు ఆ దావాగ్నిలో కొద్దిగా సందు చూచుకొని దాటిపోయి హిమాలయానికి వెళ్ళిపోయాడు. తరువాత ఆ దావాగ్ని వాళ్ళందరినీ తనలో కలుపుకొన్నది. ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి ఆ ముగ్గురూ ఈ విధంగా (తమ తనువులు చాలించి) ఉత్తమలోకాలకు చేరుకొన్నారు.

సీ. **పదపడి నృప! యేను భాగీరథీతీర । మున వచ్చుచుండి యవ్వనము దివ్య**

మునులచే మీ రటు సని క్రమ్మఱంగ వ । చ్చినది యాదిగ నయ్యశేష వృత్త

మును నేర్పడఁగ వింటి, మూఁడు కళేబర । ములుఁ గంటి; నక్కురుపుంగవుండు

భార్యయుఁ బాండుని పత్నియు సద్గతి । నొందిరి; నీ వింక నుమ్మలింప

ఆ. **కుండు' మనిన శోక మొదవి యాతఁడు బాహు । లెత్తి యెలుఁగు సెలఁగ నేడ్వఁ దమ్ము**

లడలు గదిరి యేడ్చి; రవ్వార్త నంతఃపు । రమున రోదనార్తరవము లెసఁగ! **156**

ప్రతిపదార్థం: నృప!= (ధర్మ) రాజా!; పదపడి= ఆ తర్వాత; ఏను= నేను (నారదుడు); భాగీరథీ తీరమునన్= గంగఒడ్డు మీదుగా; వచ్చుచున్+ఉండి= వస్తూ; ఆ+వనము-దివ్య-మునులచేన్= ఆ గంగాపరిసరారణ్యవాసులైన మునివరులవలన; మీరు= మీరు (పాండవులు); అటన్= ఆ ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి; చని= వెళ్ళి; క్రమ్మఱంగన్= తిరిగి; వచ్చినది= హస్తినకు రావటం; ఆదిగన్= మొదలుగా; ఆ+అశేషవృత్తమును= జరిగిన వృత్తాంతం యావత్తూ; ఏర్పడఁగన్= వివరంగా; వింటిన్= విన్నాను; మూఁడు కళేబరములున్= ముగ్గురి (ధృతరాష్ట్రుడు, గాంధారి-కుంతి) శరీరాలనూ; కంటిన్= చూచాను; ఆ+కురుపుంగవుండు(న్)= ఆ ధృతరాష్ట్రుడూ; భార్యయున్= అతని భార్య గాంధారీ; పాండుని పత్నియున్= పాండురాజు భార్య-కుంతీ; సద్గతిన్= ఉత్తమలోకాలను; ఒందిరి= పొందారు; ఇంకన్= అందుచేత ఇంక; నీవు= నీవు; ఉమ్మలింపక+ఉండుము= దుఃఖించకుండా ప్రశాంతంగా ఉండు; అనినన్= నారదుడు చెప్పగా; శోకము= దుఃఖం; ఒదవి= పుట్టి; అతఁడు= ధర్మరాజు; బాహులు= చేతులు; ఎత్తి= పైకెత్తి; ఎలుంగు= గొంతు (కంఠస్వరం); చెలఁగన్= ధ్వనించగా; (పెద్దగా); ఏడ్వన్= ఏడుస్తుంటే; తమ్ములు= (ఆ ధర్మరాజు తమ్ములు) భీమ, అర్జున, నకుల, సహదేవులు; అడలు= దుఃఖం; కదిరి= అతిశయించి; ఏడ్చిరి= ఏడ్చారు; ఆ+వార్తన్= ధృతరాష్ట్రాదుల మరణవార్తవలన; అంతఃపురమునన్= ఆ రాణి వాసాలలో; రోదన+ఆర్త-రవములు= ఏడుపులతో, బాధనిండిన ధ్వనులు; ఎసఁగన్= అధికం కాగా.

తాత్పర్యం: ధర్మరాజా! తర్వాత నేను గంగాతీరం మీదుగా వస్తూ-మీరు ధృతరాష్ట్రాదులను చూడటానికి ఆయన ఆశ్రమానికి రావటం, తరువాత రాజ్యానికి తిరిగి రావటం మొదలుగా ఈ వృత్తాంతం మొత్తం ఆ గంగా తీరారణ్యవాసులయిన మునులవలన విన్నాను. ఆ ముగ్గురి (దగ్ధ) శరీరాలనూ చూచాను. ఆ ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, ఉత్తమలోకాలకు వెళ్ళిపోయారు. కాబట్టి నీవింక ఏమీ దుఃఖపడకు' మని నారదుడు చెప్పగా దుఃఖం కలిగి, ధర్మరాజు చేతులు పైకెత్తి, బిగ్గరగా ఏడ్వసాగాడు. భీమాదులూ దుఃఖంతో ఏడ్చారు. ఆ వార్తచేత అంతఃపురంలోను ఏడుపుల ధ్వనులు అతిశయించాయి.

వ. **అవ్విశేషంబు.** **157**

తాత్పర్యం: ధృతరాష్ట్రాదుల ఆ మరణవార్త (క్రమంగా పౌరులకు తెలిసింది. తరువాతి పద్యంతో అన్వయం.)

క. **విని పౌరజనసమూహము । లనయంబును వనట మునిఁగి హాహారవముల్**

వినువీథి ముట్ట రోదన । మొనరిచె నవ్వేళఁ గరుణ ముత్కట మయ్యెన్. **158**

ప్రతిపదార్థం: విని= (ధృతరాష్ట్రాదుల మరణవార్త) విని; పౌర-జన-సమూహములు= ఆ నగరపు ప్రజల గుంపులు; అనయంబును= నిరంతరమైన; వనటన్= శోకంలో; మునిఁగి= నిండి; హాహా-రవముల్= హా,హా అనే ధ్వనులు; వినువీథిన్= ఆకాశాన్ని; ముట్టన్=అంటగా; రోదనము= ఏడుపు; ఒనరిచెన్= చేశాయి; ఆ+వేళన్= ఆ సమయంలో; కరుణము= కారుణ్యం; ఉత్కటము= భరింపరానంతటిది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: ధృతరాష్ట్రాదుల మరణవార్తను తెలిసికొని, పురప్రజలు గుంపులు గుంపులుగా చేరి, నిరంతరమైన శోకంతో చేసిన హా, (మహారాజా)హా-అనే ఏడుపు ధ్వనులు ఆకాశం అంటాయి. ఆ సమయంలో ఆ రాజ్య దైన్యం మేరలేనిదయింది.

క. నారదుఁ డుపశమ ఫణితులఁ। గౌరవసత్తమునిఁ దేర్పఁ గ్రమమున నాక్రం
దారవము లుడిగె బంధుజ। నారబ్ధము లైన యనునయాలాపములన్. 159

ప్రతిపదార్థం: నారదుఁడు= నారదమహర్షి; కౌరవసత్తమునిన్= కురువంశశ్రేష్ఠుడైన ధర్మరాజును; ఉపశమ-ఫణితులన్= ఊరడింపు మాటలతో; తేర్పన్= దుఃఖంనుండి తేరుకొనేటట్లు చేయగా; బంధు-జన+ఆరబ్ధములు= బంధువులు ప్రారంభించినవి; ఐన= అయిన; అనునయ+ఆలాపములన్= ఊరడింపు మాటలతో; ఆక్రంద-ఆరవములు= ఏడుపుల ధ్వనులు; క్రమమునన్= మెల్లగా; ఉడిగెన్= ఆగిపోయాయి.

తాత్పర్యం: నారదుడు సాంత్వన వచనాలతో ధర్మరాజు దుఃఖంనుండి తేరుకొనేటట్లు చేయగా బంధువుల అనునయపు మాటలతో, ఏడుపుల ధ్వనులు క్రమంగా ఆగిపోయాయి.

ధర్మరాజు ధృతరాష్ట్రప్రభృతులు మృతు లగుటకు శోకించుట(సం.15-16-1)

వ. అట్లు సమస్త జనంబులును విగతరోదను లై రప్పు డక్కౌరవనాథుండు నారదముని యాననం బాలోకించి యిట్లనియె. 160

ప్రతిపదార్థం: సమస్త జనంబులును= ధర్మరాజాదులు అందరూ; అట్లు= ఆ ప్రకారంగా (బంధువుల అనునయాలతో); విగతరోదనులు= ఏడుపు పోయిన వారలు; ఐరి= అయ్యారు (ఏడ్పుమానారు); అప్పుడు= ఆ సమయంలో; ఆ+కౌరవ-నాథుండు= కురువంశ్యులకు దిక్కయిన ఆ ధర్మరాజు; నారదముని-ఆననంబ= నారదమహర్షి ముఖాన్ని; ఆలోకించి= చూచి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: ధర్మరాజు ప్రభృతులయిన జనులందరూ ఆ విధంగా ఏడుపులు మానారు. అపుడు ధర్మరాజు నారదుడిని చూస్తూ ఇట్లా అన్నాడు.

సీ. 'ఎఱుఁగఁగ వచ్చునే యెవ్వరి కెత్తతి। నేదెస యగునొ మునీంద్ర! యేము
గలుగంగ దెస లేని పులుమానిసికిఁ బోలె। నక్కురువృద్ధున కట్టిచావు
పాటిల్లె; సుమదీర్ణ బాహుదర్పోజ్జ్వలు। లైన పుత్త్రులు నూర్వు రట్లు గలిగి
బలము నాగాయుతప్రాణసమం బగు। నమ్మహారా జట్టి యడవిచిచ్చు

తే. వలనఁ దెగటాఱె; నే మనఁ గలదు కమల। ముఖుల తాలవృంతానిలముల సుఖించు
ప్రభువె కంక గృధ్రావలీపక్షవాయు। వడర నిలఁబడియున్నవాఁ డక్కటకట! 161

ప్రతిపదార్థం: ముని+ఇంద్ర!= (నారద) మహర్షీ; ఎవ్వరికిన్= ఎటువంటివారికైనా; ఏ+తఱిన్= ఏసమయంలో; ఏదెస= ఏ విధంగా; అగునొ= అవుతుందో; ఎఱుఁగంగన్= తెలియటం; వచ్చునే?= సాధ్యమా? ఏము= (రాజులమైన కొడుకులు) పాండవులు; కలుగంగన్= ఉండగా; ఆ+కురువృద్ధునకున్= కురువంశంలో పెద్దవాడైన ఆ ధృతరాష్ట్రుడికి; దెస-లేని-పులు-మానిసికిన్-పోలెన్= దిక్కులేని హీన మనుష్యుడికి వలె; అట్టి-చావు= ఆవిధమైన (రక్షించేవాడు లేని) మరణం; పాటిల్లెన్= సంభవించింది; సముదీర్ణ-బాహు-దర్ప-ఉజ్జ్వలులు= విస్తారమైన భుజ బలగర్వం చేత ప్రకాశించేవారు; ఐన-పుత్రులు= అయినటువంటి కొడుకులు; నూర్వురు= వందమంది; అట్లు= ఆ విధంగా (కడుపు పంటగా) కలిగి= పుట్టి; నాగ+అయుత-ప్రాణ-సమంబు= పదివేల యేనుగుల బలంతో సమానమైన; బలము= శక్తి (స్వయంగానూ) కలిగిన; ఆ+మహారాజు= ఆ ధృతరాష్ట్ర చక్రవర్తి; అడవిచిచ్చువలనన్= దావాగ్నిచేత; తెగటాఱెన్+ఏ= కూలిపోయినాడట; ఏమి-అనన్+కలదు?= ఇంక చెప్పగలిగింది ఏమున్నది?; కమలముఖుల= తామరపూలవంటి ముఖాలు గలిగిన-కోమలులైన స్త్రీలయొక్క; తాల-వృంత= విసనకర్రలనుండి వెలువడే; అనిలములన్= మెల్లనైన గాలులచేత; సుఖించు ప్రభువు+ఎ= సుఖపడే ఆ మహారాజే; అక్కట+అక్కట= అయ్యయ్యో; కంక= రాబందులయొక్క; గ్రద్ద= గ్రద్దలయొక్క; ఆవలీ= పంక్తుల యొక్క; పక్ష= రెక్కలనుండి వచ్చే; వాయువు= గాలి; అడరన్= అతిశయించగా; ఇలన్= నేలపైన; పడి-ఉన్నవాఁడు= పడిపోయి ఉన్నాడు.

తాత్పర్యం: 'నారదమునీంద్రా! ఎవ్వరికి, ఎప్పుడు, ఏమి జరుగుతుందో తెలియటం సాధ్యం కాదు. మేమింతమంది ఉండగా దిక్కులేని హీనమానవుడివలె, ఆ కురువంశవృద్ధుడికి ఆ విధమైన మరణం సంభవించింది. విస్తారమైన భుజబలాధిక్యం చేత గొప్పవారైన కొడుకులు, వందమందిని ఆ విధంగా పొంది, స్వయంగా పదివేల యేనుగుల బలం కలిగి ఉన్న మహారాజు, అడవిలో పుట్టిన అగ్గివలన కూలిపోయినాడంటే చెప్పే దేముంది? సుకుమారలైన కాంతలచేత తాలవృంతాలనుండి వెలువడే మెల్లనైన గాలితో సుఖించే మహారాజే-అయ్యో! రాబందుల, గ్రద్దల, రెక్కల నుండి వీస్తున్న గాలి అతిశయిస్తుండగా నేడు నేలమీద పడిపోయి ఉన్నాడు.

క. కల మృదుమాగధ గానం। బుల మేల్కనురాజు గృధ్రములునుం గాకం
బులు నఱవఁగ నిడుద నిదుర। నొలసి తెలుప దిక్కుమాలి యున్నాఁడు గదే! 162

ప్రతిపదార్థం: కల= మధురమైన; మృదు= చెవికింపయిన; మాగధ= స్తోత్రపాఠకుల; గానంబులన్= స్తోత్ర గానాలతో; మేల్కనురాజు= నిదురనుండి మేలుకొనే ధృతరాష్ట్ర మహారాజు; గృధ్రములునున్= గ్రద్దలూ; కాకంబులున్= కాకులూ; అఱవఁగన్= అరుస్తూ ఉంటే; నిడుదనిదుర= దీర్ఘనిద్ర- (లేవలేని నిద్రలో); ఒలసి= పడి; తెలుపన్= తెలియజేయటానికి ఎవరూ లేక; దిక్కుమాలి= దిక్కులేకుండా; ఉన్నాఁడుగదే!= ఉన్నాడు గదా!

తాత్పర్యం: మాగధులు చేసే అవ్యక్తమధురమూ, సుకుమారమూ అయిన స్తోత్రగానంతో నిద్రలేచే మహారాజు ధృతరాష్ట్రుడు, ఈ రోజు గద్దలూ, కాకులూ చుట్టూ చేరి అరుస్తూ ఉంటే లేవలేని పెద్ద నిద్దురలో పడి మేల్కొలిపే వాడే లేక దిక్కులేకుండా పడిపోయి ఉన్నాడు గదా.

సీ. వల్లభుం డొక్క సద్వ్రతముఁ బూనినఁ దానుఁ। దద్వ్రత మూని గాంధారి యతని
పోయినగతిఁ బోయె; నాయమకై యంత। వగవఁ; బుత్త్రుల రాజ్యవైభవంబు

విడిచి మే యోమక యడవికి బోయిన । తల్లికి వగచెద; ధర్మసుతుఁడు

భీమసేనుండును, బీభత్సుఁడును దన । కడుపునఁ బుట్టిన కొడుకు; లట్టి

తే. యెగ్గతంబునఁ దానుఁ గారగ్గిఁ గాలె । నటె యనాథయై దీనికి నంతరంగ

మలఁదురక తల్లడిల్లక యారటమున । నుడుక కలమటఁ బడక యెట్లుండుఁ జెపుమ! 163

ప్రతిపదార్థం: వల్లభుండు= భర్త (ధృతరాష్ట్రుడు) ఒక్క= ఒకానొక; సత్-వ్రతము= ఉత్తమమైన దీక్షను; పూనినన్= ఆచరిస్తుంటే; తానున్= (పతివ్రత అయిన భార్యగా) తానుకూడా; తద్-వ్రతమున్= భర్తయొక్క దీక్షనే; పూని= అనుసరించి; పొంది; అతని-పోయినగతిన్= ఆ భర్త (ధృతరాష్ట్రుడు) పోయిన మార్గంలోనే; గాంధారి= గాంధారి; పోయెన్= వెళ్ళింది; ఆయమకై= అటువంటి ఆమె కోసం; అంత= పెద్దగా; వగవన్= బాధపడను; కానీ, పుత్రుల= పాండవుల; రాజ్య-వైభవము= సామ్రాజ్య-అధికారాన్ని-(సుఖాలనూ); విడిచి= వదలుకొని; మే= ఒడలు; ఓమక= కాపాడుకొనకుండా; అడవికిన్= అరణ్యానికి (గాంధారీ ధృతరాష్ట్రులతో); పోయిన= వెళ్లిన; తల్లికిన్= కుంతిని గురించి; వగచెదన్= దుఃఖిస్తున్నాను; ధర్మసుతుఁడు= ధర్మరాజు (తానూ); భీమసేనుండును= భీముడూ; బీభత్సుఁడును= అర్జునుడూ; తన కడుపునన్= తన (స్వ) గర్భం నుండి; పుట్టిన= జన్మించిన; కొడుకుల+అట్టి= పుత్రులు-అయిఉండగా; తాను= ఆ కుంతి; అనాథ= దిక్కులేనిది; ఐ= అయి; ఎగ్గతంబునన్= (కాపాడే) జనం లేని చోట; కారు+అగ్గిన్= దావాగ్నిలో; కాలెన్= కాలిపోయింది; దీనికిన్= ఇటువంటి కుంతీమరణానికి; అంతరంగము= మనస్సు; అలఁదురక= కలత పోకుండా; తల్లడిల్లక= (బాధతో) కంపం పొందకుండా; ఆరటమునన్= ఉద్వేగం (కుదురు లేకుండటం)తో; ఉడుకక= తపించి పోకుండా; అలమటన్= దురవస్థలో; పడన్= మునిగిపోకుండా; ఎట్లు= ఏప్రకారంగా; ఉండున్?= ఉంటుంది?; చెపుమ= (నారదమునీంద్రా!) నీవే చెప్పుము.

తాత్పర్యం: తన భర్త ఒకానొక మంచి వ్రతం ఆచరిస్తున్నాడు కాబట్టి (పతివ్రత అయిన భార్యగా) తాను కూడా అదేవ్రతాన్ని ఆచరిస్తూ భర్త పోయిన మార్గంలో గాంధారికూడా వెళ్ళిపోయింది. కాబట్టి ఆమెను గూర్చి నేను ఎక్కువగా బాధపడను. కానీ, కొడుకుల రాజ్యంతో ప్రాభవం వదలుకొని ఒడలు ఓముకొనకుండా అడవికి వెళ్ళిన తల్లి కుంతిని గూర్చి విచారిస్తున్నాను. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, తన కడుపున పుట్టిన బిడ్డలై ఉండగా దిక్కులేనిదై, (రక్షించే) జనం లేని చోట, దావాగ్నిలో కాలిపోయింది. దానికి మనస్సు కలతపడకుండా, దుఃఖంతో కంపించకుండా కుదురులేని తనంతో తపించిపోకుండా, కష్టంలో మునిగిపోకుండా ఎలా ఉంటుంది నారదా! నీవే చెప్పుము.

క. విను ఖాండవ దహనంబునఁ । దనకుఁ బ్రమోదంబు శక్రతనయుఁ డొసఁగె; నా

తని తల్లిఁ గాల్పఁ దగునే । యనలునకుం; గడుఁగృతఘ్నుఁ డయ్యెఁ మునీంద్రా! 164

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా!= నారదమహర్షీ!; విను= వినుము; ఖాండవదహనంబునన్= ఖాండవవనాన్ని దహించే పనిలో; శక్రతనయుండు= (ఇంద్రుడికొడుకు) అర్జునుడు; తనకున్= తనకు (అగ్నికి); ప్రమోదంబు= ఆనందం (అభీష్టం); ఒసఁగెన్= ఇచ్చాడు; అతనితల్లిన్= తనకు మేలుచేసినవాడి తల్లిని; కాల్పన్= దహించటం; అనలునకున్= అగ్నికి; తగున్+ఏ?= యుక్తమా?; కడున్= మిక్కిలి; కృతఘ్నుఁడు= (అగ్నిదేవుడు) చేసిన మేలు మరచేవాడు; అయ్యెన్= (ఇందువలన) అయినాడు.

తాత్పర్యం: మహర్షీ! ఇంకా వినండి. ఖాండవవనాన్ని దహించే పనిలో అర్జునుడు తనకు ఆనందాన్ని కలిగించాడే! అట్లా మేలు చేసిన వాడి తల్లిని దహించడం ఆ అగ్నికి తగినదేనా? అగ్ని చాలా కృతఘ్నుడయ్యాడు గదా!

సీ. మతియొక్క నెవ్వగ మనమున జనియించె; । నాంబికేయుండు కారగ్గి నెరసె
దానికి నెయ్యది యేను జేయుదు నొక్కొ?' । యనవుడు నారదుం డానృపాలు
తోడ నబ్భరతవృద్ధుఁడు శాంతి యెక్కుడై । సవిశేషమైన పూజా విధాన
మున నుపాసించి తగిన యిష్టి సేసి య । గ్నులఁ దొలునాఁడ వీడ్కొనియె; ననియు

తే. నపుడు యాజకజనము లయ్యగ్ని చయము । నడవిలోన నుద్వాసించి యరిగె; ననియుఁ
బేర్చి యది యవ్వనం బెల్ల నేర్చె ననియు । వింటి నాత్మాగ్నిఁ గాలె నా విభుఁడు వత్స!' 165

ప్రతిపదార్థం: మనమునన్= నా మనసులో; మతి= పైగా; ఒక్క= ఇంకొక; నెఱ+వగ= సంపూర్ణమయిన దుఃఖం; జనియించెన్= కలిగింది; ఆంబికేయుండు= ధృతరాష్ట్రుడు; కారు+అగ్గి= దావాగ్ని; నెరసెన్= చుట్టుముట్టుకొన్నది; దానికిన్= ఆస్థితికి; నేను= నేను (ధర్మరాజు); ఏ+అది= ఏ క్రియ; చేయుదున్+ఒక్కొ?= చేయవలసిఉన్నది?; అనవుడున్= అని ధర్మరాజు పల్కగా; ఆ-నృపాలుతోడన్= ఆ ధర్మరాజుతో; నారదుండు= నారదమహర్షి (ఇట్లా అన్నాడు); వత్స!= నాయనా! ధర్మరాజా!; ఆ+భరత వృద్ధుఁడు= భరతవంశంలో పెద్ద అయిన ఆ ధృతరాష్ట్రుడు; శాంతి= (ఇంద్రియాలను అణచి) సంపూర్ణమైన విరక్తి; ఎక్కుడు+ఐ= అధికమై; తొలినాఁడు+అ= మరణించటానికి ముందురోజే; అగ్నులన్= తన అగ్నిహోత్రాలను; సవిశేషము= ప్రత్యేకం; ఐన= అయినటువంటి; పూజా-విధానమునన్= అర్చనా పద్ధతిలో; ఉపాసించి= సేవించి; తగిన-ఇష్టి= అర్హమైన యజ్ఞం; చేసి= నిర్వహించి; వీడ్కొనియెన్= (అగ్నులను) విడిచిపెట్టాడు; అనియున్= అనీ; అపుడు= ఆ సమయంలో; ఆ+అగ్ని-చయమున్= ధృతరాష్ట్రుడు వీడుకొలిపిన అగ్నుల సముదాయాన్ని; యాజక-జనములు= (ధృతరాష్ట్రుడిని అనుసరించి వచ్చిన) ఋత్విక్కులు; అడవిలోనన్= ఆ అడవిలోనే; ఉద్వాసించి= విడిచి; అరిగెన్= వెళ్ళారు; అనియున్= అనీ; అది= అట్లా విడిచిపెట్టబడిన (ధృతరాష్ట్రుడి) అగ్నియే= అంటుకొని, పెరిగి; ఆ+వనంబు= ఆ అరణ్యం; ఎల్లన్= మొత్తం; ఏర్చెన్= తగులబెట్టింది; అనియెన్= అనీ; వింటిన్= విన్నాను (కాబట్టి); ఆ+విభుఁడు= ఆ ధృతరాష్ట్రుడు; ఆత్మ+అగ్నిన్= తన అగ్నిహోత్రంవలననే; కాలెన్= దగ్ధమయ్యాడు.

తాత్పర్యం: (మునీంద్రా) మనసులో మరో బాధ కలుగుతున్నది. ధృతరాష్ట్రుడు దావాగ్నిలో మరణించాడు గదా! ఆవిధంగా సంభవించిన మృతికి సంబంధించి నేను చేయవలసిన (ఉత్తర) క్రియలు ఏమిటి? ధర్మరాజు అట్లా అనగానే నారదుడు (ఇట్లా అన్నాడు) 'నాయనా! ఆ ధృతరాష్ట్రుడు సంపూర్ణమైన విరక్తి ఇంకా అధికమై ముందటిరోజే తన అగ్నులకు ప్రత్యేకపూజలు చేసి, అవసరమైన ఇష్టిని నిర్వహించి, ఆ అగ్నులనుండి సెలవు తీసికొన్నాడు. అపు డాతడితో ఉన్న ఋత్విక్కులు ఆ ఆగ్నులను అడవిలోనే ఉద్వాసన చేసి వెళ్ళిపోయారు. అట్లా వారు విడిచిపెట్టిన (ధృతరాష్ట్రుడి) అగ్నులే అంటుకొని పెరిగి ఆ అడవిని అంతా కాల్చేశాయి- అని కూడా విన్నాను. అందుచేత ధృతరాష్ట్రుడు కేవలం అడవిచిచ్చువలన కాకుండా స్వీయాగ్నులలోనే మృతిపొందాడు.

ఉ. కావున నెవ్వగం బొరయఁగాఁ బనిలేదు నరేంద్ర! గొంతియుం
బావకు నప్పకుం గరము భక్తి దగం బరిచర్య సేసి దే
వావలి ప్రస్తుతింపఁగ నిరామయలోకము నొందె; వారికిన్
నీ వుదకంబు లీవలయు నిష్ఠమెయిం దిలసంయుతంబుగాన్. 166

ప్రతిపదార్థం: నర+ఇంద్ర!= (ధర్మ) రాజా!; కావునన్= అందుచేత; (ధృతరాష్ట్రుడు ఆత్మాగ్నితో మృతి చెందాడు కాబట్టి); నెఱ+వగన్= అధికమయిన దుఃఖం; పొరయఁగాన్= పొందవలసిన; పని= అవసరం; లేదు= లేనే లేదు; గొంతియున్= కుంతికూడా; బావకున్= బావగారైన ధృతరాష్ట్రుడికీ; అప్పకున్= అక్క-గాంధారికీ; కరము= మిక్కిలి; భక్తి(న్)= సేవాభావంతో; తగన్= తగువిధంగా; పరిచర్య= శుశ్రూష; చేసి= ఆచరించి; దేవ+ఆవలి= దేవతల సముదాయం; ప్రస్తుతింపఁగన్= మెచ్చుకొనేటట్లుగా; నిరామయలోకమున్= మంచి (ఇంద్ర) లోకాన్ని; ఒందెన్= చేరుకొన్నది; నీవు= నీవు; వారికిన్= కుంతీ, గాంధారీ, ధృతరాష్ట్రులకు; నిష్ఠమెయిన్= శ్రద్ధతో; తిలసంయుతంబుగన్= నువ్వులతో గూడ; ఉదకంబులు= నీళ్ళు; ఈన్+వలయున్= ఇవ్వ(విడువ)వలసింది.

తాత్పర్యం: కాబట్టి ధర్మరాజు మిక్కిలి దుఃఖాన్ని పొందవలసిన అవసరం లేదు. కుంతి కూడా బావకు అక్కకూ మిక్కిలి భక్తితో తగిన విధంగా సేవచేసి దేవతలు ప్రస్తుతించే విధంగా మంచిలోకాన్ని పొందింది. వారికి నీవు నిష్ఠతో నువ్వులూ నీళ్ళూ విడువవలసియున్నది.

యుధిష్ఠిరుఁడు ధృతరాష్ట్రాదులకుఁ దిలోదక ప్రదానంబు చేయుట (సం.15-47-10)

క. అనుజన్ములు నంతఃపుర। వనితాజనములును నీవు వసుధేశ్వర ! వే
చని నడపుఁ డుదకవిధి నీ। జనకునకును జననులకును జాహ్నవిలోనన్.' 167

ప్రతిపదార్థం: వసుధా+ఈశ్వర!= (ధర్మ) రాజా!; అనుజన్ములు= తమ్ముళ్ళూ; అంతఃపుర-వనితా-జనములును= అంతఃపుర స్త్రీలూ; నీవు(న్)= నీవూ; వే= త్వరగా; చని= వెళ్ళి; జాహ్నవిలోనన్= గంగలో; నీ జనకునకును= నీ తండ్రి అయిన ధృతరాష్ట్రుడికీ;జననులకును= తల్లులకు; (కుంతీ,గాంధారులకు); ఉదకవిధి= తిలోదకాలిచ్చే పని; నడపుఁడు= ఆచరించండి.

తాత్పర్యం: ధర్మరాజా! భీమసేనాదులైన తమ్ములూ, ద్రౌపదీ ప్రభృతులైన అంతఃపురకాంతలూ, నీవూ వెంటనే వెళ్ళి, గంగలో, ధృతరాష్ట్రుడికీ, కుంతీ, గాంధారులకూ; తిలోదకప్రదానం చేయండి.'

ఆ. అనిన లెస్స గాక! యని ధర్మసుతుఁ డేక। వస్త్ర ధరణనియతి వఱల నెల్ల
వారు నట్ల యేఁగుదేరఁగఁ బౌరులు। బలసి చనఁగఁ జనియెఁ బౌరవేంద్ర! 168

ప్రతిపదార్థం: పౌరవ+ఇంద్ర!= జనమేజయరాజా; అనినన్= అని నారదుడు చెప్పగా; ధర్మసుతుఁడు= ధర్మరాజు; లెస్స కాక= మంచిది అట్లాగే; అని= అనిచెప్పి; ఏక-వస్త్ర-ధరణనియతి= ఒకే వస్త్రం ధరించటం అనే నియమం; వఱలన్= ఒప్పుతుండగా (నియమబద్ధంగా ఏకవస్త్రం ధరించి); ఎల్లవారున్= తమ్ములు మొదలైనవారు అందరూ; అట్లు+అ= ఆవిధంగా ఏకవస్త్రధారులై; ఏఁగుదేరఁగన్= వెంటరాగా; పౌరులు(న్)= పురప్రజలుకూడా; బలసి= అధికసంఖ్యలో; చనఁగన్= వెళ్ళగా; చనియెన్= (గంగకు) వెళ్ళాడు.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠుడా! జనమేజయా! నారదు డావిధంగా చెప్పగా మంచిది అట్లాగే చేద్దామని ధర్మరాజు నియమానుగుణంగా, ఏకవస్త్రం ధరించగా, తమ్ములు మొదలైన వాళ్ళు గూడా అలాగే ఏకవస్త్రం ధరించి వెంటరాగా, పురప్రజలూ గుంపులుగా రాగా, గంగకు వెళ్ళాడు.

వ. ఇట్లు చని గంగాస్నానం బాచరించి యమ్మహీపతి మొదలగు నర్వజనంబులు ధృతరాష్ట్రునకు గాంధారికిం గుంతికిం దిలోదకప్రదానంబులు నిర్వర్తించి, నివృత్తులై యశుచిత్వం బపనయించుటకుం బుర బహిరంగణం బునఁ బటకుటీర ప్రకరంబుల వసియించి; రట్టియెడ. 169

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ ప్రకారంగా (అనుజాదులతో-కలిసి); చని= (గంగకు) వెళ్ళి; గంగాస్నానంబు= గంగలో స్నానం; ఆచరించి= చేసి; ఆ+మహీపతి= ఆ ధర్మరాజు; మొదలు+అగు-అర్హజనంబులు= మొదలైన యోగ్యులయిన వారు; ధృతరాష్ట్రునకు(న్)= ధృతరాష్ట్రుడికీ; గాంధారికిన్= గాంధారికీ; కుంతికిన్= కుంతికీ; తిల+ఉదక-ప్రదానంబులు= నువ్వులూ, నీళ్ళూ ఇవ్వటం; నిర్వర్తించి= పూర్తిచేసి; నివృత్తులు+ఐ= (గంగనుండి రాజధానికి) తిరిగిపోతూ; అశుచిత్వంబు= ధృతరాష్ట్రాదుల మరణం వలన కలిగిన అశౌచాన్ని; అపనయించుటకున్= తొలగించుకొనటానికి; (ఆ రోజులు గడిపేయటానికి); పుర-బహిస్-అంగణంబునన్= హస్తినాపురానికి వెలుపలి ప్రాంతంలో; పట-కుటీర-ప్రకరంబుల్= వస్త్రాలతో గూర్చిన ఆవాసాలలో (డేరాలలో); వసియించిరి= నివాసం ఏర్పాటు చేసికొన్నారు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా (అనుజాది సహితుడై) ఏకవస్త్రధారణం మున్నగు లక్షణాలతో వెళ్ళి గంగలో స్నానం చేసి, ధర్మరాజు మొదలైన అవసరమైనవారు ధృతరాష్ట్రుడికీ, కుంతికీ తిలోదకాలిచ్చి వెనుకకువచ్చి మృతాశౌచం తొలగే వరకు హస్తిపురం వెలుపల గుడారాలలో నివాసం చేస్తున్నారు. ఆ సమయంలో...

సీ. **ఆంబికేయాదుల యస్థిపుంజముల గం। గాద్వార సలిల సంగమ విశిష్ట**
సంస్కారమునఁ గూర్పఁ జాలెడు సంశుద్ధ। జనముల రావించి సబహుమాన
ఫణితుల వారి కప్పని యేర్పడఁగఁ జెప్పి। పనిచె నక్కౌరవ జనవిభుండు;
శ్రాద్ధార్హదినమున వృద్ధానుమతి నతం। డక్కురువృద్ధున కతని సతికి

తే. **గొంతికిని రత్నకాంచన గోతురంగ। హస్తి కన్యా ధరిత్రీ గృహాది దాన**
విధుల సర్వజనంబులు విస్మితులుగ। నియతిమెయిఁ బారలౌకిక క్రియ లొనర్చె. **170**

ప్రతిపదార్థం: ఆ+కౌరవ-జన-విభుండు= కురువంశంవారికి నాథుడైన ఆ ధర్మరాజు; ఆంబికేయ-ఆదుల= ధృతరాష్ట్రుడూ మొదలైన (గాంధారీ, కుంతీ); అస్థిపుంజములన్= అస్థి సముదాయాలను; గంగాద్వార= గంగాద్వారంలోని; సలిల= (గంగా) జలంతో; సంగమ= కలపటం అనే; విశిష్ట= ప్రత్యేకమైన, సంస్కారమునన్= పవిత్రంగా; కూర్పన్= కలపటానికి; చాలెడు= సమర్థులయిన; సంశుద్ధ-జనములన్= పవిత్రులయిన (తెలిసినవారూ, ఆప్తులూ అయిన) మనుష్యులను; రావించి= పిలిపించి; వారికిన్= ఆ జనానికి; సబహుమాన-ఫణితులన్= మన్ననలతో గూడిన మాటలతో; ఆ+పని= ధృతరాష్ట్రాదుల అస్థులను గంగాజలంలో కలిపే పనిని; ఏర్పడఁగన్= వివరంగా; చెప్పి= తెలియజేసి; పనిచెన్= (ధృతరాష్ట్రాదులు దగ్ధమయిన చోటికి) పంపాడు; శ్రాద్ధ+అర్హ-దినమునన్= శ్రాద్ధం చేయవలసిన (అశౌచం తొలగినటువంటి-పండ్రెండవ) రోజున; అతండు= ఆ ధర్మరాజు; వృద్ధ-అనుమతిన్= పెద్దల ఆమోదంతో; ఆ+కురువృద్ధునకున్= ఆ ధృతరాష్ట్రుడికీ; అతని సతికిన్= ధృతరాష్ట్రుడి భార్య గాంధారికీ; గొంతికిని= కుంతీదేవికీ; రత్న= రత్నాలూ; కాంచన= బంగారమూ; గో= ఆవులూ; తురంగ= గుర్రాలూ; హస్తి= ఏనుగులూ; కన్యా= కన్నెపిల్లలూ; ధరిత్రీ= నేలా; గృహ= ఇళ్ళూ; ఆది= మొదలైన దాన-విధులన్= దానకర్మలచేత; సర్వజనంబులు= అందరూ; విస్మితులుగన్= ఆశ్చర్యపడేవిధంగా; పారలౌకిక క్రియలు= ధృతరాష్ట్రాదులకు ఊర్ధ్వలోకాన్ని సాధించే కర్మలను; నియతి మెయిన్= శ్రద్ధతో; ఒనర్చెన్= చేశాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రాదుల అస్థికలను గంగాద్వారంలోని జలంలో నిమజ్జనం చేసే పనిని నిర్వహించటానికి ధర్మరాజు సమర్థులైన ఉత్తమ వ్యక్తులను పిలిపించి వాళ్ళకు ఆపనిని మన్ననలతో వివరించి చెప్పి, (ధృతరాష్ట్రాదులు దగ్ధమైన చోటకు పంపాడు; మృత-అశౌచం తొలగినటువంటి పండ్రెండవ రోజు-శ్రాద్ధం చేయవలసిన నాడు.) పెద్దల ఆమోదంతో

ధృతరాష్ట్రుడినీ గాంధారినీ కుంతినీ, ఉద్దేశించి అందరూ ఆశ్చర్యపడేటట్లుగా రత్నాలూ, బంగారమూ, ఆవులూ, గుర్రాలూ, ఏనుగులూ, కన్నెలూ, భూమి, ఇళ్ళూ, మొదలైన దానాలతో పరలోక సాధకాలైన ఉత్తర క్రియలను శ్రద్ధగా ఆచరించాడు ధర్మరాజు.

ఆ. మునిజనములు వచ్చి యనుమోద మందంగ । సకల బంధుజనులు సంతసిల్ల
నన్న పర్వతముల నాజ్యనదులఁ బిత్ృ । మేధ ముల్లసిల్లె మేదినీశ! 171

ప్రతిపదార్థం: మేదినీ+ఈశ!= (జనమేజయ) మహారాజా!; ముని జనములు= తాపసులు; వచ్చి= (ధృతరాష్ట్రాదుల శ్రాద్ధకర్మలను) చూడ వచ్చి; అనుమోదము= సంతోషం; అందంగన్= పొందగా; సకల-బంధు-జనులు= చుట్టాలు అందరూ; సంతసిల్లన్= ఆనందించగా; పిత్ృమేధము= శ్రాద్ధకర్మ; అన్న-పర్వతములన్= కొండలంతలై ఉన్న అన్నం రాసులతోనూ; ఆజ్యనదులన్= నదులవలె ప్రవహిస్తున్న నేయితోనూ; ఉల్లసిల్లెన్= వర్ధిల్లింది;

తాత్పర్యం: జనమేజయ మహారాజా! ధృతరాష్ట్ర ప్రభృతుల శ్రాద్ధం రోజు (శతయూపాది) మునులు వచ్చారు. ఆ మునులూ, చుట్టాలూ అందరూ సంతోషించే విధంగా కొండలంతటి అన్నరాసులతో, నదులవలె సాగుతున్న నేతి ప్రవాహాలతో ఆ పిత్ృమేధం ప్రకాశించింది.

క. ద్వాదశ దినములు నారదుఁ । డాదరమున నొద్ద నుండి యంతయుఁ గని స
మ్మోదంబుతోడ నాశీ । ర్వాదం బొనరించెఁ బాండవ ప్రవరునకున్. 172

ప్రతిపదార్థం: నారదుండు= నారదమహర్షి; ద్వాదశదినములు(న్)= ఆ పండ్రెండు రోజులూ; ఆదరమునన్= వాత్సల్యంతో; ఒద్దన్= ధర్మరాజు తోనే; ఉండి= నిలిచి; అంతయున్= ధర్మరాజు చేసిన పారలౌకిక క్రియలు అన్నీ; కని= చూచి; సమ్మోదంబు తోడన్= సంతృప్తితో; పాండవప్రవరునకున్= పాండురాజు కొడుకులలో శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజుకు; ఆశీర్వాదంబు= ఆశీస్సు; ఒనరించెన్= కలుగజేశాడు.

తాత్పర్యం: ధర్మరాజు ధృతరాష్ట్రాదులకు పారలౌకిక క్రియలు నిర్వహించిన ఆ పండ్రెండు రోజులు కూడా నారద మహర్షి అక్కడే ఉండి; అంతా చూచి, ఆనందించి, ఆ ధర్మరాజును ఆశీర్వదించాడు.

వ. అమ్మునీంద్రునిఁ దక్కునుం గలుగుతపస్విసత్తముల సమర్చితులం గావించి యుధిష్ఠిరుం డామంత్రితులం జేసిన నాసంయమివరులు నిజనివాసంబులకుం జని; రాన్నృపకుంజరుండు బంధుమిత్రసహితుండై కుంజర పురంబు ప్రవేశించె; నిత్తెఱంగున నాంబికేయునకు భారతరణంబు పిదప దానాది పుణ్య క్రియాకలాపకరణంబులం బురంబునం బదియేనును, దపోనియమంబున వనంబున మూఁడునుంగాఁ బదునెనిమిది సంవత్సరంబులు చనియె; నివ్విధంబున వైచిత్రవీర్యుని సంసేవన సమస్తప్రకారంబుల సంఘటించి కృతార్థతానందంబునొంది ధర్మ నందనుండు జనంబు లభినందించుచందంబున సామ్రాజ్యంబుఁ బాలించె నని యిట్లు ధృతరాష్ట్రుని యాశ్ర మ వాసంబు విషయంబైన వర్తనంబు వైశంపాయనుండు చెప్పిన విని జనమేజయుండు 'మహాత్మా యిట్లు కృతకృత్యతం బొందిన పాండవాగ్రజుండు భూభారంబు నిర్వహించుచుండం బదంపడి పుట్టిన విశేషంబు లెఱింగింపవే! యనుటయు. 173

ప్రతిపదార్థం: యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఆ+మునీంద్రునిన్= ఆ నారదమహర్షినీ; తక్కునున్+కలుగు= మిగిలి ఉన్న; తపస్వి-సత్తములన్= మునివరులను; సమర్చితులన్= పూజించబడిన వారినిగా; కావించి= చేసి; ఆమంత్రితులన్-చేసినన్= వీడుకోలు ఇవ్వగా; ఆ సంయమివరులు= (నారదాదులైన) ఆ మునిశ్రేష్ఠులు; నిజనివాసంబులకున్= తమతమ నెలవులకు; చనిరి= వెళ్ళారు; ఆ నృప కుంజరుండు= రాజ శ్రేష్ఠుడైన ఆ ధర్మరాజు; బంధు-మిత్ర-సహితుండు+ఐ= తనతో వచ్చిన చుట్టాలతో, స్నేహితులతో కలిసినవాడై; కుంజరపురంబు= హస్తినాపురం; ప్రవేశించెన్= ప్రవేశించాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; ఆంబికేయునకున్= ధృతరాష్ట్రుడికి; భారత రణంబు పిదపన్= కురుక్షేత్రయుద్ధం తరువాత; దాన+ఆది-పుణ్య-క్రియా- కలాప-కరణంబులన్= గ్రామాది దానాలు మొదలైన మంచి పనులను చేయటంతో; పురంబునన్= హస్తినాపురంలో; పది+ఏనును= పదిహేను సంవత్సరాలూ; తపస్+నియమంబునన్= తపస్సుకు సంబంధించిన నియమాలతో; వనంబునన్= అడవిలో; మూఁడునున్= మూడునూ; కాన్= అయ్యేవిధంగా (మొత్తం); పదునెనిమిది సంవత్సరంబులు= పద్దెనిమిది సంవత్సరాలు; చనియెన్= గడచాయి; ధర్మనందనుండు= ధర్మరాజు; ఈ-విధంబునన్= ఈ తీరుగా; వైచిత్రవీర్యుని= (విచిత్రవీర్యుడి కొడుకు) ధృతరాష్ట్రుడి యొక్క; సంసేవన= శుశ్రూష; సమస్త ప్రకారంబులన్= అన్నివిధాలుగానూ; సంఘటించి= చేసి; కృతార్థతా+ఆనందంబున్= సాఫల్యంతోడి సంతోషాన్ని; ఒంది= పొంది; జనంబులు= ప్రజలు; అభినందించు-చందంబునన్= మెచ్చుకొనే విధంగా; సామ్రాజ్యంబున్= రాజ్యాన్ని; పాలించెన్= పరిపాలించాడు; అని; ఇట్లు= ఈ విధంగా; ధృతరాష్ట్రుని= ధృతరాష్ట్రుడియొక్క; ఆశ్రమవాసంబు= తపోవన నివాసానికి; విషయంబు+ఐన= సంబంధించిన; వర్తనంబు= వృత్తాంతం; వైశంపాయనుండు= వైశంపాయనముని; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు= జనమేజయమహారాజు (వైశంపాయనుడితో ఇట్లా అన్నాడు); మహాత్మా!= మహానుభావా!; ఇట్లు= మీరు చెప్పిన యీ ప్రకారంగా; కృతకృత్యతన్= కర్తవ్యం నిర్వహించి సాఫల్యాన్ని; పొందిన= పొందినటువంటి; పాండవ-అగ్రజుండు= ధర్మరాజు; భూభారంబు= రాజ్య నిర్వహణ బాధ్యతను; నిర్వహించుచుండన్= నడపుతూ ఉండగా; పదంపడి= ఆ తరువాత; పుట్టిన= కలిగిన; విశేషంబులు= ప్రత్యేక సంఘటనలు; ఎఱింగింపవే= తెలియ జెప్పవలసింది; అనుటయున్= అని అడుగగా- (జనమేజయుడితో వైశంపాయను డిట్లా చెప్పాడని తరువాతి మౌసలపర్వంతో అన్వయం)

తాత్పర్యం: ధర్మరాజు ఆ నారదమహర్షినీ; మిగిలిన (అక్కడికి చూడవచ్చిన) మునులనూ, పూజించి వీడుకోలు చెప్పగా వాళ్లందరూ తమ తమ ఆశ్రమాలకు వెళ్ళిపోయారు. తరువాత ఆ ధర్మరాజు కూడా తనతో వచ్చి ఉన్న చుట్టాలతోనూ, మిత్రులతోనూ కలిసి హస్తినాపురం ప్రవేశించాడు. ఈవిధంగా ధృతరాష్ట్రుడికి భారతయుద్ధం పూర్తయిన తర్వాత దానాలు మొదలైన పుణ్యకార్యాలు చేయడంతో హస్తినాపురంలో పదిహేనేండ్లూ, తపోనియమాలతో, అరణ్యంలో మూడేళ్ళూ, మొత్తం పద్దెనిమిది సంవత్సరాలు గడచాయి. ధృతరాష్ట్రుడిని అన్ని విధాలుగానూ సేవిస్తూ కృతార్థతతో ఆనందించిన ధర్మరాజు ప్రజలు ప్రశంసించే విధంగా రాజ్యాన్ని పరిపాలించాడు-అని వైశంపాయనుడు ఈ విధంగా ధృతరాష్ట్రుడి యొక్క ఆశ్రమవాసానికి సంబంధించిన వృత్తాంతం చెప్పగా విని జనమేజయుడు (వైశంపాయనుడితో) 'మహాత్మా! కృతకృత్యుడైన ధర్మరాజు రాజ్యాన్ని పరిపాలిస్తుండగా తరువాత జరిగిన విశేషాలు ఏమిటో తెలియజెప్ప వలసింది' అన్నాడు. (అప్పుడు వైశంపాయనుడిట్లా-మౌసలపర్వంలో చెప్తున్నాడు)

ఆశ్వాసాంతము

శా. **కారుణ్యాత్మక దృక్ప్రచార! గతసంకల్పాంతరంగస్థితి**
స్మేరాకార! పతంగమధ్యమ మరీచివ్యాప్తి మూర్ఛత్సుధా

ధారారూపవిహార! నిర్మిత జగత్సంసార! నానాగమ

క్షీరోద్యన్నవనీతతాలసిత! నిశ్చిత్తత్వ సంభావితా! **174**

ప్రతిపదార్థం: కారుణ్య-ఆత్మక-దృక్-ప్రచార= దయయే రూపంగా కలిగిన చూపులయొక్క కదలిక కలవాడా!; గత= తొలగిపోయినటువంటి; సంకల్ప= కోరికలు (రాగద్వేషాలకు సంబంధించిన తలపులు) కల్గిన; అంతరంగ= మనస్సులో; స్థితి= ఉండటంతో; స్మేర= వికాసం పొందిన; ఆకార!= స్వరూపం కలిగినవాడా!; పతంగ= సూర్యుడియొక్క; మధ్యమ= నడుమనున్నదైన; మరీచి= కిరణం; వ్యాప్తి= ప్రసారం చేత; మూర్ఛత్= వృద్ధిపొందుతున్న; సుధా= అమృతం యొక్క; ధారా= ప్రవాహం; రూప= ఆకారంగా; విహార!= విహరించేవాడా!; నిర్మిత= (నీచేత) కల్పించబడిన; జగత్= లోకాలయొక్క; సంసార!= జీవధర్మం గలవాడా!; నానా= అనేకములైన; ఆగమ= శాస్త్రాలు అనేటటువంటి; క్షీర= పాలనుండి; ఉద్యత్= పైకి తేలినటువంటి; నవనీతతా= వెన్నయొక్క ధర్మంతో; లసిత= ప్రకాశించేవాడా; నిస్-చిత్-తత్త్వ= సమగ్రమైన చైతన్యంతోను, బ్రహ్మభావంతోనూ; సంభావితా!= తెలిసికొనబడేవాడా!

తాత్పర్యం: కరుణయే ఆకారంగా ఉన్న చూపుల కదలికలు కలవాడా! ఏవిధమైన తలపులూ లేని వాళ్ళ మనసులలో వికాసరూపంతో ఉండేవాడా! సూర్యుడిలోని మధ్య కిరణం వ్యాపించడం చేత వర్ధిల్లుతున్నటువంటి అమృత ప్రవాహరూపమైన విహారం కలవాడా! విశ్వసంసారాన్ని కల్పించినవాడా! అనేక (విధ)ములైన శాస్త్రాలు అనే పాలనుండి ఉద్భవించిన వెన్నవంటి ధర్మంతో ప్రకాశించే వాడా! సంపూర్ణమైన చైతన్యమూ, బ్రహ్మముగా, (జ్ఞానులచేత) తెలియబడేవాడా!-హరిహరనాథా!.

క. **నిర్మలసంవిదుపాస్యా! । ధర్మకరణ! దుర్వికాస్య దైత్యశ్రేణీ**

నిర్మథన కేళి! నిర్జర । శర్మకృతి విహారశీల! సంయమిలోలా! **175**

ప్రతిపదార్థం: నిర్మల-సంవిత్-ఉపాస్యా!= మలినం లేని జ్ఞానం చేత ధ్యానించదగినవాడా!; ధర్మ-కరణ!= ధర్మక్రియకు సాధనమైనవాడా!; దుస్-వికాస్య= దుష్టమూ; కుటిలమూ అయిన నడవడి కలిగిన; దైత్య= రాక్షసుల; శ్రేణీ= సమూహాలను; నిర్మథన= నాశనం చేయటం; కేళి!= ఆటగా కలిగినవాడా!; నిర్జర= దేవతలకు; శర్మ= మేలునూ; కృతి= చేయటం అనే; విహార= వేడుక; శీల!= స్వభావంగా కలిగినవాడా!; సంయమి-లోలా!= ఇంద్రియాలను అణచుకొన్న-మునులయందు అధికాసక్తి కలవాడా!; హరిహరనాథా!.

తాత్పర్యం: నిర్మలమైన (సంకల్పాలను త్యజించిన) జ్ఞానం చేత ఉపాసింపదగినవాడా! ధర్మానికి మూలమైనవాడా! దుష్కర్మలు చేసేటటువంటి రాక్షస సమూహాలను నిర్మూలించటం క్రీడగా కలిగినవాడా! దేవతలకు మేలు చేయటమే వేడుక కావటం స్వభావంగా కలవాడా! యతులపై ఆసక్తి కలిగినవాడా!- హరిహరనాథుడా!.

మాలిని.

సమదవిమద దూరా సన్న రక్షా! ప్రసన్నా!

శమశుభమయమూర్తి! స్ఫారదుర్లక్ష సారా!

దమవిభవసముద్యద్ధామ! నిస్సీమభూమా!

సమహృదయలసత్సంసర్గ! సానందవర్గా! **176**

ప్రతిపదార్థం: సమద= మదించిన వారికీ (అహంకారులకు); విమద= మదం లేని వారికీ (నిరహంకారులకు) దూర= దూరంగానూ; ఆసన్న!= దగ్గరగానూ ఉండేవాడా!; రక్షా-ప్రసన్నా!= రక్షించటం కొరకు దయ కలిగిన (చూపే)వాడా!; శమ= శాంతీ; శుభమయ= కళ్యాణమూ నిండిన; మూర్తి!= స్వరూపం కలవాడా!; స్ఫార= విస్తారమైనటువంటిదీ; దుర్‌లక్ష= సామాన్య ఇంద్రియాలకు తెలియనిదీ అయిన; సారా!= శక్తి గలవాడా!; దమ= ఇంద్రియాలు (మనస్సు) నిగ్రహం యొక్క; విభవ= ఆధిక్యం చేత; సముద్యత్= తోచేటటువంటి; ధామ!= ఉనికి కలవాడా!; నిస్సీమ-భూమా!= హద్దులేని సమృద్ధి కలిగిన వాడా!; సమ= సర్వమునందు, ఒకే సమయమున; హృదయ= మనసు గలిగిన వారియందు; లసత్= ప్రకాశించే; సంసర్గ!= సంబంధం (కూడుట) కలవాడా!; స-ఆనంద-వర్గా!= ఆనందంతో కూడిన (భక్తుల) సమూహం కలవాడా!-హరిహరనాథా!.

తాత్పర్యం: మదం గలిగిన వారికి దూరంగానూ, మదం (విడిచిన- లేని) వారికి దగ్గరగానూ ఉండేవాడా!. ఆశ్రితులను కాపాడటానికి ప్రసన్నుడివై ఉండేవాడా!. శాంతీ, శుభమూ నిండిన రూపం కలిగిన వాడా!; విస్తారమూ, సామాన్యులకు గోచరంగానిదీ అయిన శక్తి కలవాడా!; ఇంద్రియనిగ్రహం అధికంగా గలిగినవారిచేత మాత్రమే తెలియదగిన ఉనికి గలవాడా!. మేరలేని బాహుళ్యం (సమృద్ధి) కలిగినవాడా!. సర్వసమబుద్ధులతో ఒప్పుతున్న సంబంధం (సాన్నిహిత్యం) కలవాడా! ఆనందంతో కూడిన హృదయం కలిగిన భక్తసమూహం కలవాడా!-హరిహరనాథా!.

గద్యము.

ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బైన శ్రీమహాభారతంబున నాశ్రమవాసపర్వంబునందు సర్వంబు ద్వితీయాశ్వాసము.

తాత్పర్యం: ఇది ఉభయకవి మిత్రుడూ, కొమ్మనామాత్యుడి పుత్రుడూ, పండితుల చేత ఆరాధించబడి రాణించేవాడూ అయిన తిక్కన సోమయాజి శుభప్రదంగా రచించిన శ్రీ మహాభారతంలోని ఆశ్రమవాసపర్వంలో చివరిది రెండవ ఆశ్వాసం.

ఆశ్రమవాసపర్వంలో రెండవ ఆశ్వాసం సమాప్తం,

శ్రీమదాంధ్రమహాభారతంలో ఆశ్రమవాసపర్వం సర్వం ముగిసింది.